

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 242

శనివారం 23-11-2024



తొమ్మిది నెలలు... 104 మంది పిల్లలు...

'సెర్చ్' ఇంజన్లీ అమ్మలు

-15లో



ఇంటింటికి
సౌర సిరులు

-15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

శ్రీ సత్యసాయి దివ్య పథం – పరివర్తనకు రాజమార్గం

"హృదయంలో ధర్మం ఉంటే - శీలంలో సౌందర్యం ఉంటుంది
శీలంలో సౌందర్యం ఉంటే - గృహంలో సామరస్యం ఉంటుంది
గృహంలో సామరస్యం ఉంటే - దేశంలో సువ్యవస్థ ఉంటుంది
దేశంలో సువ్యవస్థ ఉంటే - ప్రపంచంలో శాంతి వెల్లివిరుస్తుంది"

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఈ దివ్య వాక్కులను ఆనాటి భారతదేశ రాష్ట్రపతి శ్రీ ఏ. పి. జె. అబ్దుల్ కలామ్ గారు 2007 ఏప్రిల్ లో యురోపియన్ పార్లమెంట్ లో తాము చేసిన ప్రసంగంలో ప్రస్తావించగా, సభ అంతా చప్పట్లతో మారుమ్రోగింది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య సందేశములు, చేపట్టిన పథకములు ప్రపంచం నలుమూలల వ్యాప్తి చెందాయనుటకు ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే.

దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పుట్టపర్తి అను కుగ్రామంలో జన్మించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా, నేటి తరంలో లక్షలాది జనులకు తమ అన్ని కష్టాలలో ఓదార్పు నిచ్చే అత్యంత ఆప్తుడు. హేతువాదులకు బాబా గొప్ప మానవతావాది. ఆధ్యాత్మిక సాధకులకు, సాయి అవతార ఉద్యమంలో పాలుపంచుకున్నవారికి బాబా తల్లి, తండ్రి, గురువు, దైవం, ఒక అవతార మూర్తి.

పరమ ధార్మిక రత్నాకర వంశంలో శ్రీ పెదవేంకమరాజు, శ్రీమతి ఈశ్వరమ్మ పుణ్య దంపతులకు 1926 నవంబర్ 23వ తేదీ (శ్రీమదక్షయ నామ సంవత్సరం, కార్తీక బహుళ తదియ), పవిత్ర సోమవారం నాడు స్వామివారు జన్మించారు. తల్లిదండ్రులు, పెద్దలు స్వామివారికి సత్యనారాయణరాజు అన్న నామకరణం చేసినారు.

బాల్యంలో నుదుట విభూతి, కుంకుమతో తోటి బాలురతో ఆడుతూ పాడుతూ ఉన్న బాల సత్యం, మాంసాహార భక్షణ మంచిదికాదని నొక్కి చెప్పి మూగజీవుల ప్రాణాలను రక్షించారు. తోటి స్నేహితులకి భక్తి పాటలు నేర్పడమే కాక, ఆపదలో ఉన్న అందరికీ ఆపన్న హస్తం అందించేవాడు చిన్నారి రాజు.



రోజూ మాదిరి పాఠశాలకు బయలుదేరిన సత్యం, తన 14 వ ఏట పుస్తకాల్ని గిరాటేసి, తాను సాయిబాబా నని, ఆపస్తంబ సూత్రుడను, భారద్వాజస గోత్రుడనని, తాను సంకల్పించి వచ్చిన కార్యక్రమం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని ప్రకటించారు. 1940 లో అట్టి దివ్య ప్రకటన చేసిన నాటినుండి, పవిత్రమైన 20 అక్టోబర్ ను అవతార ప్రకటన దినోత్సవంగా అత్యంత భక్తి శ్రద్ధలతో పరిగణిస్తారు.

1947 లో అన్న శేషమరాజు గారి సందేహాలకు సమాధానంగా వ్రాసిన ప్రత్యుత్తరంలో తమ దివ్య అవతార లక్ష్యాలను సుస్పష్టంగా క్రింది పద్య రూపంలో వివరించారు,శ్రీ సత్యసాయి బాబా.

"అఖిల మానవులకు ఆనందమొనగూర్చి రక్షించుమందుటే దీక్ష నాకు, సన్మార్గమును వీడి చరియించువారల పట్టి కాపాడుటే వ్రతము నాకు, బీద సాదలకున్నైన పెనుబాధ తొలగించి లేమిని బాపుటే ప్రేమ నాకు, మంచి చెడ్డలు కూడా మనసులో సమముగా భావించి మెలుగుటే భక్తి నాకు"

పుట్టపర్తిలోని కొండలను ఆనుకొని ప్రశాంతి నిలయం పట్టణవాటిక ఏర్పడినది. పేరుకు తగినట్టు ఈ ఆశ్రమం ప్రశాంతతకు ఆలవాలం, ఆధ్యాత్మిక పరివర్తనకు మూలకేంద్రం. శ్రీ సాయినాథుని దివ్యత్వం ప్రపంచంలోని అసంఖ్యాకులను ఆకర్షించి వ్యక్తిగత పరివర్తన, తద్వారా సమాజ పరివర్తనకు శ్రీకారం చుట్టి అవతార దివ్య ఉద్యమమును వికసింపచేసి, విశ్వవ్యాప్తం చేసింది.

1950 వ దశకంలో నిర్మించిన పుట్టపర్తిలోని జనరల్ ఆసుపత్రి అయినా, అటు పిమ్మట నిర్మించిన శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ, శ్రీ సత్యసాయి ఉన్నత వైద్య సంస్థలు అయిననూ స్వామివారు తరచూ బోధించే విశ్వజనీన ప్రేమకు, నిస్వార్థ సేవకు, మానవాళి అంతటిపై స్వామివారికి గల అనంత ప్రేమకు ప్రతీకలు.

శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు లేదా శ్రీ సత్యసాయి సేవా సంస్థలద్వారా నిర్వహింపబడే ఎంతటి బృహత్తర సేవా కార్యక్రమాలైనా సరే, వాటి వెనుక ఉన్న ఏకైక లక్ష్యం స్వీయ పరివర్తన.

సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ అహింస అను ఐదు ప్రధాన మానవతా విలువలపై ఆదర్శవంతమైన సమాజమును నిర్మించుటకు వ్యక్తిగత పరివర్తన అత్యంత ముఖ్యమని, తప్పనిసరియని బాబా ఎల్లప్పుడూ నొక్కి చెబుతారు.

ప్రపంచంలోని భిన్న సంస్కృతీ సంప్రదాయాలకు, భిన్న మతాలు, దేశాలకు చెందినవారికి నేడు ప్రశాంతినిలయం తమ స్వగృహంగా మారింది. ఈ ఆశ్రమంలో దీపావళి, క్రిస్మస్, రంజాన్, బుద్ధ పూర్ణిమ, చైనీయుల నూతన సంవత్సర వేడుకలు అన్ని పర్వదినాలు ఒకే ప్రత్యేకతతో, అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

"నేను నీ మతమును, దైవాన్ని మార్చడానికి రాలేదు" అని బాబా చెబుతూ,

"ఒక హిందువు మంచి హిందువుగా, ఒక ముస్లిం మంచి ముస్లింగా, ఒక క్రిస్టియన్ మంచి క్రిస్టియన్ గా మారాలన్నదే నా అభిమతం" అన్నారు.

"ఉన్నది ఒకటే మతం - అది ప్రేమ మతం,
ఉన్నది ఒకటే కులం - అది మానవ కులం,
ఉన్నది ఒకటే భాష - అది హృదయ భాష,
ఉన్నది ఒకటే దైవం - అతడు సర్వాంతర్యామి"
అని తమ విశ్వజనీన బోధలలో తెలియపరుస్తారు, బాబా.

అందరినీ "ప్రేమ స్వరూపులారా!, దివ్యాత్మ స్వరూపులారా!" అని సంబోధించి అందరిలో ఉన్న దివ్యత్వాన్ని తట్టి లేపి ప్రతి వ్యక్తి తనజీవితంలో ప్రేమమార్గంలో నడిచేలా స్ఫూర్తినందిస్తున్నారు, బాబా. ప్రపంచం భూతలస్వర్గంగా మారుటకు దోహదపడేది ప్రేమ మార్గం మాత్రమే.

"మీ హృదయంలో ప్రేమ బీజములు నాటండి, వాటిని ప్రేమ వృక్షములుగా ఎదగ నివ్వండి. వాటి ద్వారా లభించు ఆనందమనే ఫలములను అందరికీ పంచండి" అన్న భగవాన్ బాబావారి దివ్యవాక్కులు సాయి అవతార ఉద్యమం మరింత స్ఫూర్తితో ముందుకు నడచుటకు దిశానిర్దేశం చేస్తాయనుటలో ఎట్టి సందేహం లేదు.



భగవాన్ బాబా వారి దివ్య ఆధ్యాత్మిక ఉద్యమం

- **నవంబర్ 23, 1926** — జననం
- **అక్టోబర్ 20, 1940** — అవతార ప్రకటన
- **నవంబర్ 23, 1950** — ప్రశాంతి నిలయం ప్రారంభోత్సవం
- **అక్టోబర్ 04, 1956** — జనరల్ హాస్పిటల్, పుట్టపర్తి ప్రారంభం
- **జూలై 22, 1968** — అనంతపురంలోని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల ప్రారంభోత్సవం



- **సెప్టెంబర్ 02, 1972** — శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ స్థాపన
- **నవంబర్ 22, 1981** — శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ విశ్వవిద్యాలయం ప్రారంభం



- **నవంబర్ 22, 1991** — ప్రశాంతి గ్రామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవం
- **నవంబర్ 18, 1995** — శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం



- **జనవరి 19, 2001** — బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవం
- **నవంబర్ 23, 2004** — చెన్నై వాటర్ ప్రాజెక్ట్



చెన్నై వాటర్ ప్రాజెక్ట్

- **మార్చి 30, 2006** — శ్రీ సత్యసాయి మొబైల్ హాస్పిటల్ ప్రారంభం
- **2009 & 2013** — ఒడిషా హౌసింగ్ ప్రాజెక్ట్, ఫేజ్ I & II



ఒడిషా హౌసింగ్ ప్రాజెక్ట్, ఫేజ్ I & II

- **2014-2015** — అనంతపురం వాటర్ ప్రాజెక్ట్ ఫేజ్ II
- **2017** — శ్రీ సత్యసాయి సోలార్ పవర్ ప్రాజెక్ట్
- **2020 - 2021** — కోవిడ్ సహాయ చర్యలు



కోవిడ్ సహాయ చర్యలు

- **2023 - 2024**
  - లేహ్ - లదాఖ్‌లోని మహబోధి ఆసుపత్రిని దత్తత తీసుకోవడం.
  - అండమాన్ & నికోబార్ వరకు వైద్య సేవ విస్తరింపు.
  - గుజరాత్‌లోని వడోదరలో జాతీయ విపత్తు నిర్వహణ శిక్షణ కేంద్రం ఏర్పాటు.

భవిష్యత్ ప్రణాళికలు

ప్రేమావతారి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి శతాబ్ది ఉత్సవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంలో, భగవాన్ బాబా వారి దివ్య బోధలు, దివ్యోద్యమం కొత్త వారికి మరియు సుదూర భౌగోళిక ప్రాంతాలకు విస్తరించడమే కాకుండా , నేటి కాలానికి తగిన అధునాతన సాంకేతికతను కూడా ఉపయోగించుకుంది.

- శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంలో పాఠశాల విద్యార్థులకు అల్పాహారముగా రాగిజావను అందిస్తున్నారు. ఇది మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అంతటా 26 జిల్లాల్లోని 44,392 పాఠశాలల నుండి 33 లక్షల మంది విద్యార్థులకు అందించబడడం విశేషం.



- శ్రీ సత్యసాయి ప్రేమతరు అన్న సేవా కార్యక్రమం పేరిట శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాబోయే రెండేళ్లలో 10 మిలియన్ల చెట్లను నాటాలని శ్రీ సత్యసాయి సేవాసంస్థలు సంకల్పించాయి. గ్రామీణ ప్రాంతాలలో కూడా ఇది ఒక శక్తివంతమైన సేవా కార్యక్రమంగా నిర్వహింప బడుతున్నది.
- శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు లోని సంస్థల అవసరాలకు తగినంత విద్యుత్తును శ్రీ సత్యసాయి మిత్ర - సోలార్ పవర్ ప్రాజెక్ట్, ద్వారా అందించడానికి 6.1 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్రాజెక్ట్ ట్రస్టు ద్వారా ప్రారంభించబడింది. ఒక ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేయబడిన అతిపెద్ద సౌర ఆధారిత విద్యుత్తు స్థాపనలలో ఇది ఒకటి. ఈ సౌర విద్యుత్తు వినియోగం ద్వారా సాయి సంస్థల ద్వారా బయటకు వెలువరిచే కార్బన్ ఫుట్ ప్రింట్ గణనీయంగా తగ్గుతుంది.
- 'శ్రీ సత్యసాయి దివ్యాంగజన్ సేవ' అన్న పేరిట శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారు శ్రీ సత్యసాయి సేవా సంస్థల మద్దతుతో ఒక నూతన సేవ ప్రతిపాదించారు. దివ్యాంగులకు అధిక-నాణ్యత గల ఎండోస్కెలెటల్ కృత్రిమ సహాయక పరికరాలను అందించడం ఈ సేవ ప్రధాన లక్ష్యం. దివ్యాంగుల ప్రయోజనం కోసం అనుకూలములతో తీర్చిదిద్దిన 'మొబైల్ కృత్రిమ అవయవాల సంరక్షణ వ్యాన్' జూలై 21, 2024న ప్రారంభించబడింది. ఈ వ్యాన్ లోనే లబ్ధిదారుల ప్రదేశానికి వెళ్లి, వారికి కావాల్సిన కొలతల అనుగుణంగా కృత్రిమ అవయవాలు అక్కడిక్కడే తయారుచేసి అందిస్తారు.



- శ్రీ సత్యసాయి విద్యా వాహిని (SSSVV) అనేది దేశంలోని అన్ని ప్రాంతాలలో గల ఉపాధ్యాయులకు అధిక-నాణ్యత కంటెంట్, శిక్షణ, బోధనా సహాయాలు అందించు డిజిటల్ వేదిక. ప్రాంతీయ భాష మరియు మాతృభాష మాత్రమే మాట్లాడగలిగి ఆంగ్లములో ప్రావీణ్యత తక్కువ ఉన్న అధ్యాపకులకు కమ్యూనికేటివ్ ఇంగ్లీషు తరగతుల నిర్వహణ శ్రీ సత్యసాయి విద్యావాహిని ద్వారా అందిస్తున్నారు. ప్రధానమంత్రి దీక్షా పోర్టలుకు అతిపెద్ద కంటెంట్ అందిస్తున్న సంస్థ శ్రీ సత్యసాయి విద్యావాహిని. సమగ్రంగా అనగా 360 డిగ్రీల డిజిటల్ సౌకర్యాలు కవర్ చేసే దాతృత్వంతో నడిచే అతికొద్ది EdTech ప్రాజెక్టులో SSSVV ఒకటి.

పైన పేర్కొన్న సేవా కార్యక్రమాలు మరియు మరెన్నో సేవలతో, భగవాన్ బాబా పాదముద్రలు కొత్త ప్రదేశాలకు చేరుతున్నాయి. అసంఖ్యాకప్రజలు శ్రీవారి ప్రేమపూర్వక ఆశీర్వాదాలను పొందుతున్నారు.



"భగవాన్ శ్రీ సత్య సాయి బాబా, లౌకికమయిన మానవ మేధస్సుకు అతీతమయిన అద్భుత స్వరూపము. వారి జీవిత కాలము లో అందరికీ చూపిన నిస్వార్థమైన ప్రేమ, సంపూర్ణమయిన స్వచ్ఛత మరియు చేసిన సేవలకు అందరమూ కలసి మొక్కవలసినదే. "నా జీవితమే నా సందేశం" అని భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ప్రకటించారు. ఉచిత విద్యతో యువతకు సాధికారత, ఉచిత వైద్యం ద్వారా రోగులకు స్వస్థత మరియు ఉచిత స్వచ్ఛమైన నీటి సరఫరా ద్వారా మారుమూల కుగ్రామాలలో జీవితాలను మెరుగుపరిచే మానవతా ప్రాజెక్టులను ప్రారంభించారు.

శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులమైన మాకు, శ్రీ సత్య సాయి బాబా అత్యంత ప్రభావవంతమైన మరియు క్లిష్టమయిన పనులను నిరాడంబరంగా, ఎలాంటి ఆర్భాటము లేకుండా ఎలా సాధించారో చూసే అవకాశం లభించింది. శ్రీ సత్య సాయి బాబా నిష్కల్మషముగా, ప్రణాళికా బద్ధముగా నిష్కపటంగా ప్లాన్ చేసే వారు. ఆదర్శవంతమయిన అణకువతో అమలు చేసే వారు. వారి దార్శనికతను సునిశితముగా, గొప్ప సామర్థ్యంతో అమలు చేసే వారు. వారి ప్రణాళికలను, పని చేసే విధానాలను గమనిస్తూ అనుసరించటమే నాయకత్వ నిర్వహణలకు చక్కని శిక్షణా పాఠములు.

బాబా వారు స్థాపించిన సంస్థలు మానవాళికి సేవలు కొనసాగిస్తూనే ఉండటం, సామాన్యుల జీవితాలపై ఈ సేవల ద్వారా సామాజిక - ఆర్థిక ప్రభావం గణనీయంగా ఉండటం, బాబా వారిని సశరీరులుగా దర్శించని వారు కూడా వారి ప్రేమకు ఆకర్షితులై... ప్రతిరోజూ ప్రశాంతి నిలయంలోకి పోటెత్తడం వారి సజీవ ఉనికికి నిదర్శనం. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, సాయి వారసత్వాన్ని కొనసాగిస్తూనే ఉన్నది మరియు దాని నిర్వహణ పరిధిని విస్తరిస్తుంది, ఆధునిక సాంకేతికతను, సాధనాలను మరియు పద్ధతులను ఉపయోగిస్తూ, సంకల్పాలలో, లక్ష్యాలలో మరియు నిర్వహణలో స్వచ్ఛతను, పారదర్శకతను పాటిస్తూ ఉన్నది. భగవాన్ బాబా జీవితం మరియు మానవాళికి వారు అందించిన ఆదర్శవంతమయిన వారసత్వాన్ని, తలుచుకొంటూ శతజయంతి ఉత్సవాలను జరుపుకోవటం, చరిత్రలో ఒక ముఖ్యమైన సందర్భం. భగవాన్ వెలిగించిన ప్రేమ జ్యోతులు పరిరక్షించడానికి మరియు ఆ దివ్యమయిన వెలుగును వ్యాప్తి చేయడానికి సంకల్పిద్దాం.

– ఆర్. జె. రత్నాకర్,
మేనేజింగ్ ట్రస్టీ, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్

"భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జీవితం షరతులు లేని ప్రేమ మరియు సంపూర్ణ త్యాగానికి ప్రతీక. వారు ప్రపంచవ్యాప్తంగా ఉనికిని కలిగి ఉన్న 'శ్రీ సత్యసాయి సేవా సంస్థలు' అనే ప్రత్యేకమైన వేదికను స్థాపించారు. వారు ఈ సంస్థ యొక్క పురోగతిని, పరిణామాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ పోషిస్తూ వచ్చారు మరియు మార్గనిర్దేశం చేశారు. సుమారు 3,027 సేవా సమితిలు మరియు 4,203 భజన మండలిల నుండి 10,00,000 మంది క్రియాశీల సభ్యులు మరియు 2,25,000 మంది శిక్షణ పొందిన సేవాదళ్ వాలంటీర్లతో మానవాళికి గొప్ప సేవను అందిస్తున్న, అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఇది నేడు దేశంలో గర్వంగా నిలుస్తోంది. దాదాపు 20,000 మంది గురువులు దేశంలోని 18,000 కేంద్రాలలో 4,30,000 మంది బాలవికాస్ విద్యార్థులకు విలువ-ఆధారిత సమాంతర విద్యను అందిస్తూ ఉన్నారు.

నేడు, ప్రపంచంలోని ప్రతి దేశంలోని శ్రీ సత్యసాయి సేవా సంస్థలలోని ప్రతి ఒక్క సభ్యుడు, "కరిష్యే వచనం తవ" అనే ప్రతిజ్ఞతో ఆయన సందేశాన్ని ఉత్తమమైన ఆరాధనగా ఆచరణలో పెట్టడానికి కట్టుబడి ఉన్నారు.


– శ్రీ నిమిష్ పాండ్య,
అఖిల భారత అధ్యక్షుడు, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, భారతదేశం

ఆచరణాత్మక ప్రేమ

2009 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశంజిల్లా అద్దంకి గ్రామానికి చెందిన వెంకట్ మరియు దీపారాణి దంపతులు అప్పుడే జన్మించిన తమ చిన్నారి సాయితేజతో ఆనందంగా శ్రీ సత్యసాయి జనరల్ ఆసుపత్రి నుండి బయటకు వచ్చారు. కానీ, రక్తానికి ఇన్ఫెక్షన్ కలిగించే సెప్టిసీమియా అను ప్రాణాంతక వ్యాధితో అతి కొద్ది రోజుల లోనే శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చిన్నారిని చేర్పించ వలసి వచ్చింది. పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి లో అర్జంట్ గా క్రిటికల్ ఆపరేషన్ పూర్తిగా ఉచితంగా చేసి, చిన్నారిని రక్షించారు.

"మేము పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని దూరం నుండి అనేకసార్లు చూసి, దానిని దేవాలయంగా భావించేవారం. ఈనాడు మా చిన్నారిని కాపాడి ఈ వైద్యాలయము నిజంగా మా పాలిటి దేవాలయం అయింది" , ఆనందభాష్పాలతో అన్నారు ఆ దంపతులు.

ఇది కేవలం ఒక కుటుంబం యొక్క కథ కాదు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి విద్య, వైద్య, సామాజిక సేవా పథకాల్లో లబ్ధి పొందిన లక్షలాది కుటుంబాలు నిత్యం చెప్పే కథ.



పుట్టపర్తి గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి శ్రీమతి ఈశ్వరమ్మ ఎంతో జాలితో, గ్రామప్రజలకు ఒక చిన్న పాఠశాల, ఒక చిన్న మంచినీటి బావి మరియు ఒక చిన్న ఆసుపత్రి కావాలని బాబాను కోరింది. నిస్వార్థంగా కోరిన మాతృమూర్తి కోరికలు తీర్చినారు, స్వామి.

ఒక యూనివర్శిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, శ్రీ సత్యసాయి సుజల స్రవంతి పేరిట నేడు లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారు. 'నా జీవితమే నా సందేశం' అన్న తమ ప్రకటనను ఆచరణలో చూపి, ప్రపంచ స్థాయి ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్య, ఉన్నత వైద్యం, సుజల స్రవంతి మరియు ఇతర సామాజిక పథకములు ప్రేమతో ఉచితంగా అందరికీ అందించగలమను ఆదర్శాన్ని మనకు అందించారు.

మానవాళికి బాబా అందించిన సంక్షేమ పథకాలను నాలుగు ప్రధాన విభాగాల క్రింద విభజించవచ్చు; మెడికేర్, ఎడ్యుకేర్, సోషియోకేర్ మరియు డిజాస్టర్ రిలీఫ్.

భౌతిక, మౌలిక సదుపాయాలను సృష్టించడం, అత్యంత ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడం మరియు సచ్ఛంద సేవాదళ్ సభ్యుల ద్వారా ప్రేమతో సహాయక సేవలను అందించడం వంటివి అన్ని ప్రాజెక్టులలో కనిపించే సాధారణ అంశములు.

భగవాన్ బాబా స్థాపించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల సేవలతో బాటు, గ్రామస్తుల ఇంటి వద్దకే అధునాతన ఆరోగ్య సంరక్షణ 'శ్రీ సత్యసాయి మొబైల్ హాస్పిటల్' రూపంలో అందుబాటులోకి వచ్చింది. శ్రీ సత్యసాయి మొబైల్ హాస్పిటల్ గ్రామీణ ప్రాంతాలకు క్రమం తప్పకుండా ప్రతినెల వెళ్లి, శ్రీ సత్యసాయి జిల్లాలోని 350 గ్రామాలలో అవసరమైన వారికి వైద్య సంరక్షణను అందిస్తుంది. 15 విభిన్న స్పెషాలిటీలకు చెందిన దాదాపు 250 మంది వైద్యులు ఈ కార్యక్రమం కోసం స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు. గత 18 సంవత్సరాలుగా ఈ మొబైల్ ఆసుపత్రి సేవలు కొనసాగింపబడుతూనే ఉన్నాయి.

రెండు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు (శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్), మొబైల్ హాస్పిటల్, జనరల్ హాస్పిటల్స్, టెలిహెల్త్ సెంటర్లు - వీటిలో దేనిలో కూడా బిల్లింగ్ డిపార్ట్మెంట్ లేకపోవడం విశేషం . వీటితోపాటు ఒక నర్సింగ్ కాలేజీ కూడా నిర్వహింపబడుతున్నది.

దాదాపు 4,250 కి.మీ పైప్ లైన్ ద్వారా శ్రీసత్యసాయి సుజల స్రవంతి పేరిట అనంతపురం, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు, మెదక్, మహబూబ్ నగర్ మరియు చెన్నై పట్టణంలోని లక్షలాది మందికి తాగునీటిని ఉచితంగా, ప్రేమతో అందిస్తున్నారు.

శ్రీ సత్యసాయి యూనివర్శిటీ ద్వారా ప్రాథమిక తరగతుల నుండి డాక్టరేట్ వరకు ట్యూషన్ ఫీజు లేకుండా అత్యున్నత స్థాయి ప్రమాణాలతో విలువ ఆధారిత సమగ్ర విద్య అందించబడుతుంది.

శ్రీ సత్యసాయి విద్యావాహిని, సాయి పాఠశాలలు మరియు విశ్వవిద్యాలయ బోధనలో ఉన్నత స్థాయి ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడం ప్రత్యేక అంశం.

విద్య, వైద్యం, మంచినీటితో బాటు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ యొక్క ప్రధాన ప్రాజెక్టులలో వివిధ రాష్ట్రాలలో ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రభావితమైన ప్రాంతాలలో సహాయక చర్యలు వెంటనే చేపట్టడం మరొక ముఖ్యమైన సేవా కార్యక్రమం.

ఆధ్యాత్మిక ప్రాతిపదికన నిస్వార్థసేవలు అందించు శ్రీ సత్యసాయి సేవా సంస్థలలో ఆధ్యాత్మిక, సేవా, విద్యా విభాగములు ప్రధాన విభాగములు. శ్రీ సత్యసాయి విద్యాజ్యోతి ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 900 గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్న సంస్థ, సమగ్ర గ్రామాభివృద్ధి కార్యక్రమాలతో బాటు సాధారణ ఆరోగ్య శిబిరాలను కూడా ఈ పాఠశాలల్లో నిర్వహిస్తుంది.

కోవిడ్-19 మహమ్మారి విజృంభించినప్పుడు, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రధానమంత్రి సహాయ నిధికి తగిన విరాళాలు, వైద్య సామాగ్రిని అందించడమే కాకుండా, ప్రైవేట్ క్వారంటైన్ సెంటర్ లు ఏర్పరచి వేలాది మందికి వైద్యసేవలు, ఆహారం అందచేసింది. క్షేత్ర స్థాయిలో, దాదాపు 85 కమ్యూనిటీ కిచెన్ల ద్వారా, శ్రీ సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ సభ్యులు పౌష్టికాహారాన్ని తయారు చేసి అర్హులకు పంపిణీ చేశారు.

"Duty with love is desirable, Duty without love is deplorable and Love without duty is divine" అన్న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి వాక్కుల ఆధారంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు నిరంతరంగా మానవాళికి నిస్వార్థ సేవలు అందిస్తూనే ఉంటాయి.


'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 | వెల: ₹ 5.50

సంపుటి: 17 | సంచిక: 242

శనివారం | 23-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కుప్పకూలి... కూల్చేసి...

పెర్త్ టెస్టులో పుంజుకున్న భారత్. టీమిండియా 150 ఆలౌట్. ఆస్ట్రేలియా 67/7 - 17లో



బుల్ బ్యాక్ ర్యాలీ

సెన్సెక్స్ 1,961 పాయింట్లు.. నిఫ్టీ 557 పాయింట్లు జంప్ - 17లో



విజేతలెవరో?

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల సమరంలో విజేతలెవరో నేడు తేలనుంది. ఉదయమే ఓట్ల లెక్కింపు జరగనుంది.

- వివరాలు 6లో▶



మనది బలమైన బంధం

భారత్, గయానా మధ్య చక్కటి స్నేహ సంబంధాలు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు.

- వివరాలు 6లో▶



జలాంతర్గామిని ఢీకొట్టిన పడవ

గోవా తీరం నుంచి సముద్రంలో 70 నాటికల్ మైళ్ల దూరంలో... భారత నావికా దళ జలాంతర్గామిని పడవ ఢీకొట్టింది.

- వివరాలు 6లో▶



అమెరికా ఏజీగా బోండీ

మాట్ గేట్జ్ స్థానంలో అమెరికా అటార్నీ జనరల్‌గా పమేలా జో బోండీని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు.

- వివరాలు 6లో▶

ఆ భూములు ఇవ్వండి!

కేంద్ర ప్రభుత్వ సంస్థల వద్ద నిరుపయోగంగా ఉన్న భూమిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి


- 10 వేల ఎకరాలకుపైగా ఉన్నట్టు గుర్తించిన రెవెన్యూ యంత్రాంగం
- మార్కెట్ రేటు ప్రకారం ఆ భూముల విలువ రూ. 45 వేల కోట్లపైనే..
- కేంద్ర సంస్థలకు ప్రభుత్వ ధర చెల్లించి తీసుకునే యోచనలో సర్కారు
- దీనిపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసిన రాష్ట్ర సర్కారు
- హరియాణాలోనూ ఇదే తరహా డిమాండ్ ఉందంటున్న రెవెన్యూ వర్గాలు
- కేంద్రం సానుకూలంగా స్పందిస్తే రాష్ట్ర ఖజానాకు కాసుల పంటేననే ఆలోచన

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ)లకు గతంలో కేటాయించిన భూముల్లో.. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్నవాటిని తిరిగి ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం కోరుతోంది. మొత్తంగా 10 వేల ఎకరాలకుపైగానే నిరుపయోగంగా ఉన్నాయని ఇప్పటికే గుర్తించింది. ప్రధాన ప్రాంతాల్లో ఉన్న ఈ భూములను ప్రభుత్వ ధర తీసుకుని తమకు అప్పగించాలని కోరుతోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు ప్రారంభమయ్యాయని.. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందని రెవెన్యూ వర్గాల సమాచారం. మిధాని, డీఆర్‌డీవో, బీడీఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, బీహెచ్‌ఈఎల్, హెచ్‌ఏఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఎల్ వంటి సంస్థల భూములు ఈ జాబితాలో ఉన్నట్టు తెలిసింది. బీజేపీ అధికారంలో ఉన్న హరియాణా రాష్ట్రంలో కూడా ఇలాంటి డిమాండ్ ఉందని, దీంతో ఈ డిమాండ్ల పట్ల కేంద్రం సానుకూలంగా స్పందించే అవకాశముందని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి.

దశాబ్దాల కింద కేటాయింపు..

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు కోసం దశాబ్దాల క్రితం పెద్ద సంఖ్యలో రాష్ట్ర ప్రభుత్వ భూములను కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర అంగీకారంతోపాటు నిబంధనలకు అనుగుణంగా అప్పగించిన ఈ భూములను ఆయా సంస్థలు తమ అవసరాల కోసం వినియోగించుకుంటున్నాయి. అయితే ఆ సంస్థలు ఏ మేరకు భూములను

మిగతా 5వ పేజీలో ▶



నిరుపయోగ భూముల లెక్కలివే...

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ	నిరుపయోగ భూమి (ఎకరాల్లో)
సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా	2,290
బీహెచ్ఈఎల్, లింగంపల్లి	2,125
ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, మెదక్	2,000
ఈసీఐఎల్, చర్లపల్లి	930
డ్రగ్స్ అండ్ ఫార్మా లిమిటెడ్	891
బాలానగర్ హెచ్‌ఏఎల్	214
హెచ్‌ఎంటీ	123
డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్	55



హైదరాబాద్ శిల్పాకళా వేదికలో 'లోక్‌మంథన్ భాగ్యనగర్-2024' ప్రధాన కార్యక్రమాన్ని శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాష్ట్ర మంత్రి సీతక్క, ప్రజ్ఞాభారతి చైర్మన్ టి.హనుమాన్ చౌదరి. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ మన దేశ సంస్కృతీ సంప్రదాయాలు చాలా గొప్పవని, వాటిని నిలబెట్టుకోవడంతో పాటు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు

ఐకమత్యం, సామరస్యమే మన సభ్యత.. మన భవిష్యత్తు

లోక్‌మంథన్ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- వివరాలు 18లో

సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్

పది మంది మావోయిస్టులు మృతి

- ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఎదురుకాల్పులు

6 లో



మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరి హత్య

- వివరాలు 14లో

న్యూస్‌రీల్

మధ్యవర్తిత్వమే మంచిది



న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వ విధానానికి ఆదరణ పెరుగుతోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ తెలిపారు. ప్రజలు దీర్ఘకాలంపాటు కోర్టు విచారణకు వెళ్లకుండా వేగంగా వివాదాలను పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం సులువైన మార్గమని చెప్పారు.

- వివరాలు 18లో▶


గడపగడపకూ 'ఏడాది విజయోత్సవాలు'



రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో అమలు చేసిన విప్లవాత్మక పథకాలు, సంక్షేమ కార్యక్రమాల వివరాలను గడపగడపకూ చేర్చాలని ప్రజాపాలన విజయోత్సవాల మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది.

- వివరాలు 2లో▶

నిర్ణయం స్పీకర్‌దే



పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకరేనని హైకోర్టు స్పష్టం చేసింది. 'రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్‌గా ఇచ్చిన అధికారాల మేరకు విధులు నిర్వహించాలి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని దృష్టిలో ఉంచుకుని అనర్హత పిటిషన్లపై తగిన సమయంలో తప్పకుండా నిర్ణయం తీసుకోవాలి..' అని పేర్కొంది.

- వివరాలు 2లో▶

ష్.. మీ ఫోన్ వింటోందా?



మీరేం మాట్లాడుతున్నారు? ఏం చేయాలని అనుకుంటున్నారు?.. ఇవన్నీ మీ వ్యక్తిగతం. వేరే ఎవరికీ తెలిసే అవకాశమే లేదు. కానీ మీ స్మార్ట్ ఫోన్ ఇవన్నీ వినేస్తోంది. మనపై మన ఫోన్ ఉంచుతున్న నిఘా గుట్టును తేల్చేయడానికి నిపుణులు 4 సూచనలు చేస్తున్నారు.

- వివరాలు 18లో▶

ఇదండీ జగత్



రూ. 5,260 కోట్ల పెట్టుబడులు..
12,490 ఉద్యోగాలు

రాష్ట్ర ప్రభుత్వంతో ఆరు ఫార్మా కంపెనీల అవగాహన ఒప్పందాలు

- సచివాలయంలో సీఎం రేవంత్, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో కంపెనీల ప్రతినిధుల భేటీ
- ప్రతిపాదిత ఫార్మాసిటీలో 4 నెలల్లో ఆయా సంస్థలకు స్థలాలు కేటాయించాలని అధికారులకు సీఎం ఆదేశం



ఫార్మా ప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాలుష్యరహిత గ్రీన్ ఫార్మా యూనిట్లను నెలకొల్పేందుకు, ప్రస్తుతమున్న కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రముఖ ఫార్మా కంపెనీలు ముందుకొచ్చాయి. ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీలు రూ. 5,260 కోట్ల పెట్టుబడులకు సంబంధించి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నాయి. ఈ పెట్టుబడుల ద్వారా కొత్తగా 12,490 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ప్రతిపాదిత ఫార్మాసిటీలో ఈ కంపెనీల యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయించనుంది. సీఎం రేవంత్, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సచివాలయంలో

మిగతా 5వ పేజీలో ▶

నిజాలకు పాతరేసి.. నిస్సిగ్గుగా నిందలా!

అమెరికాలో అదానీ సంస్థపై అభియోగాలు నమోదైతే ఇక్కడ వైఎస్ జగన్‌పై విషప్రచారమా?

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'సెకీ'తో గత ప్రభుత్వం ఒప్పందం..

అదానీతో రాష్ట్ర ప్రభుత్వానికి ఏం సంబంధం?..

ఆ ఒప్పందంలో ఉన్నది రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం



- పైగా సెకీ తనకు తానుగా యూనిట్ రూ.2.49కే సరఫరా చేస్తామని లేఖ రాస్తూ ముందుకొచ్చింది.. సెకీ ధరతో ఏటా రూ.3,750 కోట్లు ఆదా
- సెకీతో ఒప్పందం వల్ల ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి మినహాయింపు
- గతంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి హయాంలోనైనా.. ఇంత కారుచౌకగా 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం జరిగిందా?
- యూనిట్‌కు 2.49 చొప్పున 25 ఏళ్లపాటు నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేస్తామంటే ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా కాదంటుందా?
- ఈ ఒప్పందం కేంద్రం–రాష్ట్రం మధ్య జరిగితే లంచాలకు అవకాశముంటుందా?
- కేంద్రం ఎక్కడైనా రాష్ట్రాలకు లంచం ఇస్తుందా?.. ఈ ప్రక్రియలో లంచాలిచ్చేందుకు ఆస్కారం ఏముంది?
- అసలు అధిక ధరలకు పీపీఏలు చేసి అడ్డగోలు స్కామ్‌లకు పాల్పడిందే చంద్రబాబు
- యూనిట్ రూ.6.99 చొప్పున కొనుగోలు చేసింది ఈ పెద్దమనిషే
- దీర్ఘకాలిక ఒప్పందాలతో రూ.35 వేల కోట్ల భారం బాబు నిర్వాకం కాదా?
- రెట్టింపు ధరలతో జరిగిన ఆ ఒప్పందాలు ముడుపుల కోసం కాక మరెందుకంటున్న విద్యుత్తు రంగ నిపుణులు

12 లో

పరువు పోతోంది పరిష్కారమేంటి?

'పురుగులన్నం' ఘటనల నేపథ్యంలో హెచ్‌ఎంల నుంచి అభిప్రాయ సేకరణ

- నరుకులు సర్కారే ఇస్తే బాగుంటుంది.. బియ్యాన్ని రీసైక్లింగ్ చేయాలి
- నెలల తరబడి బిల్లులివ్వకపోతే ఎలా.. ఉపాధ్యాయులను బలిచేస్తే లాభమేంటి?
- 'మధ్యాహ్న భోజనం'పై నివేదికలు అందజేసిన పలు స్కూళ్ల హెచ్‌ఎంలు

సాక్షి, హైదరాబాద్: మధ్యాహ్న భోజనం పురుగులతో విద్యార్థులు ఏదో ఒకచోట అస్వస్థతకు లోనవుతూనే ఉన్నారు. 'ఒకరోజు ఖమ్మం జిల్లాలో, మరోరోజు నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తినే మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వం పరువు పోతోంది. ఏం చేద్దాం..ఎలా పరిస్థితిని చక్కబెడదాం'అంటూ ఉన్నతాధికారులు హెచ్‌ఎంల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. 'నాణ్యత లేని భోజనం పెడితే కటకటాలు లెక్కబెట్టిస్తాం'అని సీఎం నవంబర్ 14న ప్రకటించారు. అయినా వరుస ఘటనలు చోటు చేసుకోవడంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను సీఎంవో ఆదేశించింది. ఘటన జరిగినప్పుడు హెచ్‌ఎంనో, డీఈవోనో సస్పెండ్ చేస్తే కొత్త సమస్యలొస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. టీచర్ల నుంచి వ్యతిరేకత కొని తెచ్చుకుంటున్నామని సీఎం భావిస్తున్నారు. ఇవేవీ లేకుండా పురుగుల అన్నంతో పరువు పోకుండా ఏం చేయాలో నివేదిక ఇవ్వడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు.

సమస్య ఎక్కడ?

రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ స్కూళ్లున్నాయి. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి పౌర సరఫరాల శాఖ నుంచి బియ్యం అందజేస్తారు. మిగతా సరుకులన్నీ స్వయం సహాయ బృందాల నిర్వహణలో ఉంటాయి. ఎక్కువ మంది విద్యార్థులుంటే కొంత వరకూ నిర్వహణ సాధ్యమవుతోంది. మరీ తక్కువగా విద్యార్థులుంటేనే నిర్వహణ వ్యయం ఇబ్బందే. 13,005 స్కూళ్లలో 50 లోపు విద్యార్థులే ఉన్నారు. ఈ కారణంగా వచ్చే నిధులు తక్కువ. స్వయం సహాయ బృందాలకు నెలవారీ బిల్లులు కూడా చెల్లించడం లేదు. అప్పు తెచ్చి వంట చేస్తున్నామని, వడ్డీ తామే కడుతున్నామంటున్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా ఏం చేసినా నాణ్యత ఎలా పెరుగుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. అదీగాక సివిల్ సప్లై నుంచి వచ్చే బియ్యంలో పురుగులు ఉంటున్నాయని, వాటిని రీ సైక్లింగ్ చేస్తే తప్ప పురుగులు అరికట్టడం సాధ్యం కాదంటున్నారు. దీనికి బడ్జెట్ ఉండదని హెచ్‌ఎంలు అంటున్నారు.

ఇక్కడో రీతి... అక్కడో తీరు

కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూళ్లలో నాణ్యమైన మెనూ అమలు చేస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో రకమైన ఆహారం ఇస్తారు.



గుడ్లు కూడా ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. అన్నం, వెజిటబుల్స్, రసం, కోడిగుడ్డు, ఆకుకూరపప్పు, నెయ్యి, పెరుగు ఇస్తున్నారు. కాబట్టి నిర్వహణ వ్యయం సరిపోతుందనేది హెచ్‌ఎంల వాదన. ప్రభుత్వ స్కూళ్లలో మాత్రం బియ్యం, కూరగాయలు, పప్పు మాత్రమే ఇస్తున్నారు. పప్పు, కోడిగుడ్డు రోజూ ఉండదు. కూరల రేట్లు రోజుకో విధంగా ఉంటున్నాయి. ఇవన్నీ నిర్వహణ సమస్యగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖకు తెలిపారు.

విధాన పరమైన లోపాలున్నాయి



మధ్యాహ్న భోజన నాణ్యత పెంచాలంటే ముందుగా విధానపరమైన మార్పులు అవసరం. సంబంధిత ఏజెన్సీలకు ముందుగా బిల్లులు చెల్లించాలి. నాణ్యత పెంచేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలి. నిధులు పెంచాలి. తప్పు జరిగినప్పుడు హెచ్‌ఎంలనే బాధ్యులను చేయడం అన్యాయం.

- పి.రాజాభాను చంద్రప్రకాశ్,
తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు

టీచర్లనే ప్రశ్నించడం సరికాదు



మధ్యాహ్న భోజన పథకం అమలులో హెచ్‌ఎంల పాత్ర నామమాత్రమని 2014లో ముంబై హైకోర్టు తీర్పు చెప్పింది. బోధన సంబంధమైన విధులే హెచ్‌ఎంలకు తలకు మించి ఉన్నాయి. తప్పు జరిగితే బాధ్యులను చేయాలనే విధానం మంచిది కాదు.


- పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు

నిర్ణయం స్పీకర్‌దే

ఎమ్మెల్యేల ఫిరాయింపులపై తేల్చిచెప్పిన హైకోర్టు

తగిన సమయంలో స్పీకర్ తప్పకుండా నిర్ణయం తీసుకోవాలి

- ఫిరాయింపుల చట్టాన్ని, అసెంబ్లీ కాల పరిమితిని దృష్టిలో ఉంచుకోవాలి
- 10వ షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్‌గా విధులు నిర్వహించాలి
- సింగిల్ జడ్జి తీర్పును కొట్టేసిన సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకరేనని హైకోర్టు స్పష్టం చేసింది. 'రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్‌గా ఇచ్చిన అధికారాల మేరకు విధులు నిర్వహించాలి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని దృష్టిలో ఉంచుకుని అనర్హత పిటిషన్లపై తగిన సమయంలో (రీజనబుల్ టైమ్) తప్పకుండా నిర్ణయం తీసుకోవాలి..' అని స్పష్టం చేసింది. ఐదేళ్ల అసెంబ్లీ గడువును దృష్టిలో ఉంచుకోవాలని సూచించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టేసింది. తద్వారా స్పీకర్ ముందు పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చిచెప్పింది. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, కొత్తగూడెం నుంచి తెల్లం వెంకట్రావు బీఆర్‌ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరడాన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఖైరతాబాద్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు దాఖలు వేశారు. అలాగే దానంను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా స్పీకర్ సమయం ఇవ్వడం లేదంటూ బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. అనర్హత పిటిషన్ల విచారణకు నాలుగు వారాల్లో షెడ్యూల్ ఖరారు చేయాలని సెప్టెంబర్ 9న తీర్పునిచ్చారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

ఇరుపక్షాల వాదనలు ఇలా..

'స్పీకర్ తన ముందున్న పిటిషన్లపై నిర్ణయం వెలువరించిన తర్వాత కోర్టులు న్యాయ సమీక్ష జరపొచ్చు. అయితే అది కూడా చాలా స్వల్పమే. కానీ స్పీకర్ ఇంకా నిర్ణయం తీసుకోక ముందు కోర్టులు ఆయనపై ఒత్తిడి తేలేవు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం రాజ్యాంగ అధిపతి అయిన స్పీకర్ విధుల్లో కోర్టుల జోక్యం అతి స్వల్పం. తన ముందున్న అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం, స్వేచ్ఛ ఆయనకు ఉంటుంది. స్పీకర్ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని గతంలో ఎర్రబెల్లి దయాకర్ పిటిషన్‌లో ఇదే హైకోర్టు స్పష్టం చేసింది..'అని ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, న్యాయ శాఖ ముఖ్య కార్యదర్శి తరఫున రవీంద్ర శ్రీవాస్తవ, ఫిరాయింపు ఎమ్మెల్యేల తరఫున న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి, జంధ్యాల రవిశంకర్ వాదించారు. అయితే 'పదవ షెడ్యూల్‌ను ఉల్లంఘించిన వ్యక్తులను అనర్హులుగా ప్రకటించాలనే రాజ్యాంగ లక్ష్యానికి కట్టుబడి ఉండాలంటే, ఫిర్యాదు చేసిన తేదీ నుంచి మూడు నెలల వ్యవధిలో స్పీకర్ ముందున్న అనర్హత పిటిషన్లపై తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలి. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల జీవితకాలం ఐదేళ్లు మాత్రమే. కాబట్టి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచకుండా నిర్దీత సమయంలో తీర్పు వెలువరించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఇక్కడ 8 నెలలైనా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీళ్లు దాఖలు చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదు..'అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాది గండ్ర మోహన్‌రావు, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తరఫు న్యాయవాది జె.ప్రభాకర్ వాదనలు వినిపించారు.

పలు తీర్పులు ప్రస్తావించిన ధర్మాసనం

సెప్టెంబర్ 30న అప్పీళ్లు దాఖలైన నాటి నుంచి ఇరు పక్షాల తరఫున సుదీర్ఘ వాదనలు విన్న సీజే ధర్మాసనం ఈ నెల 12న తీర్పు రిజర్వు చేసింది. ఎర్రబెల్లి దయాకర్‌రావు వర్సెస్ తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎస్‌ఏ సంపత్‌కుమార్ వర్సెస్ కాలే యాదయ్య, కీషమ్ మేఘచంద్ర సింగ్ వర్సెస్ స్పీకర్, మణిపూర్ లెజిస్లేటివ్ అసెంబ్లీ, రాజేంద్రసింగ్ రాణా, కిహోటో హోలోహన్ సహా పలు కేసుల్లో తీర్పులను శుక్రవారం తీర్పు వెల్లడి సందర్భంగా సీజే ధర్మాసనం ప్రస్తావించింది. సుప్రీంకోర్టు పలు కేసుల విచారణ సందర్భంగా స్పీకర్ తగిన(రీజనబుల్) సమయంలో నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్న విషయాన్ని నొక్కి చెప్పింది. 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి తగిన అధికారం స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిందని పేర్కొంది.

'కలెక్టర్‌కు పట్టాలు ఇచ్చే అధికారం'

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: భూ పట్టాలు జారీచేసే అధికారాన్ని సీసీఎల్‌ఏ నల్లగొండ కలెక్టర్‌కు అప్పగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి ప్రక్షాళన ప్రారంభించింది. గతంలో ధరణిలో ఎలాంటి వివరాలు సరిచేయాలన్నా, పట్టాలు ఇవ్వాలన్నా సీసీఎల్‌ఏకే అధికారం ఉండేది. సీసీఎల్‌ఏ అనుమతి ఇస్తేనే కలెక్టర్ వాటిలో మార్పులు, చేర్పులను ఆన్‌లైన్ ద్వారా చేపట్టేవారు. మొట్టమొదటిసారిగా నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి పట్టాలు ఇచ్చే అధికారాన్ని అప్పగిస్తూ సీసీఎల్‌ఏ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్టు శుక్రవారం నల్లగొండలో జరిగిన దిశ సమావేశంలో తెలియజేశారు.

వికటించిన మధ్యాహ్న భోజనం

- ముగ్గురు విద్యార్థులకు వాంతులు.. 20 మందికి కడుపునొప్పి
- కరీంనగర్ జిల్లా బూర్గుపల్లి పాఠశాలలో ఘటన

గంగాధర (చొప్పదండి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూర్గుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించింది. శుక్రవారం మధ్యాహ్నం అన్నం తిన్న పలువురు విద్యార్థులు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో మొత్తం 205 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో శుక్రవారం 180 మంది హాజరయ్యారు. మధ్యాహ్న సమయంలో పాఠశాలలో వండిన భోజనం తిన్నారు. కాసేపటికి ముగ్గురు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. ఇది చూసిన మరో 20 మంది విద్యార్థులు కడుపునొప్పిస్తోందని ఉపాధ్యాయులకు చెప్పారు. వెంటనే వారు ప్రభుత్వ వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి వైద్యం అందించి, మాత్రలు ఇచ్చారు. విషయం తెలుసుకున్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. మధ్యాహ్న భోజనానికి వండిన బియ్యం కొత్తవి కావడంతో పాటు అన్నం మెత్తగా కావడం వల్ల విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని, ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని ఎంఈవో ప్రభాకర్‌రావు వివరించారు.

మీ ఖాతాలో బోనస్ జమ అయింది!

రైతుల ఫోన్లకు సీఎం, మంత్రి పేరిట సందేశాలు

ప్రియమైన రైతు సోదరులకు,

ఖరీఫ్ (2024 - 25) లో మీ దగ్గర కొనుగోలు చేసిన 62.800 క్వింటాల్ ల సన్నధాన్యానికి అదనపు ప్రయోజనం ప్రకారం రూ. 31,400.00/- మీ STATE BANK OF INDIA ఖాతా నెం.XXXXXXXX5461 లో జమచేయబడినది.

శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి.

చెన్నారం గ్రామానికి చెందిన రైతు ఫోన్‌కు వచ్చిన సందేశం

నేలకొండపల్లి: సన్నధాన్యం సాగు చేసిన రైతుల ఖాతాల్లో క్వింటాకు రూ.500 చొప్పున రాష్ట్రప్రభుత్వం నగదు జమ చేస్తుండగా.. ఆ వెంటనే 24గంటల్లోగా బోనస్ కూడా జమ అవుతోంది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెన్నారంలోనే పలువురు రైతులు సన్న ధాన్యం అమ్మగా.. వారి ఖాతాల్లో శుక్రవారం బోనస్ కూడా జమ అయింది. ఈమేరకు వారి సెల్‌ఫోన్లకు సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేరిట సందేశాలు వచ్చాయి.

ఇంటింటి కుటుంబ సర్వే పత్రాలు రోడ్లపై దర్శనమా?

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

సాక్షి, హైదరాబాద్: గతంలో ప్రజాపాలన దరఖాస్తులు రోడ్లపై దొరికాయని, ఇప్పుడు మళ్లీ ఇంటింటి కుటుంబ సర్వే పత్రాలు దర్శనమిస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజల వివరాల సేకరణ పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది మరో నిదర్శనమని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లపై తెలంగాణ ప్రజల బతుకు వివరాలను బట్టబయలు చేయడమే మీ సర్వే లక్ష్యమా? అని ప్రశ్నించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో ఇచ్చిన వివరాల భద్రత డొల్ల అని స్పష్టమవుతోందని హరీశ్‌రావు విమర్శించారు. సైబర్ మోసగాళ్ల చేతికి ఈ వివరాలు చిక్కితే ప్రజల పరిస్థితి ఏంటని నిలదీశారు.

నకిలీ యాంటీబయాటిక్ ట్యాబ్లెట్ల రవాణా

యూపీ నుంచి కొరియర్లతో తెలంగాణకు సరఫరా

సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్ నుంచి తెలంగాణకు కొరియర్లతో సాగిస్తున్న నకిలీ యాంటీ బయాటిక్ ట్యాబ్లెట్ల రవాణాను ఛేదించారు. హైదరాబాద్‌లో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణ, ఎస్టీఎఫ్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆపరేషన్‌లో ఈ దాడులు జరిగాయి. నార్కోటిక్ డ్రగ్స్, ఫెంటానిల్ ట్రాన్స్‌డెర్మల్ ప్యాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.6.91 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. నకిలీ డ్రగ్స్ కేసుల్లో నేరస్తుడైన గాండ్ల రాములు.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రొద్దుటూరుకు చెందిన మునిశేఖర్ సహకారంతో వీటిని రవాణా చేశాడు.

బోనస్‌ను బోగస్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

వరంగల్ రైతు డిక్లరేషన్ హామీల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదు: హరీశ్‌రావు



ఖమ్మం మార్కెట్‌లో రైతు లకావత్ రామాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో గంగుల కమలాకర్, పువ్వాడ, ఎమ్మెల్సీ మధు, ఎంపీ వద్దిరాజు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం..దానిని బోగస్ చేయడమే కాక సన్నరకం ధాన్యం అమ్మిన రైతులకు సైతం బోనస్ చెల్లించలేదని, కనీసం మద్దతు ధర కూడా వచ్చే పరిస్థితి లేదని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లను మాజీ మంత్రులు గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్యతో కలిసి శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం చింతకాని మండలంలో పర్యటించారు. ప్రొద్దుటూరులో భూవివాద నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న రైతు బోజెడ్ల ప్రభాకర్ కుటుంబం, ఇటీవల అరెస్టయి జైలుకు వెళ్లొచ్చిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, లచ్చగూడెంలో రైతు గూని ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో హరీశ్‌రావు మాట్లాడారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో 25 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని కొంటామని ప్రకటనలు చేస్తే.. ఇప్పటివరకు 1.20 లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు.

రైతులకు సాయమెందుకు చేయరు?

రుణమాఫీ, రైతుబంధు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు సాయం, పంటల బీమా ఇలా రైతులకు ఇచ్చిన ఏ హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని హరీశ్‌రావు విమర్శించారు. వడ్లు కూడా కొనే పరిస్థితి లేకపోవడంతో సగానికి సగం ధాన్యం దళారుల పాలవుతోందన్నారు. ఖమ్మం మార్కెట్‌లో క్వింటా పత్తికి రూ.6,400కు మించి ధర రాకపోవడంతో రైతులు క్వింటాకు రూ.1,100 నష్టపోతున్నారు. ఆరు గ్యారంటీలపై బాండ్ పేపర్ ఇచ్చి అమలు చేయనందున ఏడాది పాలనపై ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ప్రతిపక్షాల మీద కుట్రలు చేయడంపైనే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించిందని హరీశ్‌రావు విమర్శించారు.

బీసీల జనాభా ఆధారంగానే రిజర్వేషన్లు

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం ఇస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీసీ కులాల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించేందుకే ఇంటింటి సర్వే చేస్తున్నట్లు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బీసీ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించింది. ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలకు చెందిన వివిధ కుల సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు కమిషన్‌కు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు బీసీల హక్కులపై మాట్లాడారు. అనంతరం కమిషన్ చైర్మన్ నిరంజన్ మీడియాతో మాట్లాడారు. న్యాయపరమైన సమస్యలు రాకుండా సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వేపై ఎలాంటి అపోహలు అవసరం లేదని పేర్కొన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులను ఉద్యోగులుగా గుర్తించాలని, బెస్తలను బీసీ–ఏ నుంచి ఎస్టీలోకి చేర్చాలని, ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి.. రజకులను బీసీ–ఏ నుంచి ఎస్సీ గ్రూప్‌లో చేర్చాలనే విజ్ఞప్తులు వచ్చినట్లు వెల్లడించారు. వీటన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ బాలికల కాలేజీ హాస్టళ్ల సమస్య తీవ్రంగా ఉందని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలో ఉన్న బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, బీసీ–డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలని కోరారు. కమిషన్ సభ్యులు బాలలక్ష్మి, రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర పాల్గొన్నారు.

డిసెంబర్‌లో కేసీఆర్, హరీశ్‌కు పిలుపు!

క్రాస్ ఎగ్జామినేషన్‌కు సిద్ధమవుతున్న పీసీ ఘోష్ కమిషన్

ఈ నెల 25 నుంచి మూడో విడత క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావులను ప్రశ్నించడానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సిద్ధమవుతోంది. డిసెంబర్ నెల చివరి వారంలో వీరికి కమిషన్ నుంచి సమన్లు అందే అవకాశం ఉందని తెలుస్తోంది. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్‌ను మార్చడంతో పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ స్థలాల ఎంపిక, ఇతర అంశాల్లో కేసీఆర్, హరీశ్‌రావు కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పటికే పలువురు అధికారులు కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చారు. గత రెండు విడతల క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ఈఎన్‌సీలు మురళీధర్ రావు, నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ నాగేంద్రరావుతో పాటు పలువురు సీఈలు, ఎస్ఈలను కమిషన్ ప్రశ్నించింది. మూడో విడత క్రాస్ ఎగ్జామినేషన్‌ను సోమవారం నుంచి ప్రారంభించి మరో 52 మంది ఇంజనీర్లను ప్రశ్నించనుంది. ప్రతిరోజూ 14 మంది ఇంజనీర్లను విచారించడానికి ఏర్పాట్లు చేసింది. అనంతరం ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారులను ప్రశ్నించనుంది. ఆ తర్వాత కాంట్రాక్టర్లతో పాటు కాగ్ అధికారులను సైతం కమిషన్ ప్రశ్నించనుంది.

ధరణితో రైతులకు అన్యాయం

- ఇందిర పంచిన భూములను అమ్ముకున్న బీఆర్‌ఎస్ సర్కార్
- మేడిగడ్డ కూలినట్టే బీఆర్‌ఎస్ సర్కార్ కూలిపోయింది
- మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



యాదగిరిగుట్టలో మిషన్ భగీరథ పైలాన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు తుమ్మల, సీతక్క, కోమటిరెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో నిజమైన రైతులకు అన్యాయం చేసిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంచిన భూములను కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కుందని ధ్వజమెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు మల్లన్నసాగర్ నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు చేపట్టిన ప్రాజెక్టు కోసం యాదగిరిగుట్టలో నిర్మిస్తున్న మిషన్ భగీరథ పైలాన్ పనులకు శుక్రవారం మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వ భూములు భారీగా కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు రైతుల భూములు అడుగుతుంటే బీఆర్‌ఎస్ నేతలు అడ్డుకొంటున్నారని మండిపడ్డారు. ఇబ్రహీంపట్నంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేదలకు పంచిన 20 వేల ఎకరాల భూములను బీఆర్‌ఎస్ పాలనలో కేవలం రూ.5 లక్షలు, రూ.6 లక్షలకు ఎకరం చొప్పున గుంజుకున్నారని ధ్వజమెత్తారు. నెల 26వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో రూ.2,000 కోట్లతో అభివృద్ధి పనులను ఉత్సవాల్లాగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మేడిగడ్డలాగే బీఆర్‌ఎస్ సర్కారు కూలింది: కోమటిరెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే పడిపోతుందని బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని, వారికి మతి భ్రమించిందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మేడిగడ్డ కూలినట్టే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూలిపోయిందని చురకలంటించారు. డిసెంబర్ 6వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బ్రాహ్మణ వెల్లంల డిస్ట్రిబ్యూటరీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతకుముందు మంత్రులు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం పాల్గొన్నారు.

గడపగడపకూ 'ఏడాది విజయోత్సవాలు'

ఈనెల 30న పాలమూరులో రైతు దినోత్సవ సభ

- డిసెంబర్ 7–9 వరకు హైదరాబాద్‌లో లేజర్ షో, కార్నివాల్, సాంస్కృతిక వేడుకలు
- ఉన్నతస్థాయి సమీక్షలో ప్రజాపాలన విజయోత్సవాల మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాలు



శుక్రవారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు కేకే, సీఎస్ శాంతికుమారి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో అమలు చేసిన విప్లవాత్మక పథకాలు, సంక్షేమ కార్యక్రమాల వివరాలను గడపగడపకూ చేర్చాలని ప్రజాపాలన విజయోత్సవాల మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఈ విజయోత్సవాల్లో అన్ని శాఖలు భాగస్వాములు కావాలని అధికారులను ఆదేశించింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ భేటీలో ఉపసంఘం సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు సీఎస్ శాంతికుమారి, వివిధ శాఖల కార్యదర్శులు, సీఎంవో అధికారులు పాల్గొన్నారు. వచ్చే నెల 9వ తేదీ వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేసింది.

అన్ని మాధ్యమాల ద్వారా ప్రచారం: భట్టి

డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ వివిధ శాఖల పరిధిలో అమలైన పథకాలు, కార్యక్రమాల గురించి ఆయా శాఖలు ప్రజలకు వివరించాలని సూచించారు. ఇందుకోసం సోషల్ మీడియా సహా అన్ని మాధ్యమాలను ఉపయోగించుకోవాలని కోరారు. విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో రైతు దినోత్సవంతోపాటు సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ వేదికగా లేజర్ షో, కార్నివాల్‌తోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు.

మహిళలను చైతన్యవంతులను చేయాలి: మంత్రి ఉత్తమ్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మహిళల అభ్యున్నతి కోసం చేపట్టిన 70 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు సున్నా వడ్డీ పథకం, బ్యాంకు లింకేజీల కల్పన, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ తదితర పథకాల గురించి మహిళలందరికీ తెలియజేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులకు సూచించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అన్ని ఆర్టీసీ బస్సులపై ప్రజా ప్రభుత్వ పాలన విజయాలను తెలియజేసేలా ప్రకటనలు తయారు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల ఏర్పాటుపై పాఠశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు.

సీఎం చేతుల మీదుగా ఆరు పాలసీల విడుదలకు ఏర్పాట్లు: సీఎస్

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలు, 200 విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రారంభిస్తున్నామని.. 9,007 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని సీఎస్ శాంతికుమారి తెలిపారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆరు ప్రధాన పాలసీలను విడుదల చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.


Reliance
Growth is Life
పెరిగిన ధరలతో తెలివిగా ఉండండి,
విచ్చేయండి
SMART BAZAAR
BUY 1 GET FREE
1500+ ప్రొడక్ట్స్ పై
మెకెయిన్ వెజీ బర్గర్ ప్యాటీ 360 g
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹144
బజాజ్ / డాబర్ ఆన్మోల్ కొబ్బరికాయ ఆయిల్ 600 ml
ఎమ్ఆర్‌పి ₹261 మొదలుకుని
లిప్ బామ్ 4.8 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹250 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹125 మొదలుకుని
మాయిశ్చరైజర్ క్రీమ్ / లోషన్ 200 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹435 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹218 మొదలుకుని
షాంపు 580 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹850 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹425 మొదలుకుని
సోప్ 125 g మొదలుకుని / షవర్ జెల్ 500 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹90 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹45 మొదలుకుని
టేప్ డైపర్ (ఎంపిక శ్రేణి)
ఎమ్ఆర్‌పి ₹1149 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹575 మొదలుకుని
నూడుల్స్ / కెచప్ 75 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹49 మొదలుకుని
BUY 1 GET FREE
బిస్కెట్స్ / టీ / కాఫీ 50 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹130 మొదలుకుని
జ్యూసులు 1 L / బ్రేక్ఫాస్ట్ స్ప్రెడ్స్ 250 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹140 మొదలుకుని
కాలిఫ్లవర్ 1 యూనిట్
స్మార్ట్ ప్రైస్ ₹25
మార్కెట్ ధర ₹32
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹55 మొదలుకుని
గుడ్ లైఫ్ / ఫార్చ్యూన్ / సఫోలా సోయా చంక్స్ (ఎంపిక శ్రేణి)
ఎమ్ఆర్‌పి ₹65 మొదలుకుని
BUY 1 GET 1 FREE
గుడ్ లైఫ్ చిలీ / దనియాలు / పసుపు పౌడర్ 100 g మొదలుకుని
పండ్లు మరియు కూరగాయలపై అధిక పొదుపులు చేసుకోండి
స్మార్ట్ ప్రైస్ ₹48
ఆరంజ్ 1 kg
మార్కెట్ ధర ₹55
మెన్స్ అండ్ ఉమెన్స్ జీన్స్
BUY 1 GET FREE
cello LA OPALA
లూజ్ లెస్ స్టీల్ / ఓపల్ వేర్ / మెలమైన్ డిన్నర్ సెట్
LYF PIGEON WONDERCHEF SINGER PRESTIGE
ఎలక్ట్రిక్ కెటిల్ 1.5 L
HAPPY LIVING Ulhaas TRIDENT ARVIND WELSPUN
డబల్ బెడ్‌షీట్ కోఆర్డినేటెడ్ పిలో కవర్ తో సహా
safari Skybags AMERICAN TOURISTER
క్లిన్ ట్రాలీ (ఎంపిక శ్రేణి)
స్టెయిన్ లెస్ స్టీల్ ప్రెషర్ కుక్కర్ 3 L (బయటి మూత)
₹1099
ఎమ్ఆర్‌పి ₹2295
ఎమ్ఆర్‌పి ₹45 మొదలుకుని
BUY 1 GET FREE
₹499 మొదలుకుని
ఎమ్ఆర్‌పి ₹1299 మొదలుకుని
ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని
BUY 1 GET 2 FREE
జనినం 70% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹6500 మొదలుకుని



> సర్వభూత హితము నల్పుచున్నవాడై, పాపము క్షీణింప చేసుకున్నవాడై, సంశయము లేకుండ చేసుకొన్నవాడై ఎవడు ఉన్నాడో వాడు బ్రహ్మయోగియై ఆత్మస్థానము పొందుచున్నాడు.
>
> – హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 23 నవంబర్ 2024

ప్రభుత్వాలు మేల్కొనాలి!

స్వేచ్ఛ నిజమైన విలువేమిటో గుర్తించాలంటే కారాగారం గురించి కాస్తయినా తెలిసి వుండాలంటారు. జైలంటే కేవలం అయినవాళ్లకు దూరం కావటమే కాదు... సమాజం నుంచి పూర్తిగా వేరుపడిపోవడం, పొద్దస్తమానం తనలాంటి అభాగ్యుల మధ్యే గడపాల్సిరావటం. అటువంటివారిలో విచారణ ఖైదీలుగా ఉన్నవారికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన తాజా ప్రకటన ఊరటనిస్తుంది. కేసు విచారణ పూర్తయి పడే గరిష్ఠ శిక్షలో కనీసం మూడోవంతు కాలం జైల్లో గడిపి ఇంకా న్యాయం కోసం ఎదురుచూస్తూనేవున్న ఖైదీలను ఈనెల 26న జరగబోయే రాజ్యాంగ దినోత్సవానికి ముందు విడుదల చేస్తామని అమిత్ షా తెలియజేశారు. విచారణ కోసం దీర్ఘకాలం ఎదురుచూస్తూ గడిపే ఖైదీ ఒక్కరు కూడా ఉండరాదన్నది తమ ఉద్దేశమని చెప్పారు. ఇది మంచి నిర్ణయం. ప్రజాస్వామిక వాదులు ఎప్పటినుంచో ఈ విషయంలో ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేస్తూనేవున్నారు. కఠిన శిక్షలుపడి దీర్ఘకాలం జైల్లో వున్నవారిలో సత్ప్రవర్తన ఉన్నపక్షంలో జాతీయ దినోత్సవాల రోజునో, మహాత్ముడి జయంతి రోజునో విడుదల చేయటం ఆనవాయితీగా వస్తోంది. అయితే విచారణలోవున్న ఖైదీల విషయంలో ప్రభుత్వాలు క్రియాశీలంగా ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. తగిన విధానం రూపొందించలేదు. ఇందువల్ల జైళ్లు కిక్కిరిసి ఉంటున్నాయి. వాటి సామర్థ్యానికి మించి ఖైదీల సంఖ్య ఉండటంతో జైళ్ల నిర్వహణ అసాధ్యమవుతున్నది. అసహజ మరణాలు చోటుచేసుకుంటున్నాయి. ఖైదీల మధ్య కొట్లాటలు జరుగుతున్నాయి. ఖైదీల్లో అత్యధికులు అట్టడుగు కులాలవారూ, మైనారిటీ జాతుల వారూ ఉంటారు. వీరంతా నిరుపేదలు. కేవలం ఆ ఒక్క కారణం వల్లే వీరి కోసం చొరవ తీసుకుని బెయిల్ దరఖాస్తు చేసేవారు ఉండరు. కనీసం పలకరించటానికి రావాలన్నా అయినవాళ్లకు గగనమవుతుంది. రానూ పోనూ చార్జీలు చూసుకుని, కూలి డబ్బులు కోల్పోవటానికి సిద్ధపడి జైలుకు రావాలి. అలా వచ్చినా ఒక్కరోజులో పనవుతుందని చెప్పడానికి లేదు. రాత్రి ఏ చెట్టుకిందో అర్ధాకలితో గడిపి మర్నాడైనా కలవడం సాధ్యమవుతుందా లేదా అన్న సందేహంతో ఇబ్బందులుపడే వారెందరో!

బెయిల్ వచ్చినా ఆర్థిక స్తోమత లేక కారాగారాల్లోనే ఉండిపోతున్న ఖైదీల కోసం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2023 బడ్జెట్‌లో ఒక పథకాన్ని ప్రతిపాదించారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోని కమిటీల సిఫార్సుతో ఈ పథకం వర్తిస్తుంది. విచారణలోవున్న ఖైదీకి రూ. 40,000, శిక్షపడిన ఖైదీకి రూ. 25,000 మంజూరుచేసి బెయిల్‌కు మార్గం సుగమం చేయటం దాని ఉద్దేశం. బెయిల్ వచ్చినా జామీను మొత్తం సమకూరకపోవటంతో 24,879 మంది ఖైదీలు బందీలుగా ఉండిపోయారని మొన్న అక్టోబర్‌లో సుప్రీంకోర్టు పరిశోధన విభాగం సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్లానింగ్ (సీఆర్‌పీ) వెల్లడించింది. అయితే దీనివల్ల లబ్ధి పొందినవారు ఎందరని తరచి చూస్తే ఎంతో నిరాశ కలుగుతుంది. ప్రముఖ డేటా సంస్థ 'ఇండియా స్పెండ్' ఢిల్లీతోపాటు ఎనిమిది రాష్ట్రాల్లో ఈ పథకం అమలు తీరు ఎలావున్నదో ఆరా తీస్తూ సమాచార హక్కు చట్టంకింద దరఖాస్తులు చేస్తే ఇంతవరకూ కేవలం ఆరు రాష్ట్రాలు జవాబిచ్చాయి. అందులో మహారాష్ట్ర 11 మందిని, ఒడిశా ఏడుగురిని విడుదల చేశామని తెలపగా 103 మంది అర్హులైన ఖైదీలను గుర్తించామని ఢిల్లీ తెలిపింది. మూడు బిహార్ జైళ్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా విడుదలైనవారి వివరాలిచ్చాయి తప్ప పథకం లబ్ధిదారులెందరో చెప్పలేదు. పథకం ప్రారంభం కాలేదని బెంగాల్ చెప్పగా, బీజేపీ రాష్ట్రాలైన యూపీ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లు డేటా విడుదల చేయలేదు. కేరళ స్పందన అంతంతమాత్రం. ఫలానా పథకం అమలు చేస్తే ఇంత మొత్తం గ్రాంటుగా విడుదల చేస్తామని కేంద్రం ప్రకటిస్తే అంగలార్చుకుంటూ తొందరపడే రాష్ట్రాలకు దిక్కూ మొక్కూలేని జనానికి తోడ్పడే పథకమంటే అలుసన్న మాట!

ఒక డేటా ప్రకారం దేశవ్యాప్తంగా ఖైదీల సంఖ్య 5,73,220 కాగా, అందులో 75.8 శాతం మంది... అంటే ప్రతి నలుగురిలో ముగ్గురు విచారణలో ఉన్న ఖైదీలే. మొత్తం 4,34,302 మంది విచారణ ఖైదీలని ఈ డేటా వివరిస్తోంది. విచారణ ఖైదీల్లో 65.2 శాతంమందిలో 26.2 శాతంమంది నిరక్షరాస్యులు. పదోతరగతి వరకూ చదివినవారు 39.2 శాతంమంది. రద్దయిన సీఆర్‌పీసీలోని సెక్షన్ 436ఏ నిబంధనైనా, ప్రస్తుతం వున్న బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 479 అయినా నేరానికి పడే గరిష్ఠ శిక్షలో సగభాగం విచారణ ప్రారంభంకాని కారణంగా జైల్లోనే గడిచిపోతే బెయిల్‌కు అర్హత ఉన్నట్టే అంటున్నాయి. అయితే మరణశిక్ష లేదా యావజ్జీవ శిక్ష పడే నేరాలు చేసినవారికి ఇది వర్తించదు. బీఎన్ఎస్ఎస్ అదనంగా మరో వెసులుబాటునిచ్చింది. తొలి నేరం చేసినవారు విచారణ జరిగితే పడే గరిష్ఠ శిక్షలో మూడోవంతు జైలులోనే ఉండిపోవాల్సి వస్తే అలాంటి వారికి బెయిల్ ఇవ్వొచ్చని సూచించింది. బహుళ కేసుల్లో నిందితులైన వారికిది వర్తించదు.

నిబంధనలున్నాయి... న్యాయస్థానాలు కూడా అర్హులైన వారిని విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. నిరుడు కేంద్రమే ఖైదీల కోసం పథకం తీసుకొచ్చింది. పైగా బీఎన్ఎస్ఎస్ 479 నిబంధనను ఎందరు వర్తింపజేస్తున్నారో చెప్పాలని సుప్రీంకోర్టు 36 రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాలకూ మొన్న ఆగస్టులో ఆదేశాలిస్తే ఇంతవరకూ 19 మాత్రమే స్పందించాయి. ఇది న్యాయమేనా? పాలకులు ఆలోచించాలి. ఈ అలసత్వం వల్ల నిరుపేదలు నిరవధికంగా జైళ్లలో మగ్గుతున్నారు. కేంద్రం తాజా నిర్ణయంతోనైనా ప్రభుత్వాలు మేల్కొనాలి. విచారణలోవున్న ఖైదీల్లో ఎంతమంది అర్హుల్లో నిర్ధారించి, కేంద్ర పథకం కింద లబ్ధిదారుల జాబితాను రూపొందించాలి. వారి విడుదలకు చర్యలు తీసుకోవాలి.

ఆదివాసులకు చేయూతనిద్దాం!

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

ఆంగ్లేయుల దోపిడీని ఎదురించి ఆదివాసులు స్వాతంత్ర్య పోరాటానికి పునాదులు వేశారు. కానీ కనీస హక్కులు లేకుండా ఇప్పటికీ మనుగడ కోసం పోరాటం చేస్తున్నారు. అభివృద్ధి పనుల వల్ల నిరాశ్రయులైన వారిలో 55 శాతం దాకా ఆదివాసులేనని గణాంకాలు చెబుతున్నాయి. దురదృష్టవశాత్తూ ఈ అభివృద్ధి ఫలాలలో ఆదివాసుల వాటా తక్కువ. సాధారణంగా అభివృద్ధికి మరో పార్శ్వం కూడా ఉంటుంది. కానీ తమ అటవీ ఉత్పత్తులతో విధ్వంస కోణానికి తావులేని అభివృద్ధిని అడవి బిడ్డలు అందించగలరు. వారికి కావలసిందల్లా తగిన శిక్షణ, ప్రోత్సాహం, మార్కెటింగ్ సౌకర్యాలు మాత్రమే. సుస్థిరాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేసినప్పుడే, తరతరాలుగా జరుగుతున్న అన్యాయానికి సమాజం తరపున ప్రాయశ్చిత్తం చేసినట్లవుతుంది.

వైవిధ్యభరితమైన భారతీయ సంస్కృతిలో ఆదివాసులది కీలకమైన భూమిక. ప్రకృతిని దైవంగా భావించే ఆదివాసులు, ఆంగ్లేయుల దోపిడీని ఆది నుంచీ ఎదురించి స్వాతంత్ర్య పోరాటానికి పునాదులు వేశారు. భారత దేశంలోని అపారమైన సహజ సంపదపై కన్ను వేసిన బ్రిటిష్ పాలకులు 1865లో అటవీ చట్టాన్ని తీసుకువచ్చారు. 1927లో ఇండియన్ ఫారెస్ట్ యాక్ట్ పేరుతో మరో చట్టం చేశారు. అడవుల పరిరక్షణ ముసుగులో సహజ వనరులను దోచుకునేందుకు ఉద్దేశించిన ఆ చట్టాలకు వ్యతిరేకంగా ఆదివాసులు అనేక పర్యాయాలు తిరుగుబాటు చేసి మరింత అణచివేతకు గురయ్యారు. కానీ, తమ నిరంతర తిరుగుబాటు ద్వారా స్వాతంత్ర్య పోరాటానికి జీవం పోశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వాల చొరవ వల్లనో, ప్రజల పోరాటాల వల్లనో వలస పాలన దుష్పరిణామాల నుంచి బయట పడగలిగాము.

అయితే, ప్రధాన స్రవంతికి దూరంగా అడవుల్లో నివసిస్తున్న ఆదివాసులు ఇప్పటికీ వివక్షకు, ఉదాసీనతకు గురవుతూనే ఉన్నారు. తరతరాలుగా తాము కాపాడుకుంటున్న అడవులలో కనీస హక్కులు లేకుండా మనుగడ కోసం పోరాటం చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో అడవుల హద్దులను గుర్తించారు, కానీ అడవి బిడ్డల హక్కులను విస్మరించారు. అభివృద్ధి కూడా ఆదివాసుల పాలిట శాపంగా పరిణమించింది. దేశ జనాభాలో వారు సుమారు 8 శాతం ఉంటారు. అభివృద్ధి పనుల వల్ల నిరాశ్రయులైన వారిలో 55 శాతం దాకా ఆదివాసులేనని గణాంకాలు తెలుపుతున్నాయి. దురదృష్టవశాత్తూ ఈ అభివృద్ధి ఫలాలలో ఆదివాసుల వాటా అతి తక్కువ.

అటవీ చట్టాలు అమలు చేయాలి!

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఐదు దశాబ్దాల దాకా ఆదివాసులను ప్రధాన స్రవంతిలో కలిపేందుకు పెద్దగా ప్రయత్నాలు జరగలేదు. 1996లో వచ్చిన పెసా(పీఈఎస్ఏ– షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ) చట్టం, 2006 నాటి అటవీ హక్కుల చట్టం (ఫారెస్ట్ రైట్స్ యాక్ట్) ఆదివాసులకు జరుగుతూ వచ్చిన అన్యాయాల పరిష్కారం దిశగా మైలురాళ్లుగా చెప్పుకోవచ్చు. పెసా చట్టం అడవి బిడ్డల సంప్రదాయిక వనరుల నిర్వహణ విధానాలను ఆమోదిస్తూ, వారి స్వయం పాలనకు వీలు కల్పించేందుకు తీసుకువచ్చారు. ఎఫ్ఆర్ఏ చట్టం ఇంకొక అడుగు ముందుకు వేసి చారిత్రకంగా ఆదివాసులకు అటవీ హక్కుల విషయంలో జరిగిన అన్యాయాలకు ముందుమాటలో క్షమాపణ చెప్పింది. ఉద్దేశాలు ఉన్నతంగా ఉన్నప్పటికీ ఈ చట్టాల అమలు సంతృప్తికరంగా లేదు. పాలనా యంత్రాంగంలోని కొన్ని వర్గాల వ్యతిరేకత, రాష్ట్ర చట్టాలతో సరైన అనుసంధానం లేకపోవడం వల్ల ఈ చట్టాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు.



పెసా, ఎఫ్ఆర్ఏ చట్టాల అమలు విషయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మహారాష్ట్ర కాస్త మెరుగైన స్థానంలో ఉంది. చెన్నమనేని విద్యాసాగర్ రావు ఆ రాష్ట్ర గవర్నర్‌గా ఉన్నప్పుడు తీసుకున్న చొరవ వల్ల ఇది సాధ్యమయింది. ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులలో ఐదు శాతం నేరుగా గ్రామ పంచాయతీలకు, గ్రామసభలకు అందించాలని ఆయన నిర్దేశించడం వల్ల షెడ్యూల్డ్ ప్రాంతాలలోని ఆదివాసీ పల్లెల సాధికారీకరణకు మార్గం సుగమమైంది. వెదురు, బీడీ ఆకుల వంటి చిన్న చిన్న అటవీ ఉత్పత్తులపై గ్రామ సభలకు హక్కులు పునరుద్ధరించారు. తద్వారా అడవులను నమ్ముకున్న స్థానికులకు ఆదాయం పొందే అవకాశం కల్పించారు. గిరిజన గ్రామసభలు అటవీ ఉత్పత్తుల విక్రయం ద్వారా నెలకు 10 నుంచి 80 లక్షల రూపాయల ఆదాయం పొందుతున్నాయి. ఆదాయం పొందే అవకాశం కల్పించడం వల్ల ఆదివాసులు అడవుల పరిరక్షణతో పాటు పెంపకం కూడా చేపట్టి ప్రకృతితో తమకున్న అవినాభావ సంబంధాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. దీంతో పెసా, ఎఫ్ఆర్ఏ చట్టాల వల్ల అడవులు నాశనమవుతాయని కొన్ని వర్గాలు చేసిన ప్రచారంలోని డొల్లతనం కూడా బయటపడింది. పెసా చట్టం అమలులో గడ్చిరోలి జిల్లా దేశంలోనే ముందంజలో ఉండి మార్గదర్శకంగా నిలిచింది. మహారాష్ట్రలో విద్యాసాగర్ రావు చొరవతో 20 లక్షల ఎకరాల అటవీ భూమి నిర్వహణ బాధ్యతను స్థానిక ఆదివాసీ గ్రామసభలకు అప్పగించారు. ఇతర రాష్ట్రాలు కూడా ఈ అనుభవాలను పాఠాలుగా తీసుకొని సుస్థిరాభివృద్ధిలో ఆదివాసులను భాగస్వాములను చేయాలి.

పర్యావరణ హిత ఉపాధి అవకాశాలు

సాధారణంగా అభివృద్ధికి మరో పార్శ్వం కూడా ఉంటుంది. పరిశ్రమలు ఉపాధికి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నప్పటికీ వాటి నుంచి వెలువడే వ్యర్థాల వల్ల గాలీ, నీరూ కలుషితమై రకరకాల రోగాలు ప్రబలుతున్న విషయం తెలిసిందే. ఇలాంటి విధ్వంస కోణానికి తావులేని అభివృద్ధిని అడవి బిడ్డలు అందిస్తారు. వారికి కావలసిందల్లా తగిన శిక్షణ, ప్రోత్సాహం, మార్కెటింగ్ సౌకర్యాలు మాత్రమే. అడవిలో లభ్యమయ్యే పలు వనరులను ప్రపంచానికి అవసరమయ్యే ఉత్పత్తులుగా మలిస్తే పర్యావరణానికి ఏ మాత్రం ముప్పు లేకుండా ఆదివాసులకు ఉపాధి లభిస్తుంది, దేశ ఆర్థికాభివృద్ధిలో వారు భాగస్వాములవుతారు.

అడవులలో విస్తృతంగా లభించే వెదురు ద్వారా ప్రపంచానికి అవసరమయ్యే అనేక ఉత్పత్తులను తయారు చేయవచ్చు. గృహోపకరణాల నుంచి దుస్తుల దాకా సంగీత పరికరాల నుంచి ఔషధాల దాకా రకరకాల అవసరాలకు వెదురును ఉపయోగిస్తున్నారు. అటవీ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఐఐటీల వంటి ఉన్నత విద్యాసంస్థలు ముందుకు వచ్చి ఆదివాసులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలి. మహారాష్ట్రలో ఒక విశ్వవిద్యాలయం, మరో స్వచ్ఛంద సంస్థ కలిసి ఆదివాసులకు వెదురు నుంచి రాఖీలు తయారు చేయడంలో శిక్షణ ఇచ్చాయి. మిగతా రాష్ట్రాలలో కూడా స్వచ్ఛంద సంస్థలు చొరవ తీసుకొని ఆదివాసులకు ఆసరాగా నిలవాలి. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అడవిలో లభించే వనరుల ద్వారా సబ్బులు, షాంపూలు, సుగంధ ద్రవ్యాలు తయారు చేయవచ్చు. వీటికి ఎక్కువ ధర చెల్లించడానికి కూడా వినియోగదారులు వెనకాడటం లేదు. కాబట్టి స్టార్టప్ కంపెనీలు కూడా అటవీ ఉత్పత్తులపై దృష్టి సారించాలి.

ఆదివాసులకు ఆత్మగౌరవం ఎక్కువ. అవసరమైతే ఉపవాసమైనా ఉంటారు కానీ ఇంకొకరి ముందు చేయి చాచడానికి ఇష్టపడరు. అటువంటి వారికి ఆసరాగా నిలబడి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి చేయూతనిస్తే తరతరాలుగా జరుగుతున్న అన్యాయానికి సమాజం తరపున ప్రాయశ్చిత్తం చేసినట్లవుతుంది. అంతే కాకుండా వేల ఏళ్లుగా ప్రతిఫలాపేక్ష లేకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ వస్తున్న అడవిబిడ్డల రుణం తీర్చుకున్నట్లవుతుంది.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మన్
మొబైల్ : pvg@ekalavya.net

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎప్పటికి?



పాకిస్తాన్‌లో మరో విషాద దినం: మరో ఉగ్రవాద దాడిలో యాభై మందికి పైగా షియాలు చనిపోయారు. ఈ హింస, శాఖా విద్వేషాల చక్రం ఎప్పుడు ముగుస్తుంది?

– అమనా బేగం అన్సారీ, కాలమిస్ట్

ఊహిస్తున్నదే!



ఈమధ్య నేను లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ అవుట్ అయినప్పుడు ఎక్కువ బాధ పడుతున్నాను. ఎందుకంటే, టాప్ ఆర్డర్ కుప్పకూలడానికి ఎటూ మానసికంగా సిద్ధమయ్యే ఉన్నాను.

– రమేష్ శ్రీవత్స్, సెటైరిస్ట్

అమలు ఎలా?



ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై ఐసీసీ జారీ చేసిన అరెస్ట్ వారెంట్ ఒక గిమ్మిక్. ఎవరు అమలు చేస్తారు? ఐసీసీని రూపొందించిన రోమ్ చట్టంపై ఇజ్రాయెల్, యూఎస్ఏ సంతకం చేయలేదు. న్యాయశాస్త్రంలో అంతర్జాతీయ చట్టం అనేది కనుమరుగవుతున్నది. శక్తిమంతమైన దేశాలు శిక్ష లేకుండా తప్పించుకోగలవు.

– మార్కండేయ కాట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

బతగ్గలమా?



గంగా నదిని శుభ్రం చేయడంలో, యమునా నదిని శుభ్రం చేయడంలో, మన గాలిని శుభ్రం చేయడంలో, ఢిల్లీలోని విషపూరిత చెత్త పర్వతాలను శుభ్రం చేయడంలో, మన ఘోరమైన ట్రాఫిక్‌ను చక్కదిద్దడంలో మనం విఫలమయ్యాం. అసలు మనది ఒక బతకగలిగే దేశమేనా?

– హిందోల్ సేన్ గుప్తా, ప్రొఫెసర్

ఇదీ ప్లాన్!



మీరు ఐదేళ్లలో ఎలా ఉంటారన్నది వీటిపై ఆధారపడి ఉంటుంది: తినే తిండి, చేసే వ్యాయామం, పోయే నిద్ర, చదివే పుస్తకాలు, రాసే రాతలు, చేసే ఆదా, పెట్టే పెట్టుబడులు, చేసే ప్రయాణాలు, నేర్చుకునే కొత్త నైపుణ్యాలు, చేసుకునే కొత్త హాబీలు, ఇచ్చే–నిలబెట్టుకునే వాగ్దానాలు; ఇంకా, ఎవరితో పని చేస్తారు, స్నేహితులతో ఎలా గడుపుతారు, ఎంత ఓపెన్‌గా ఉంటారు, ఎప్పుడు నిష్క్రమిస్తారు...

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

పరిణామ సత్యం

ఒక అక్షరం, ఒక ఆలోచన, ఒక పుస్తకం సమాజాన్ని ప్రభావితం చేస్తాయా? ఆలోచనలు అనంతం. అక్షర శక్తి అనల్పం. ఇవి రెండూ ఏకమై పుస్తక రూపం తీసుకుంటే అది చూపే ప్రభావానికి ఎల్లలు ఉండవు. ఛార్లెస్ డార్విన్ 1859 నవంబర్ 24న వెలువరించిన 'జాతుల పుట్టుక' (ది ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్) అనే గ్రంథం ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపింది. వచ్చిన తొలిరోజే 1,250 కాపీలు అమ్ముడు పోయాయంటే ఆ గ్రంథం సృష్టించిన సంచలనం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. అంతగా సంచలనాత్మకం కావటానికి అందులో ఉన్నదేమిటి? డార్విన్ ఆ పుస్తకంలో ప్రతిపాదించిన 'జీవ పరిణామ సిద్ధాంతం'! అది నూతన భావ విస్ఫోటనానికి నాంది పలికింది. నాటి వరకూ సమాజంలో పాతుకుపోయిన సృష్టివాద నమ్మకాలకు భిన్నంగా కొత్త అవగాహనకూ, ఆలోచనలకూ పట్టం కట్టడం. అందుకే పరిణామ సిద్ధాంతాన్ని ఎర్నెస్ట్ మయర్ అనే శాస్త్రవేత్త నూతన పథ నిర్దేశినిగా పేర్కొన్నాడు.

ఇంతకూ ఆ సిద్ధాంతం ఏం చెప్పింది? జీవులు... దగ్గర లక్షణాలున్న వాటి పూర్వీకులైన జీవుల నుండి పరిణామం చెందాయని. ఏ జీవీ ఉన్నది ఉన్నట్లుగా సృష్టి కాలేదనీ, ప్రకృతి పరిస్థితుల నెదుర్కొని దీర్ఘ కాలంలో నేడు మనం చూస్తున్న జీవులు, జీవ వైవిధ్యం రూపుదిద్దుకున్నాయనీ. ఒక్కమాటలో చెప్పాలంటే, ఈ భూమిపై నివసించే ప్రతి జీవీ ప్రకృతి చెక్కిన శిల్పమే! ఇది ఒక భౌతిక ప్రక్రియ. ఇందులో ఏ అతీత శక్తుల ప్రమేయం లేదని ఆధారాలతో మరీ వివరించాడు డార్విన్. ఇదే సృష్టివాదులకు కంటగింపుగా మారింది. మనిషితో సహా అన్ని రకాల జంతు, వృక్ష జాతులనూ ఇప్పుడు ఉన్నట్లుగానే దేవుడు సృష్టి చేశాడనీ, అవి మార్పు చెందటం కొత్త జాతులు రావటం అనే ప్రసక్తే లేదని దాదాపు అన్ని మతాల నమ్మకం. ఆ నమ్మకానికి చేటు తెస్తుందనుకున్న ఏ సిద్ధాంతాన్నైనా, ఎన్ని నిరూపణలు చూపినా అంగీకరించేందుకు సృష్టివాదులు ససేమిరా ఒప్పుకోరు. అందుకే ఆదిలోనే మతం నుండి వ్యతిరేకతను, దాడిని ఎదుర్కోవలసి వచ్చింది.



అయినా ఈ సిద్ధాంతం 1930 నాటికి శాస్త్ర ప్రపంచ ఆమోదం పొందటం గమనార్హం. డార్విన్ చూపిన నిదర్శనాలు, ఇబ్బడిముబ్బడిగా సేకరించిన నమూనాలు, జీవ పరిణామ సిద్ధాంత ప్రతిపాదకుల్లో ఒకరైన ఆల్‌ఫ్రెడ్ రస్సెల్ వాలస్ మలయా దీవుల్లో కనిపెట్టిన అనేక జంతుజాతుల విశేషాలు సృష్టివాదుల నోరు కట్టేశాయి. డార్విన్ కాలం నాటి కంటే తరువాతి కాలంలోనే పరిణామాన్ని బలపరిచే ఎన్నో రుజువులు బయటపడినాయి. జీవించి ఉన్న జాతులను, గతించిన జాతులతో అనుసంధానించే అనేక మధ్యంతర జీవులు శిలాజాల రూపంలో దొరకటం డార్విన్ సిద్ధాంతాన్ని మరింత బలపరిచాయి. శిలాజాలే కావు నేటి ఆధునిక పరిశోధనలు, జీనోమ్ సమాచారం సైతం డార్విన్ పరిణామ సిద్ధాంత విశిష్టతను, సత్యాన్ని చాటడం విశేషం. ఇంతటి ప్రభావశీలమైన జీవ పరిణామ సిద్ధాంతాన్ని వెల్లడించిన గ్రంథం వెలువడిన నవంబర్ 24వ తేదీని 'అంతర్జాతీయ జీవ పరిణామ దినం'గా ప్రపంచం జరుపుకొంటోంది. పరిణామ విశ్వజనీనతనూ, సత్యాన్నీ ప్రజల ముందుంచే పనిని సైన్సు ప్రచార సంస్థలు భుజానికెత్తుకుని పరిణామ దినోత్సవాన్ని జరుపుతున్నాయి.

– ప్రొ॥ కట్టా సత్యప్రసాద్, జన విజ్ఞాన వేదిక ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు

(రేపు అంతర్జాతీయ జీవ పరిణామ దినోత్సవం)

పంట మార్పిడే సరైన పరిష్కారం

విశ్లేషణ



డా॥ జి. పద్మజ

'వ్యవసాయం రుతుపవనాలతో ఆడే జూదం' అంటారు. సకాలంలో వానలు కురవక పోవడమే కాదు, వాతావరణ మార్పులు, నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత... ఇలా అనేక కారణాలు రైతును దెబ్బతీస్తున్నాయి. అయితే ఇవేవీ రైతు నియంత్రణలో ఉన్న అంశాలు కావు. అయితే రైతుల తమ చేతుల్లో ఉన్నవాటినీ నిర్లక్ష్యం చేయడం వల్ల ఎంతో నష్టానికి గురవుతున్నారు. ఉదాహరణకు పంటమార్పిడి వారి చేతుల్లో ఉన్న వ్యవహారమే. పంటమార్పిడి చేయక పోవడం వల్ల రైతులు కనీసం 25 శాతం పంట దిగుబడిని నష్టపోతున్నారు. రైతు ఆదాయాన్ని పెంచుకునేందుకు పంట మార్పిడి అద్భుతమైన సాధనం. పైగా రసాయనిక ఎరువుల ధాటికి నానాటికీ తీసికట్టుగా మారుతున్న నేల సారానికి టానిక్‌గానూ పనిచేస్తుంది ఇది. దురదృష్టం ఏమిటంటే... ఇన్ని లాభాలు ఉన్నప్పటికీ మన రైతన్నలు పంట మార్పిడిని సీరియస్‌గా తీసుకోవడం లేదు.



ఈ పంటమార్పిడి ఎలా చేయాలో ఒకసారి చూద్దాం. వరి వేసిన తరువాత మినుములు లేదా నువ్వుల్లాంటి నూనెగింజలను సాగు చేయడం మేలు. దీనివల్ల నేలలో నత్రజని మోతాదు పెరగడమే కాకుండా... చీడపీడల బెడద కూడా తగ్గుతుంది. మొక్కజొన్న పంటను వేరుశనగ లేదా కాయగూర పంటలతో మార్పిడి చేసుకోవడం మేలు. ఒకవేళ ప్రధాన పంటగా వేరుశనగ వేస్తుంటే... తరువాతి పంటగా మొక్కజొన్న వేసుకోవచ్చు. ఇది నేలలో సేంద్రీయ పదార్థం మోతాదులను కూడా పెంచుతుంది. పత్తి పంటకు మార్పిడిగా పెసలు వేస్తే చీడపీడల బెడద తగ్గుతుంది. నేలలో నత్రజని మోతాదు ఎక్కువ అవుతుంది. ప్రధాన పంటల సాగు తరువాత కాయధాన్యాలను సాగుచేయాలి. వ్యర్థాలను మళ్లీ నేలలో కలిపేస్తే మేలు కలిగించే సూక్ష్మజీవులు కూడా ఎక్కువవుతాయి. వేర్వేరు పంటల సాగు వల్ల రైతు ఆదాయమూ పెరుగుతుంది.

పంట మార్పిడిని తగు విధంగా అమలు చేస్తే రైతు ఆదాయం 15 నుంచి 20 శాతం ఎక్కువ అవుతుంది. ఒక సంవత్సరంలో వేర్వేరు పంటలు సాగు చేస్తారు కాబట్టి మార్కెట్ రిస్క్ తక్కువ అవుతుంది. పంట మార్పిడి వల్ల నేలలో నత్రజని మోతాదు ఎక్కువై ఉత్పత్తి ఖర్చులు 10 నుంచి 15 శాతం వరకూ తగ్గుతాయి. అంటే రసాయన ఎరువులు, క్రిమి, కీటకనాశినుల వాడకం తగ్గుతుందని అర్థం. ఒకే రకమైన పంట సాగు చేస్తుంటే చీడపీడలు కూడా వాటికి అలవాటు పడిపోతాయి కాబట్టి సమస్య ఎక్కువవుతుంది. ఉదాహరణకు వరికి సోకే కాండం తొలుచు పురుగు కాయధాన్యాల మొక్కలపై జీవించలేదు. వరి తరువాత ఈ కాయధాన్యాల సాగు చేస్తే సహజసిద్ధంగా చీడపీడల సమస్య తగ్గిపోతుంది.

దేశంలో వ్యవసాయంపైనే ఆధారపడిన అరవై శాతం గ్రామీణుల జీవనోపాధి అవకాశాలను పెంచేందుకు, ఆహార భద్రతకు పంట మార్పిడి అన్నది ఎంతో ఉపయోగపడుతుంది. భూసారం, దిగుబడులు పెంచే పంటమార్పిడి గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమయ్యేందుకు, తద్వారా ఉపాధి అవకాశాలను పెంచేందుకు కారణమవుతుంది.

ఈ ప్రయోజనాలపై ప్రభుత్వం తగిన ప్రచారం చేయడం లేదు. అందువల్ల రైతులకు దీనిపై అవగాహన లోపించింది. పంటల మార్పిడి వల్ల వేర్వేరు పంటల విత్తనాలు, ఎరువులు, కొన్నిసార్లు వ్యవసాయ పరికరాల అవసరమూ ఏర్పడుతుంది. ఇవి రైతులపై కొంత ఆర్థిక భారం మోపే అవకాశం ఉంటుంది. పైగా అన్ని రకాల పంటలకు మద్దతు ధర లభించని నేపథ్యంలో రైతులు పంట మార్పిడిపై ఆసక్తి చూపడం లేదు.

రైతులందరూ పంట మార్పిడిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరమెంతైనా ఉంది. సీజన్‌ను బట్టి మారిపోయే పంటలకు తగ్గట్టుగా నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. కాయధాన్యాలు, పప్పుధాన్యాలతోపాటు నూనెగింజల పంటల విత్తనాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. అంతేకాకుండా... మద్దతు ధరలు దక్కేలా చూడటం. మార్కెట్ ఒడిదుడుకులను వీలైనంత మేరకు తగ్గించడం ద్వారా రైతులు పంట మార్పిడిపై ఆసక్తి చూపేలా చేయాలి.

వ్యాసకర్త ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులు

రారాజు ఆగమనానికి...

విశ్వవ్యాప్తంగా క్రైస్తవ విశ్వాస సమాజాలు అన్నీ ఆచరించే పెద్ద పండుగ క్రిస్మస్. క్రిస్మస్ అంటే క్రీస్తు ఆరాధన అని అర్థం. క్రీస్తు జన్మదినం జరుపుకునే డిసెంబర్ 25కి ముందు నాలుగు వారాల నుంచి ముందస్తు క్రిస్మస్ వేడుకలు ప్రారంభిస్తారు. దీనినే 'అడ్వెంట్' అంటారు. లాటిన్ భాషలోని అడ్వెంటస్ అనే పదం దీనికి మూలం. అడ్వెంట్ అంటే ఆగమనం/ రాకడ/ ఆహ్వానం అని అర్థం. డిసెంబర్ 24 సాయంత్రంతో అడ్వెంట్ ముగుస్తుంది.

అడ్వెంట్ నాలుగు వారాల్లో దేవాలయాల్లో ముందస్తు క్రిస్మస్ వాతావరణం ఏర్పడుతుంది. అడ్వెంట్ తొలి ఆదివారమే పెద్ద నక్షత్రాన్ని అలంకరిస్తారు. ఏసు జననానికి ముందు ఆకాశంలో పుట్టిన కొత్త నక్షత్రానికి గుర్తుగా నక్షత్రాన్ని అలంకరించడంతో క్రిస్మస్ పండుగ వాతావరణం ఏర్పడుతుంది. దేవాలయాల్లోనూ క్రిస్మస్ చెట్టును అలంకరించి రంగురంగుల దీపాలతో అలంకరణలు చేసి ముస్తాబు చేస్తారు. పచ్చని చెట్టు ప్రేమకు, శాంతికి, జీవిత విలువలకు ప్రతీక.



అడ్వెంట్ నాలుగు వారాల్లో వరుసగా మూడు వారాలు ఊదారంగు మైనపు వత్తులూ, చివరివారం గులాబి రంగు మైనపు వత్తి వెలిగిస్తారు. ఈ అన్ని రోజుల్లో జరిగే ప్రార్థనలో ప్రేమ – ఆనందం, విశ్వాసం – శాంతికి గుర్తుగా రంగురంగుల మైనపు వత్తులు వెలిగించడం క్రీస్తుశకం 567 నుండి కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ వారు ప్రారంభించారు. ఈ నాలుగు వారాలూ దేవాలయం ప్రధాన పీఠభాగం (ఆల్టార్)ని ఊదారంగు వస్త్రాలతో అలంకరిస్తారు. దేవాలయ అధిపతులు కూడా అదే రంగు వస్త్రాలను ధరిస్తారు. ఊదారంగు రాచరికానికి గుర్తు. రారాజు ఆగమనానికి ఆహ్వానం పలకడానికి సమాజాన్ని సిద్ధం చేయడంలో మతాధిపతులు ప్రార్థనా సమావేశాలు నిర్వహిస్తారు. అడ్వెంట్ కాలమంతా తెల్లవారుజామునే ప్రార్థనలు నిర్వహించి, సమాజానికి క్రిస్మస్ ఆగమన సందేశం ఇస్తారు.

అడ్వెంట్ కాలంలోనే క్రిస్మస్ కారల్స్ ప్రధాన భూమిక పోషిస్తాయి. యువకులు, పెద్దలు ఒక సమూహంగా ఏర్పడి ఆ యా గృహాలు సందర్శించి పాటలు, నృత్యాలతో పండుగ ఉత్సాహాన్ని నింపుతారు. ఈ నేపథ్యంలోనే ఆ యా ప్రాంతాల్లోని అనాథలను గుర్తించి వస్త్రాలు, ఆహారం పంచి ఇస్తారు. 'నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు'మన్న సందేశం అక్షరాలా పాటిస్తారు. అడ్వెంట్ వల్ల ఏసును హృదయంలో ప్రతిష్ఠించుకుని తప్పులు పునరావృతం కాకుండా ఆత్మక్షాళనం గావించుకోవడం ప్రధాన కర్తవ్యం. వ్యక్తిగత శుద్ధితో పాటు సమాజ ప్రక్షాళన జరుపుకుని మానవ సమాజమంతా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఆనందించడం, ఒకరికొకరు చేయూతను అందించుకోవడం అడ్వెంట్ కాలంలో చేయవలసిన కర్తవ్యం.


– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

(రేపు అడ్వెంట్ ప్రారంభం)

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.అష్టమి రా.10.08 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** మఖ రా.10.20 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.9.34 నుండి 11.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.58 నుండి 7.44 వరకు, **అమృతఘడియలు:** రా.7.46 నుండి 9.31 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.12, **సూర్యాస్తమయం:** 5.20.

సీఎం రేవంత్ స్వగ్రామంలో మాజీ సర్పంచ్ ఆత్మహత్య

ఇంటికి వెళ్లేందుకు దారి విషయంలో సీఎం సోదరులు కక్ష కట్టారంటూ సూసైడ్ నోట్



సాయిరెడ్డి రాసిన సూసైడ్ నోట్



సాక్షి, నాగర్‌కర్నూల్: సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి(85) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఇంటికి వెళ్లేందుకు దారి కోసం గతంలో పాతబావిని పూడ్చివేశాడు. దీనికి ఆనుకొని ఉన్న స్థలంలో ఇటీవల ప్రభుత్వం వెటర్నరీ ఆస్పత్రిని నిర్మించింది. ఆస్పత్రి భవనానికి ప్రహరీ నిర్మించే క్రమంలో శుక్రవారం అధికారులు గుంతలు తీయించారు. తన ఇంటికి దారి వదిలి ప్రహరీ నిర్మించాలని సాయిరెడ్డి అధికారులను కోరాడు. అధికారులు ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తుండగా, ఈ విషయంలో మనస్తాపం చెందిన సాయిరెడ్డి కొండారెడ్డిపల్లి నుంచి కల్వకుర్తికి బస్సులో చేరుకున్నాడు. అక్కడ పురుగుమందు కొనుక్కొని, రఘుపతిపేట దారిలో పంటపొలాల్లో తాగి అక్కడే స్పృహతప్పి పడిపోయాడు. స్థానికుల సమాచారంతో కల్వకుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. సాయిరెడ్డి కుటుంబసభ్యులకు సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులోని వివరాల ప్రకారం.. 'నేను సుమారు 40 ఏళ్ల కింద నిర్మించుకున్న ఇంటిముందు దారి కోసం సొంత ఖర్చులతో పాత బావిని పూడ్చివేశాను. ఇంటి పక్కనుంచి దారి చేసుకున్నాను. కానీ సీఎం రేవంత్ రెడ్డి బ్రదర్స్ నా మీద కక్షగట్టి నా ఇంటి ముందు పశువుల దవాఖానా కట్టినారు. వీళ్లను నేను ఎలాంటి ఆక్షేపణలు చేయలేదు, నా ఇంటికి దారి ఇడవమన్నాను. దారి ఇస్తామని చెప్పారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి బ్రదర్స్ నామీద పార్టీల నిందమోపి, నా ఇంటికి అడ్డంగా గోడ నిర్మాణానికి పూనుకున్నారు. నేను ఏ పార్టీ కాదు. నాది దేవుడి పార్టీ. ఇలాంటి పరిస్థితి వస్తుందనుకోలేదు. అందుకే బాధతో చనిపోతున్నా. నా చావు దేవుళ్లకు అంకితం'అని ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై మహేందర్ తెలిపారు.

ఇది రేవంత్ సోదరులు చేసిన హత్య

సాయిరెడ్డిది ఆత్మహత్య కాదు.. సీఎందే బాధ్యత: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సొంత ఊరు కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాముకుంట్ల సాయిరెడ్డిది ఆత్మహత్య కాదని రేవంత్‌రెడ్డి సోదరులు చేసిన హత్య అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సాయిరెడ్డి ఆత్మహత్యకు ముందు రాసిన నోట్‌లో సీఎం సోదరులు తనపై కక్ష కట్టారని స్పష్టంగా పేర్కొన్నారన్నారు. సూసైడ్ నోట్ ఆధారంగా సీఎం రేవంత్‌రెడ్డి సోదరులపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని 'ఎక్స్'వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ సోదరుల అరాచకాలు తట్టుకోలేక సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆరునెలల క్రితం ఒక యూట్యూబ్ చానల్‌కు సాయిరెడ్డి ఇంటర్వ్యూ ఇచ్చాడనే కక్షతో ఆయన ఇంటికి వెళ్లే దారిని మూసివేశారని చెప్పారు. రెండు పర్యాయాలు కొండారెడ్డిపల్లి సర్పంచ్‌గా సేవలు అందించిన 85 ఏళ్ల వ్యక్తిని గౌరవించకుండా ఆత్మహత్యకు పాల్పడేలా రేవంత్ సోదరులు వేధింపులకు గురి చేశారన్నారు. ఈ ఘటనకు సీఎం నైతిక బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో గిరిజన మహిళలపై దమనకాండను మరవక మునుపే కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ఆత్మహత్య ఘటన జరిగిందన్నారు. రాష్ట్రంలో సీఎం, ఆయన సోదరుల అరాచకాలకు అంతేలేకుండా పోయిందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాపాలనకు బదులుగా అరాచక, నియంత, దుర్మార్గపు పాలన సాగుతోందని కేటీఆర్ మండిపడ్డారు.

అరాచకాలు శ్రుతిమించాయి: హరీశ్‌రావు

'కొండారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడడం కలచివేసింది. సాక్షాత్తు సీఎం సొంత గ్రామంలో ఉన్న దారుణ పరిస్థితికి సాయిరెడ్డి ఆత్మహత్య నిదర్శనం. సీఎం సొంత గ్రామ మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు ఉసిగొల్పిన వారిపై చర్యలు తీసుకోవాలి. సీఎం అన్నదమ్ముల అరాచకాలు శ్రుతి మించాయనడానికి ఇది నిదర్శనం. సాయిరెడ్డి మృతికి కారణమైన సీఎం అన్నదమ్ములపై చట్టరీత్యా కేసులు నమోదు చేయాలి'అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఆ భూములు ఇవ్వండి!

▶ మొదటి పేజీ తరువాయి

వినియోగించుకుంటున్నాయన్న దానిపై రాష్ట్ర రెవెన్యూ శాఖ ఇటీవల వివరాలు సేకరించింది. రాష్ట్రంలోని 11 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు మొత్తం 8,900 ఎకరాలు కేటాయించగా.. అందులో 2,300 ఎకరాలు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయని, మిగతా భూములను నిరుపయోగంగా వదిలేశారని తేలింది. వీటితోపాటు ఇప్పటికే మూతపడిన సిమెంట్ కార్పొరేషన్, డ్రగ్స్ లిమిటెడ్, హెచ్‌ఎంటీల పరిధిలో మరో 3,300 ఎకరాల వరకు భూమి ఉందని రెవెన్యూ శాఖ గుర్తించింది.

రూ.45 వేల కోట్ల విలువతో..

హైదరాబాద్ నగరానికి శివార్లలో, ప్రధాన ప్రాంతాల్లో ఉన్న ఈ నిరుపయోగ భూముల విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ప్రకారం రూ.45 వేల కోట్ల వరకు ఉంటుందని రెవెన్యూ శాఖ అంచనా వేసింది. ఈ భూములను ప్రభుత్వ ధరకు తిరిగి తీసుకోవడం ద్వారా... పరిశ్రమల ఏర్పాటు, వాణిజ్య అవసరాలకు, వేలం వేసి నిధుల సమీకరణ చేసుకోవడానికి ఉపయోగపడతాయని ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. ఆ నివేదిక ప్రకారం... ప్రభుత్వ ధరతో ఆ భూములను తిరిగి తీసుకోవాలంటే రూ.8 వేల కోట్ల వరకు అవసరమని అంచనా వేసినట్టు సమాచారం. దీనిపై కేంద్ర ప్రభుత్వ శాఖలతో సంప్రదింపులు జరపాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభించిందని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి.

గత ప్రభుత్వ హయాంలోనే కోరినా..

కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన నిరుపయోగ భూములను ఇవ్వాలని గత బీఆర్‌ఎస్ సర్కారు కూడా కేంద్రాన్ని కోరింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి హోదాలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2022లో కేంద్రానికి లేఖ రాశారు. పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా కేంద్ర పీఎస్‌యూల భూములను ప్రైవేటు వ్యక్తులకు అమ్మవద్దని... రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడం ద్వారా ఆర్థికాభివృద్ధికి సహకరించాలని కోరారు. కానీ కేంద్రం అప్పట్లో సానుకూలంగా స్పందించలేదు. ఇప్పుడు ఎలా స్పందిస్తున్నదని తేలాల్సి ఉంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి కాసుల పంట పండే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులతో సమావేశమైన ఫార్మా కంపెనీల ప్రతినిధులు

..12,490 ఉద్యోగాలు

▶ మొదటి పేజీ తరువాయి

తొలుత డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి, లారస్ ల్యాబ్స్ ఈడీ వీవీ రవికుమార్, గ్లాండ్ ఫార్మా సీఈవో శ్రీనివాస్, ఎంఎస్ ల్యాబ్స్ సీఎండీ ఎంఎస్‌ఎన్‌రెడ్డి, అరబిందో ఫార్మా డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, హెటిరో గ్రూప్ ఎండీ బి.వంశీకృష్ణ సమావేశమయ్యారు. ఈ భేటీలో టీఎస్‌ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎంవోయూలపై కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. మరో నాలుగు నెలల్లో ఫార్మా కంపెనీలు నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించడంతోపాటు ఫార్మాసిటీలో సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

యూనిట్లు ఇలా..

ఈ ఒప్పందాల ప్రకారం ఎంఎస్‌ఎన్ లేబొరేటరీ తయారీ యూనిట్‌తోపాటు పరిశోధన అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. లారస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పనున్నాయి. అలాగే గ్లాండ్ ఫార్మా సంస్థ ఆర్ అండ్ డి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్‌స్టెన్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లను స్థాపించనుంది. ఇక డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఇంజెక్టబుల్, బయో సిమిలర్ల యూనిట్ ఏర్పాటు చేయనుండగా హెటిరో ల్యాబ్స్ ఫినిష్‌డ్ డోస్, ఇంజెక్టబుల్ తయారీ పరిశ్రమను నెలకొల్పనుంది.

ఆర్థికాభివృద్ధిలో 'ఆడిట్' ఎంతో కీలకం: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సాక్షి, హైదరాబాద్: సమర్థవంతమైన వనరుల కేటాయింపు, ఆర్థికాభివృద్ధికి ఆడిట్‌లు చాలా కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. నగరంలోని ఏజీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆడిట్ వీక్ 2024 ముగింపు కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని ఉదహరిస్తూ ఆడిటింగ్ ప్రాముఖ్యతను వివరించారు. జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి, వైరుధ్యాలను తగ్గించడానికి కోశాధికారి.. కంప్ట్రోలర్–ఆడిటర్‌ల కోసం వేర్వేరు కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కౌటిల్యుడు సిఫారసు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రతిభావంతులైన సీనియర్ ఆడిట్ అధికారులు, సీనియర్ అకౌంట్స్ అధికారులకు గవర్నర్ అవార్డులను అందజేశారు. హైదరాబాద్‌లోని కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్‌కు సంబంధించిన ఆరు ఫీల్డ్ ఆఫీసుల కీలక పాత్ర, విధులను ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఖాతాలు, హక్కులు) చందా పండిట్ తెలిపారు.

యుద్ధానికి తెర దించేందుకు..

రష్యా రెడీ!

లక్షలాదిగా సైనికుల బలి.. క్షతగాత్రులు అంతకు రెట్టింపు

- భారీగా ఆర్థిక, సాయుధ నష్టం
- దాంతో పునరాలోచనలో పుతిన్
- ఉక్రెయిన్ నుంచి భారీ భూభాగం
- దానికి నాటో సభ్యత్వం ఇవ్వరాదు
- ఈ డిమాండ్లు నెరవేర్చాలని పట్టు



రెండున్నరేళ్లు దాటిన యుద్ధం. కనీవినీ ఎరగని విధ్వంసం. ఇరువైపులా లెక్కకైనా అందనంత ఆస్తి, ప్రాణనష్టం. యుద్ధంలో నిజమైన విజేతలంటూ ఎవరూ ఉండరని ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నిరూపిస్తోంది. అగ్ర రాజ్యపు అపార ఆర్థిక, సాయుధ సంపత్తి ముందు ఏ మూలకూ చాలని ఉక్రెయిన్ యుద్ధంతో కకావికలైంది. ఆర్థికంగా, సైనికంగా మాత్రమే గాక జనాభాపరంగా, అన్ని రకాలుగానూ దశాబ్దాలు గడిచినా కోలుకోలేనంతగా నష్ట పోయింది. అమెరికా, యూరప్ దేశాల ఆర్థిక, సాయుధ దన్నుతో నెట్టుకొస్తున్నా ట్రంప్ రాకతో ఆ సాయమూ ప్రశ్నార్థకంగా మారేలా కన్పిస్తోంది. అదే జరిగితే చేతులెత్తేయడం మినహా దాని ముందు మరో మార్గం లేనట్టే. ఇంతటి యుద్ధం చేసి రష్యా కూడా సాధించిన దానికంటే నష్టపోయిందే ఎక్కువ. అందులో ముఖ్యమైనది సైనిక నష్టం. యుద్ధంలో ఇప్పటికే ఏకంగా 2 లక్షల మందికి పైగా రష్యా సైనికులు మరణించినట్టు గణాంకాలు చెబుతున్నాయి! దీనికి తోడు కనీసం మరో 5 లక్షల మంది సైనిక విధులకు పనికిరానంతగా గాయపడ్డట్టు సమాచారం. ఇది ఆ దేశానికి కోలుకోలేని దెబ్బే. యువతను నిర్బంధంగా సైన్యంలో చేర్చుకునే ప్రయత్నాలూ పెద్దగా ఫలించడం లేదు. యుద్ధ భూమికి పంపుతారనే భయంతో రష్యా యువత భారీ సంఖ్యలో వీలైన మార్గంలో దేశం వీడుతోంది. దాంతో సైనికుల కొరత కొన్నాళ్లుగా రష్యాను తీవ్రంగా వేధిస్తోంది. మరో దారి లేక సైన్యం కోసం ఉత్తర కొరియా వంటి దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి! దీనికి తోడు సుదీర్ఘ యుద్ధం కారణంగా ప్రధానమైన ఆయుధ నిల్వలన్నీ దాదాపుగా నిండుకోవడంతో రష్యాకు ఎటూ పాలుపోవడం లేదు. ఉక్రెయిన్‌పై సైనిక చర్యను ఇంకా కొనసాగించే విషయంలో స్వదేశంలోనే తీవ్ర వ్యతిరేకత ఉందని ఇప్పటికే రుజువైంది. ఈ నేపథ్యంలో యుద్ధానికి ఏదో రకంగా తెర పడాలని ఉక్రెయిన్‌తో పాటు రష్యా కూడా కోరుకుంటున్నట్టు సమాచారం. ఇటీవలి పుతిన్ ఉన్నత స్థాయి భేటీలో ఈ అంశమూ చర్చకు వచ్చిందంటున్నారు.

ఇవీ షరతులు...

- భూతల యుద్ధంలో ఉక్రెయిన్ నుంచి రష్యా సైన్యానికి గతంలోలా కొన్నాళ్లుగా పెద్దగా ప్రతిఘటన ఎదురవడం లేదు.
- దాంతో నెనెట్‌స్క్ తదితర ఉక్రెయిన్ భూభాగాల్లోకి రష్యా నానాటికీ మరింతగా చొచ్చుకుపోతోంది.
- కానీ ఇందుకు చెల్లించుకోవాల్సి వస్తున్న సైనిక, ఆయుధ మూల్యం తదితరాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆలోచనలో పడేసినట్టు వార్తలొస్తున్నాయి. ఏదోలా ఉక్రెయిన్‌పై యుద్ధానికి తెర దించేందుకే ఆయన మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది.
- కొన్ని ప్రధాన షరతులకు ఉక్రెయిన్ అంగీకరించే పక్షంలో యుద్ధాన్ని నిలిపేసేందుకు పుతిన్ సంసిద్ధత వ్యక్తం చేస్తున్నట్టు అమెరికా ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయి వర్గాలు తెలిపాయి.
- ఆక్రమిత ప్రాంతాలకు తోడు మరింత భారీ భూభాగాన్ని ఉక్రెయిన్ తమకివ్వాలని పుతిన్ పట్టుబడుతున్నారు.
- అది కనీసం అమెరికాలోని పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన వర్జీనియా పరిమాణంలో ఉండాలని కోరుతున్నారు.
- ఉక్రెయిన్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ నాటోలో సభ్యత్వం ఇవ్వరాదని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఈ డిమాండ్‌ను నాటో పరిగణనలోకే తీసుకోవద్దని కోరుతున్నారు.

యుద్ధంలో మరణించిన రష్యా సైనికులు	గాయపడ్డ సైనికులు
1.5 లక్షల నుంచి 2 లక్షలు	5 లక్షల పైచిలుకు

వామ్మో సైన్యం!
రష్యా యువతలో వణుకు

సైన్యంలో చేరడమనే ఆలోచనే రష్యా యువతకు పీడకలతో సమానం! కొత్తగా చేరేవారిని వేధించడంలో రష్యా సైనికుల ట్రాక్ రికార్డు సాధారణమైనది కాదు! రిటైరైన తర్వాత కూడా వాటిని గుర్తుకు తెచ్చుకుంటూ వణికిపోయే పరిస్థితి! వాటి బారిన పడే బదులు బతికుంటే బయట బలుసాకైనా తినొచ్చని రష్యా యూత్ భావిస్తుంటారు. డెజొవ్షినా అని పిలిచే ఈ వేధింపుల జాడ్యం ఇప్పటిది కాదు. రష్యా సైన్యంలో 17వ శతాబ్దం నుంచే ఉందని చెబుతారు. దీనికి భయపడి రష్యా యువత సైన్యంలో చేరకుండా ఉండేందుకు వీలైనంతగా ప్రయత్నిస్తుంటుంది. ఉక్రెయిన్ యుద్ధంలో కనీవినీ ఎరగనంత సైనిక నష్టం జరుగుతుండటంతో భారీగా రిక్రూట్‌మెంట్‌కు రష్యా రక్షణ శాఖ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోంది. యువతీ యువకులకు వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా సైన్యంలో చేరాలని పేర్కొనే 'డ్రాఫ్ట్ నోటీస్' పంపిస్తోంది. దాంతో సైనిక జీవితాన్ని తప్పించుకునేందుకు రష్యా యువత లక్షలాదిగా విదేశాల బాట పట్టారు. అలా వెళ్లలేని వారిలో చాలామంది ఫేక్ మెడికల్‌గా అన్‌ఫిట్ సర్టిఫికెట్లు సమర్పిస్తుంటారు. ఆ క్రమంలో అవసరమైతే తమ ఎముకలు తామే విరగ్గొట్టుకుంటారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు! దాంతో చెచెన్యా, యకుట్జియా, దగెస్తాన్ వంటి సుదూర ప్రాంతాల నుంచి సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందిన యువతను రక్షణ శాఖ కొన్నాళ్లుగా ప్రధానంగా టార్గెట్ చేస్తోంది. ఖైదీలను నిర్బంధంగా సైన్యంలో చేరుస్తోంది. ఇలాంటి వారిని సైన్యంలో దారుణంగా చూస్తున్నారు. చనిపోతే మృతదేహాలను గుర్తించి గౌరవప్రదంగా కుటుంబీకులకు అప్పగించే పరిస్థితి కూడా ఉండటం లేదు! దీనికి తోడు రష్యాలో మామూలుగానే సైనికులు దారుణమైన పరిస్థితుల్లో పని చేయాల్సి ఉంటుంది. వారికి అత్యంత అవసరమైన పౌష్టికాహారానికే దిక్కుండదు! పైగా సరైన వైద్య సదుపాయమూ అందదు. సంక్షేమం దేవుడెరుగు, చివరికి సైనికుల భద్రతకు కూడా ప్రభుత్వం పెద్దగా ప్రాధాన్యమివ్వదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మామూలు సమయాల్లోనే పరిస్థితి ఇలా ఉంటుందంటే ఇక యుద్ధ సమయాల్లోనైతే సైనికుల భద్రత, సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్నీ సర్కారు అక్షరాలా గాలికే వదిలేస్తుంది!

– సాక్షి, నేషనల్ డెస్క్

భారీ ఎన్‌కౌంటర్
పది మంది మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఎదురుకాల్పులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దండకారణ్యంలో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా భెజ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళలు సహా పది మంది మావోయిస్టులు మరణించారు. ఈ ప్రాంతం ఏపీ, తెలంగాణ సరిహద్దుగా ఉండడంతో మూడు రాష్ట్రాల పరిధిలో ఉద్రిక్తత నెలకొంది. భెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొరాజ్‌గూడ, దంతేస్‌పురం, నగరం, భండార్‌పదర్ గ్రామాల మధ్య అడవుల్లో కుంట– కిష్టారం ఏరియా నక్సల్స్ కమిటీ సమావేశమైంది. నక్సలైట్ల సమావేశంపై పక్కా సమాచారం అందుకున్న జిల్లా, కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. శుక్రవారం ఉదయం భండార్‌పదర్ గ్రామ సమీపంలో మావోలకు పోలీసులు ఎదురుపడ్డారు. దీంతో ఒక్కసారిగా పరస్పర కాల్పులు మొదలయ్యాయి. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాల్పులు కొనసాగాయి. ఇందులో పది మంది మావోయిస్టులు చనిపోయారని బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందర్‌రాజ్ ప్రకటించారు. మృతుల్లో డివిజనల్ కమిటీ సభ్యుడు మడ్కం మాసా, మాసా భార్య దుధీ హునీ, ఏరియా కమిటీ సభ్యురాలు లఖ్మా మాధవి, గార్డ్ కొవసీ కోసా, మడ్కం జితూ, మడ్కం కోసీలుగా గుర్తించారు. మడ్కం మాసాపై రూ.8 లక్షలు, లఖ్మాపై రూ.5 లక్షల రివార్డ్ ఉంది. మిగతా నలుగురిని గుర్తించాల్సి ఉంది. ఘటనస్థలం నుంచి ఇన్సాస్, ఏకే 47, ఎస్ఎల్ఆర్, బ్యారెల్ గ్రనేడ్ లాంచర్ ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మావోలపై ఉక్కుపాదం

దేశంలో 2026 మార్చి నాటికి మావోయి స్టులను అంతం చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా వారిపై ఉక్కుపాదం మోపుతోంది. ఫలితంగా ఈ ఏడాది ఇప్పటివరకు బస్తర్ డివిజన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 207 మంది మావోలు చనిపోగా 787 మంది అరెస్ట్ అయ్యారు. 789 మంది లొంగిపోయారు. దీంతో బస్తర్ అడవుల్లో సంచరించడం మావో యిస్టు దళాలకు కష్టంగా మారింది. నిర్బంధం పెరగడంతో దండకారణ్యం, అబూజ్‌మడ్ అడవుల నుంచి ఇతర రాష్ట్రాల్లోని సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు మావోలు ప్రయత్నిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో పోలీసులు నిఘా పెంచారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్ – ఒడిశా సరిహద్దు మల్కన్‌గిరి జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయాడు.

తెలుగు మాట్లాడే ప్రాంతంలో..

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం ఏపీలోని చింతూరు, తెలంగాణలోని దుమ్ముగూడెం ప్రాంతాలకు సరిహద్దుగా ఉంది. ఇక్కడ ఉన్న ఆదివాసీ గ్రామాల పేర్లు తెలుగులో ఉండడమే కాక వారు తెలుగు కూడా మాట్లాడగలరు. ఉపాధి, విద్య, వైద్యం, నిత్యావసరాల కోసం ఎక్కువగా తెలుగు రాష్ట్రాలకు వచ్చివెళ్తుంటారు. ఈ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరగడంతో ఏపీ, తెలంగాణలోని సరిహద్దు గ్రామాల్లో ఆందోళన నెలకొంది. సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ నిఘా పెరిగిపోవడంతో ఈ గ్రామాల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా గాలిస్తున్నా ఇప్పటికీ మావోయిస్టు అగ్రనాయకత్వానికి ఎలాంటి నష్టం వాటిల్లకపోవడం ఒక్కటే మావోయిస్టులకు ఊరటనిస్తోంది.

ఉ.కొరియా చేతికి రష్యన్ గగనతల రక్షణ క్షిపణులు
10 వేల మంది సైనికులను పంపినందుకు పుతిన్ రిటర్న్ గిఫ్ట్

సియోల్: ఉక్రెయిన్ యుద్ధం పరోక్షంగా ఉత్తర కొరియా, రష్యాల రక్షణ బంధాన్ని మరింత బలోపేతం చేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధక్షేత్రాల్లో పాల్గొనేందుకు 10 వేల మంది ఉత్తరకొరియా సైనికులు అక్టోబర్‌లో రష్యాకు తరలివెళ్లిన విషయం తెల్సిందే. ఉత్తరకొరియా సాయానికి బదులుగా రష్యా సైతం పెద్ద సాయమే చేసిందని దక్షిణకొరియా శుక్రవారం ప్రకటించింది. గగనతల రక్షణ క్షిపణులను ఉ.కొరియాకు రష్యా అందించిందని దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్‌సుక్‌కు జాతీయ భద్రతా సలహాదారు షిన్ వోన్సిక్ శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు ఎస్‌బీసీ టీవీ కార్యక్రమంలో షిన్ మాట్లాడారు. ''ఉ.కొరియా గగనతల రక్షణ వ్యవస్థలో వాడే క్షిపణులను రష్యా సరఫరా చేసింది. వీటితోపాటు ఇతర ఉపకరణాలనూ ఉ.కొరియాకు పంపించింది. తమను ద్వేషించేలా దేశ వ్యతిరేక కరపత్రాలను తమ దేశంలోనే డ్రోన్ల ద్వారా జారవిడుస్తున్నారని, ఇది పునరావృతమైతే క్షిపణి దాడులు తప్పవని ఉ.కొరియా ఇటీవల ద.కొరియాను హెచ్చరించిన విషయం విదితమే. అయితే ఈ కరపత్రాలతో తమకు ఎలాంటి సంబంధంలేదని ద.కొరియా స్పష్టంచేసింది.

అమెరికా ఏజీగా బోండీ
గేట్జ్ తప్పుకున్న గంటల్లోనే ట్రంప్ నిర్ణయం



వాషింగ్టన్: మాట్ గేట్జ్ స్థానంలో అమెరికా అటార్నీ జనరల్‌గా పమేలా జో బోండీని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు. ఆ పదవికి ఇటీవలే నామినేట్ చేసిన మాట్ గేట్జ్ తప్పుకోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గేట్స్‌పై లైంగిక వైధింపులు, 17 ఏళ్ల మైనర్ బాలికతో శృంగారం, మాదకద్రవ్యాల వాడడం తదితర ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో ఆయన నియామకంపై ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ల నుంచే వ్యతిరేకత ఎదురైంది. తనపై ఆరోపణలను గేట్జ్ ఖండించినా ఈ వివాదం ట్రంప్‌కు ఇబ్బందికరంగా మారిందని వ్యాఖ్యానించారు. అందుకే ఏజీగా బాధ్యతలు చేపట్టబోనని ప్రకటించారు. ఆ తర్వాత కొద్ది గంటలకే ఏజీగా బోండీని ఎంపిక చేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఫ్లోరిడాకు తొలి మహిళా అటార్నీ జనరల్‌గా నేరాలపై కఠినంగా ఆమె వ్యవహరించారని ట్రంప్ ప్రశంసించారు. ట్రంప్ తొలి హయాంలో ఓపియాయిడ్ అండ్ మాదకద్రవ్యాల దుర్వినియోగ కమిషన్‌లో బోండీ పని చేశారు. ట్రంప్‌తో బోండీకి చాలా ఏళ్లుగా స్నేహముంది. 2020లో సెనెట్ అభిశంసన విచారణలో ట్రంప్ తరఫున డిఫెన్స్ లాయర్‌గా ఆమె వ్యవహరించారు. మనీ లాండరింగ్ విచారణ సందర్భంగా ట్రంప్‌కు బహిరంగంగానే మద్దతిచ్చారు. 2018లో కూడా జెఫ్ సెషన్స్ స్థానంలో బోండీని ఏజీగా ట్రంప్ నియమిస్తారని వార్తలొచ్చాయి.

నాలుగో మహిళా ఏజీ

అమెరికా అటార్నీ జనరల్ పదవి చేపట్టబోతున్న నాలుగో మహిళ బోండీ. దేశ తొలి మహిళా ఏజీగా జానెట్ రెనో నిలిచారు. 1993–2001 మధ్య కాలంలో క్లింటన్ హయాంలో ఆ పదవి చేపట్టారు. తర్వాత 2015–2017 మధ్య ఒబామా హయాంలో లోరెట్టా లించ్ ఆ పదవిని చేపట్టిన రెండో మహిళ. ఆమె రాజీనామా అనంతరం సాలీ యేట్స్ 10 రోజుల పాటు తాత్కాలిక ఏజీగా వ్యవహరించారు.

భారత్, గయానా మధ్య బలమైన బంధం

- సంస్కృతి, వంటలు, క్రికెట్ ఇరు దేశాలను అనుసంధానిస్తున్నాయి
- గయానాలో ప్రవాస భారతీయుల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ

జార్జిటౌన్: భారత్, గయానా మధ్య చక్కటి స్నేహ సంబంధాలు ఉన్నాయని, రెండు దేశాలను సంస్కృతి, వంటలు, క్రికెట్ అనుసంధానిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండు దేశాల నడుమ ఉన్న సారూప్యతలు బంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. గయానా రాజధాని జార్జిటౌన్‌లో స్థానిక కాలమానం ప్రకారం గురువారం భారత సంతతి ప్రజలు, ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. కరీబియన్ దేశమైన గయానా అభివృద్ధిలో ఇండో–గయానీస్ సామాజిక వర్గం కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. భారత్, గయానా పరస్పరం పంచుకుంటున్న విలువలే ఇరు దేశాల మధ్య బంధానికి బలమైన పునాదిగా మారాయని వివరించారు. సుసంపన్నమైన, విశిష్టమైన సంస్కృతి ఇరు దేశాలకు గర్వకారణంగా నిలుస్తోందని వ్యాఖ్యానించారు. మన సాంస్కృతిక వైవిధ్యమే మన బలం అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. క్రికెట్ క్రీడ పట్ల ఉన్న ప్రేమ భారత్–గయానాను ఒక్కటిగా కలిపి ఉంచుతోందని తెలిపారు. క్రికెట్ అంటే ఒక జీవన విధానమని వెల్లడించారు. టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌ల్లో భారత జట్టుకు గయానా ప్రజలు మద్దతు తెలిపారని గుర్తుచేసుకున్నారు. ప్రవాస భారతీయులను 'రాష్ట్రదూతలు'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. భారత సంస్కృతి, విలువలకు వారు రాయబారులని కొనియాడారు. ఇండో–గయానీస్ ప్రజలు రెండు రకాలుగా ఆశీస్సులు పొందారని, వారికి గయానా మాతృభూమి అయితే భారతమాత ప్రాచీన భూమి అని వివరించారు. రెండు దశాబ్దాల క్రితం ఒక యాత్రికుడిగా గయానాలో పర్యటించానని, అప్పటితో పోలిస్తే దేశం ఇప్పుడు దేశం చాలా మారిపోయిందని చెప్పారు. గయానా ప్రజల ప్రేమ, ఆప్యాయ తల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదని ఉద్ఘాటించారు.



గయానాలో చాలా ప్రత్యేకంగా భావించే ఏడు కూరల భోజనాన్ని ప్రధాని మోదీకి తన అధికార నివాసంలో స్వయంగా ఆకులో వడ్డిస్తున్న అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ

స్వదేశానికి మోదీ: నైజీరియా, బ్రెజిల్, గయానాల్లో ఐదు రోజుల పర్యటన ముగించుకొని మోదీ శుక్రవారం భారత్ చేరుకున్నారు.

కేజ్రీవాల్ కంటే ఆతిశి నయం
ఢిల్లీ ఎల్జీ సక్సేనా ప్రశంస

న్యూఢిల్లీ: మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కంటే ఢిల్లీ ప్రస్తుత సీఎం ఆతిశి వెయ్యి రెట్లు నయమని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా శుక్రవారం ప్రశంసలు కురిపించారు. ఇందిరాగాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆయన ఆతిశితో కలిసి పాల్గొన్నారు. వేదికపై నున్న ఆతిశిని ఉద్దేశిస్తూ.. 'ఢిల్లీ సీఎంగా మహిళ ఉన్నందుకు నాకు సంతోషంగా ఉంది. పూర్వ సీఎం కంటే ఆమె వెయ్యిరెట్లు నయమని నేను పూర్తి విశ్వాసంతో చెప్పగలను' అని సక్సేనా వ్యాఖ్యానించారు. సాధారణంగా ఢిల్లీ ఎల్జీకి, ఆప్ ప్రభుత్వానికి పొసగదు. ఎప్పుడూ ఉప్పునిప్పుగా ఉండే సక్సేనా.. ఆతిశిపై ప్రశంసలు కురిపించడం విశేషం. జైలు నుంచి బెయిల్‌పై బయటికి వచ్చాక అరవింద్ కేజ్రీవాల్ ఈ ఏడాది సెప్టెంబరులో సీఎం పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తన నిజాయితీకి ప్రజలు సర్టిఫికెట్ ఇచ్చాకే (ఎన్నికల్లో నెగ్గి) మళ్లీ సీఎం పదవిని చేపడతానని కేజ్రీవాల్ అన్నారు. కేజ్రీవాల్ బదులుగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆతిశి జెండా ఎగురవేస్తారని ఆప్ సర్కారు ప్రతిపాదించగా.. సక్సేనా నిరాకరించిన విషయం తెలిసిందే.

గోవా తీరంలో జలాంతర్గామిని ఢీకొట్టిన పడవ

- 11 మందిని రక్షించిన అధికారులు
- మరో ఇద్దరు మత్స్యకారులు గల్లంతు
- కొనసాగుతున్న గాలింపు చర్యలు



న్యూఢిల్లీ: గోవా తీరం నుంచి సముద్రంలో 70 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం చోటుచేసుకుంది. భారత నావికా దళానికి చెందిన జలాంతర్గామిని మత్స్యకారుల పడవ ఢీకొట్టినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మత్స్యకారులు సముద్రంలో గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సముద్రంలో చేపలు పట్టేందుకు ఉపయోగించే ఈ పడవ పేరు మార్తోమా. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 13 మంది ఉన్నారు. వారిలో 11 మందిని అధికారులు రక్షించారు. మరో ఇద్దరి ఆచూకీ తెలియాల్సి ఉంది. వారి కోసం ఆరు నౌకలను, హెలికాప్టర్లను రంగంలోకి దించినట్లు నావికా దళం అధికార ప్రతినిధి చెప్పారు. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించామని పేర్కొన్నారు. ముంబైలోని మారిటైమ్ రెస్క్యూ కో–ఆర్డినేషన్ సెంటర్(ఎంఆర్‌సీసీ)తో కలిసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. కోస్ట్ గార్డ్ సిబ్బంది సేవలు కూడా వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా, జలాంతర్గామిని పడవ ఢీకొన్న ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు నావికా దళం ఆదేశాలు జారీ చేసింది.

విజేతలెవరో...?
నేడే మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

ముంబై/రాంచీ: మహారాష్ట్ర, జార్ఖండ్‌లో హోరాహోరీగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమరంలో విజేతలెవరో నేడు తేలిపోనుంది. రెండు రాష్ట్రాల్లో శనివారం ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. అలాగే 13 రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరిగిన 46 అసెంబ్లీ స్థానాల్లోనూ ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు. నాందేడ్ లోక్‌సభ స్థానంతోపాటు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాజీనామాతో ఖాళీ అయిన వయనాడ్‌లో లోక్‌సభ స్థానానికి సైతం ఉప ఎన్నిక నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ పడిన రాహుల్ సోదరి ప్రియాంకాగాంధీ వాద్రా భవితవ్యం మరికొన్ని గంటల్లో తేటతెల్లం కానుంది. మహారాష్ట్ర, జార్ఖండ్‌తోపాటు ఉప ఎన్నికలు జరిగిన అసెంబ్లీ స్థానాలు, నాందేడ్, వయనాడ్ లోక్‌సభ స్థానాల్లో శనివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. మహారాష్ట్రలో మొత్తం 288 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 288 అసెంబ్లీ స్థానాలుండగా, 4,136 మంది అభ్యర్థులు పోటీ చేశారు. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి, కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 145 ఎమ్మెల్యే సీట్లు గెలుచుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో మరోసారి మహాయుతి ప్రభుత్వమే ఏర్పాటయ్యే అవకాశం ఉందని సర్వేలు అంచనా వేసిన సంగతి తెలిసిందే.

జార్ఖండ్‌లో 1,211 మంది పోటీ

మొత్తం 81 శాసనసభ స్థానాలున్న జార్ఖండ్‌లో ఈసారి 1,211 మంది పోటీ చేశారు. జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) నేతృత్వంలోని 'ఇండియా' కూటమి, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే మధ్య అసలైన పోటీ నెలకొంది. జార్ఖండ్‌లో మరోసారి అధికారంలోకి వస్తామని ఇండియా కూటమి ధీమా వ్యక్తం చేస్తుండగా, విజయం తమదేనని ఎన్డీయే నేతలు తేల్చిచెబుతున్నారు. సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఎన్డీయేవైపే మొగ్గుచూపాయి.

మహారాష్ట్రలో ఎంవీఏ ముందు జాగ్రత్త

మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం సాధించిన తమ అభ్యర్థులందరినీ వెంటనే ముంబైలో శిబిరానికి తరలించాలని మహా వికాస్ అఘాడీ నిర్ణయించింది. తమ ఎమ్మెల్యేలపై బీజేపీ కూటమి వల విసిరే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా వారిని శిబిరానికి తరలించాలని నిర్ణయించినట్లు శివసేన(యూబీటీ) అగ్రనేత సంజయ్ రౌత్ శుక్రవారం వెల్లడించారు. ఈ ఎన్నికల్లో తమ కూటమి కనీసం 160 సీట్లు గెలుచుకుంటుందని చెప్పారు. గెలిచే అవకాశం ఉన్న స్వతంత్ర అభ్యర్థులు ఇప్పటికే తమకు మద్దతు ప్రకటించారని తెలిపారు.

'ఎమర్జెన్సీ' నిర్ణయాలన్నీ...
చెల్లవని చెప్పలేం

'సామ్యవాద, లౌకిక' వివాదంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఎమర్జెన్సీ అమల్లో ఉన్నంత మాత్రాన ఆ సమయంలో పార్లమెంటు తీసుకున్న నిర్ణయాలేవీ చెల్లబోవని చెప్పలేమని సుప్రీంకోర్టు శుక్రవారం అభిప్రాయపడింది. రాజ్యాంగ ప్రవేశికలో 'సామ్యవాద, లౌకిక, సమగ్రత' పదాలను జోడిస్తూ ఎమర్జెన్సీ సమయంలో చేసిన 42వ సవరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. ఆ పదాలపై ఇప్పటికే సుప్రీంకోర్టు పలుమార్లు న్యాయ సమీక్ష జరిపిందని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ ధర్మాసనం గుర్తు చేసింది. తామిప్పుడు ఆ నిర్ణయంలో తాలూకు మంచిచెడుల్లోకి వెళ్లదలచు కోలేదని స్పష్టం చేసింది. ఈ అంశంపై విచారణను ముగించింది. నవంబర్ 25న తీర్పు వెలువరించనున్నట్టు ప్రకటించింది. దీన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చింది. 1976లో ఎమర్జెన్సీ అమల్లో ఉండగా నాటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీ 42వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. తద్వారా రాజ్యాంగ ప్రవేశికలో 'సార్వభౌత, ప్రజాస్వామిక గణతంత్రం' అన్నచోట 'సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక గణతంత్రం' అని చేర్చారు. దీన్ని సవాలు చేస్తూ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి, అడ్వొకేట్ విష్ణుశంకర్ జైన్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను ధర్మాసనం విచారించింది. 42వ రాజ్యాంగ సవరణ ఇప్పటికే ఎన్నోసార్లు సుప్రీంకోర్టు న్యాయ సమీక్షకు గురైందని, పార్లమెంటు కూడా దీనిపై జోక్యం చేసుకుందని సీజేఐ గుర్తు చేశారు. మన దేశంలో సామ్యవాద అనే పదానికి సంక్షేమ రాజ్యమనే అర్థమే వాడుకలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ''ఈ విషయంలో ఇతర దేశాలకు, మనకు చాలా తేడా ఉంది. ప్రైవేట్ రంగ వికాసాన్ని మనమెప్పుడూ నిరోధించలేదు. మనమంతా ఆ రంగ వృద్ధి వల్ల లాభపడ్డవాళ్లమే'' అని చెప్పుకొచ్చారు. లౌకికవాదం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. సామ్యవాదం, లౌకికవాదం పదాలను రాజ్యాంగ ప్రవేశికలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు మరో అడ్వొకేట్ అశ్వినీ ఉపాధ్యాయ్ పేర్కొన్నారు. ధర్మాసనం స్పందిస్తూ, ప్రవేశిక రాజ్యాంగంలో భాగమేనని స్పష్టం చేసింది. ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంటుకు ఉన్న అధికారం ప్రవేశికకూ వర్తిస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

పరిహారమివ్వకుండా సేకరణ కుదరదు: సుప్రీం

న్యూఢిల్లీ: సరైన పరిహారం చెల్లించకుండా పౌరుల నుంచి భూమిని సేకరించే అధికారం ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆస్తి హక్కు ఇప్పటికీ రాజ్యాంగపరమైన హక్కేనని గుర్తు చేసింది. పరిహారమివ్వకుండా భూ సేకరణ చెల్లదంటూ హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. రోడ్డు విస్తరణ కోసం సేకరించదలచిన భూమికి గాను హైకోర్టు ఆదేశించిన మేరకు సొంతదారులకు హిమాచల్ సర్కారు ముందుగా పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది.

ఢిల్లీలో మళ్లీ క్షీణించిన వాయు నాణ్యత

న్యూఢిల్లీ: ఢిల్లీలో వాయు కాలుష్యం కాస్తంత తగ్గిందని ఆనందపడేలోపే మళ్లీ కాలుష్యం పెరిగింది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు 24 గంటల సగటు వాయు నాణ్యతా సూచీ(ఏక్యూఐ) 401కి పెరిగింది. నగరంలోని 39 పర్యవేక్షణా కేంద్రాలకుగాను 19 చోట్ల ఏక్యూఐ ఇప్పటికే 'తీవ్ర' స్థాయిని దాటింది. జహంగీర్‌పురీలో ఏక్యూఐ అత్యధికంగా 445గా నమోదైంది. శుక్రవారం ఉదయం 371గా చూపించిన ఏక్యూఐ సాయంత్రం కల్లా అమాంతం పెరిగిపోవడం గమనార్హం. మరోవైపు ఢిల్లీలో ఉష్ణోగ్రత 11.3 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడమూ వాయునాణ్యత క్షీణతకు మరో కారణం.

సాక్షి హైదరాబాద్

శనివారం ‌। 23 ‌। నవంబర్ ‌। 2024



ఖాళీ స్థలంపై కబ్జాదారుల కన్ను

బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లో కబ్జాదారులు అక్రమణలకు తెగించారు. తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంపై కన్నేశారు. -8లో



సరికొత్త.. పెట్ కల్చర్

నగరవాసులు విభిన్న రకాల పెట్స్‌ను పెంచుకుంటున్నారు. పక్షుల నుంచి పాముల వరకూ ఎన్నో రకాల డొమెస్టిక్ పెట్స్‌ను సాకుతున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
28.0/15.0

వాతావరణం

నగరంలో శనివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్ఠంగా 28, కనిష్ఠంగా 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



ఒడిశా కళాకారులు

సాంస్కృతిక సౌరభం

మాదాపూర్ శిల్పారామంలో లోక్ మంథన్ ఉత్సవాలు శుక్రవారం రెండోరోజూ ఉత్సాహంగా కొనసాగాయి. మధ్యప్రదేశ్, ఒడిశా, మేఘాలయ తదితర రాష్ట్రాల కళాకారులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. స్టాళ్లలో కొలువైన ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులు, ఔషధ మొక్కలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నిజామాబాద్‌కు చెందిన ఎంఎస్ ఆచార్య ఇత్తడితో రూపొందించిన భారీ కలం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది 18.04 అడుగులు, 3.44 అడుగుల వెడల్పు, 37.232 కిలోల బరువు ఉంది. ఈ పెన్ గిన్నిస్ రికార్డులకెక్కింది.

– సాక్షి, సిటీబ్యూరో/మాదాపూర్





భారీ కలం వద్ద సందర్శకులు

ప్రీ లాంచ్ ఆఫర్స్ పేరుతో భారీ స్కామ్

600 మంది నుంచి రూ.150 కోట్లు వసూలు

- ఆర్ హోమ్స్ నిర్వాహకుల అక్రమ బాగోతం
- సైబరాబాద్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

సాక్షి, సిటీబ్యూరో: నగర శివార్లలోని వెంచర్స్‌లో ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో 600 మంది నుంచి దాదాపు రూ.150 కోట్లు వసూలు చేసి మోసం చేసిన ఆర్ హోమ్స్ నిర్వాహకులపై బాధితులు శుక్రవారం సైబరాబాద్ ఈఓడబ్ల్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు బాధితులు హైదరాబాద్ సీసీఎస్‌ను ఆశ్రయించి, ఆ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆర్ హోమ్స్ సంస్థ, దాని వెంచర్లు సైతం సైబరాబాద్ పరిధిలో ఉండటంతో పోలీసులు వారిని అక్కడికి పంపించారు. కూకట్‌పల్లి కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన ఈ సంస్థకు భాస్కర్ గుప్తా ఎండీగా, ఆయన భార్య సుధారాణి డైరెక్టర్‌గా ఉన్నారు. వీళ్లు జై వాసవి బ్లిస్ హైట్స్ సహా అనేక ప్రాజెక్టులు చేపట్టారు. ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో చదరపు అడుగు రూ.2,199కి ఇస్తున్నట్లు 2020 నవంబర్‌లో ప్రకటించారు. కొనుగోలుదారులను ఆకర్షించడానికి కపిల్ దేవ్ (క్రికెటర్), ప్రసాద్ (క్రికెటర్), కోటి (మ్యూజిక్ డైరెక్టర్) తదితర ప్రముఖులతో ప్రచారం చేయించారు. దీంతో అనేక మంది మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందినవారు సొంతింటి కలను నెరవేర్చుకోవాలని వీరి వద్ద ఫ్లాట్లు బుక్ చేసుకున్నారు. దాదాపు 600 మంది రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల చొప్పున చెల్లించారు. రెండు నెలల్లో ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను పొందుతామని, 2023 నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామని భాస్కర్ గుప్తా, సుధారాణిలు నమ్మించారు. నిర్మాణంలో జాప్యంపై బాధితులు ప్రశ్నించడంతో ధరణి, ఎన్నికలు సహా అనేక కారణాలు చెబుతూ వారు తప్పించుకున్నారు. ఈ సంస్థ ప్లాట్లు కూడా విక్రయిస్తామని, తమకు శివార్లలో అనేక చోట్ల భూములు ఉన్నాయని అవసరమైతే బాధితులకు వాటిని కేటాయిస్తామని నమ్మించింది. నారాయణ్‌ఖేడ్ , ఘట్‌కేసర్, పఠాన్ చెరు, కర్తనూర్ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్స్, ఫార్మ్ ల్యాండ్ పేరిటా వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం.

అక్రమాల ‘ప్లానింగ్’

- తిలా పాపం.. తలా పిడికెడు అన్న చందం
- అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల దాకా ఇదే విధానం

అవినీతిమయంగా పట్టణ ప్రణాళిక విభాగం

సాక్షి, సిటీబ్యూరో: పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) అంటే పట్టణం లేదా నగరం ఎలా ఉండాలి? ఏయే సదుపాయాలు ఎలా కల్పించాలి? వేటిని ఎక్కడ ఏర్పాటు చేయాలి? భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? కొత్త భవనాలకు.. ముఖ్యంగా బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులిచ్చేముందు అక్కడి స్థానిక పరిస్థితులు, తాగునీరు, మురుగునీటి సదుపాయాలు, రహదారుల విస్తీర్ణం, ట్రాఫిక్ ఇబ్బందులు తదితరమైనవి పరిగణనలోకి తీసుకొని అనుమతులివ్వొచ్చా.. వద్దా? అనే విషయాలను పరిగణనలోకి తీసుకొని వ్యవహరించాలి. కానీ.. జీహెచ్‌ఎంసీలో టౌన్ ప్లానింగ్ అంటే భవన నిర్మాణ అనుమతుల్లో అవినీతి మాత్రమే అన్నచందంగా మారింది.



ప్రమాదాలు జరిగినప్పుడే..

- శేరిలింగంపల్లి జోన్‌లోని సిద్ధిఖీనగర్‌లో ఇటీవల భవనం ఒరిగిపోయిన ఉదంతంతో 50 గజాల్లో అయిదంతస్తులు, అక్రమ నిర్మాణం అన్నవి వెలుగులోకి వచ్చాయి. నగరంలో ఇలాంటి నిర్మాణాలు కొత్త కాదు. శేరిలింగంపల్లి నుంచి ఎల్‌బీ నగర్ దాకా, రామ్‌నగర్ నుంచి రాజేంద్రనగర్ దాకా ఇదే తంతు. 30 గజాల్లో మూడంతస్తులు కూడా వేస్తున్నారు. ఇరుకు గల్లీల్లోనైనా, విశాలమైన ప్రాంతాల్లోనైనా అంతే. అనుమతుల్లేకుండా కుప్పలు తెప్పలుగా అడ్డగోలుగా నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేరు. ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రాణాలు పోయినప్పుడు ఈ అంశం మూడు నాలుగురోజులు చర్చనీయాంశంగా మారుతుంది. తర్వాత షరామామూలే!
- ఇందుకు కారణం అన్ని స్థాయిల్లోని అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఉండటం రహస్యమేమీ కాదు. దిగువస్థాయి నుంచి ఉన్నతాధికారుల దాకా, కార్పొరేటర్ నుంచి మంత్రుల దాకా వీటి గురించి తెలుసు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్రమ కట్టడాలు.. పర్యవసానంగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల్ని అడ్డుకునేందుకు అధికారులు వెళ్లరు అంటే అతిశయోక్తి కాదు. తాము చెప్పినట్టు చేయకపోతే.. అంటూ ఒత్తిడి తెచ్చి పనులు చేయించుకునే నేతలూ ఉన్నారు. వినని పక్షంలో ఇబ్బందులు సృష్టించడమూ పరిపాటిగా మారింది. దాంతో తమవంతుగా అధికారులూ అక్రమార్కులకు అండగా ఉంటూ జేబులు నింపుకొంటున్నారనే ప్రచారం ఉంది.

అడ్డుకట్టా.. ఎట్టెట్టా..!

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు అనుమతి జారీ అయినప్పటి నుంచే నిర్ణీత వ్యవధుల్లో తనిఖీలు చేస్తామన్నారు. తనిఖీలకు ఎవరు.. ఎప్పుడు వెళ్లాలనేది ఆన్‌లైన్‌లో ఆటోమేటిక్‌గా జనరేట్ అయ్యేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అక్రమ నిర్మాణాలకు ఎప్పుడు నోటీసులిచ్చిందీ.. తదుపరి ఏం చర్యలు తీసుకుందీ ఆన్‌లైన్‌లో ఉంటుందన్నారు. మాటలు, కాగితాల్లో తప్ప అయిదేళ్లవుతున్నా అమలుకు నోచుకోనేలేదు.

సీజ్ చేస్తామన్నారు..

అడపాదడపా అక్రమ నిర్మాణాలు కూల్చివేసినా.. యజమానులతో కుమ్మక్కై టౌన్‌ప్లానింగ్ అధికారులు తూతూమంత్రంగా నాలుగు రంధ్రాలు వేసి వెళ్లిపోవడం.. తిరిగి వాటిని పూడ్చివేయడం.. అదనపు అంతస్తుల నిర్మాణాలు ఆగకపోవడం వంటివి పరిగణనలోకి తీసుకొని అక్రమ నిర్మాణాలను సీజ్ చేయాలని నిర్ణయించారు. తద్వారా నిరుపయోగంగా మారే భవనం వల్ల యజమానులకు ఆదాయం ఉండదు.. జీహెచ్‌ఎంసీకి కూల్చివేతల వ్యయ ప్రయాసలుండవని భావించారు. కానీ.. అమలుకు నోచుకోలేదు. ఇలా అక్రమ నిర్మాణాల కట్టడి మాటలు దాటి చేతల్లో కనిపించలేదు. దాంతో గ్రేటర్ పరిధిలో అక్రమ నిర్మాణాలు తామరతంపరగా వెలుస్తూనే ఉన్నాయి.

అక్రమాలు ఎన్నెన్నో

అక్రమ నిర్మాణాల్ని పెద్దగా పట్టించుకోకుండానే, తప్పనిసరి పరిస్థితుల్లో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ఈ ఏడాది తొలి ఆర్నెల్లలో వెయ్యికి పైగా అక్రమ నిర్మాణాల్ని కూల్చివేసింది. అంటే.. జరుగుతున్న అక్రమ నిర్మాణాలు ఇంకా ఎన్ని ఉంటాయో అంచనా వేయొచ్చు.

ఆర్నెల్లలో కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు జోన్ల వారీగా..

జోన్	కూల్చివేతలు
ఎల్‌బీనగర్	94
చార్మినార్	88
ఖైరతాబాద్	66
సికింద్రాబాద్	151
శేరిలింగంపల్లి	142
కూకట్‌పల్లి	487
మొత్తం	1028



- వీటిలో అధికంగా కూల్చివేతలు జరిగిన సర్కిళ్లలో మూసాపేట్‌లో 209, కూకట్‌పల్లిలో 142, కుత్బుల్లాపూర్‌లో 70, రాజేంద్రనగర్‌లో 57, చందానగర్‌లో 81, సికింద్రాబాద్‌లో 68 అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ఈ తరహా నిర్మాణాలు అత్యధికంగా జరుగుతున్న శేరిలింగంపల్లి సర్కిల్‌లో మాత్రం కేవలం 40 కూల్చివేతలు మాత్రమే జరిపారంటే అక్కడ పైరవీల పాత్ర ఎంతగా ఉందో అంచనా వేసుకోవచ్చు.

సెంచరీకి చేరువలో..

పదేళ్లలో భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

- 2014లో 49.56 ఎంయూలు..
- ఈ ఏడాది 90.68 ఎంయూలకు చేరిక
- వచ్చే వేసవిలో 100 ఎంయూలు దాటే అవకాశం
- కొత్తగా 72 సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు



గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ ఇలా

సంవత్సరం	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
2014	2,261	49.56
2015	2,497	52.86
2016	2,586	55.65
2017	2,796	60.87
2018	2,958	62.83
2019	3,391	73.84
2020	2,930	61.39
2021	3,158	67.01
2022	3,435	71.49
2023	3,756	81.39
2024	4,352	90.68

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. బహుళ అంతస్తుల నిర్మాణాలతో పాటు గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులతో పాటు చిన్నతరహా, భారీ పరిశ్రమలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. కొత్త కనెక్షన్లకు తోడు ఇళ్లలో కొత్తగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాలు వచ్చి చేరుతుండటంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. గత పదేళ్లతో పోలిస్తే.. వినియోగం గణనీయంగా పెరిగింది. 2014లో జూన్ 2న అత్యధికంగా 49.56 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ వినియోగమైంది. ఈ ఏడాది మే 6న రికార్డు స్థాయిలో 90.68 ఎంయూలుగా నమోదైంది. 2025 నాటికి 110 ఎంయూలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు డిస్కం అంచనా వేసింది. ఆ మేరకు ముందస్తు ఏర్పాట్లు కూడా చేస్తోంది. ఒక వైపు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, లైన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తూనే.. మరోవైపు ఇప్పటికే ఉన్న లైన్లను ఆధునికీకరించే పనిలో నిమగ్నమైంది. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు ఆయిల్ లీకేజీలు సహా అధిక లోడ్, తరచుగా సాంకేతిక లోపాలు వెలుగు చూస్తున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చి, వాటి స్థానంలో అదనపు సామర్థ్యంతో కూడిన కొత్త డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తోంది.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు..

- గ్రేటర్ జిల్లాల్లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 61 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 52 లక్షలు గృహ, 8 లక్షలు వాణిజ్య, 50 వేలకుపైగా పారిశ్రామిక కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా అదనంగా మరో 2,500 కొత్త కనెక్షన్లు వచ్చి చేరుతున్నాయి. కొత్త కనెక్షన్లకు తోడు విద్యుత్ గృహోపకరణాల సంఖ్య కూడా పెరుగుతోంది. ఫలితంగా విద్యుత్ డిమాండ్ వార్షిక పెరుగుదల సగటున 15 శాతం నమోదవుతోంది. కేపీహెచ్‌బీలో 87 శాతం, పాపిరెడ్డి కాలనీలో 64, గోపన్‌పల్లిలో 60, పెద్ద అంబర్‌పేటలో 58, సాహెబ్ నగర్‌లో 52, బండ్లగూడలో 36, మైటాస్‌లో 36, బాచుపల్లిలో 32 శాతం చొప్పున ఉన్నట్లు ఇటీవల డిస్కం అధ్యయనంలో తేలింది.



- అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను గుర్తించి.. ఆ మేరకు మెట్రో జోన్‌లో 37, మేడ్చల్ జోన్‌లో 27, రంగారెడ్డి జోన్‌లో 57 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచింది. తాజాగా మరో 72 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకుని భవిష్యత్తులో మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దాదాపు రూ.50 కోట్ల అంచనాతో సైబర్‌సిటీ సర్కిల్‌లో 235, రాజేంద్రనగర్‌లో 43, సరూర్‌నగర్‌లో 116, హబ్సిగూడలో 21, బంజారాహిల్స్‌లో 20, సికింద్రాబాద్‌లో 19, హైదరాబాద్ సెంట్రల్‌లో 20, హైదరాబాద్ సౌత్‌లో 18 చొప్పున అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

విపత్తులను దీటుగా ఎదుర్కొందాం: రంగనాథ్

సనత్‌నగర్: విపత్తులను దీటుగా ఎదుర్కొనే బాధ్యత మనందరిపై ఉందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఇండియా మెటిరోలాజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ) 150 ఏళ్ల వేడుకలను పురస్కరించుకుని ‘ఐఎండీస్ వెదర్ అండ్ క్లెమైట్ సర్వీసెస్ ఫర్ తెలంగాణ’ అంశంపై బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఐఎండీలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో వాతావరణ సమాచారాన్ని ముందస్తుగానే తెలుసుకోవడంతో పాటు ప్రమాద హెచ్చరికలు సైతం ప్రజలకు అందుతున్నాయన్నారు. తద్వారా ప్రజలను అప్రమత్తం చేసి వారిని సురక్షిత ప్రదేశానికి తరలించే సమయం దొరుకుతుందన్నారు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లే అవకాశాలు చాలా తక్కువయ్యాయన్నారు. అర్బన్ డిజాస్టర్స్‌కు సంబంధించి హైడ్రా ఐఎండీతో కలిసి పని చేస్తుందన్నారు. వర్క్‌షాప్‌లో ఐఎండీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.మహాపాత్ర, ఐఎండీ చెన్నై ఆర్‌ఎంసీ బీడీజీఎం బాలచంద్రన్, వాతావరణ కేంద్రం హైదరాబాద్ హెడ్ నాగరత్న తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

నై ‘సెక్యూరిటీ’

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లపై వాహనదారుల్లో విముఖత

- ఇది లేకుంటే వాహనం అమ్మాలన్నా, కొనాలన్నా కష్టమే
- అన్ని రవాణా కార్యకలాపాలకు హై సెక్యూరిటీ అనుసంధానం
- ఉమ్మడి రాష్ట్రంలోనే అమల్లోకి వచ్చిన హెచ్‌ఎస్‌ఆర్‌పీ
- గ్రేటర్‌లో నిత్యం 2,500 కొత్త వాహనాల నమోదు
- వీటిలో వెయ్యి వాహనాలకైనా అందని ఈ నంబర్ ప్లేట్లు

సాక్షి, సిటీబ్యూరో: మీ వాహనానికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేదా? అయితే రవాణా శాఖ లెక్కల్లో అది లేనట్టే. అలాంటి వాహనాన్ని అమ్మాలన్నా, కొనాలన్నా కష్టమే. అంతేకాదు.. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ చేయడం కూడా సాధ్యం కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ) లేని వాహనాలకు రవాణా శాఖ ఆమోదం లేనట్లుగానే భావించాలి. వాటిపై ఆర్టీఏ నుంచి ఎలాంటి పౌరసేవలు లభించవు. ఇంత కీలకమైన హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ అమలుకు నోచుకోవడం లేదు. వాహనదారులు ఇష్టారాజ్యంగా తమకు నచ్చిన నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. కాగా.. ఇప్పటికైనా హెచ్‌ఎస్‌ఆర్‌పీని అమర్చుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు. వాహనాల భద్రత, రహదారి భద్రత దృష్ట్యా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉమ్మడి రాష్ట్రంలోనే హెచ్‌ఎస్‌ఆర్‌పీ అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దీని అమలు తీరు నత్తనడకను తలపిస్తోంది. లక్షలాది వాహనాలు హెచ్‌ఎస్‌ఆర్‌పీకి దూరంగానే ఉన్నాయి.

నాణ్యతపై నమ్మకం లేక..

ఆర్టీఏలో రిజిస్ట్రేషన్ అయ్యే ప్రతీ వాహనానికి ఒక కోడ్‌ను కేటాయిస్తూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌లో హోలోగ్రామ్‌ను ఏర్పాటు చేస్తారు. దీనిలో నమోదైన కోడ్ ఆధారంగానే రవాణా శాఖ కార్యకలాపాలను నిర్వహిస్తుంది. వాహనం ఒకరి నుంచి మరొకరికి బదిలీ చేయాలన్నా, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చుకోవాలన్నా, పన్నులు, ఫీజులు చెల్లించాలన్నా ఈ కోడ్ ఆధారంగానే సాధ్యమవుతుంది. చాలామంది వాహనదారులు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ల నాణ్యత నాసిరకంగా ఉందని, అమర్చిన కొద్దిరోజులకే ఇవి పాడవుతున్నాయని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అల్యూమినియం నంబర్ ప్లేట్‌పై నల్లటి రంగులో రాసే అంకెలు సైతం ఎక్కువ కాలం ఉండడం లేదు. ఒకటి రెండేళ్లలోనే చెదిరిపోతున్నాయి. దీంతో వాహనదారులు తమకు నచ్చిన విధానంలో నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.



ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరు?

- వాహనాల భద్రత దృష్ట్యా 2013లో అప్పటి ప్రభుత్వం హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లను అమల్లోకి తెచ్చింది. దీని అమలు బాధ్యతను అప్పట్లో ఆర్టీసీకి అప్పగించారు. ఓ ప్రైవేట్ సంస్థ సహకారంతో ఆర్టీఏ కార్యాలయాల్లోనే హెచ్‌ఎస్‌ఆర్‌పీ సెంటర్లను ఏర్పాటు చేశారు. కానీ కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాల డిమాండ్ మేరకు హెచ్‌ఎస్‌ఆర్‌పీ సరఫరాలో ఆ సంస్థ విఫలమైంది.
- ప్రతిరోజూ సుమారు 2,500 వాహనాలు కొత్తగా నమోదవుతుండగా రోజుకు కనీసం వెయ్యి వాహనాలకు కూడా నంబర్‌ప్లేట్లు అందడం లేదు. దీంతో వాహనదారులు రిజిస్ట్రేషన్ల కోసం 3 నుంచి 6 నెలల వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ క్రమంలో రవాణాశాఖ అధికారులు తయారీ సంస్థపై ఒత్తిడి పెంచడంతో పాటు నంబర్ ప్లేట్ ఉంటేనే బండి రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశారు. అయినా పెద్దగా పురోగతి కనిపించడంలేదు.

ఆర్టీఓ స్థాయిలోనే మార్పు

హెచ్‌ఎస్‌ఆర్‌పీ లేకపోవడం వల్ల నిలిచిపోయిన ట్రాన్సాక్షన్స్‌ను పునరుద్ధరించే సదుపాయం ఇప్పటి వరకు రవాణా కమిషనర్ కార్యాలయానికే పరిమితం కాగా.. ఇటీవల దీనిని వికేంద్రీకరించారు. కిందిస్థాయిలో జిల్లా, ప్రాంతీయ రవాణా అధికారులు కూడా పునరుద్ధరించే సదుపాయం కల్పించారు. వాహనదారులు ఇందుకోసం హెచ్‌ఎస్‌ఆర్‌పీని ఏర్పాటు చేసుకొని అధికారులను సంప్రదించవచ్చు.

కోహెడ మార్కెట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తాం

- రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకుడు ఉదయ్ కుమార్

తుర్కయంజాల్: కోహెడలో నూతన మార్కెట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకుడు పి.ఉదయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం కోహెడలో మార్కెట్ నిర్మాణ స్థలాన్ని నూతన పాలకవర్గం, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులకు ఉపయోగపడేలా అన్ని రకాల సదుపాయాలతో పాటు దక్షిణ భారతంలోనే అతిపెద్ద మార్కెట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణం ద్వారా ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయని చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సంబంధిత అధికారులతో త్వరలోనే సమావేశం ఉంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు అంజయ్య, జైపాల్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, గణేశ్ నాయక్, రఘుపతిరెడ్డి, బండి మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, రాష్ట్ర మార్కెటింగ్ అదనపు సంచాలకుడు ఆర్.లక్ష్మణుడు, ప్రాంతీయ సంచాలకుడు ఇ.మల్లేశం, జిల్లా మార్కెటింగ్ అధికారి రియాజ్, ఎస్ఈ లక్ష్మణ్‌గౌడ్, డీఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



డీపీఆర్‌ను పరిశీలిస్తున్న ఉదయ్ కుమార్ తదితరులు

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.12 ఎమ్మెల్యే కాలనీలో వైల్డ్‌స్కేప్ ఆధ్వర్యంలోని ది మిశ్రా స్టోర్‌లో 'రెసొనెన్స్ అండ్ రూమ్ థెరపీ' కలెక్టివ్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇది సాయంత్రం 4 గంటల నుంచి జరుగుతుంది.
- కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియంలో సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కోటి దీపోత్సవం జరుగుతుంది.
- డాక్టర్ బోయి విజయభారతి ఆటో బయోగ్రాఫీ విజయగాథ, స్మారక సంచికల ఆవిష్కరణ సాయంత్రం 6 గంటలకు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరుగుతుంది.
- 'కాఫీ టేబుల్ బుకింగ్ ఇన్నోవేషన్స్-101' కార్యక్రమం రాయదుర్గంలోని టీ వర్క్స్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

రేపు ఓయూ ఎంబీఏ (ఈవెనింగ్) కోర్సు ప్రవేశ పరీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎంబీఏ(ఈవెనింగ్) రెండు సంవత్సరాల కోర్సు ప్రవేశ పరీక్షను ఈ నెల 24న ఆదివారం నిర్వహించనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ క్యాంపస్‌లోని పీజీ అడ్మిషన్స్ కార్యాలయం ప్రాంగణంలోని దూరవిద్య కేంద్రం తరగతి గదుల్లో జరిగే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియ వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

ఖాళీ స్థలంపై కబ్జాదారుల కన్ను!

- స్థలం చుట్టూ షీట్ల నిర్మాణం
- హైడ్రాకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు



స్టే కొనసాగుతున్న స్థలం చుట్టూ షీట్ల ఏర్పాటు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో కబ్జాదారులు దర్జాగా ప్రవేశించి గత కొంతకాలంగా ఆక్రమణలకు తెగించారు. స్థలంలో ఎలాంటి నిర్మాణం చేపట్టవద్దంటూ స్టే కొనసాగించాలని అటు రెవెన్యూ అధికారులకు, ఇటు స్థలంపై పోరాడుతున్న సంస్థలకు కోర్టు తీర్పునిస్తూ స్టే ఇచ్చింది. అయితే గత ఏడాది కాలంగా ఈ స్థలంలోకి పార్థసారధి, ఆయన తనయుడు విజయ్ భార్గవ్‌లు ప్రవేశించి రెవెన్యూ అధికారుల కళ్లుగప్పి గది నిర్మించడమే కాకుండా అక్రమంగా కరెంటు కనెక్షన్ పొంది గత 10 రోజుల నుంచి చుట్టూ ఐరన్ షీట్లు నిర్మిస్తున్నారు. ఈ స్థలంపై తమకే హక్కులు ఉన్నాయని, కబ్జాదారులు అక్రమంగా ప్రవేశించి చుట్టూ షీట్లు నిర్మించారంటూ శ్రీరాధిక కో-ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు శుక్రవారం హైడ్రాకు, హైదరాబాద్ కలెక్టర్‌కు, షేక్‌పేట మండల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ స్థలాన్ని ఆక్రమించిన కబ్జాదారుడు పార్థసారధిపై ఇటీవల బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. గతంలో కూడా ఈ స్థలంలో నిర్మాణాలు చేపట్టగా అప్పుడు అధికారులు కూల్చివేసి నిందితులను రిమాండ్‌కు కూడా తరలించారు. మార్చి 16న ఈ కబ్జాదారులను శంకర్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయినా..వీరు తీరు మార్చుకోకుండా బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే రౌడీలతో స్థలాన్ని ఆక్రమించి తిష్ట వేసి చుట్టూ షీట్ల నిర్మాణం చేపట్టారు. సుమారు పదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని బోగస్ పేపర్లతో ఆక్రమించేందుకు యత్నిస్తున్నారంటూ వీరిపై చర్యలు తీసుకోవాలంటూ షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. అయినా సర్వే సదరు కబ్జాదారులు దర్జాగా ఈ భూమిని ఆక్రమించేందుకు పథకం వేశారు.

చర్యలు తీసుకుంటాం

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో మూడెకరాలు వాటర్‌వర్క్స్ కార్యాలయానికి కేటాయించారు. ఈ స్థలం కబ్జాకు గురైనట్లు తెలిసింది. చర్యలు తీసుకుంటాం. స్థలం చుట్టూ షీట్లు నిర్మించినట్లుగా కూడా ఫిర్యాదులు అందాయి. కబ్జాదారులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో రెండు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లాం. ఇక్కడ నిర్మించిన గదిని కూడా గతంలో కూల్చివేశాం. మళ్లీ నిర్మించినట్లుగా ఫిర్యాదులు అందాయి. ఇక్కడ ప్రభుత్వ హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేస్తాం. అక్రమంగా నిర్మించిన షీట్లను కూడా తొలగిస్తాం.

– అనితారెడ్డి, తహసీల్దార్, షేక్‌పేట మండలం

కోటి దీపోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి



కవాడిగూడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తి టీవీ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం కార్యక్రమం శుక్రవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క దంపతులు, హైకోర్టు జస్టిస్ ఎన్.రాజేశ్వరరావు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మకు కోటి గాజుల అర్చన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ కృష్ణ తత్వంపై డాక్టర్ గంగాధర శాస్త్రి గానప్రవచనం చేశారు. శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి ఆశీర్వచనం అందించగా, శ్రీ వేదాంతం రాజగోపాల చక్రవర్తి ప్రవచనామృతం వినిపించారు. అనంతరం కోటి దీపోత్సవం ప్రాంగణంలో నంది వాహనంపై ఆదిదంపతుల ఊరేగింపు నిర్వహించారు.

ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్‌కు ఇండోర్ ట్రైనర్ ట్రోఫీ



మారుతి ప్రసాద్‌కు అవార్డు అందజేస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్

అబిడ్స్: సిటీ పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్‌కు బెస్ట్ ఇండోర్ ట్రైనర్ ట్రోఫీ లభించింది. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆయనకు అవార్డు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ..పోలీసు విధులు నిర్వహిస్తూనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైతం క్రీడారంగంలో రాణించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బెస్ట్ ఇండోర్ ట్రైనర్ ట్రోఫీ అవార్డు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

నిమ్స్‌లో తొలిసారి వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ

లక్డీకాపూల్: నిమ్స్ వైద్యులు గుండెకు సంబంధించి సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి రికార్డు సృష్టించారు. వివరాల్లోకి వెళ్తే అరుదైన గుండె సంబంధిత మిట్రల్ స్టెనోసిస్ వ్యాధితో బాధపడుతున్న 56 ఏళ్ల రోగికి వాల్వ్ మార్పిడి చేయాల్సి వచ్చింది. నిమ్స్ కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యనిపుణులు రోగికి పరీక్షలు జరిపి కుంచించుకుపోయిన వాల్వ్ దిగువ ఎడమ గుండె గదిలోకి రక్త ప్రవాహాన్ని తగ్గిస్తున్నట్లు గుర్తించారు. మిట్రల్ యాన్యులర్ కాల్సిఫికేషన్(ఏఎంసీ)గా పరిగణించే ఈ సమస్య పరిష్కారానికి వాల్వ్ మార్పిడి చికిత్స అనివార్యమని వైద్యులు నిర్ధారించారు. అప్పటికే రోగి హైపర్‌టెన్షన్, డయాబెటిస్, క్రానిక్ కిడ్నీ డిసీజ్‌లతో బాధపడుతున్నట్లు గుర్తించారు. దాంతో టీఎంవీఆర్ ప్రక్రియతో వాల్వ్ మార్పిడిని విజయవంతంగా నిర్వహించారు. ఈ నెల 19న నిర్వహించిన ఈ సర్జరీని ఓపెన్ పద్ధతిలో కాకుండా అధునాతన సాంకేతికతతో పూర్తి చేశారు. శుక్రవారం ఆస్పత్రి నుంచి రోగిని డిశ్చార్జి చేశామని నిమ్స్ వైద్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆటో అందుకున్న ఆనందంలో..

- ప్రజావాణి వినతికి స్పందించిన అధికారులు
- ఎస్సీ లబ్ధిదారుకు అందిన ఎలక్ట్రికల్ ఆటో..
- ప్రజాభవన్‌కు వచ్చి ఆనందం వ్యక్తం చేసిన ఆటో డ్రైవర్



అశోక్ ఆటోలో ప్రయాణించిన చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్

లక్డీకాపూల్: ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం వల్ల నగరంలోని ఎర్రగడ్డకు చెందిన ఎస్సీ యువకుడు మేదరి అశోక్‌కు స్వయ ం ఉపాధి కోసం ఎలక్ట్రికల్ ఆటో సకాలంలో అందింది. శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన ఎలక్ట్రికల్ ఆటోతో వచ్చాడు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లను తన ఆటోలో ఎక్కించుకొని తిప్పి కృతజ్ఞతలు తెలిపాడు.

వివరాల్లోకి వెళ్తే..హైదరాబాద్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ ద్వారా స్వయం ఉపాధి కోసం మేదరి అశోక్‌కు ఎలక్ట్రికల్ వాహనం కొనుగోలు చేసేందుకు రుణం మంజూరైంది. అయితే వాహనాల డీలర్ వద్ద ఎలక్ట్రికల్ ఆటో రిలీజ్ కోటా మించి పోవడంతో ఆటో ఇవ్వడం కుదరదని డీలర్ చెప్పారు. దీంతో అశోక్ మూడు వారాల క్రితం ప్రజావాణికి వచ్చి తన సమస్యను విన్నవించాడు. దీనిపై నోడల్ అధికారి దివ్య దేవరాజన్ స్పందించి..రవాణా శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఎలక్ట్రికల్ ఆటోను రిలీజ్ చేయించారు. దీంతో ఆటో అందుకున్న అశోక్ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

నీరు..ఆదాయ వనరు!

– దేశంలో ఏటా రూ.82,600 కోట్ల మార్కెట్

సాక్షి, సిటీబ్యూరో: ప్రాణకోటికి జీవనాధారమైన నీరు ఆదాయ వనరుగా మారింది. బంగారం, ఇంధనం లాగే జలం కూడా వ్యాపార వస్తువుగా మారిపోయింది. ఉచిత సహజ వనరైన నీటిని ఇప్పుడు ప్యాకింగ్, బాటిళ్ల రూపంలోకి మార్చి విక్రయిస్తున్నారు. దేశంలో ప్రతి ఏటా రూ.82,600 కోట్ల విలువైన నీరు అమ్ముడవుతుందని ఇండియన్ ప్లంబింగ్ అసోసియేషన్ (ఐపీఏ) తెలిపింది. 2022 నుంచి 2030 మధ్యకాలంలో నీటి వ్యాపారం 14.03 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని పేర్కొంది. ప్రస్తుతం దేశంలో ప్రతి వ్యక్తి ఏడాదికి సగటున దాదాపు ఐదు వాటర్ బాటిళ్ల నీటిని వినియోగిస్తున్నాడని, ఈ లెక్కన ఒక్క వాటర్ బాటిళ్ల రూపంలోనే ఏటా దాదాపు రూ.9,200 కోట్ల విలువైన నీరు అమ్ముడవుతుందని ఐపీఏ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం దేశంలో 6 వేలకు పైగా ప్రాంతాలలో 150 రిజిస్టర్డ్ వాటర్ బ్రాండ్లు మార్కెట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. హైటెక్స్‌లో జరుగుతున్న 30వ ఇండియన్ ప్లంబింగ్ కాన్ఫరెన్స్ ఆదివారంతో ముగియనుంది.

డిసెంబర్ 7 నుంచి సీఎం కప్-2024 పోటీలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సీఎంకప్-2024లో క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సెపక్‌తక్ర అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెరిక సురేష్ పిలుపునిచ్చారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గ్రామీణ, మండల స్థాయి నుంచి, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు 36 రకాల క్రీడల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. శుక్రవారం ఈ మేరకు చీఫ్ మినిస్టర్ కప్ కోసం స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీబాల దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో షెడ్యూల్‌ను ఏకగ్రీవంగా ఆమోదించి ప్రకటించినట్లు చెప్పారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో గ్రామీణ స్థాయిలో, డిసెంబర్ 10 నుంచి 12 తేదీల్లో మండల స్థాయిలో, డిసెంబర్ 16 నుంచి 21తేదీల్లో జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిల్లో విజయం సాధించిన క్రీడాకారులతో డిసెంబర్ 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు ఏడు రోజుల పాటు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలుంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడల్లో అత్యున్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ, కానిస్టేబుళ్లు

చాంద్రాయణగుట్ట: పాత బస్తీలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఓ ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళ్తే.. బండ్లగూడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆర్.పవన్.ఓ ప్రైవేట్ భూమికి సంబంధించిన కేసులో నిందితుడిపై ఉన్న కేసు మూసివేసేందుకు రూ.30 వేలు లంచం డిమాండ్ చేసి, చివరకు రూ.15 వేలు తీసుకునేందుకు అంగీకరించాడు. ఇందుకు మధ్యవర్తులుగా కానిస్టేబుళ్లు సి.హెచ్.రామకృష్ణ, బి.సంతోష్‌లు వ్యవహరించి చెరో రెండు వేలు లంచం తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం సాయంత్రం 7.20 గంటల సమయంలో వీరు లంచం తీసుకుంటుండగా..ముందస్తుగా బాధితుడు మునీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు మాటువేసి దాడులు నిర్వహించారు. ఎస్ఐ వద్ద రూ.15 వేలు, ఒక కానిస్టేబుల్ వద్ద రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఏసీబీ అధికారులు ప్రజలకు సూచించారు.

పోలీసుల చొరవతో నిలిచిన ప్రాణం



ఠాణా ఆవరణలో నర్సింహ గౌడ్‌తో ఎస్ఐ వెంకటేశ్

ఆమనగల్లు: తాను చనిపోతున్నానంటూ కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన ఓ వ్యక్తిని ఆమనగల్లు పోలీసులు చాకచక్యంగా కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని చంపాపేట్‌కు చెందిన నర్సింహగౌడ్ శుక్రవారం ఉదయం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి సమీపంలో ఉన్న ఓ వెంచర్ నుంచి తన భార్యకు వీడియోకాల్ చేసి, ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో కంగారు పడిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సింహగౌడ్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతను ఉన్న ప్రాంతాన్ని గుర్తించిన హైదరాబాద్ పోలీసులు ఆమనగల్లు పీఎస్‌కు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది కలిసి విఠాయిపల్లి సమీపంలోని వెంచర్‌లో ఉన్న నర్సింహగౌడ్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మాక్ టెస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్ష నిర్వహిస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు రెండు ఫ్రీ ఫుల్ లెంగ్త్ మాక్ టెస్టుల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.నవీన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మాక్ టెస్టులు డిసెంబర్ 2, 3, 9, 10వ తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. అర్హత ఉన్న మైనార్టీ అభ్యర్థులు తమ దరఖాస్తులను గన్‌ఫౌండ్రీలోని రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు

జేఎన్‌టీయూహెచ్ కెమిస్ట్రీ హెచ్‌ఓడీ రమాదేవి



కార్యక్రమంలో ప్రొఫెసర్ రమాదేవి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఫార్మసీ రంగంలో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని జేఎన్‌టీయూహెచ్ కెమిస్ట్రీ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ బి.రమాదేవి అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధి గుంతపల్లి గ్రామంలో అవంతి విద్యాసంస్థలో బీ ఫార్మసీ, డీ ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమలోని భయాందోళనను తొలగించుకుని, ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తూ ముందుకు సాగాలని చెప్పారు. అప్పుడే మంచి ఉద్యోగాలను సొంతం చేసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధాత్రి హెల్త్‌కేర్ సెంటర్ ఫౌండర్, ఎండీ చంద్రశేఖర్, బ్రహ్మకుమారి కవిత, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ స్వామిరావు, పీఆర్‌ఓ శ్రీనివాస్‌నాయుడు, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టెన్త్ ఫీజు రాయితీకి ని'బంధనాలు'!

- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు చేకూరని లబ్ధి
- ఏళ్ల కిందటి నిబంధనలతో ఇబ్బందులు

సాక్షి, సిటీబ్యూరో: ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు పదో తరగతి పరీక్ష ఫీజు రాయితీ అందడం లేదు. ఇందుకు ఏళ్ల కిందట రూపొందించిన నిబంధనలే కారణమని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయంపై తగిన మార్పుల కోసం రాష్ట్ర విద్యాశాఖ దృష్టి సారించడం లేదని వారంటున్నారు. రాయితీ నిబంధనలను ప్రస్తుత ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టుగా సవరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, నగర విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

రాయితీ పొందాలంటే..

- ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్ ఇటీవల విడుదలైంది. ఈ నెల 28వ తేదీతో గడువు ముగియనుంది. విద్యార్థులంతా ఫీజులు చెల్లించే పనుల్లో నిమగ్నమయ్యారు.
- నిబంధనల ప్రకారం ఒక విద్యార్థి పరీక్ష రుసుం కింద రూ.125 చెల్లించాలి. వంద శాతం రాయితీ పొందాలంటే విద్యార్థులు వార్షిక ఆదాయ ధ్రువపత్రాన్ని సమర్పించాలి. హైదరాబాద్ నగరంతో సహా శివారు జిల్లాల్లోని విద్యాసంస్థల్లో ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సుమారు 1.18 లక్షల మంది వరకు ఉన్నారు. వీరిలో సుమారు 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉంటారని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. వీరి కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.24 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేల లోపు ఉంటేనే వంద శాతం ఫీజు రాయితీ వర్తిస్తుంది. కానీ ప్రస్తుతం అంత తక్కువ ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎక్కడా ఇవ్వడం లేదు. ఈ నిబంధన చాలా ఏళ్ల కిందట రూపొందించారు. ఇప్పుడు సగటున వార్షిక ఆదాయం రూ.లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు ఉండాలని ప్రభుత్వ ఉత్తర్వులు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఏ విద్యార్థికీ రాయితీ లభించడం లేదు. ఆదాయ పరిమితిని సవరిస్తేనే ఫలితం ఉంటుందని టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు షెడ్యూల్ ఇలా
అపరాధ రుసుం లేకుండా గడువు: ఈ నెల 28 వరకు
రూ.50 అపరాధ రుసుం: డిసెంబరు 2
రూ.200 అపరాధ రుసుం: డిసెంబరు 12
రూ.500 అపరాధ రుసుంతో: డిసెంబరు 21 వరకు..

పింఛన్లు పెంచే వరకు పోరాటం ఆగదు



ఇబ్రహీంపట్నం రూరల్: నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, పెన్షన్లు పెంచే వరకు పోరాటం ఆపేది లేదని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కాళ్ల జంగయ్య మాట్లాడుతూ.. పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్నా నేటికీ పెంచకపోవడం సిగ్గు చేటని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 26న నిర్వహిస్తున్న 'చలో హైదరాబాద్'కు భారీ సంఖ్యలో పెన్షన్‌దారులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, మహిళా అధ్యక్షురాలు యాదమ్మ, నాయకులు జంగయ్య, బాల్‌రాజు, మహ్మద్ సలీం, ఆకుల సంజీవ, మైసయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



సర్వే ఫారాన్ని ఎన్యుమరేటర్‌కు అందజేస్తున్న ఐఏఎస్ అధికారి టీకే శ్రీదేవి



భోలానగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి



ఎన్యుమరేటర్‌కు వివరాలు తెలియజేస్తున్న ప్రముఖ సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ

బంజారాహిల్స్: సమగ్ర కుటుంబ సర్వేలో ఐఏఎస్ అధికారి డాక్టర్ టీకే శ్రీదేవి తన కుటుంబ వివరాలను శుక్రవారం అందజేశారు. జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీసీ ప్రశాంతి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ బీ రాజు, ఎన్యుమరేటర్ కౌశిక్ వివరాలను భర్తీ చేసిన తర్వాత దరఖాస్తులు స్వీకరించారు. అలాగే ఫిలింనగర్‌లో ప్రముఖ సినీ మాటల రచయిత పరుచూరి గోపాలకృష్ణ తన కుటుంబ వివరాలను ఫారంలో భర్తీ చేసి ఎన్యుమరేటర్‌కు అందజేశారు.

శరవేగంగా సమగ్ర సర్వే..

గ్రేటర్‌వ్యాప్తంగా సర్వే శరవేగంగా కొనసాగుతుందని మేయర్ విజయలక్ష్మి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని భోలానగర్, శ్రీరామ్‌నగర్ బస్తీల్లో సంబంధిత అధికారులతో కలిసి ఇంటింటి సర్వేను శుక్రవారం పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 62.47 శాతం కుటుంబాల సర్వే పూర్తి చేశామన్నారు.

ఘనంగా ములాయం సింగ్ యాదవ్ జయంతి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

బంజారాహిల్స్: సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ జయంతి వేడుకలను ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 36లోని పార్టీ కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ నేత దండుబోయిన నిత్య కల్యాణ్ యాదవ్ ఆధ్వర్యంలో ములాయం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బసవతారకం కేన్సర్, నీలోఫర్, నిమ్స్, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల వద్ద అన్నదానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ దండోరా సమితి అధ్యక్షులు మదిరె నర్సింగ్‌రావు మాదిగ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో..

పంజగుట్ట: ములాయంసింగ్ యాదవ్ జయంతిని పురస్కరించుకుని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం పలువురు వక్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, సమాజ్‌వాదీ పార్టీ జాతీయ కార్యదర్శి జగదీశ్ యాదవ్, సీనియర్ నాయకుడు మధు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ అధ్యక్షుడు గద్దం శ్రీనివాస్ యాదవ్, దయానంద్ యాదవ్, ఆంధ్రాకేసరి సంతోష్ యాదవ్, ఉద్యోగ సంఘం నాయకుడు ఎంబీ కృష్ణ యాదవ్, బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు.

ములాయం సేవలు చిరస్మరణీయం

కాచిగూడ: ములాయంసింగ్ యాదవ్ సేవలు చిరస్మరణీయమని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి అన్నారు. ములాయం సింగ్ యాదవ్ జయంతి సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'భారత రాజ్యాంగం –పీడీఏ సాధికారత' అనే అంశంపై శుక్రవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అక్కల బాబుగౌడ్, డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, స్వరూపారాణి, ప్రకాశ్ యాదవ్, కొమురయ్య, ప్రకాశ్ యాదవ్, బోనాల విజయ్‌కుమార్, హరికృష్ణ, మహ్మద్ వజీద్ సిద్ధిఖీ, మహ్మద్ రిజ్వాన్ హుస్సేన్, జానంపల్లి రాములు, రవికుమార్, ప్రభాకర్, దేవని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



హోటల్ మారియట్‌లో శుక్రవారం ఆకృతి ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకురాలు శశినాథ తెలిపారు.

ఉత్సాహంగా 'వైట్ కోట్ వేడుక'

బంజారాహిల్స్: అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో 'వైట్ కోట్ వేడుక'ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అపోలో హాస్పిటల్స్ గైనకాలజీ గౌరవ ప్రొఫెసర్ డాక్టర్ రూమాసిన్హా, అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సీఓఓ అపర్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైట్ కోట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ 2024 బ్యాచ్‌కు చెందిన 150 మంది విద్యార్థులు వైద్య వృత్తిలోకి అడుగుపెట్టారన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులకు స్వాగతం పలికి వైట్ కోట్లను ధరింపజేశారు. కార్యక్రమంలో డీన్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

వెంగళరావునగర్: పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి ఆపై బెదిరింపులకు గురి చేస్తున్న యువకుడిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడలో పదో తరగతి చదువుతున్న బాలికకు గతేడాది వినాయకమంటపం అన్నదానం వద్ద ప్రవీణ్ అనే వ్యక్తి కలిశాడు. మూడు రోజులు వెంటపడి యువతి నెంబర్ తీసుకుని ఇన్‌స్టాగ్రాంలో మెసేజ్‌లు పంపాడు. అనంతరం ఏడాది పాటు ఆమెను తన గదికి తీసుకెళ్లి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇద్దరూ కలిసిన ఫొటోలు తీసుకున్నాడు. అనంతరం ఆమెను బెదిరింపులకు గురి చేస్తున్నాడు. ఇదే విషయాన్ని యువతి తల్లి ప్రవీణ్‌కు ఫోన్ చేసి అడగ్గా ఆమెను సైతం తీవ్రమైన పదజాలంతో దూషిస్తూ బెదిరించాడు. తన కుమార్తెను మానసికంగా వేధిస్తున్న యువకుడిపై చర్యలు తీసుకోవాలని యువతి తల్లి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె కనిపించడం లేదంటూ ఫిర్యాదు..

వెంగళరావునగర్ : కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి మధురానగర్ పీఎస్ ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేస్త్రీ పని చేసే వ్యక్తి భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి కార్మికనగర్‌లో నివసిస్తున్నాడు. ఈనెల 20న భార్యభర్తలు కూలీ పనికి వెళ్లగా చిన్న కుమార్తె స్కూల్‌కు వెళ్లింది. పెద్ద కుమార్తె ఇంట్లోనే ఉంటోంది. సాయంత్రం 4.30 సమయంలో భార్య ఇంటికి వచ్చి చూడగా పెద్ద కుమార్తె కనిపించలేదు. ఆమె దుస్తులు, 4 తులాల బంగారాన్ని తీసుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే విషయాన్ని తన భర్తతో చెప్పింది. చిన్న అత్త కుమారుడు సూర్యప్రకాశ్‌వర్మ తన పెద్ద కుమార్తెకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు నమోదుకు మరో ఛాన్స్

- నేడు, రేపు ప్రత్యేక శిబిరాలు
- ఖైరతాబాద్‌లో అందుబాటులో ఉండనున్న బీఎల్‌ఓలు
- 18 ఏళ్లు నిండినవారు అర్హులు



స్థానిక ఆఫీసర్లతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారులు

బంజారాహిల్స్: ఓటరు జాబితా సవరణపై ఇంటింటి సర్వే పూర్తి చేసిన అధికారులు గత నెల 29న ఓటరు జాబితా ముసాయిదాను ప్రకటించారు. కాగా నేటి నుంచి రెండురోజుల పాటు ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఆరు డివిజన్ల పరిధిలోని 245 పోలింగ్ బూత్‌ల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవల్ అధికారులు ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండనున్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలు, సవరణ, పరిశీలనకు అవకాశం కల్పించారు. ఈ నెల 28 వరకు అభ్యంతరాల దరఖాస్తులు స్వీకరించి డిసెంబర్ 24 లోగా పరిష్కరిస్తారు. అనంతరం తుది జాబితాను వచ్చే ఏడాది జనవరి 6 న ప్రకటిస్తారు.

యువత నమోదు చేసుకోవాలి..

18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఇప్పటివరకు ఓటు హక్కు లేనివారు ఫారం–6 దరఖాస్తును సమీపంలోని బీఎల్‌ఓలకు అందజేయవచ్చు. దీంతో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. దేశ భవిష్యత్తు అయిన యువత ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రశాంతి కోరారు. ప్రత్యేక శిబిరంలో పుట్టిన తేదీకి సంబంధించిన ఏదైనా ధ్రువీకరణ పత్రం జత చేసి దరఖాస్తును బీఎల్‌ఓలకు అందించాలని వారు సూచిస్తున్నారు.

నమోదు ప్రక్రియను పరిశీలించిన అధికారులు..

స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా అధికారులు ఇప్పటికే ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం సంబంధిత అధికారులు ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ సర్కిల్–18 కార్యాలయంలో ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రశాంతితో సమావేశం నిర్వహించి దరఖాస్తులను తనిఖీ చేశారు. ఫారం–6, 7, 8 దరఖాస్తుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసూనాంబ, డీడీ జకీర్, సీఈఓ కార్యాలయం నుంచి ప్రత్యేకంగా వచ్చారు. వీరికి ఖైరతాబాద్ ఈఆర్‌ఓ ప్రశాంతి, ఏఈఆర్‌ఓలు సాయిశ్రీనివాస్, అనితారెడ్డి, రమేశ్‌బాబు, శ్రీనివాసరావు పరిశీలనలో భాగంగా సందేహాలు నివృత్తి చేశారు. సవరణ ఎలా జరుగుతుందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. స్పెషల్ క్యాంపెయిన్‌లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటున్నారో లేదో కూడా పరిశీలించాలని సూచించారు.

నేడు బీసీ కమిషన్ పబ్లిక్ హియరింగ్



బంజారాహిల్స్: లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఈనెల 23న (నేడు) బీసీ కమిషన్ పబ్లిక్ హియరింగ్ నిర్వహించనున్నట్లు షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి తెలిపారు. కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విచారణ జరగనున్నదని మండలపరిధిలోని బీసీ, ఎంబీసీ సంఘం నాయకులు, ఎన్జీఓలు, ఉద్యోగ సంఘ నాయకులు హాజరుకావచ్చన్నారు. సామాజిక, విద్యాపరమైన సమస్యలుంటే సంఘం నాయకులు కమిషన్‌కు దరఖాస్తులు అందించవచ్చని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలు హాజరై అభ్యర్థనలు, వినతులు, సలహాలు, సూచనలను కమిషన చైర్మన్ నిరంజన్‌తో పాటు కమిటీ సభ్యులకు విన్నవించుకోవాలని సూచించారు.

డిసెంబర్ 21న డ్రగ్స్ రహిత తెలంగాణ 2కే రన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నెక్లెస్ రోడ్డులో డ్రగ్స్ రహిత తెలంగాణ 2 కే రన్ నిర్వహించనున్నట్లు తెలంగాణ విద్యా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెండెం తారక్ గౌడ్, రవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేతులమీదుగా కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యా సమితి ప్రతినిధులు గణేశ్, అశోక్, సాయినాథ్, శ్రీను, పరమేశ్, రాజు,సంజయ్, మహేందర్, మారుతీ సంతోష్ పాల్గొన్నారు.

యువ పురస్కారం ప్రదానం



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన శ్వేత ప్రసాద్ కర్ణాటక సంగీతం విభాగంలో 2022–23 సంవత్సరానికి గాను బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అందుకున్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ కార్యదర్శి అరుణీష్ చావ్లా, సంయుక్త కార్యదర్శి ఉమ నందూరి, సంగీత నాటక అకాడమీ వైస్ చైర్మన్ సంధ్య చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు.

'తెలంగాణలో వచ్చేది బీసీల రాజ్యమే'

కాచిగూడ: తెలంగాణలో వచ్చేది బీసీల రాజ్యమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఈనెల 25న రవీంద్రభారతీలో నిర్వహించనున్న 'బీసీల సమరభేరి' సభకు పార్టీలకతీతంగా బీసీ లు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నీల వెంకటేశ్, తంగెళ్లముడి నందగోపాల్, ఎల్.కృష్ణ, సుదాకర్, వీరన్న, ఉదయ్ నేత, రఘుపతి, అనంతయ్య, లక్ష్మీనారాయణ, రాజేందర్, బాలయ్య, హేమంత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ సీటు మదనం గంగాధర్‌కు కేటాయించాలి'

కాచిగూడ: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి సంచార జాతికి చెందిన మదనం గంగాధర్‌కు సీటు కేటాయించాలని 57 ఎస్సీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు చింతల రాజలింగం కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంచార జాతుల సంక్షేమం, అభివృద్ధి కోసం గంగధర్ డీఎస్‌పీ ఉద్యోగానికి రాజీనామా చేసి పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న గంగాధర్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. కార్యక్రమంలో 57 ఎస్సీ కులాల ఐక్యవేదిక ప్రతినిధులు బానాల మల్లేశ్, యాదయ్య, సంజయ్, దశరథ్, శంకర్, గడ్డమీది గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీజేసీ ఓవర్సీస్‌కు బెస్ట్ అవార్డు



సినీ నటి అదా శర్మ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ మణి

వెంగళరావునగర్: వెంగళరావునగర్ కాలనీ ప్రధాన రహదారిలోని వీజేసీ ఓవర్సీస్ సంస్థకు ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ బ్రాండ్ అవార్డు లభించింది. బెంగళూరుకు చెందిన ప్రముఖ 'మై బ్రాండ్ బెటర్' సంస్థ ప్రతి ఏడాది సర్వే నిర్వహించి విద్యార్థులకు అత్యుత్తమ సేవలందించే సంస్థలకు అవార్డులు అందిస్తుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది నిర్వహించిన సర్వేలో కూడా వీజేసీ ఓవర్సీస్ సంస్థ ప్రముఖ స్థానంలో నిలిచింది. ఇటీవల బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ బాలీవుడ్ నటి అదా శర్మ ఈ అవార్డును వీజేసీ ఓవర్సీస్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మణి ఉత్తరాదికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మణి మాట్లాడుతూ 2009లో తమ సంస్థను ప్రారంభించామని, నాటి నుంచి 10 వేల మందికి పైగా విద్యార్థులు, ఉద్యోగ ఆశావాహులు తమ ద్వారా విదేశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు మరిన్ని సేవలు అందిస్తామని అన్నారు.

మర్యాదపూర్వక కలయిక

లిబర్టీ: అఖిల భారత అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రుద్రాక్ష మల్లేశ్ ప్రొఫెషనల్ కాంగ్రెస్ పార్టీ నేషనల్ చైర్మన్ ప్రవీణ్‌చక్రవర్తిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కండువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విన్నవించారు. ఆటో విభాగం నేతలు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఐపీసీ ప్రోగాం

లక్డీకాపూల్ : స్థానిక హాంప్షైర్ ప్లాజా హోటల్‌లో 12వ నేషనల్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ (ఐపీసీ) సర్టిఫికెట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ఇన్‌ఫెక్షన్ నియంత్రణలో అత్యాధునిక సాంకేతికత, గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీసెస్, హెల్త్‌కేర్ ఫెసిలిటీల్లో రోగి, సిబ్బంది భద్రతను నిర్ధారించడానికి వినూత్న పరిష్కారాలపై చర్చించారు. కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్, నాన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కే హరిప్రసాద్ మాట్లాడుతూ రోగి ఆరోగ్య సంరక్షణను పెంపొందించడంలో ఇన్ఫెక్షన్ నియంత్రణ చాలా ముఖ్యమన్నారు. నాంపల్లి కేర్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సమీ, క్లీనికల్ మైక్రోబయాలజీ కన్సల్టెంట్, ఐపీసీ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ముస్తఫా ఆఫ్జల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్వాలిటీ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజీవ్ చౌరే, ఐఎఫ్‌సీఏఐ అధ్యక్షుడు డాక్టర్ రంగారెడ్డి, నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ విన్సీ అశోక్ త్రిభవన్, అపోలో క్లీనికల్ మైక్రోబయాలజిస్ట్ కన్సల్టెంట్ డాక్టర్ ఎం.ఎస్ రత్నమణి, శంకర ఐ ఫౌండేషన్ నేషనల్ హెడ్ డాక్టర్ సాయిశ్రుతి, నాంపల్లి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సమ పాల్గొన్నారు.

అనుమతుల్లేని సిగరెట్లు విక్రయిస్తున్న వారిపై కేసు

వెంగళరావునగర్ : అనుమతుల్లేని సిగరెట్లు విక్రయిస్తున్న ఇరువురిపై మధురానగర్ పోలీసులు కేసు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలు ప్రాంతాల్లో అక్రమంగా లైసెన్స్ లేని సిగరెట్లు విక్రయిస్తున్నట్టుగా సమాచారం అందింది. దాంతో ఎస్ఐ సాయినాథ్‌రెడ్డి సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. బోరబండకు చెందిన నవాజ్‌ఖాన్, చార్మినార్‌కు చెందిన మక్బూల్ అహ్మద్ యూసుఫ్‌గూడ, మధురానగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న తమ పాన్‌షాపుల్లో సిగరెట్లు విక్రయిస్తున్నారు. పోలీసులు తనిఖీలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో వివిధ బ్రాండ్స్‌కు చెందిన, ఫారెన్ సిగరెట్లు, ఈ–సిగరెట్స్ లభించాయి. నిందితులను అదుపులోకి తీసుకుని సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిరాయి ఇస్తానని కార్లు తీసుకుని మోసం

వెంగళరావునగర్ : కిరాయి ఇస్తానని కారు తీసుకుని మోసగించిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక యాదిగిరినగర్‌లో ఎన్.ప్రేమ్‌కుమారి తన భర్త సుబ్రమణ్యంతో ఉంటోంది. ఆమె వృత్తిరీత్యా లేడీ బౌన్సర్‌గా విధులు నిర్వహిస్తోంది. తన భర్తకు స్నేహితుడైన కంబాల మధుబాబు లక్షన్నర తీసుకుని ఆమె పేరుతో బైక్ తీసుకుని ఈఎంఐ చెల్లించాడు. అనంతరం ఆమె కారు ఈఎంఐ మీద కొనుగోలు చేసింది. ఆ కారును ప్రముఖ చానల్‌లో కిరాయికి ఇస్తే రూ.40 వేలు ఇప్పిస్తానని నమ్మించి తీసుకున్నాడు. 3 నెలల పాటు నెలకు రూ.35,500 చొప్పున చెల్లించాడు. అనంతరం ఈఎంఐ ఇవ్వకపోగా తప్పించుకుని తిరుగుతున్నాడు. స్థానికంగా ఉన్న విజయలక్ష్మి వద్ద కూడా 2 కార్లు తీసుకుని ఈఎంఐ చెల్లించకుండా తిరుగుతున్నాడు. దీంతో ఇరువురు మహిళలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ మీడియాను ఉపయోగించుకోవాలి



నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: 64 రోజులుగా కొనసాగుతున్న నిరసనను మరింత ఉధృతం చేసేందుకు ఉద్యోగులు,విద్యార్థులు,డిజిటల్ మీడియాను ఉపయోగించుకోవాలని అంబేడ్కర్ వర్సిటీ జేఏసీ నేతలు సూచించారు. ఈ మేరకు జేఏసీ రూపొందించిన వెబ్‌సైట్‌ను పరిశోధక విద్యార్థి ఎస్.కృష్ణయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చూడాలని ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ రిజ్వీని డిమాండ్ చేశారు. అలాగే వారు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనను కొనసాగించారు. జేఏసీ చైర్‌పర్సన్ పల్ల వీకాబ్లే. కన్వీనర్ వడ్డానం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 27న విశ్వవిద్యాలయంలో జరిగే వంటావార్పు కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎల్వీకే రెడ్డి, వెంకటేశ్వర్లు, యాకేష్‌దైద, ఉదయిని,కాంతం ప్రేమ్‌కుమార్, కిశోర్, రాఘవేంద్ర, పాండు, రాములు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్వర్ణ దేవాలయంలో బ్రహ్మోత్సవాలు



బ్రోచర్ విడుదల చేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

బంజారాహిల్స్: ఈ నెల 24 నుంచి 29 వరకు హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్య గౌర చంద్రదాస శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోనే మొదటి స్వర్ణ దేవాలయంలో ఆరు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల రోజుల్లో బ్రహ్మోత్సవ హోమం, నిత్య ఆరాధన, వివిధ అలంకారాలతో దేవతామూర్తుల దర్శనం ఉంటాయని పేర్కొన్నారు.

'స్టెల్లార్ రిజర్వ్ కేఫ్' ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరవాసులకు సరికొత్త కాఫీ రుచులు అందించేందుకు మరో కేఫ్ సిద్ధమైంది. అత్యాధునిక సాంకేతికత, కళాత్మకంగా రుచి చూపేందుకు 'స్టెల్లార్ రిజర్వ్' కేఫ్ జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో అరాబికా బీన్స్‌తో పాటు చిక్కమగళూరు, హోండూరస్ నుంచి ప్రత్యేకంగా సేకరించిన గింజల నుంచి కాఫీ తయారు చేయనున్నారు. స్వీట్స్ అంటే ఇష్టపడేవారికి ప్రత్యేక గెలాటో ఉత్పత్తి యంత్రం ద్వారా పిస్టాచియో, చాకోలెట్ న్యూటెల్లా, లోటస్ బిస్కోఫ్ వంటి ప్రసిద్ధ రుచులతో పాటు, మస్క్ మెలన్ సార్బెట్ వంటి ఇటలీకి చెందిన ప్రత్యేక రుచులను అందించనున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీ బీ–బ్లాక్‌లో శివపార్వతుల కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభం కాగా మధ్యాహ్నం అన్నప్రసాద వితరణతో పూర్తయింది. నవయుగ నాగ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో యేటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కమిటీ నేతలు శ్రీకాంత్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, శరత్‌చంద్ర, ధర్మారెడ్డి, వంశీకృష్ణ, రాజేశ్, రాము, సాయిరఘు తదితరుల సమక్షంలో జరిగిన వేడుకకు వివిధ పార్టీల నేతలు, వివిధ కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు, మహిళలు, మధురానగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. అలాగే కమిటీ సభ్యులు పలువురిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీల అందజేత

రహమత్‌నగర్ : కార్మికనగర్‌కు చెందిన కుల్సుమ్‌బీకి రూ.80 వేలు, రహమత్‌నగర్‌కు చెందిన గంగాధర్‌కు రూ 60 వేలు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరయ్యాయి. దీంతో సంబంధిత ఎల్‌ఓసీలను కార్పొరేటర్ సీఎన్ రెడ్డి శుక్రవారం వారి నివాసాలకు వెళ్లి అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, మన్సూర్, షేక్ సాబేర్, రవిశంకర్, వేముల యాదయ్య, జ్ఞానేశ్వర్, సింగారి శ్రీనివాస్, కేశవులు, నాగరాజు, అందాలు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–4లోని సుఖ్‌దేవ్ నగర్ బస్తీలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఆమె వెంట ఏఈ సతీశ్ ఉన్నారు.

నగరంలో ఐ2కెన్ సేవలు ప్రారంభం

బంజారాహిల్స్: పూణె కేంద్రంగా కొనసాగుతున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్మోటాలజీ, ఈస్థటిక్స్ అండ్ న్యూట్రిషన్ (ఐ2కెన్) సేవలను నగరంలో మేనేజింగ్ డైరెక్టర్ నందన్ గిజారే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ శ్రేణి నగరాల్లో మాదిరిగానే నగరంలో బ్యూటీ అండ్ వెల్‌నెస్ పరిశ్రమ ప్రస్తుతం గణనీయమైన వృద్ధి సాధిస్తోందన్నారు. పెరుగుతున్న డిమాండ్, అవసరాలు తీర్చేందుకు నైపుణ్యం గల నిపుణుల లభ్యత మధ్య గణనీయ అంతరం ఉందన్నారు. ఐ2కెన్ స్థానికంగా అగ్రశ్రేణి, అంతర్జాతీయ గుర్తింపు పొందిన విద్యను అందిస్తుందని తద్వారా ఈ అంతరాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.

చిత్తశుద్ధితో పని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

లిబర్టీ: మూసీ సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంటే కొందరు రాజకీయంగా బురద చల్లడం తగదని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ నదిని పట్టించుకోలేదని అంతేగాకుండా మురికి కూపంగా మార్చిందని మండిపడ్డారు. ఇప్పటికైనా వారంతా రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

వైద్య విద్యను బలోపేతం చేయాలి

లిబర్టీ: వైద్య విద్యను బలోపేతం చేయాలని దళిత బహుజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎస్.వాణిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందించి శాలువా కప్పి సన్మానించి వినతిపత్రం అందజేశారు. వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని డాక్టర్ ఎన్.వాణి హామీనిచ్చినట్లు ఆయన తెలిపారు.

'అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి'

లిబర్టీ: రైతులు, గిరిజనులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వీ కృష్ణస్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫార్మ పరిశ్రమకు వ్యతిరేకంగా రైతులు, గిరిజనులు ఉద్యమిస్తుంటే అక్రమ కేసులు పెట్టించి జైలు పాలు చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. లగచర్లలో జాతీయ మానవ హక్కుల కమిషన్ బృందం పర్యటించి నిజాలను తెలుసుకోవాలని ఆయన కోరారు. రెవెన్యూ అధికారులు అనుసరించిన విధానం వల్లనే ఘర్షణ జరిగిందని, కేసులు ఎత్తివేయకుంటే దళిత, గిరిజన సంఘాలను రాజకీయ పక్షాలను సంఘటితం చేసి పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, శనివారం,
23, నవంబర్, 2024

పెట్ అండ్ పెట్ లవర్స్.., సిటీలో ఈ పదాలకు ఒక క్రేజ్ ఏర్పడింది. మనుషులే కాకుండా వారి జీవితాల్లో సాధు జంతువులను మమేకం చేసుకుని, ఆత్మీయతను పెంచుకుంటూ ఆనందానికి, ఆహ్లాదానికి, సాన్నిహిత్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు. అయితే మొదటి నుంచి పెట్స్ అంటే కేవలం కుక్కలు, పావురాలు, పిల్లులను ఎక్కువగా పెంచుకునే వారు. కానీ మారుతున్న అధునాతన జీవన శైలికి అనుగుణంగా వినూత్నంగా విభిన్న రకాల పెట్స్‌ను పెంచుకుంటున్నారు. ఈ వెరైటీ పెట్స్‌లో పక్షుల నుంచి పాముల వరకూ ఎన్నో రకాల డొమెస్టిక్ పెట్స్‌ను సాకుతున్నారు. ఈ వెరైటీల్లో ఎక్కువగా ఇంపోర్టెడ్ పెట్స్ ఉంటున్నాయి. వీటి ఖరీదు సైతం అధికంగానే ఉంటుంది. పాతిక వేల నుంచి రూ.2 లక్షలకు పైబడి వెరైటీ పెట్స్ సిటీలో సరికొత్త కల్చర్‌గా మారింది.

- సాక్షి, సిటీబ్యూరో



సరికొత్త.. పెట్ కల్చర్..

హైదరాబాద్ వైబ్స్

- విభిన్న బ్రీడ్ల కుక్కలు, పక్షులు, పిల్లుల పెంపకం
- వినూత్న పంథాలో సిటీ పెట్ లవర్స్..
- రూ.20 వేల నుంచి లక్షల్లో ఖరీదు
- ఆస్ట్రేలియా, యూకే, మెక్సికో నుంచి దిగుమతి
- విల్లాల్లో వింత పెట్స్‌తో నగరవాసుల దోస్తీ



నగరవాసుల్లో పెరిగిపోతున్న సాధు జంతువుల పెంపకం ఒక హాబీ మాత్రమే కాదు.., ఇదొక సంస్కృతిగా మారింది. సాధారణ కుక్కల నుంచి మొదలై విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న బల్లులు, తొండలు వంటివి ఈ కల్చర్‌లో భాగమై పోయాయి. గతంలో జర్మన్ షెఫర్డ్, ల్యాబడార్స్, గోల్డెన్ రిట్రైవర్, రాట్ వీలర్, పామోనేరియన్, హచ్‌డాగ్ వంటి వాటిని ఇష్టంగా పెంచుకునే వారు. చౌ చౌ, షిట్జూస్ వంటి పప్పీస్‌కూ ఈ మధ్య ఆదరణ బాగా పెరిగింది. ఈ వెరైటీ డాగ్స్ సుమారు 75 వేల నుంచి లక్షల రూపాయల్లో లభిస్తున్నాయి.

పిల్లులకూ ప్రేమికులు..

కరోనా అనంతరం కొన్ని కారణాల వల్ల పెంపుడు జంతువుల ధరలు కాస్త తగ్గినట్లు పెట్స్ నిపుణులు తెలిపారు. ప్రస్తుతం డాగ్స్‌తో పాటు బ్రిటిష్ షార్టైర్స్, రాగ్‌డాల్స్, మైన్ కూన్స్ వంటి విభిన్న రకాల పిల్లులను సైతం పెంచుతున్నారు. ఈ వెరైటీ పెట్స్ పై ఆసక్తి, అవగాహన పెరగడంతో ఈ మధ్య కాలంలో డాగ్ షో, క్యాట్ షోలు నగరంలో విరివిగా జరుగుతున్నాయి.



పక్షులకు భారీ క్రేజ్..

నగరంలో రిచ్ కల్చర్‌లో భాగంగా పక్షులను పెట్స్‌గా పెంచుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆఫ్రికన్ గ్రే ప్యారెట్, మకావ్ వంటి పక్షులకూ క్రేజ్ పెరిగింది. ఇలు వంటి విభిన్న రకాల పక్షులు సుమారు 20 వేల నుంచి 2 లక్షల వరకూ ధరల్లో లభిస్తున్నాయి. అయితే సాధారణంగా హంసలు అంటే చాలా మందికి ఇష్టం, కొందరు వీటిని తమ గార్డెన్‌లోని కొలనుల్లో పెట్స్‌గా పెంచుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో బ్లాక్ స్వాన్ (నలుపు హంసలు) లకు డిమాండ్ పెరిగింది. వాటి నాణ్యతను బట్టి ఈ బ్లాక్ స్వాన్స్ జోడీ మార్కెట్ విలువ 5 లక్షల నుంచి 10 లక్షలు ఉండటం గమనార్హం. ఇవే కాకుండా అందమైన పావురాలు, అస్ట్రిచ్‌తో పాటు విభిన్న రకాల చిట్టి పొట్టి జాతి పక్షులకూ ఆదరణ పెరిగింది.

విల్లాల్లో వింతగా..

నగరవాసులు విల్లాల్లో ఇంకొంచెం ముందడుగేసి సరీసృపాల (పాకేవి–రెప్టైల్స్)ను కూడా పెంచేసుకుంటున్నారు. వీటినీ పెట్స్ జాబితాలో చేర్చేస్తున్నారు. వీటిలో ఎక్కువగా కొన్ని రకాల జాతుల తొండలు, బల్లులు, పాములను విల్లాలు, ఫామ్‌హౌస్‌లలో పెంచుకోవడం ట్రెండ్‌గా మారుతోంది. ఈ తరహా కల్చర్‌కు పలువురు జంతుప్రేమికులు ఇష్టపడుతున్నారు.

సంస్కృతికి ప్రతిబింబంగా..

మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా మరి కొందరు పుంగనూరు ఆవులను పెంచుకుంటున్నారు. ఇవే కాకుండా.. ఇంటీరియర్ అందాలను పంచే ఫిష్ ఆక్వేరియమ్‌లో అరుదైన చేపలు పెంచడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇందులో గోల్డ్ ఫిష్ వంటి రకాలను అమితంగా ఇష్టపడుతున్నారు. కొందరైతే వాస్తు కోసం కూడా ప్రత్యేకంగా ఎంపిక చేసిన చేపలను పెంచడం విశేషం.

అనుమతులు తప్పనిసరి..

జంతు ప్రేమికులు ఎలా పడితే అలా.. వేటిని పడితే వాటిని.. పెంచుకోడానికి వీల్లేదు. సాధు జంతువులుగా గుర్తించబడుతున్నప్పటికీ వాటన్నింటినీ పెంచుకోడానికి అనుమతులు లేవని పెట్స్ నిపుణులు చెబుతున్నారు. అటవీ, జంతు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో కొన్ని రకాల వైల్డ్ యానిమల్స్‌ను పెంచకూడదు. వాటి సహజత్వాన్ని కోల్పోడానికి కారణమవుతుంది కాబట్టి, ఆహారం కూడా అందించకూడదని నిబంధనలు చెబుతున్నాయి. ప్రత్యేకంగా కొన్ని రకాల పక్షులు, జంతువులకు మాత్రం సంబంధిత శాఖ అనుమతులతో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకుని పెంచుకోవచ్చని సూచించారు.





బిగ్గెస్ట్ శారీ ఫెస్ట్..!

కమ్మ భవన్‌లో 24 నుంచి 30 వరకు



సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే అతి పెద్ద శారీ ఫెస్టివల్‌కు నగరం వేదికగా నిలవనుంది. కేంద్ర జౌళి శాఖ చేనేత అభివృద్ధి విభాగం కమిషనర్ ఆధ్వర్యంలో నేషనల్ డిజైన్ సెంటర్ హైదరాబాద్ శారీ ఫెస్టివల్ నిర్వహించనుంది. ఈ ప్రత్యేక చీరల ప్రదర్శన అమీర్‌పేటలోని కమ్మ సంఘం భవన్‌లో ఈ నెల 24 నుంచి 30 వరకూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకూ జరగనుంది. ఈ ఎక్స్‌పో దేశంలోని దాదాపు 75 చేనేత కార్మికులు, స్వయం సహాయక సంఘాలు, సహకార సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. ఈ ప్రదర్శన ద్వారా దాదాపు 100 మంది చేనేత కళాకారులు ఒక్క చోటుకు రానున్నారు. వీరికి దేశ, విదేశీ మార్కెట్లను పరిచయం చేయడమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. కొనుగోలుదారులు నేరుగా ఉత్పత్తిదారుల నుంచి కొనుగోలు చేసే అవకాశం ఉంది.

తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో..

పిల్లల జాతర

- ఆశయం కోసం బతికేవారు కొద్దిమందే
- తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు కేవీ.రమణాచారి





సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో 4వ పిల్లల జాతర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులతో పాటు బతుకమ్మ ఆటలు, కోలాటం, నాటకాలు, డ్యాన్స్‌లు, ఏకపాత్రాభినాయం వంటి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి మాట్లాడుతూ ఆశయం కోసం బతికేవారు కొద్దిమంది మాత్రమే ఉంటారని, అందుకోసం విద్యార్థులంతా పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. బాలల్లోని అంతర్గత శక్తిని వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. తెలంగాణ బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, భారత్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్ వేణుగోపాల్ రెడ్డి, ప్రముఖ కవి, రచయిత నందిని సిద్దారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ పాల్గొన్నారు.





నోవోటెల్‌లో వెడ్డింగ్ హై-లైఫ్!

మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్

సాక్షి, సిటీబ్యూరో: మోస్ట్ అవెయిటెడ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ నగరవాసులకు కనువిందు చేయనుంది. నవంబర్ స్పెషల్ ఎగ్జిబిషన్ 'హై–లైఫ్ ఎగ్జిబిషన్' పేరుతో హెచ్‌ఐసీసీ నోవోటెల్ వేదికగా ప్రారంభమైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకూ మూడు రోజుల పాటు అతిపెద్ద బ్రాండ్ ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ నటీమణులు సీరత్ కపూర్, సాన్వే మేఘనా ప్రారంభించారు. పండుగలు, లైఫ్ స్టైల్, పెళ్లి వేడుకలకు అనుగుణంగా అద్భుతమైన కలెక్షన్లు ఇక్కడ అందుబాటు ధరలో లభ్యం కానున్నాయని హైలైఫ్ ఎగ్జిబిషన్స్ ఎండీ, సీఈవో అబీ డొమినిక్ తెలిపారు. చాలా అరుదైన బ్రాండెడ్ దుస్తులు, స్టైలిష్ జ్యూవెలరీతో పాటు మరెన్నో యాక్సెసరీస్ అందుబాటులో ఉంటాయని వివరించారు.


చిత్రం భళా..

ఆకట్టుకుంటున్న ఇండియన్ ఫొటో ఫెస్టివల్

వివిధ రాష్ట్రాల కళాకారుల చిత్రాల ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఇండియన్ ఫొటో ఫెస్టివల్ 10వ ఎడిషన్‌కు సందర్శకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో తెలుగు రాష్ట్రాలతో పాటు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుంచి కళలను ప్రదర్శనలో ఉంచారు. ఏటా నవంబరు మూడో వారంలో ఇండియన్ ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ ఫెస్టివల్ ఇప్పటి వరకూ వందలాది మంది కళాకారులకు, ఫొటోగ్రాఫర్లకు దన్నుగా నిలుస్తోంది. వారి పెయింట్స్, ఫొటోలను ఉచితంగా ప్రదర్శనకు అవకాశం కల్పిస్తున్నారు. ఫొటోలు, చిత్రాలను ప్రదర్శించడానికి విశాలమైన ప్రదేశం, అద్భుతమైన వనరులు ఉన్న స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ఇక్కడే ఉంది. దీంతో గత పదేళ్లుగా ప్రతి సంవత్సరం ఇండియన్ ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి నేషనల్ జియోగ్రాఫిక్ భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఎంతో కళాకారులకు ఔత్సాహికుల నుంచి ఆర్థిక ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి. బయట వర్క్‌షాప్‌లో తమ పెయింట్స్‌ను ప్రదర్శించడానికి కనీసం రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకూ ఖర్చవుతుంది. అదే ఇండియన్ ఫొటో ఫెస్టివల్ ఆర్ట్ గ్యాలరీలో అందరికీ ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నారు. ఇది కళాకారులకు కొంత ఉపశమనం కల్పిస్తుంది. నిపుణులైన వ్యక్తులు ఆర్ట్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. వారికి మంచి మార్గాన్ని చూపిస్తున్నారు.




అరుదైన చిత్రాల ప్రదర్శన..

ఇండియన్ ఫొటో ఫెస్టివల్‌కు తొలిసారి వచ్చాను. ఇక్కడ చాలా చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. ప్రస్తుతం అందరికీ మొబైల్, కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. పూర్వకాలంలో కెమెరాలు ఉపయోగించే అవకాశం లేనప్పుడు తీసిన కొన్ని అరుదైన చిత్రాలు ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

- షాహోజినా బిశ్వాస్, కోల్‌కతా

కళాకారులకు తోడ్పాటు..

పదేళ్లుగా ఇండియన్ ఫొటో ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం. కొన్ని వేల మంది సందర్శకులు వచ్చి కళలను ఆస్వాదిస్తున్నారు. కళాకారుల ఫొటోలను ప్రదర్శనలో ఉంచేందుకు ఎలాంటి రుసుమూ వసూలు చేయడంలేదు. దీంతో ఎక్కువ మంది ఫొటోలు, పెయింటింగ్స్ ఇక్కడ ప్రదర్శనలో ఉంచుతున్నారు. ఔత్సాహికులు తమకు నచ్చిన వారికి ప్రోత్సాహం అందిస్తున్నారు. కళాకారులను ప్రోత్సహించాలన్నదే మా లక్ష్యం. - ఆక్విన్ మథ్యూస్, ఇండియన్ ఫొటో



సాక్షి రియల్టీ
శనివారం
23-11-2024

థీమ్.. హోమ్!

- స్పోర్ట్స్, డిస్నీ, గ్రీనరీ ఇతివృత్తంతో వసతులు, ఇంటీరియర్
- థీమ్ ఆధారిత లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాలపై ఆసక్తి
- ఆ తరహా ఇళ్ల నిర్మాణానికే డెవలపర్ల మొగ్గు
- కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తెల్లాపూర్ వంటి ప్రాంతాల్లో నిర్మాణాలు
- ఒకేరకమైన అభిరుచులున్న నివాసితులు ఒకే చోట ఉండటమే వీటి ప్రత్యేకత



సాక్షి, సిటీబ్యూరో:

మార్పు అనివార్యం.. జీవనశైలిలోనైనా, నిర్మాణ శైలిలోనైనా.. కాలానుగుణంగా అభిరుచులను, అవసరాలను తీర్చే వాటికి ఎవరైనా జై కొడతారు. వినూత్న నిర్మాణ శైలి, విలాసవంతం, ఆధునికత నగర గృహ నిర్మాణ రంగంలో ఇప్పుడిదే ట్రెండ్ కొనసాగుతోంది. లగ్జరీ వసతులు, ఇంటీరియర్ మాత్రమే కాదు డిజైనింగ్, ఆర్కిటెక్చర్ నుంచే ప్రత్యేకత కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే థీమ్ బేస్డ్ హోమ్స్ ట్రెండ్‌గా మారిపోయాయి.





- థీమ్ ఆధారిత నిర్మాణాలు కొత్తదేమీ కాదు. పురాతన కాలంలో రాజభవనాలు, రాజ ప్రాసాదాలు, కోటలు, గోపురాలను దైవం, వాస్తు, శిల్పం వంటి ఇతివృత్తంగా ఆయా నిర్మాణాలు ఉండేవి. వాటికే డెవలపర్లు ఆధునికతను జోడించి గృహ సముదాయాల స్థాయికి తీసుకొచ్చేశారు. సాధారణంగా థీమ్ బేస్డ్ రిసార్టులు, హోటళ్లు, పార్కులు ఉంటాయి. కానీ, ఇప్పుడు మెట్రో నగరాల్లో లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, క్లబ్ హౌస్‌లను ఈ తరహాలో నిర్మిస్తున్నారు.

ఇండో సార్సెనిక్, గోథిక్, స్పానిష్ వంటి నిర్మాణ శైలి భవనాలు



యువ కస్టమర్ల డిమాండ్



ప్రవాసులు, అధిక ఆదాయ వర్గాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎక్కువగా థీమ్ ఆధారిత హోమ్స్‌లో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రాజెక్ట్‌లలోనే కాదు అవి ఉండే ప్రాంతాల్లో కూడా మెరుగైన మౌలిక వసతులు ఉండాలని కోరుకుంటున్నారు. కరోనా తర్వాతి నుంచి ఈ తరహా ప్రాజెక్ట్‌లకు డిమాండ్ పెరిగింది.

– డాక్టర్ కిరణ్, సీఈఓ, సుచిరిండియా

థీమ్ బేస్డ్ అంటే?

స్పోర్ట్స్, డిస్నీ, హెల్త్ అండ్ వెల్‌నెస్, గోల్ఫ్, ఈజిప్టియన్, అరబిక్, స్పానిష్, రోమన్ వంటి ఏదైనా ఇతివృత్తం ఆధారంగా నిర్మించే నివాస సముదాయాలనే థీమ్ బేస్డ్ హోమ్స్ అంటారు. ఒకే రకమైన అభిరుచులు, ఆసక్తులు ఉన్న నివాసితులు ఒకే గృహ సముదాయంలో ఉండటమే వీటి ప్రత్యేకత. దీంతో నివాసితుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అద్భుతమైన శిల్పాలు, విశాలమైన ద్వారాలు, కిటికీలు, అందమైన మంటపాలు, గ్రాండ్ గ్యాలరీ, ఆహ్లాదకరమైన పచ్చదనంతో ఉంటాయి.

అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనే..

కొనుగోలుదారుల అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా థీమ్ ఆధారిత గృహాలను నిర్మించేందుకు డెవలపర్లు ముందుకు వస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, క్లబ్‌హౌస్‌లను కూడా థీమ్ ఆధారంగానే నిర్మిస్తున్నారు. పౌలోమి ఎస్టేట్స్, సుచిరిండియా, రాంకీ, గిరిధారి హోమ్స్ వంటి పలు నిర్మాణ సంస్థలు ఈ తరహా ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నాయి. కోకాపేట, తెల్లాపూర్, నల్లగండ్ల, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొల్లూరు, మాదాపూర్ వంటి అన్ని రకాల మౌలిక వసతులతో అభివృద్ధి చెందిన ప్రాంతాలలో ఎక్కువగా నిర్మిస్తున్నారు.

మౌలిక వసతులూ మెరుగ్గానే..

గృహల కొనుగోలుదారుల అభిరుచులు మారిపోయాయి. స్విమ్మింగ్ పూల్, జిమ్, పార్క్, క్లబ్ హౌస్ వంటి సౌకర్యాలను విలాసవంతమైన వసతులుగా పరిగణించడం లేదు. అంతకుమించి ఆధునికతను కావాలంటున్నారు. ఒక వసతుల విషయంలోనే కాదు ప్రాజెక్ట్ డిజైనింగ్, ఆర్కిటెక్చర్ అన్నింట్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని భావిస్తున్నారు. ప్రత్యేకత లేకపోతే ప్రాజెక్ట్‌ను ఎంపిక చేయడం లేదు. మెరుగైన మౌలిక వసతులు, అన్ని రకాల రవాణా సదుపాయాలు, విస్తీర్ణమైన స్థలం ఉన్న ప్రాంతాల థీమ్ బేస్డ్ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి సరైనవి.

థీమ్ బేస్డ్ ప్రాజెక్ట్‌లను ఆర్కిటెక్చర్, కల్చర్, లైఫ్‌స్టైల్ మూడు రకాలుగా వర్గీకరిస్తారు.

1. **ఆర్కిటెక్చర్:** ఈ భవన నిర్మాణాల శైలి వినూత్నంగా ఉంటాయి. ఈ తరహా నిర్మాణ శైలిని ప్రపంచ దేశాల్లోని చరిత్రలో వివిధ కాలవ్యవధుల్లో వచ్చిన నిర్మాణాలను ప్రేరణగా తీసుకొని ఆర్కిటెక్చర్ డిజైనింగ్‌ను రూపొందిస్తారు. ఈ తరహా భవన నిర్మాణాలు సమగ్రత్తను నిర్ధారించడంతో పాటు ఫ్యాషన్ సింబల్‌గా మారాయి.

ఉదాహరణ: ఇండో సార్సెనిక్, గోథిక్ అండ్ విక్టోరియన్, మొగల్స్, ఈజిప్టియన్, అరబిక్, స్పానిష్, రోమన్, మొరాకన్ ఆర్కిటెక్చర్ నిర్మాణాలు.

2. **కల్చర్:** ప్రపంచంలోని వివిధ సంస్కృతులను ప్రతిబింబించేలా ఈ నివాస సముదాయాలు ఉంటాయి.

ఉదాహరణ: డెన్మార్క్, నార్వే, స్వీడన్ వంటి స్కాండినేవియన్ దేశాల్లో గృహాల డిజైన్లు ప్రకృతిని పెంపొందించేలా, జపనీయుల హోమ్స్ మినిమలిస్టిక్ డిజైన్లను అవలంబిస్తుంటారు. భారతీయులు చైతన్యపరిచే గృహాలను ఇష్టపడుతుంటారు.

3. **లైఫ్‌స్టైల్:** కొనుగోలుదారుల జీవనశైలి, అవసరాలు, అభిరుచులకు తగ్గట్టుగా నిర్మించే కస్టమైజ్డ్ గృహాలివీ. ఈ ప్రాజెక్ట్‌లలో గ్రీనరీకి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ధారాళమైన గాలి, వెలుతురుతో ఆకట్టుకుంటాయి.

ఉదాహరణ: స్పోర్ట్స్ టౌన్‌షిప్‌లు, డిస్నీ, చిల్డ్రన్ సెంట్రిక్ హోమ్స్, హెల్త్ అండ్ వెల్‌నెస్ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు వంటివి.

నగరంలో అద్దెలు ఇలా

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అద్దెలు పెరిగాయి. మూడు నెలల్లో కిరాయిలు 1–4 శాతం మేర పెరిగాయి. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో, ఆఫీసులకు దగ్గరగా ఉన్న చోట, అలాగే మెట్రో కనెక్టివిటీ, ఇతర రవాణా సదుపాయాలు మెరుగ్గా ఉన్న ప్రాంతాల్లో నెలవారీ అద్దెలు ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయని అనరాక్ గ్రూప్ అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 1,000–1,300 చదరపు అడుగుల 2 బీహెచ్‌కే ఫ్లాట్ ధరలు ఎలా ఉన్నాయంటే..

(నోట్: ఫ్లాట్ విస్తీర్ణం, ఫేసింగ్, భవనం నాణ్యత, వసతులను బట్టి అద్దెలలో హెచ్చుతగ్గులుంటాయి)



కోకాపేట	రూ.45,000-55,000
గోపన్‌పల్లి	40,000
బాచుపల్లి	38,000
మణికొండ	39,000
ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్	50,000
అమీర్‌పేట	20,500
మదీనాగూడ	26,000
కొండాపూర్	49,000
తెల్లాపూర్	48,000
జూబ్లీహిల్స్	58,000
నిజాంపేట	23,000
మీర్‌పేట	5,000
తుర్కయాంజాల్	6,500
ఘట్‌కేసర్	8,000
బీహెచ్‌ఈఎల్	8,200
ముషీరాబాద్	8,500
ప్రగతినగర్	9,000
కొంపల్లి	9,000
మేడిపల్లి	10,000
రామాంతాపూర్	10,000
బోడుప్పల్	10,000
పటాన్‌చెరు	9,000 -10,000

వాటి జోలికి హైడ్రా వెళ్లదు



స్థిరాస్తి కొనుగోళ్లలో.. జాగ్రత్తలు తీసుకోండి



- అన్నీ పరిశీలించాకే ముందడుగు వేయండి
- లే అవుట్లలోని రహదారులు, పార్కులను పరిరక్షిస్తాం
- ఇప్పటికే ప్రజలు నివసిస్తుంటే వాటిని కూల్చివేయం

‘సాక్షి’తో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: రాజధాని చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) హద్దుగా జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) పేరు చెబితే ఇప్పుడు అందరూ ఉలిక్కిపడుతున్నారు. ఈ ప్రత్యేక విభాగం ఆపరేషన్స్ నేపథ్యంలో స్థిరాస్తి క్రయవిక్రయాలకు సంబంధించి సామాన్యుల్లో అనేక సందేహాలు నెలకొన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని కొన్ని విభాగాలతో పాటు కొందరు వ్యక్తులూ రెచ్చిపోతున్నారు. ఓ పక్క నోటీసులు, మరోపక్క బెదిరింపులతో తమ ‘పని’ పూర్తి చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ అంశాలను ‘సాక్షి’.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లింది. వివరాలు ఆయన మాటల్లోనే..

- అక్రమ నిర్మాణం అయినప్పటికీ.. ఇప్పటికే ప్రజలు నివసిస్తుంటే.. ఆ జనావాసాల జోలికి హైడ్రా వెళ్లదు. జలవనరుల పరిరక్షణలో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న వాటిపైనే చర్యలు తీసుకుంటుంది. సామాన్యుడికి అండగా నిలవాలనే ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఎవరైనా ప్లాట్, ఫ్లాట్ ఖరీదు చేసుకునే ముందు దానికి సంబంధించిన వివరాలు సరిచూసుకోండి.
- నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రస్తుతం కుంట, చెరువు కనిపించకపోయినప్పటికీ ఒకప్పుడు అక్కడ ఉండొచ్చు. ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం అక్కడ జలవనరు ఉన్నట్లు రికార్డు ఉంటుంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న పట్టాభూములు సైతం కేవలం వ్యవసాయం చేసుకోవడానికి ఉద్దేశించినవి. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు, ఈ భూములు క్రయవిక్రయాలు చేయకూడదు.
- రాజధానిలోని భూములకు సంబంధించిన సమగ్ర వివరాలు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కి (ఎన్ఆర్ఎస్‌సీ) ఆధీనంలోని భువన్, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ధరణి వెబ్‌సైట్లలో, జలవనరులకు సంబంధించిన వివరాలు హెచ్ఎండీఏ లేక్స్ వెబ్‌సైట్స్‌లో ఉంటాయి. వీటితో పాటు రెవెన్యూ రికార్డులను సైతం సరిచూసుకున్న తర్వాతే క్రయవిక్రయాల విషయంలో ముందుకు వెళ్లాలి.
- రాజధానిలో ఎక్కడైనా స్థిరాస్తి కొనుగోలు చేసేప్పుడు మరికొన్ని అంశాలనూ సరిచూసుకోండి. ఆ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అవి ఇవ్వాల్సిన విభాగాలే ఇచ్చినవి సక్రమ అనుమతులేనా? ఆ అనుమతుల్ని రద్దు చేయడం వంటివి జరిగాయా? కోర్టు వివాదాలు ఉన్నాయా? అనేవి చూసుకోండి. కొన్ని నిర్మాణాలకు హెచ్ఎండీఏకు బదులు పంచాయితీ సెక్రటరీ, ఆర్ఐలు అనుమతులు మంజూరు చేసిన ఉదంతాలు ఉన్నాయి.
- లేఅవుట్లలో ఉన్న కామన్ ఏరియాలు, పార్కులు, రహదారులు సైతం కాలక్రమంలో ఆక్రమణలకు గురవుతున్నాయి. కేవలం రికార్డుల్లో మాత్రమే ఇవి ఉంటూ.. వాస్తవంలో కనుమరుగు అవుతున్నాయి. ఈ విషయాన్ని హైడ్రా సీరియస్‌గా తీసుకుంటోంది. ఇలా ఆక్రమణలకు గురైన వాటినీ పునరుద్ధరిస్తుంది. వీటిని పరిరక్షించడం కోసం నిర్దిష్ట విధానాన్ని రూపొందించింది.

సౌర విద్యుత్ ఇస్తామని చెప్పింది సెకీనే

ఇందుకు 2021 సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వానికి లేఖే తిరుగులేని నిదర్శనం

అది కూడా అత్యంత చౌకగా యూనిట్ రూ.2.49కే అందిస్తామని ఆ లేఖలో వెల్లడి

పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంలో ఏపీ కృషికి అభినందన

రైతులకు పగటి పూట సౌర విద్యుత్‌ను అందించాలనే వినూత్న నిర్ణయం నచ్చిందని వెల్లడి

అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరా చార్జీలకు కూడా 25 ఏళ్లు మినహాయింపు ఇస్తామని స్పష్టీకరణ

సెకీనే ప్రతిపాదించిన ఈ వ్యవహారంలో స్కామేమిటి? ముడుపులేమిటి?

సాక్షి, అమరావతి: పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకోవడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవలంభిస్తున్న వినూత్న విధానాలు, చూపిస్తున్న చొరవకు స్పందిస్తూ తామే పాతికేళ్లపాటు రాష్ట్రానికి చవగ్గా సౌర విద్యుత్ అందిస్తామని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) తనకు తానే ముందుగా ప్రతిపాదించింది. అందుకు 2021 సెప్టెంబర్ 15న సెకీ రాసిన లేఖే తిరుగులేని ఆధారం. వేరే ప్రయత్నాలు అవసరం లేదని, అతి తక్కువ ధరకు యూనిట్ రూ.2.49కి తామే అందిస్తామంటూ సెకీనే ఆరోజు రాష్ట్రానికి లేఖ రాసింది. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా వ్యవసాయానికి పగటిపూట ఉచితంగా 9 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన పునరుత్పాదక విద్యుత్‌ను.. అదీ డిస్కంలపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా అందించాలనే జగన్ వినూత్న ఆలోచనను కేంద్ర సంస్థ ఆ లేఖలో కొనియాడింది. సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ టెండర్లు పిలిచిందనే విషయం తమకు తెలిసిందని, అయితే తామే చౌక ధరకు సోలార్ విద్యుత్‌ను 25 ఏళ్ల పాటు సరఫరా చేస్తామని ఆ లేఖలో తెలిపింది. 2024 సెప్టెంబర్‌లో 3 వేల మెగావాట్లు, 2025 సెప్టెంబర్‌లో 3 వేల మెగావాట్లు, 2026 సెప్టెంబర్‌లో 3 వేల మెగావాట్లు చొప్పున మొత్తం 9 వేల మెగావాట్లు ఇస్తామని వివరించింది. 25 సంవత్సరాల పాటు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) చార్జీల నుంచి రాష్ట్రానికి మినహాయింపు కూడా ఇస్తామని చెప్పింది. తామిచ్చే టారిఫ్ యూనిట్ రూ.2.49 వల్ల వ్యవసాయ విద్యుత్‌కు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ భారం కూడా తగ్గుతుందని పేర్కొంది. అదే విధంగా 9 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఏపీలో ప్రాజెక్టు నిర్మిస్తే అయ్యే ఖర్చులు, భూమి కూడా మిగులుతాయని, వాటిని రాష్ట్రం ఇతర అభివృద్ధి, ప్రాజెక్టుల అవసరాలకు వినియోగించుకోవచ్చని వివరించింది. డిస్కంలకు కూడా విద్యుత్ కొనుగోలు ఖర్చులు తగ్గుతాయని వెల్లడించింది. తమ ప్రతిపాదనకు అంగీకరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆత్మ నిర్భర్ భారత్'కు ఏపీ మద్దతు ఇచ్చినట్టవుతుందని కూడా చెప్పింది. వెంటనే సానుకూల నిర్ణయాన్ని తెలపాలని రాష్ట్రాన్ని కోరింది. ఇలా కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీనే స్వయంగా విద్యుత్ ఇస్తామంటూ ముందుకు వచ్చిన ఈ వ్యవహారంలో స్కామ్‌కు ఆస్కారమే ఉండదన్నది స్పష్టం. ఇందులో ముడుపుల అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదన్న విషయం ఎవరికైనా ఇట్టే అవగతమవుతుంది.

కేంద్రం ఇంతగా చెప్పాక ఎవరైనా కాదంటారా..!

చంద్రబాబు కుదుర్చుకున్న దీర్ఘకాలిక పీపీఏల వల్ల డిస్కమ్‌లపై తీవ్ర ఆర్థిక భారం పడింది. దీనివల్ల ప్రభుత్వంపై రాయితీ భారం కూడా పెరిగింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు 10 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్రంలో సోలార్ పార్క్‌లను అభివృద్ధి చేయాలని 2020లో గత ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలో 2020 నవంబర్‌లో 6,400 మెవాగాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ జీఈసీఎల్) టెండర్లు పిలిచింది. యూనిట్ రూ.2.49 నుంచి రూ.2.58 చొప్పున సరఫరా చేసేందుకు ముందుకొస్తూ 24 బిడ్లు దాఖలు అయ్యాయి. అయితే న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నమవడం వల్ల ఆ టెండర్ ప్రక్రియ రద్దయింది. అదే సమయంలో అతి చౌకగా విద్యుత్ అందిస్తామని కేంద్ర ప్రభుత్వమే ఇంత స్పష్టంగా చెప్పాక ఏ రాష్ట్రమైనా ఎందుకు వద్దంటుంది? పైగా, ఈ విద్యుత్ తీసుకొంటే ఆర్థికంగా, ఇతరత్రా పలు ప్రయోజనాలూ ఉన్నాయి. ఇంత మంచి అవకాశాన్ని ఏ రాష్ట్రమూ వదులుకోదు. ఒక వేళ వద్దంటే ప్రతిపక్షాలు ఊరుకుంటాయా? తక్కువకు ఇస్తామని కేంద్రమే ముందుకు వస్తే ఎందుకు తీసుకోవడంలేదని, దాని వెనుక రాష్ట్ర ప్రయోజనాలకంటే వేరే కారణాలున్నాయంటూ గోల పెట్టేవి. ఇదే ఎల్లో మీడియా ప్రభుత్వాన్ని తప్పు బడుతూ కథనాలు రాసేది. అలాంటి అవకాశాన్ని ఇవ్వకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే కేంద్ర ప్రతిపాదనను మంత్రి మండలి సమావేశంలో ప్రవేశపెట్టారు. మంత్రులంతా ఏకగ్రీవంగా సెకీ ఒప్పందానికి అంగీకారం తెలిపారు. అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. 2003 ఎలక్ట్రిసిటీ యాక్ట్ ప్రకారం సెకీతో ఒప్పందాలకు కేంద్ర, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండళ్ల ఆమోదం కూడా లభించింది. ఈ ఒప్పందాల్లో ఎక్కడా అదానీ గ్రూపునకు చెందిన సంస్థలతోగానీ అనుబంధ కంపెనీలతోగానీ ఒప్పందాలు కుదుర్చుకోలేదు. ఇక అవినీతి ఎక్కడుంది? అసలు లంచాలకు ఆస్కారం ఏముంది?

"చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అత్యధిక ధరలకు ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ) కుదుర్చుకున్నారు. అప్పటికి మార్కెట్‌లో సౌర విద్యుత్ యూనిట్ రూ.2.44కే లభిస్తున్నా (బ్యాక్‌డౌన్ చార్జీలతో కలిపి రూ.3.54) ఏకంగా యూనిట్ రూ.6.99 చొప్పున కొనుగోలు చేశారు. ఒకపక్క మిగులు విద్యుత్ ఉన్నప్పటికీ చంద్రబాబు దాన్ని వృథా చేసి మరీ ఇంత ఎక్కువ ధరకు పీపీఏలు చేసుకోవడంలో ఆంతర్యమేమిటి? అది కదా అసలు సిసలైన కుంభకోణం..! దీన్ని ప్రశ్నించే సాహసం ఈనాడు ఏనాడైనా చేసిందా?"

"అసలు అదానీతో ఒప్పందం చేసుకోవాలనిగానీ, భారీగా లంచాలు పొందాలనిగానీ అప్పటి ప్రభుత్వం అనుకుంటే సంస్థలతోనే నేరుగా చేసుకునేవారు గానీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీతో ఎందుకు చేసుకుంటారు? ముడుపులే కావాలనుకుంటే చంద్రబాబులా ప్రైవేట్ సంస్థలతోనే ఒప్పందం కుదుర్చుకునేవారు కదా? ఇంత చిన్న లాజిక్ కూడా తెలియదా?"

రాష్ట్ర ప్రభుత్వం అప్పటికే టెండర్లు పిలిచినా వాటిపై చట్టపరంగా సమస్యలు వచ్చాయి. ఆ తరుణంలో కేంద్రం తక్కువ ధరకే విద్యుత్ ఇస్తామని లేఖ రాసింది. వ్యవసాయ ఉచిత విద్యుత్‌పై ముందుచూపు, రైతులకు 25 ఏళ్ల పాటు మంచి చేయాలనే జగన్ సర్కారు సంకల్పాన్ని అభినందిస్తూ నాడు సెకీ లేఖ రాసింది. డిస్కంలపై ఆర్థిక భారం పడకుండా, రైతుల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ఇది దోహదం చేస్తుందని పేర్కొంది. అదే సెకీ విద్యుత్ తీసుకోకపోతే అప్పటికే పిలిచిన టెండర్ల కేసు కోర్టులో ఎప్పటికి తేలుతుందో తెలియదు. అది తేలే నాటికి పరికరాల రేట్లు, విద్యుత్ ధరలు ఎంతగానో పెరిగేవి. అప్పుడు ఇదే ఈనాడు, ఇతర ఎల్లో మీడియా తక్కువకు ఇస్తామన్నా సెకీ విద్యుత్‌ను ఎందుకు తీసుకోలేదని బురద చల్లేవి కాదా?

ఏది నిజం?

"రాష్ట్ర చరిత్రలోనే ఇంత కారుచౌకగా సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం.. అది కూడా అత్యధికంగా 7 వేల మెగావాట్ల కొనుగోలు కోసం ఒప్పందం గతంలో ఎప్పుడూ, ఏ ప్రభుత్వంలో, ఏ సీఎం హయాంలోనూ జరగలేదు. డిస్కమ్‌లు కూడా ఇలాంటి ఒప్పందాన్ని ఎన్నడూ కుదుర్చుకోలేదు. అందులోనూ కేంద్రమే స్వయంగా లేఖ రాసి మరీ యూనిట్ రూ.2.49 చొప్పున 25 ఏళ్లపాటు నిరాటంకంగా విద్యుత్తు సరఫరా చేస్తామని ముందుకొస్తే ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా కాదంటుందా?"

నిస్సిగ్గుగా నిందలా!

సెకీ తనకు తానుగా యూనిట్ రూ.2.49కే సరఫరా చేస్తామని ముందుకొచ్చింది

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలోనే ఇంత కారుచౌకగా సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం.. అది కూడా అత్యధికంగా 7 వేల మెగావాట్ల కొనుగోలు కోసం ఒప్పందం గతంలో ఎప్పుడూ, ఏ ప్రభుత్వంలోనూ జరగలేదు. ఏ ముఖ్యమంత్రి హయాంలోనూ జరిగిన దాఖలాలు లేవు. డిస్కమ్‌లు కూడా ఇలాంటి ఒప్పందాన్ని ఎన్నడూ కుదుర్చుకోలేదు. అందులోనూ కేంద్రమే స్వయంగా లేఖ రాసి మరీ యూనిట్ రూ.2.49 చొప్పున 25 ఏళ్లపాటు నిరాటంకంగా విద్యుత్తు సరఫరా చేస్తామని ముందుకొస్తే ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా కాదంటుందా? రైతులకు ఉచిత విద్యుత్తుపై గత సర్కారు దూరదృష్టి, సోలార్‌పై మన విధానాలను అభినందిస్తూ స్వయంగా సెకీ నాడు లేఖ రాసింది. సరఫరా చార్జీల భారం లేకుండా అత్యంత చౌకగా కరెంట్ అందిస్తామని సంసిద్ధత తెలిపింది. ఎవరు మాత్రం దీన్ని కాదంటారు? అంతేకాకుండా అప్పటికి యూనిట్ రూ.5.10 చొప్పున కొంటున్నారు. సెకీ విద్యుత్ తీసుకోకపోతే ఏటా రూ.3,750 కోట్ల భారం పడుతుంది. ఒకవేళ తీసుకోకుంటే ఎల్లో మీడియా ఎంత దుష్ప్రచారం చేసేది? అసలు ఈ ఒప్పందం ఓ రాష్ట్ర ప్రభుత్వం - కేంద్ర ప్రభుత్వానికి మధ్య జరిగింది. అలాంటప్పుడు లంచాలెలా వస్తాయి? కేంద్రం ఎక్కడైనా రాష్ట్రానికి లంచం ఇస్తుందా? ఒకవేళ తీసుకోవాలనుకుంటే కేంద్రం రాసిన లేఖకు ఎందుకు స్పందిస్తారు? అలాంటి ఉద్దేశం ఉంటే నేరుగా అదానీతోనే ఒప్పందం చేసుకోవాలి కదా? కేంద్రంతో ఒప్పందం చేసుకున్నప్పుడు ఇందులో మూడో వ్యక్తి అనే ప్రస్తావన ఎందుకు ఉంటుంది? అదానీతో దీనికి ఏం సంబంధం? ఇక సెకీ రాసిన లేఖకు కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి, రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి సైతం ఆమోదం తెలిపాయి. ఇవి రెండూ కేంద్ర సంస్థలే. ఆ ఒప్పందంలో ఎలాంటి తప్పు లేదు కాబట్టే అనుమతిచ్చాయి. ఇంత గగ్గోలు పెడుతున్న ఎల్లో మీడియా చంద్రబాబు అత్యధిక ధరలతో విద్యుత్తు కొనుగోళ్ల ఒప్పందాలు (పీపీఏలు) చేసుకుంటే ఏనాడైనా కనీసం ఒక్క కథనమైనా రాసిందా? అమెరికాలో అదానీ సంస్థపై అభియోగాలు నమోదైతే దాన్ని జగన్‌కు ముడిపెట్టి విషప్రచారం చేస్తూ.. టీడీపీ అనుబంధ పత్రిక ఈనాడు పుంఖాను పుంఖాలుగా అసత్యాలను వండి వార్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికున్న అశేష జనాదరణను తగ్గించకపోతే చంద్రబాబుకు మళ్లీ వానప్రస్థం తప్పదని బెంబేలెత్తుతున్న ఈనాడు ఎక్కడో అమెరికాలో నమోదైన కేసులో జగన్ పేరు లేకపోయినా ఉందంటూ పచ్చి అబద్ధాన్ని అచ్చేసింది.

వంద శాతం ప్రభుత్వ రంగ సంస్థ..

సెకీ 'ట్రిపుల్ ఏ' రేటింగ్ కలిగిన కేంద్ర ప్రభుత్వ సంస్థ. ఆ సంస్థ నుంచి నేరుగా 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ తీసుకునేలా ఒప్పందం చేసుకుంటేనే ఇన్ని నిందలేస్తున్న ఈనాడు ఇక చంద్రబాబులా ఏ ప్రైవేట్ కంపెనీలతోనో డీల్ కుదుర్చుకుంటే ఇంకెంత శివాలెత్తిపోయేదో! గత ప్రభుత్వం ఇలాంటి వాటికి ఎక్కడా ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంది. నేరుగా సెకీతో ఒప్పందం చేసుకుంది. దీంతో బురద జల్లడానికి రంధ్రాన్వేషణ మొదలెట్టిన ఈనాడు... గత ప్రభుత్వం సెకీతో ఒప్పందం చేసుకుంటే అది అదానీతో కుదుర్చుకున్నట్లు, అందుకోసమే ఆ కంపెనీ జగన్‌కు లంచాలిచ్చినట్లు దిగజారుడు రాతలకు తెగబడింది. ఇంతకన్నా దివాలాకోరుతనం ఇంకేమైనా ఉంటుందా? దాదాపు 18 లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్తు అందటమే మహాపరాధంగా పరిగణిస్తూ.. దానికి అహర్నిశం పాటుపడిన జగన్‌పై బురద జల్లుతున్న ఎల్లో మీడియా విషపూరిత కథనాలను ఏమనుకోవాలి?

ప్రయోజనాలు ఎక్కువ గనుకే ఒప్పందం..

సెకీ నుంచి విద్యుత్ తీసుకోవడం వల్ల పాతికేళ్ల పాటు అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి కేంద్రం మినహాయింపు ఇస్తుంది. అదే రాష్ట్రంలో ఏర్పాటు చేస్తే పాతికేళ్ల సెంట్రల్ గ్రిడ్ చార్జీలను చెల్లించాలి. రాష్ట్రంలో అంతర్గతంగా సౌర ప్రాజెక్టులను నెలకొల్పితే వాటికి కావాల్సిన విద్యుత్ లైన్లు, అంతర్గతంగా విద్యుత్ ప్రసార వ్యవస్థను బలోపేతం చేయటం తప్పనిసరి. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ ప్రసార వ్యవస్థలపై దీనికోసం పెట్టాల్సిన ఖర్చును బేరీజు వేసుకుంటే బయటి రాష్ట్రాల నుంచి సౌర విద్యుత్ తీసుకున్నప్పుడే తక్కువ వ్యయం అవుతోంది. అందుకే తొలుత రాష్ట్రంలోనే సౌర విద్యుత్ ప్రాజెక్టు పెట్టాలనుకున్నప్పటికీ పలు అంశాలను పరిగణలోకి తీసుకున్న తరువాత సెకీ ప్రతిపాదనకు గత మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సెకీ ధర కన్నా ఇతర రాష్ట్రాల్లో తక్కువ రేటుకి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు జరిగాయంటూ ఈనాడు రాసుకొచ్చింది. రాజస్థాన్‌లో ఉర్జా వికాస్ నిగమ్ లిమిటెడ్ ద్వారా ఇస్తున్న విద్యుత్ యూనిట్ రూ.2.01. కానీ అక్కడ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) 23.5 శాతం. ఏపీలో ఇది 17.5 శాతమే. మరి ధరలో మార్పులుండవా?

తప్పయితే 'సీఈఆర్సీ, ఏపీఈఆర్సీ' ఎందుకు అనుమతిస్తాయి?

2003 విద్యుత్ చట్టం ప్రకారం సెకీతో ఒప్పందాలకు ఏపీఈఆర్సీ అనుమతినిచ్చింది. దీంతో సెకీ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే విద్యుత్ కొనుగోలు మొదలు కావాల్సి ఉంది. అన్నీ పరిశీలించాక కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి కూడా దీన్ని ఆమోదించింది. సెకీ విద్యుత్‌కు అంతర్ రాష్ట్ర విద్యుత్ సరఫరా చార్జీలు ఉండవని ఈ ఏడాది ఆగస్టు 13న ఏపీఈఆర్సీ కూడా స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అంతకు ముందే అంటే 2021 జనవరి 15నే వెల్లడించింది. మరి ఇప్పుడు కేంద్రం, రాష్ట్రాల్లో అత్యున్నత న్యాయ సంస్థలు అనుమతించిన ఒప్పందం తప్పంటారా? ఏదైనా అవినీతి జరిగి ఉంటే అక్కడే తేలిపోయేది కదా?

ఏటా రూ.3,750 కోట్లు ఆదా అవుతుంటే నష్టమంటారా?

ప్రస్తుతం రాష్ట్రం కొనుగోలు చేస్తున్న విద్యుత్ యూనిట్‌కు సగటున రూ.5.10 చొప్పున అవుతోంది. సెకీ విద్యుత్ మాత్రం యూనిట్ రూ.2.49కే వస్తుంది. ఇప్పుడు రాష్ట్రానికి ఎన్‌టీపీసీ ఇస్తున్న సౌర విద్యుత్ ధర కూడా ట్రేడింగ్ మార్జిన్ కలిపి యూనిట్‌కు రూ.2.79 అవుతోంది. ఎలా చూసినా సెకీ విద్యుత్ తక్కువకే వస్తోంది. ఈ లెక్కన ఏటా దాదాపు రూ.3,750 కోట్ల మేరకు ఆదా అవుతోంది. కానీ ఈనాడు మాత్రం పాతికేళ్లలో రూ.1.10 లక్షల కోట్లు నష్టమంటూ నోటికొచ్చిన లెక్కలు రాసుకొచ్చింది. ఆ తప్పుడు లెక్కల వెనుక అసలు ఆంతర్యాన్ని ప్రజలు గ్రహించలేరనుకుంటోంది.

యూనిట్ రూ.6.99 చొప్పున కొనుగోలు చేసిన చరిత్ర చంద్రబాబుది

టీడీపీ హయాంలో మార్కెట్‌లో సౌర విద్యుత్ యూనిట్ రూ.2.44కే లభిస్తున్నా (బ్యాక్‌డౌన్ ఛార్జీలతో కలిసి రూ.3.54) ఏకంగా యూనిట్ రూ.6.99 చొప్పున కొనుగోలు చేసిన చరిత్ర చంద్రబాబుది! అయినా సరే ఈనాడుకు అది ఏనాడూ కనపడకపోవడం విచిత్రం! ఇక పవన విద్యుత్తుకైతే యూనిట్‌కు రూ.4.84 వరకు అదనంగా పెట్టి నామినేషన్ పద్ధతిలో పీపీఏలు చేసుకున్నారు. పోటీ బిడ్డింగ్ లేనేలేదు. 2014 జూన్ 2న రాష్ట్ర విభజన జరిగింది. ఆ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 17,731 మెగావాట్ల విద్యుదుత్పత్తి స్థాపిత సామర్థ్యం ఉంది. అందులో 12,190 మెగావాట్లు థర్మల్, 275.78 మెగావాట్లు ఇతర విద్యుత్ కాగా మిగిలింది పునరుత్పాదక విద్యుత్. 2014 జూన్‌లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు రెండింటి మొత్తం గరిష్ట డిమాండ్ 13,404 మెగావాట్లు మాత్రమే. అయినా సరే టీడీపీ ప్రభుత్వం నాడు హడావుడిగా 8 వేల మెగావాట్ల పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ)లను అధిక ధరలకు కుదుర్చుకుంది. 'ఈనాడు'కు ఇదంతా దోచిపెట్టినట్లుగా కనిపించకపోవటం చిత్రమే! చంద్రబాబు స్వప్రయోజనాల కోసం కుదుర్చుకున్న ఒప్పందాల ఫలితంగా విద్యుత్ పంపిణీ సంస్థలపై ఏటా రూ.3,500 కోట్ల భారం పడుతోంది. అది కూడా దశాబ్దాల పాటు భరించాలి. ప్రస్తుత విలువ ప్రకారం డిస్కంలు రూ.35 వేల కోట్లకు పైనే చెల్లించాలి. రాష్ట్ర విద్యుత్ సంస్థలపై ప్రత్యక్షంగా, ప్రజలపై పరోక్షంగా ఇంత పెద్ద భారాన్ని మోపడానికి చంద్రబాబు సిద్ధపడ్డారంటే దాన్ని మించిన కుంభకోణం ఇంకేముంటుంది?

చంద్రబాబు హయాంలో అధిక ధరలకు జరిగిన విద్యుత్ ఒప్పందాలు

సంవత్సరం	పవన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు	సామర్థ్యం	యూనిట్ ధర
2014	14	281.6	4.70
2015	14	243.2	4.83
2016	63	2254.4	4.84
2017	41	712.2	4.84
2018	1	2.3	4.84
మొత్తం	133	3494	

సంవత్సరం	సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు	సామర్థ్యం (మెగావాట్లు)	యూనిట్ ధర
2014	30	649	6.49 మరియు 5.25 నుండి 6.99 వరకు (ఏటా 3% చొప్పున పదేళ్ల వరకు పెంపు)
2015	1	250	5.96
2016	4	1	6.8(ఎన్ఆర్ఈడీసీఏపీ)
		5	5.99(ఏపీజెన్‌కో)
		1,000	4.61(ఎన్‌టీపీసీ)
		400	4.5(ఎస్ఈసీఐ)
2017	-	-	-
మొత్తం	35	2,400	

సోलर एनर्जी कॉर्पोरेशन ऑफ इंडिया लिमिटेड
(भारत सरकार का उपक्रम)
Solar Energy Corporation of India Ltd.
(A Government of India Enterprise)
स्वच्छ भारत - स्वच्छ ऊर्जा

No. SECI/PT/Manufacturing/Solar/2021/ September 15, 2021

Dr. Srikant Nagulapalli, IAS
Principal Secretary, Energy
Amravati, Andhra Pradesh

Sub: Procurement of Solar Power under SECI's Manufacturing linked Solar Scheme
Ref.: SECI/PT/Manufacturing/Solar/2020/ dated 24 July, 2020

Sir,

We have been very appreciative of Andhra Pradesh's commitment in adoption of new and renewable sources of energy. It has used innovative methods to integrate renewable energy in its power mix to ensure sustainability and utilisation of competitive means available to integrate low cost solutions.

The innovative model promoted by GoAP to utilize renewable energy, with a view to achieve sustainable agriculture growth while lowering cost of cultivation by providing day-time power supply to farmers at competitive prices, is noteworthy. This indeed will go a long way in uplifting the living standards of farmers, without increasing financial burden on the State DISCOMs. We have taken note of the recent tender floated by GoAP for 6400 MW of Solar Power with 50% Capacity Green Shoe Option. As per the available information in public domain, few of the bidders have offered a tariff of Rs. 2.49/kWh in the tender of GoAP.

We wish to submit the following proposition for your acceptance:

1. SECI in pursuit of the cause of promoting renewable energy had recently worked under the auspices of GOI's "Atma Nirbhar Bharat Abhiyan" by auctioning Manufacturing Linked Solar Tender in Nov 2019. Basis, the tendering, awards were placed between Dec 2019 to June 2020 by SECI, wherein 12 GW of ISTS Connected Solar Projects were awarded in 4 Tranches of 3 GW each. Commercial Operation of Tranche-I Projects is expected by Sep' 2023 and thereafter subsequent Tranche – II, III & IV in Sep'2024, Sep'2025 and Sep'2026, respectively. The tender shall entail setting up of 3 GW pa capacity of manufacturing facilities in the Country.
2. Out of the above Solar project capacities, Tranche -I capacities have been offered to various utilities and they have shown their willingness to purchase the same and PSAs are expected to be finalised in due course. Post which SECI is in position to offer 9,000 MW capacity under Tranche II, III & IV i.e. 3000 MW each, to be set up by Sep 2024, Sep 2025 and Sep 2026, respectively.
3. The developers, who have been issued Letter of Award (LoA) have suo-moto offered 9GW under Tranche-II, III & IV under this scheme at a tariff of Rs. 2.49 / kWh including SECI's trading margin, considering reduction of solar tariff in the recent tenders for solar projects conducted nationwide and considering bulk capacity being offered. Accordingly, offer is being made to Andhra Pradesh for the above bulk quantity that has been offered by these developers.

Page 1 of 2

पंजीकृत कार्यालय : 6 वी मंजिल, प्लेट-बी, एनबीसीसी कार्यालय ब्लॉक टावर-2, पूर्वी किदवई नगर, नई दिल्ली-110023 Regd. Office : 6th Floor, Plate-B, NBCC Office Block Tower-2 East Kidwai Nagar, New Delhi-110023
दूरभाष/Phone : (011) 24666200, ई-मेल/Email : corporate@seci.co.in, वेबसाइट/Website: www.seci.co.in
सीआईएन/CIN : U40106DL2011GOI225263

'పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ అవలంభిస్తున్న వినూత్న విధానాలు, చూపిస్తున్న చొరవను ప్రశంసిస్తున్నాం. చౌక ధరతో రైతులకు విద్యుత్ అందించాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఈ నేపథ్యంలో మీ నిర్ణయాలకు మద్దతుగా రాష్ట్రానికి చవగ్గా సౌర విద్యుత్ అందిస్తాం'అని లేఖలో పేర్కొన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ).

అన్ని ఖర్చులతో కలిపి యూనిట్ రూ. 2.49 చొప్పున ఇస్తామని చెబుతూ లేఖలో స్పష్టంగా పేర్కొన్న సెకీ

4. The Manufacturing linked PSAs would have following features:
   - Similar Tariff: SECI offers this power at Rs. 2.49/kWh (inclusive applicable SECI's Trading Margin) in line with the suo-moto offer of the developers who have been issued Letter of Award (LoA) under this scheme.
   - Agricultural Subsidy Savings: With this Tariff, the procurement may save substantial amount in terms of reduction in agriculture subsidy over the PSA tenure of 25 years.
   - ISTS Waiver: As a special incentive, Government of India has granted ISTS charges waiver to solar projects set up under Solar Manufacturing tender for entire 25 years of PPA life, irrespective of their commissioning date, thus no such charges would be applicable on GoAP.
   - Park Infrastructure Available for Alternative Use: As the land shall be procured by the Solar Project developer, it frees up around 9,000 MW solar park infrastructure being set up by AP Govt, which can be used gainfully for future developments / projects.
   - Better Integration of Solar Power: Given the phased commissioning of solar projects i.e. 3000 MW in each year from 2024, 2025 and 2026, it will help AP DISCOMs and STU to methodically integrate this power in the power mix of the AP State, thereby reducing the integration and balancing cost which AP Govt. had envisaged in their Tender.

Accordingly, it is our request to Government of AP to avail the entire 9,000 MW Solar capacity to be set up during years 2024, 2025 and 2026 in tranches of 3000 MW each.

We at SECI believe that Manufacturing Linked 9,000 MW solar power would be apt and befitting alternative to GoAP's recent Tender and it would achieve all its stated objectives including costs & would be economically cheaper. Besides, AP will be supporting to the nation for development of indigenous manufacturing under "Atma Nirbhar Bharat Abhiyan".

We look forward to your favorable consideration and an early confirmation of the above offer.

This issues with the approval of competent authority.

Thanking you,

Yours faithfully,
for Solar Energy Corporation of India Limited


ISTS Waiver: As a special incentive, Government of India has granted ISTS charges waiver to solar projects set up under Solar Manufacturing tender for entire 25 years of PPA life, irrespective of their commissioning date, thus no such charges would be applicable on GoAP.

25 సంవత్సరాల పాటు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) చార్జీల నుంచి రాష్ట్రానికి మినహాయింపు కూడా ఇస్తామని లేఖలో తెలిపిన కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ

క్లుప్తంగా...

శంకర్‌నాయక్‌ను అరెస్టు చేయొద్దు

పోలీసులను ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్‌: భూ ఆక్రమణపై దాఖలైన కేసులో తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను అరెస్టు చేయవద్దని మహబూబాబాద్‌ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణ డిసెంబర్‌ 2లోగా కౌంటర్‌ దాఖలు చేయాలని చెప్పింది. అయితే దర్యాప్తు నిలిపివేయాలని తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వడం లేదని స్పష్టం చేసింది. హనుమకొండలోని హంటర్‌ రోడ్డు దుర్గాదేవికాలనీలో తమ స్థల ఆక్రమణకు శంకర్‌ నాయక్‌ ప్రయత్నం చేసినట్టు టీచర్‌ పద్మావతి ఈ నెల 20న ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తమపై దాడి చేసి, సెల్‌ఫోన్లు లాక్కున్నారని ఆరోపించారు. పోలీసులు తనపై తప్పుడు కేసు పెట్టారంటూ శంకర్‌నాయక్‌ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్‌ కె.లక్ష్మణ్‌ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్‌ తరఫున న్యాయవాది రమణారావు వాదనలు వినిపిస్తూ.. కావాలనే శంకర్‌నాయక్‌ను భూకబ్జా కేసులో ఇరికించారన్నారు. 25న మహబూబాబాద్‌లో జరగనున్న గిరిజన రైతు ధర్నాలో పాల్గొనకుండా చేసేందుకే ఈ కేసు నమోదు చేశారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి ఆదేశాల వరకు అరెస్టు చేయొద్దంటూ, విచారణ వాయిదా వేశారు.

కులగణన సర్వేను పకడ్బందీగా చేయాలి

ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం కులగణన సర్వేను మొక్కుబడిగా కాకుండా పకడ్బందీగా పూర్తి చేసి, బీసీ రిజర్వేషన్ల పెంపు ద్వారా చిత్తశుద్ధి నిరూపించుకోవాలని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్‌ చేశారు. బడుగు, బలహీన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. సమాజంలో అంతరాలను రూపుమాపేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా బీసీలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు పెంచాలన్నారు. శుక్రవారం తన నివాసంలో జరిగిన తెలంగాణ జాగృతి నాయకులు, ముఖ్యకార్యకర్తల సమావేశంలో కవిత మాట్లాడారు. కాగా, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌ పెంపుపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కులగణన డెడికేటెడ్‌ కమిషన్‌కు నివేదిక అందించాలని తెలంగాణ జాగృతి సంస్థ నిర్ణయించింది. రాష్ట్రంలో కులగణన, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపుపై కొన్ని నెలల క్రితం జాగృతి ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో రౌండ్‌ టేబుల్‌ సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాల్లో అందిన అభిప్రాయాలను క్రోడీకరించి తెలంగాణ జాగృతి నివేదిక రూపొందించింది. ఈ నివేదికను డెడికేటెడ్‌ కమిషన్‌కు కవిత సమర్పిస్తారు.

బీసీల రాజకీయ, ఆర్థిక వాటాకు ఢిల్లీని దిగ్బంధిస్తాం

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్‌




సాక్షి, హైదరాబాద్‌: బీసీలకు రాజకీయ, ఆర్థిక, విద్య, ఉపాధి అవకాశాల్లో అందాల్సిన సమాన వాటా కోసం ఢిల్లీని దిగ్బంధిస్తామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్‌ హెచ్చరించారు. రాజకీయాలను ఖరీదైన క్రీడగా మార్చి పేదల ఆశలను ఆవిరి చేస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్‌ మొదటి వారం నుంచి ఢిల్లీకి తమ పర్యటన ఉండబోతోందన్నారు. యువ నాయకులను, మహిళలను ఢిల్లీకి తీసుకెళ్లి వ్యూహాత్మకంగా బీసీల సత్తాను ఢిల్లీకోటకు చాటుతామని సురేశ్‌ చెప్పారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో అన్ని రాజకీయ పార్టీల పార్లమెంటరీ ప్రతినిధులను కూడగట్టుకొని బృహత్తరమైన ప్రణాళికను చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీల గణన, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌ కోటా, ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్ల రద్దు, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు తదితర అంశాలపై దేశంలోని రాజకీయ పార్టీలను ఏకంచేసి బలమైన ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు.

మరో 26 నియోజకవర్గాల్లో వైఐఐఆర్‌ఎస్‌సీ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్‌ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ స్కూల్స్‌ కాంప్లెక్స్‌ (వైఐఐఆర్‌ఎస్‌సీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతినిచ్చింది. దీంతో రెండో దశలో మరో 26 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మాణం చేపట్టనుంది. గతంలో మొదటి దశలో 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఈమేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రెండో దశలో ఏర్పాటు చేయనున్న వాటిలో బోధన్, పెద్దపల్లి, డోర్నకల్, సత్తుపల్లి, వైరా, కోదాడ, కొత్తగూడెం, నకిరేకల్, నాగార్జునసాగర్, తాండూర్, మక్తల్, రామగుండం, నారాయణపేట్, జుక్కల్, చొప్పదండి, కల్వకుర్తి ఉన్నాయి. అలాగే నిజామాబాద్‌ రూరల్, వనపర్తి, చేవెళ్ల, జగిత్యాల, వికారాబాద్, గద్వాల, ధర్మపురి, మెదక్, ఆర్మూర్‌ నియోజకవర్గాలున్నాయి.

కేసీ కెనాల్‌కు కృష్ణా నీరివ్వొద్దు



కృష్ణా ట్రిబ్యునల్‌-1 తీర్పునకు అది విరుద్ధం

కేసీ కాల్వకు తుంగభద్ర నుంచే కేటాయింపులు

- కృష్ణా జలాలివ్వాలన్న ఏపీ ప్రతిపాదనకు ఒప్పుకోం
- తుంగభద్ర బోర్డు భేటీలో తెలంగాణ అభ్యంతరం
- నావలి రిజర్వాయర్‌ నిర్మాణానికి అనుమతి కోరిన కర్ణాటక
- అది తెలంగాణకు నష్టమని వాదించిన రాష్ట్ర అధికారులు
- బోర్డు సమావేశంలో పలు అంశాలపై వాడీవేడి చర్చ

సాక్షి, హైదరాబాద్‌: కర్నూల్, కడప కాల్వ (కేసీ కెనాల్‌)కు కృష్ణా నది జలాలను వాడుకొనేందుకు అనుమతించాలన్న ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. కేసీ కాల్వకు తుంగభద్ర (టీబీ) నుంచి కేటాయింపులు ఉండగా.. కృష్ణానది నుంచి ఎలా వాడుకొంటారని ప్రశ్నించింది. కృష్ణా నది నుంచి కేసీ కాల్వకు కృష్ణా ట్రిబ్యునల్‌-1 ఎలాంటి కేటాయింపులు చేయలేదని తెలిపింది. శుక్రవారం తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు సమావేశం నిర్వహించారు. కేసీ కాల్వకు తుంగభద్ర జలాలకు బదులు కృష్ణా జలాలు వాడుకొనేందుకు అనుమతించాలని, తుంగభద్ర నుంచి అదనపు జలాలను తరలించేందుకు హెచ్‌ఎల్‌సీ కాల్వకు సమాంతరంగా మరో కాల్వ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఈ సమావేశంలో ఏపీ ప్రభుత్వం కోరింది. తుంగభద్ర జలాశయంలో పూడిక పేరుకుపోయినందున తమ రాష్ట్రంలోని నావలి వద్ద బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను తెలంగాణ అధికారులు తీవ్రంగా వ్యతిరేకించారు.

తుంగభద్ర నుంచే కృష్ణాకు నీళ్లు రావాలి

కృష్ణా ట్రిబ్యునల్‌-1 తీర్పు ప్రకారం తుంగభద్ర నుంచి కృష్ణా నదిలోకి నీటి లభ్యత ఉండాలని, కృష్ణా నుంచి తుంగభద్రకు కాదని తెలంగాణ అధికారులు స్పష్టంచేశారు. కృష్ణా ట్రి బ్యునల్‌-1 తీర్పునకు విరుద్ధమైన ఏపీ ప్రతిపాదనలను సాధారణ మెజారిటీతో ఆమోదించరాదని కోరారు. కేసీ కాల్వకు కృష్ణా జలాలు తరలించేందుకు అనుమతిస్తే.. ఆ కాల్వకు తుంగభద్రలో ఉన్న నీటివాటాను ఏపీలోని హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ కాల్వలకు మళ్లించుకోవాలనే ఆలోచనతో ఆ రాష్ట్రం ఈ ప్రతిపాదన తెరపైకి తెచ్చింది. అయితే అందుకు అనుమతిస్తే తమ రాష్ట్రానికి తీవ్ర నష్టం కలుగుతుందని తెలంగాణ అధికారులు వాదించారు. కృష్ణా జలాలను కేసీ కాల్వకు తరలించడంపై తాము లేవనెత్తిన అభ్యంతరాలపై కృష్ణా ట్రిబ్యునల్‌-2 విచారణ జరుపుతోందని, ఈ సమయంలో తుంగభద్ర బోర్డు ఎలాంటి నిర్ణయాలు తీసుకోరాదని కోరారు.

నావలి రిజర్వాయర్‌ కడితే మాకు నష్టం

తుంగభద్ర జలాశయంలో పూడిక చేరటంతో 30 టీఎంసీల నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని గుర్తించారు. దీంతో కర్ణాటకలోని నావలి వద్ద కొత్తగా బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌ నిర్మించి అదనపు నిల్వ సామర్థ్యం సృష్టిస్తామని ఆ రాష్ట్రం ప్రతిపాదించింది. తుంగభద్ర జలాశయం నుంచి వరద కాల్వ ద్వారా నావలి రిజర్వాయర్‌కు నీళ్ల తరలిస్తామని తెలిపింది. తుంగభద్ర జలాశయం నుంచి అదనపు జలాలను తరలించడానికి హెచ్‌ఎల్‌సీ కాల్వకు సమాంతరంగా మరో కాల్వను నిర్మిస్తామని, దాని ద్వారా కర్ణాటక కూడా నీరు తరలించుకొనేందుకు అనుమతిస్తామని ఏపీ ప్రభుత్వం మరో ప్రతిపాదన ముందుకు తెచ్చింది. అందుకు తెలంగాణ అభ్యంతరం తెలిపింది. తుంగభద్ర డ్యామ్‌ నుంచి వరద జలాలు, అదనపు జలాల వినియోగానికి కృష్ణా ట్రిబ్యునల్‌-1 తీర్పులో ఎలాంటి నిబంధన లేదని తెలంగాణ అధికారులు గుర్తుచేశారు. నావలి రిజర్వాయర్‌తోపాటు హెచ్‌ఎల్‌సీకి సమాంతర కాల్వను నిర్మిస్తే తుంగభద్ర నుంచి కృష్ణా నదిలోకి నీటి లభ్యత తగ్గిపోయి దిగువన ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేశారు. జలాశయాల్లో పూడిక తొలగింపునకు కేంద్రం ప్రకటించిన జాతీయ విధానాన్ని అనుసరించి తుంగభద్ర జలాశయంలో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్పిల్‌వే మాత్రమే పెంచాలి.. నిల్వ సామర్థ్యం కాదు

తుంగభద్ర జలాశయం స్పిల్‌వే ఎత్తు పెంచే అంశంపై కూడా తెలంగాణ అధికారులు తమ విధానాన్ని స్పష్టంచేశారు. ఇటీవల భారీ వరదలకు తుంగభద్ర డ్యామ్‌లోని ఒక గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో డ్యామ్‌ రక్షణ చర్యల్లో భాగంగా స్పిల్‌వే ఎత్తు పెంచాలని డ్యామ్‌ సేఫ్టీ రివ్యూ ప్యానెల్‌ (డీఆర్‌ఎస్‌పీ) సిఫారసు చేసింది. అయితే, గేట్లపై నుంచి నీళ్లు పొంగిపొర్లకుండా నివారించడానికి మాత్రమే జలాశయం స్పిల్‌వే ఎత్తును 30 మి.మీ. పెంచాలని డీఆర్‌ఎస్‌పీ సూచించిందని, జలాశయం నిల్వ సామర్థ్యం పెంపునకు కాదని తెలంగాణ అధికారులు స్పష్టంచేశారు.

6 నెలల్లో సైబర్‌ కమాండోలు



- ప్రాథమికంగా 452 మంది పోలీసుల ఎంపిక
- వీరికి డిసెంబర్‌లో ఐ4సీ జాతీయ స్థాయి పరీక్ష
- తుది పరీక్షలో రాష్ట్రం నుంచి 25 మందికే అవకాశం
- డిసెంబర్‌ మొదటి వారం నుంచి టీజీపీఏలో శిక్షణ

సాక్షి, హైదరాబాద్‌: పేట్రేగిపోతున్న సైబర్‌ నేరగాళ్లను అదుపు చేసేందుకు త్వరలోనే తెలంగాణలో సైబర్‌ కమాండోలు రంగంలోకి దిగనున్నారు. పోలీస్‌ శాఖలో అత్యాధునిక సాంకేతికత, సైబర్‌ నెట్‌వర్క్‌పై మంచి పట్టున్న 452 మంది ఉద్యోగులు, అధికారులను సైబర్‌ కమాండో శిక్షణ కోసం ప్రాథమికంగా ఎంపిక చేశారు. వీరి నుంచి మెరికల్లాంటి 25 మందిని మాత్రమే ఎంపిక చేసి సైబర్‌ భద్రతపై ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన మరో ఐదుమంది అధికారులు కూడా వీరితోపాటే శిక్షణ తీసుకొంటారు. మొత్తం 30 మందికి ట్రిపుల్‌ ఐటీ హైదరాబాద్‌ అత్యాధునిక సాంకేతికతతో కూడిన సైబర్‌ కమాండో శిక్షణ ఇస్తుంది. డిసెంబర్‌ మొదటి వారం నుంచి 6 నెలల పాటు శిక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకొన్న తర్వాత వీరు సైబర్‌ నేరాల కట్టడి విధుల్లోకి దిగుతారు. సైబర్‌ నేరాల కట్టడి, ఎథికల్‌ హ్యాకింగ్, భవిష్యత్‌ సైబర్‌ ముప్పులను గమనించడం సహా సైబర్‌ ఎకో సిస్టంను నెలకొల్పడం వీరి ప్రధాన కర్తవ్యం.

కఠిన పరీక్షల ద్వారా వడపోత..: సైబర్‌ కమాండోల ఎంపికను పకడ్బందీగా చేపడుతున్నారు. పోలీస్‌ శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్‌ నుంచి డీఎస్పీ స్థాయి అధికారి వరకు కంప్యూటర్, మ్యాథ్స్, ఇతర సైన్స్‌ సబ్జెక్టులు చదివిన వారిలో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మొత్తం 1,830 మంది ఈ పరీక్ష రాస్తే.. 452 మందిని రెండో దశకు ఎంపిక చేశారు. వీళ్లకు ఇండియన్‌ సైబర్‌ క్రైమ్‌ కోఆర్డినేషన్‌ సెంటర్‌ (ఐ4సీ) డిసెంబర్‌లో జాతీయ స్థాయిలో పరీక్ష నిర్వహిస్తుంది. అందులో నుంచి 25 మందిని ఎంపిక చేస్తారు. వీరితోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ఐదుగురిని కలిపి శిక్షణ ఇస్తారు. డిసెంబర్‌ మొదటివారం నుంచి ఆరు నెలలపాటు తెలంగాణ పోలీస్‌ అకాడమీలో శిక్షణ ఉంటుందని ఒక పోలీస్‌ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు.

ట్రిపుల్‌ ఐటీ హైదరాబాద్‌తో టీజీపీఏ ఎంఓయూ..: సైబర్‌ కమాండోల శిక్షణ కోసం ట్రిపుల్‌ ఐటీ హైదరాబాద్‌తో తెలంగాణ పోలీస్‌ అకాడమీ (టీజీపీఏ) అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో సైబర్‌ కమాండోలకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో శిక్షణ ప్రారంభమైంది. మొదటి బ్యాచ్‌లో దేశవ్యాప్తంగా 246 మంది సైబర్‌ కమాండోలకు ఐఐటీ మద్రాస్, ఐఐటీ కాన్పూర్, ట్రిపుల్‌ ఐటీ కొట్టాయం, ట్రిపుల్‌ ఐటీ నయారాయ్‌పూర్, రాష్ట్రీయ రక్ష యూనివర్సిటీ గాంధీనగర్, డిఫెన్స్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ అడ్వాన్స్‌డ్‌ టెక్నాలజీ పుణే, నేషనల్‌ ఫోరెన్సిక్‌ సైన్స్‌ యూనివర్సిటీ ఢిల్లీల్లో సైబర్‌ కమాండో ట్రైనింగ్‌ ఇస్తున్నాయి.

ఎవరీ సైబర్‌ కమాండోలు

సైబర్‌ ముప్పును ముందుగానే అంచనావేసి వాటిని ఎదుర్కొనేందుకు ప్రతి రాష్ట్ర పోలీస్‌ శాఖలో ప్రత్యేకంగా సైబర్‌ కమాండో విభాగం ఏర్పాటు చేయాలని ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన డీజీపీల సదస్సులో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సూచించారు. అందుకు అనుగుణంగా ప్రతి రాష్ట్రం సైబర్‌ కమాండోల శిక్షణ ప్రారంభిస్తోంది. దేశవ్యాప్తంగా రానున్న ఐదేళ్లలో కనీసం 5,000 మంది సైబర్‌ కమాండోలను రంగంలోకి దించాలని కేంద్ర హోంశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్‌ ఫోరెన్సిక్స్, ఇన్సిడెంట్‌ రెస్పాన్స్‌ అండ్‌ సెక్యూరింగ్‌ ఇన్ఫర్మేషన్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ టెక్నాలజీ (ఐసీటీ) అంశాల్లో ఈ సైబర్‌ కమాండోలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

'లగచర్ల ఘటనపై సీఎంకు నివేదిక ఇచ్చా'

పరిగి: లగచర్ల ఘటనపై పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక అందజేశారు. లగచర్ల రైతుల డిమాండ్లను సీఎంకు వివరించారు. భూసేకరణలో కోల్పోయే ఎకరా పొలానికి ప్రతిగా 150 గజాల స్థలం, రూ.15 లక్షల చొప్పున పరిహారంతో పాటుగా కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని రైతులు డిమాండ్‌ చేస్తున్నారని ముఖ్యమంత్రికి చెప్పారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, కేవలం తండా వాసులకు చెందిన భూములు మాత్రమే పోతాయంటూ బీఆర్‌ఎస్‌ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అధికారులపై దాడులు చేసేందుకు అమాయక రైతులను రెచ్చగొట్టారని అన్నారు. లగచర్లలో ఇండస్ట్రియల్‌ కారిడార్‌ మాత్రమే ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్‌ ఎంపీ మల్లు రవి, వ్యవసాయ కమిషన్‌ చైర్మన్‌ కోదండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డి కస్టడీ పిటిషన్‌పై తీర్పు 25కు వాయిదా

కొడంగల్‌: లగచర్ల దాడి ఘటనలో ఏ- 1గా ఉన్న కొడంగల్‌ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కస్టడీ పిటిషన్‌పై తీర్పును ఈ నెల 25వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కొడంగల్‌ కోర్టు పేర్కొంది. నరేందర్‌రెడ్డిని విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్‌ వేసిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం తీర్పు వెలువడాల్సి ఉండగా.. సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు జడ్జి ప్రకటించారని న్యాయవాదులు తెలిపారు.

నిపుణులతో నిర్వహించిన సమావేశంలో చర్చిస్తున్న హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌



చెరువుల పునరుజ్జీవం ఎలా?

ప్రత్యేక దృష్టి పెట్టిన హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌

- నిపుణులు, రిటైర్డ్‌ అధికారులతో భేటీ
- అనేక కీలక సూచనలు చేసిన వక్తలు

రాష్ట్ర రాజధానిలోని జలవనరుల పరిరక్షణకు గతానికి భిన్నంగా ముందుకు వెళుతున్న హైదరాబాద్‌ డిజాస్టర్‌ రెస్పాన్స్‌ అండ్‌ అసెట్‌ ప్రొటెక్షన్‌ ఏజెన్సీ (హైడ్రా) పర్యావరణ వేత్తలు, నిపుణులు, రిటైర్డ్‌ ఉన్నతాధికారులతో కలిసి పనిచేయనుంది. అందులో భాగంగా హైడ్రా కమిషనర్‌ ఏవీ రంగనాథ్‌ శుక్రవారం బుద్ధభవన్‌లోని తన కార్యాలయంలో మొదటి సమావేశం ఏర్పాటు చేశారు. 'నగర చెరువులు, నాలాల పునరుద్ధరణ, ఫుల్‌ ట్యాంక్‌ లెవల్‌ (ఎఫ్‌టీఎల్‌), సరిహద్దులు నిర్ధారణ'అనే అంశంపై జరిగిన సదస్సుకు దాదాపు 20 మంది వక్తలు హాజరయ్యారు. నగర పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు కీలక సూచనలు చేశారు.

- సాక్షి, హైదరాబాద్‌

ఇక్కడి విధానాలు విని అవాక్కయ్యారు

హైడ్రా బృందం ఇటీవల కర్ణాటకలో పర్యటించింది. అక్కడి కర్ణాటక ట్యాంక్‌ కన్జర్వేషన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ బోర్డు అధికారులతో భేటీ అయ్యింది. ఇక్కడ అమలులో ఉన్న విధానాలను చూసి వారు అవాక్కయ్యారు. అక్కడ చెరువుల్లో పట్టా భూమి అంటూ ఉండదు. మీ దగ్గర చెరువుల్లో ప్రైవేట్‌ భూమి ఎందుకు ఉంది? అని ఆ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఎఫ్‌టీఎల్‌కు బదులుగా వారు మ్యాగ్జిమం వాటర్‌ లెవల్‌ (ఎండబ్ల్యూఎల్‌) పరిగణనలోకి తీసుకుంటున్నారు. అమీన్‌పూర్‌ పెద్దచెరువుతోపాటు మరికొన్నింటి విషయంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌ జోన్ల శాస్త్రీయ నిర్ధారణ కష్టసాధ్యంగా మారింది. అన్ని శాఖల సమాచారంతో నిపుణుల కమిటీని వేసి చెరువుల హద్దులు నిర్ణయిస్తాం. అమీన్‌పూర్‌ చెరువు తూములు మూయడం వల్ల ఎగువన ఉన్న లేఔట్లు మునిగాయి. చెరువుల ఎఫ్‌టీఎల్‌ పట్టించుకోకుండా, సర్వే నంబర్లను మార్చేసి నిర్మించిన కట్టడాలనే కూల్చాం. అనుమతులు లేకుండా నిర్మిస్తే పెద్దవాళ్లవైనా, పేదలవైనా కూల్చక తప్పదు. మానవత్వం కోణంలో ఆలోచించి సమాజమంతా బాధపడుతుంది. అయితే కొన్ని చోట్ల మనసును చంపుకొని కూడా చేయాల్సి వస్తుంది. -రంగనాథ్, హైడ్రా కమిషనర్‌

చెరువు అనేది సామాజిక ఆస్తి మాత్రమే

చెరువు అనేది సామాజిక ఆస్తి. నగరాల్లో అర్బనైజేషన్‌ వల్లే చెరువులు దెబ్బతినడం మొదలైంది. రోడ్డు, రైల్వే ట్రాక్‌ నిర్మించడానికి తొలుత చెరువును పూడుస్తారు. వీటి వల్ల నీటి ప్రవాహం దిశ దెబ్బతింటుంది. ఆపై చెరువును అటు ప్రభుత్వంతోపాటు ఇటు ప్రైవేటు వారూ ఆక్రమించుకుంటారు. ప్రస్తుత తరుణంలో అర్బన్‌ హైడ్రాలజీ రీస్టోరేషన్‌ అనే అంశానికి ప్రాధాన్యం ఇస్తూ చర్యలు తీసుకోవాలి. మాస్టర్‌ ప్లాన్‌లో ఎక్కడా వాటర్‌ జోన్ల ప్రస్తావన లేదు. ఆయా విభాగాలు క్షేత్రస్థాయి వాస్తవాలు, పరిశీలన ఆధారంగా కాకుండా ఉపగ్రహ ఛాయాచిత్రాల ఆధారంగా మ్యాప్‌ తయారు చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది.

- నరసింహారెడ్డి, పర్యావరణవేత్త

ఒక చెరువు ఎఫ్‌టీఎల్‌ తగ్గితే 250 పక్షులు కనుమరుగే..

నగరాల్లో చిన్న తరహా నీటి పారుదల వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రస్తుతం ఇబ్బందులు వస్తున్నాయి. ఏదైనా ఒక చెరువు ఎఫ్‌టీఎల్‌ తగ్గిపోతే.. దాదాపు 250 పక్షులు కనుమరుగు అవుతాయి. పట్టణాలు, నగరాల్లో ఉండే ఇరిగేషన్‌ ఇంజనీర్లకు ప్రభుత్వం అర్బన్‌ హైడ్రాలజీ నేర్చుకొని, అమలు చేసే అవకాశం ఇవ్వట్లేదు.

- బీవీ సుబ్బారావు, పర్యావరణవేత్త

నగరంలో నాలా నెట్‌వర్క్‌ అత్యంత కీలకం

మునక సమస్య పోవాలంటే నగరంలో నాలా నెట్‌వర్క్‌ చాలా కీలకం. కొన్ని సందర్భాల్లో వర్షపు నీటిని ఇక్కడి డ్రైనేజీలే కాదు మూసీ కూడా తట్టుకోలేకపోతోంది. నాలాలన్నీ ఆక్రమణలు, నిర్మాణాలతో నిండిపోయాయి. గ్రామాల్లో వర్షపునీటిలో అత్యధికం భూమిలోకి ఇంకిపోతుంది. నగరంలో మాత్రం 95 శాతం ప్రవహిస్తూ బయటకు వెళ్లాల్సిందే. గృహ, మానవ వ్యర్థాలకు, వర్షపు నీటికి వేర్వేరు డ్రైనేజీ వ్యవస్థలు ఉండాలి.

- పీజీ శాస్త్రి, ఎన్‌ఐటీ మాజీ డైరెక్టర్‌

రెండు సెంటీమీటర్ల వర్షాన్నే తట్టుకోగలవు

అందుబాటులో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ గంటకు 2 సెంటీమీటర్ల వర్షపాతాన్ని మాత్రమే తట్టుకోగలరు. వీటిని పూర్తి స్థాయిలో విస్తరించాలంటే రూ.లక్ష కోట్లు ఖర్చుతో పాటు పరిహారానికీ కేటాయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎస్‌ఎన్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా సమాంతర డ్రెయిన్‌ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. - కిషన్, ఎస్‌ఎన్‌డీపీ మాజీ చీఫ్‌ ఇంజనీర్‌

తెలంగాణ తల్లి విగ్రహ పనులను పరిశీలించిన సీఎం



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ సచివాలయం లోపల నిర్మిస్తున్న తెలంగాణ తల్లి విగ్రహ పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అక్కడి నుంచి తెలంగాణ తల్లి విగ్రహం ముందు ఏర్పాటు చేస్తున్న ల్యాన్, లైట్లు, నిర్మాణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విగ్రహ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. విగ్రహం ముందు ఏర్పాటు చేస్తున్న ఫౌంటేన్‌ వరకు నడుచుకుంటూ వెళ్లి పనులను పర్యవేక్షించారు. డిసెంబర్‌ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. కాగా, అక్కడ పని చేస్తున్న కూలీలతో సీఎం ముచ్చటించారు. ఎక్కడి నుంచి వచ్చారు? జీతాలు టైంకు ఇస్తున్నారా అని సీఎం ఆరా తీసినట్లు తెలిసింది.

అదానీతో ఒప్పందాల్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలి



బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ డిమాండ్‌

- ఒప్పందాల రద్దుకు ప్రభుత్వాన్ని రాహుల్‌ గాంధీ ఆదేశించాలి
- వాటి వెనుక డిస్కంల ప్రైవేటీకరణ కుట్ర ఉందని భావిస్తున్నాం
- స్కిల్స్‌ వర్సిటీకి అదానీ రూ. 100 కోట్ల విరాళాన్ని వెనక్కివ్వాలి

సాక్షి, హైదరాబాద్‌: అదానీ కంపెనీతో చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసుకోవాలని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె. తారక రామారావు డిమాండ్‌ చేశారు. కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే ఆ ఒప్పందాలను రద్దు చేసుకొనేలా రేవంత్‌ ప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు. అలాగే స్కిల్స్‌ యూనివర్సిటీకి అదానీ గ్రూప్‌ ఇచ్చిన రూ. 100 కోట్ల విరాళాన్ని సైతం ప్రభుత్వం వెనక్కి ఇచ్చేయాలని హితవు పలికారు. బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద్, డాక్టర్‌ సంజయ్, మండలిలో విపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌ రెడ్డితో కలిసి కేటీఆర్‌ శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణతో పోలిస్తే తక్కువ తలసరి ఆదాయంగల దేశమైన కెన్యా అదానీతో వ్యాపార ఒప్పందాలను రద్దు చేసుకుంది. రేవంత్‌ ప్రభుత్వం అదానీ గ్రూప్‌తో రూ. 12,400 కోట్ల మేర ఒప్పందాలు చేసుకున్నా అదానీతో ప్రధాని దోస్తీని అనునిత్యం విమర్శించే రాహుల్‌ గాంధీ స్పందించలేదు. అదానీతో దేశానికి నష్టమని చెబుతున్న కాంగ్రెస్‌ పార్టీ.. రేవంత్‌ ఒప్పందాలు తెలంగాణకు ఏ విధంగా మేలు చేస్తాయో చెప్పాలి'అని కేటీఆర్‌ డిమాండ్‌ చేశారు.

బడే భాయ్‌ ఆదేశాలతోనే రెడ్‌ కార్పెట్‌

'బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో అడుగుపెట్టేందుకు అదానీ ప్రయత్నించినా ఒప్పందాలేవీ చేసుకోలేదు. కానీ కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీ అవినీతిపరుడిగా ముద్ర వేసిన వ్యక్తి (అదానీ)కే రేవంత్‌ ప్రభుత్వం రెడ్‌కార్పెట్‌ పరిచింది. బడే భాయ్‌ ఆదేశాలతోనే రాష్ట్రంలో రూ. 12,400 కోట్ల ఒప్పందాలను కాంగ్రెస్‌ ప్రభుత్వం కుదుర్చుకుంది. తెలంగాణ డిస్కంలను అదానీకి అప్పగించి ప్రైవేటీకరణకు కుట్ర చేసింది. యాదాద్రి జిల్లా రామన్నపేటలో సిమెంట్‌ పరిశ్రమ ఏర్పాటుకు తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణకు ప్ర యత్నించింది. అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభు త్వం చేసుకున్న ఒప్పందాల వెనుక కుట్ర ఉందని భావిస్తున్నాం. రేవంత్‌ తన నివాసంలో అదానీతో 4 గంటలపాటు సమావేశమై ఆయన వ్యాపార సామ్రాజ్యానికి స్వాగతం పలుకుతున్న సంగతి కాంగ్రెస్‌ అధిష్టానానికి తెలియదా? రేవంత్‌ ప్రభుత్వం రూ. 100 కోట్ల విరాళం రాహుల్‌ గాంధీకి తెలిసే తీసుకుందో లేదో వెల్లడించాలి. అదానీ వ్యవహారంలో కాంగ్రెస్‌ ఢిల్లీలో ఒక విధానం.. గల్లీలో మరో విధానం అనుసరిస్తోంది. అదానీతో రేవంత్‌రెడ్డి దందాను రాహుల్‌ గాంధీ సమర్థిస్తున్నారా?'అని కేటీఆర్‌ ప్రశ్నించారు.

అదానీతో పొంగులేటి భేటీ మర్మమేంటి?

'కోహినూర్‌ హోటల్‌లో అదానీతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమావేశం గురించి వివరణ ఇవ్వాలి. బీజేపీ వాషింగ్‌ మెషీన్‌లో పునీతులయ్యేందుకు ఆయన అదానీతో సమావేశమయ్యారా? బాంబుల శాఖ మంత్రి పొంగులేటి అదానీతో కాళ్ల బేరం చేసుకున్నాడో లేదో చెప్పాలి. కేసీఆర్‌ పదేళ్ల పాలనలో సృష్టించిన సంపదను రేవంత్‌ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారు. కాంగ్రెస్‌ పార్టీ అదానీని గజదొంగ అంటూనే తెలంగాణలో గజమాలతో స్వాగతం పలుకుతోంది. ఈ వ్యవహారంలో దేశ ప్రతిష్ట మంటగలిసినా బీజేపీ నోరు విప్పడం లేదు. సీఎం ప్రతి సమావేశంలో సొల్లు పురాణం మొరుగుతున్నా మేము అంశాలపైనే మాట్లాడతాం. అదానీతో ఒప్పందాలపై మా ప్రశ్నలకు కాంగ్రెస్‌ సమాధానం చెప్పాలి' అని కేటీఆర్‌ డిమాండ్‌ చేశారు.

గుంట భూమి కూడా అదానీకి ఇవ్వలేదు



టీపీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌

- అదానీ అక్రమాల్లో ప్రధాని మోదీకి కూడా భాగం ఉంది
- స్కిల్స్‌ వర్సిటీకి కేటీఆర్‌ రూ.50 కోట్లు ఇచ్చినా తీసుకుంటాం

సాక్షి, హైదరాబాద్‌: అదానీకి తెలంగాణలో గుంట భూమి కూడా ఇవ్వలేదని, చట్టబద్ధంగా వ్యాపారం చేసేందుకు ఎవరు ముందుకొచ్చినా వారిని ప్రోత్సహించడంలో తప్పేమీ లేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ వ్యాఖ్యానించారు. స్కిల్స్‌ యూనివర్సిటీ కోసం అదానీ రూ.100 కోట్లు ఇచ్చారని, వర్సిటీల అభివృద్ధి కోసం ఇచ్చే వితరణను స్వీకరించడంలో తప్పేముంటుందని ప్రశ్నించారు. స్కిల్స్‌ వర్సిటీకి బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ రూ.50 కోట్లు ఇచ్చినా తీసుకుంటామని అన్నారు. అదానీ అక్రమాల్లో ప్రధాని మోదీకి కూడా భాగం ఉందని, అందుకే ఈ వ్యవహారంపై ఆయన నోరు మెదపడం లేదని ఆరోపించారు. అదానీని వెంటనే అరెస్టు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఎంపీలు సురేశ్‌ షెట్కార్, అనిల్‌కుమార్‌ యాదవ్, ఎమ్మెల్సీ ఆమేర్‌ అలీ ఖాన్, కాంగ్రెస్‌ నేతలు మోహన్‌రెడ్డి, చరణ్‌ కౌశిక్‌ యాదవ్, నిజాముద్దీన్, కేతూరి వెంకటేశ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

జేపీసీ ఏర్పాటు చేయాలి

అదానీ న్యాయబద్ధంగా ప్రభుత్వంతో వ్యాపార ఒప్పందాలు చేసుకుంటే తమకేమీ అభ్యంతరం ఉండదని మహేశ్‌గౌడ్‌ చెప్పారు. దుబాయ్‌లో నేరం చేస్తే ఇక్కడ నేరం చేసినట్టు కాదు కదా అని ప్రశ్నించారు. అదానీ అక్రమాలపై జాయింట్‌ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేయాలని, జేపీసీ ఇచ్చే నివేదిక ప్రకారం ప్రభుత్వం ముందుకెళుతుందని అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ, అంబానీల ఆస్తులు వందల రెట్లు పెరిగిపోయాయని ఆరోపించారు.

మంత్రితో ముఖాముఖి దరఖాస్తుల పరిశీలన

టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను శుక్రవారం మహేశ్‌గౌడ్‌ పరిశీలించారు. శాఖల వారీగా ఆ దరఖాస్తులను ఎలా పంపుతున్నారో సమీక్షించారు. ఎక్కడా జాప్యం లేకుండా సంబంధిత శాఖలకు దరఖాస్తులు పంపాలని, దరఖాస్తుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు.



మంత్రిగారి నృత్యోత్సాహం

నల్లగొండ: నల్లగొండ ఎన్‌జీ కళాశాల మైదానంలో శుక్రవారం రాత్రి ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్యం చేసిన కళాకారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా స్టెప్పులేయగా.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేరింతలు కొట్టారు.

‘ఉత్తర రింగు’ @ రూ.16,800 కోట్లు

- రోడ్డు నిర్మాణ ఖర్చు రూ.8,100 కోట్లు... పరిహారానికి రూ.5,400 కోట్లు
- తాజాగా అంచనా వేసిన ఎన్‌హెచ్‌ఏఐ
- నిర్మాణ సమయం నాటికి అంచనాలు మరింత పెరిగే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగానికి దాదాపు రూ.16,800 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా నిర్ధారించారు. తాజాగా ఈ భాగం రోడ్డు నిర్మాణానికి కన్సల్టెన్సీ సేవలందిస్తున్న ప్రైవేట్ సంస్థ రూపొందించిన టెండర్ డాక్యుమెంట్‌ను ఇటీవలే ఎన్‌హెచ్‌ఏఐకి అందజేయగా, దాని ఆధారంగా ఈ లెక్క తేల్చారు. దీని ఆధారంగా త్వరలో ఎన్‌హెచ్‌ఏఐ డీపీఆర్ సిద్ధం చేయనుంది. నిర్మాణ పనులు ప్రారంభం కావటానికి ఇంకా ఆరేడునెలల సమయం ఉన్నందున, అప్పటికి ఉండే మార్కెట్ ధరల ఆధారంగా ఈ అంచనాలు మరికాస్త పెరగొచ్చు.

రోడ్డు నిర్మాణం ఇలా...

దాదాపు 162 కి.మీ. నిడివితో ఉండే రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణ పనుల(సివిల్ కాస్ట్)కు రూ.8,100 కోట్లు ఖర్చు అవుతుందని ప్రస్తుత మార్కెట్ ధరల ఆధారంగా రూపొందించిన అంచనా స్పష్టం చేస్తోంది. మొదట నాలుగు వరుసలకు.. ఒక్కో కి.మీ.కు దాదాపు రూ.50 కోట్ల వరకు వ్యయం చేయాల్సి ఉంది. ఈ రోడ్డు 5 మీటర్ల ఎత్తుతో ఉండేలా డిజైన్ చేయడంతో నిర్మాణ వ్యయం అధికంగా ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ప్రతి కి.మీ. నిడివికి ఒకటి చొప్పున కల్వర్టు, అండర్‌పాస్, ఫ్లైఓవర్.. ఇలా ఏదో ఓ నిర్మాణం ఉంటుంది. దీంతో ఖర్చు భారీగా అవుతుంది. కనీసం 10 అడుగుల ఎత్తు అప్రోచ్‌తో అండర్‌పాస్‌లను నిర్మిస్తారు.

భూసేకరణకు....

ఈ భాగం రోడ్డుకు సంబంధించి 2 వేల హెక్టార్ల భూమిని సేకరిస్తున్నారు. దీనికి పరిహారంగా దాదాపు రూ.5,400 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని తేల్చారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం సగం భరించనుంది. ప్రస్తుతానికి నాలుగు వరుసల రోడ్డే నిర్మిస్తున్నా, భవిష్యత్‌లో దానిని 8 లేన్లకు విస్తరిస్తారు. అందుకు వీలుగా ఇప్పుడే భూసేకరణ చేపట్టారు.

- ఈ అలైన్‌మెంటులో సేకరించాల్సిన భూముల్లో దాదాపు 80 హెక్టార్ల అటవీ భూములున్నాయి. అటవీశాఖకు పరిహారంగా మరోచోట భూమిని కేటాయించటంతోపాటు, ఆ భూమిలో మొక్కల పెంపకానికి అయ్యే వ్యయం కూడా చెల్లిస్తారు. సేకరించిన భూమిలో తొలగించే చెట్లకు విలువ కట్టి చెల్లిస్తారు. ఈ అటవీ భూముల్లో దాదాపు 20 హెక్టార్ల భూములు కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయి. వారిలో నిరుపేదలున్నందున వారిపేరిట గతంలో పట్టాలు కూడా జారీ అయ్యాయి. అలా పట్టాలు పొందిన వారికి లెక్క ప్రకారం పరిహారం చెల్లించాల్సి వస్తుందని తేల్చారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరి హత్య

- గొడ్డళ్లతో నరికి చంపిన మావోయిస్టులు
- మృతదేహాలతో ఆదివాసీ సంఘాల నేతలు, గిరిజనుల ఆందోళన
- మృతుల్లో ఒకరు పంచాయతీ కార్యదర్శి
- ములుగు జిల్లాలో ఘటన



వాజేడులో ఆందోళన నిర్వహిస్తున్న ఆదివాసీసంఘాల నేతలు, గిరిజనులు

వాజేడు: పోలీసులకు తమ సమాచారం ఇస్తున్నారనే నెపంతో మావోయిస్టులు గురువారం రాత్రి ఇద్దరు గిరిజనులను గొడ్డళ్లతో నరికి దారుణంగా హత్య చేశారు. ములుగు జిల్లా వాజేడు పోలీసు స్టేషన్‌కు సుమారు అరకిలో మీటరు దూరంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. వాజేడు మండల పరిధి బాలలక్ష్మీపురం (పెనుగోలు కాలనీ) గ్రామంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఉయిక అర్జున్ (38) ఇంటికి ముగ్గురు మావోయిస్టులు వచ్చారు. వారు అర్జున్‌ను ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చి ఆరుబయట గొడ్డళ్లతో నరికారు. అదే సమయంలో మరో ముగ్గురు మావోయిస్టులు ఉయిక రమేశ్ (38) ఇంటికి వెళ్లి మంచంపై పడుకున్న రమేశ్‌ను గొడ్డళ్లతో నరికి వెళ్లిపోయారు. రమేశ్ కొన ఊపిరితో ఉండగా స్థానికులు ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం చేస్తుండగానే అతను చనిపోయాడు. పేరూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రమేశ్‌కు భార్య రాంబాయి, ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉండగా, అర్జున్‌కు భార్య సావిత్రి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతులిద్దరూ వరుసకు అన్నదమ్ములు. మృతదేహాలను ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పశువులు కాయడానికి అడవుల్లోకి వస్తున్న అర్జున్ తమ దళాల సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడని, ఇతనితోపాటే ఉయిక రమేశ్ కూడా పోలీసులకు తమ సమాచారం ఇస్తున్నాడని వాజేడు, వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో ఘటనాస్థలంలో వదిలిన రెండు లేఖల్లో మావోయిస్టులు పేర్కొన్నారు.



రమేశ్



అర్జున్

అమాయకులను హత్య చేశారు

ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేసిన ఉయిక రమేశ్, ఉయిక అర్జున్ కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం రాత్రి వాజేడు మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాలు, గిరిజనులు, గ్రామ పంచాయతీ సిబ్బంది రాస్తారోకో నిర్వహించారు. ఆసుపత్రి నుంచి మృతదేహాలను తీసుకు వచ్చిన అంబులెన్స్‌ను అడ్డుగా పెట్టి పెనుగోలు కాలనీకి వెళ్లే దారి వద్ద వాజేడు, వెంకటాపురం (కె) రహదారిపై ధర్నాకు దిగారు. ఇన్‌ఫార్మర్ ముద్ర వేసి అమాయక గిరిజనులను మావోయిస్టులు అన్యాయంగా చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రమేశ్ భార్యకు నెలరోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూడటంతోపాటు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల ఆర్థిక సాయాన్ని అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు ఏటూరునాగారం ఆసుపత్రిలో మృతదేహాలను పరిశీలించారు.

జంతు దాడుల పరిహారం రూ. 20 లక్షలకు పెంపుపై కసరత్తు

అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ గవర్నింగ్ బాడీ భేటీలో మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: వన్యప్రాణుల దాడుల ఘటనల్లో మరణించిన వారికి ఇచ్చే నష్టపరిహారాన్ని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక పరిహారాన్ని రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని ఆమె గుర్తుచేశారు. శుక్రవారం అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ గవర్నింగ్ బాడీస్ సమావేశంలో సురేఖ మాట్లాడుతూ అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ల పరిధిలోని గ్రామాల తరలింపు ప్రక్రియ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉన్నందున వారిలో విశ్వాసాన్ని కల్పిస్తూ పునరావాస ప్రక్రియను చేపట్టాలని అధికారులకు సూచించారు. పునరావాసం కోసం తరలించిన కుటుంబాలకు శాశ్వత పట్టాలు అందించాలని, రాకపోకల నిమిత్తం గ్రీన్ పాసులు అందించాలని, స్కూల్ ఏర్పాటు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు మంత్రిని కోరారు. కాగా, దోమలపెంట–శ్రీశైలం ఎకో టూరిజం సర్క్యూట్‌లో భాగంగా అక్కమహాదేవి గుహలను సందర్శించే భక్తులకు యాత్రా సౌకర్యాల కల్పనకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని మంత్రి సురేఖ ఆదేశించారు. సలేశ్వరం జాతరను భవిష్యత్తులో చేపట్టనున్న సర్క్యూట్‌లలో చేర్చి యాత్రా సౌకర్యాలను కల్పించే దిశగా కార్యాచరణ చేపట్టాలన్నారు.

ఆస్పత్రుల్లో ఔషధ కొరత ఉండొద్దు

- ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలి
- ఔషధాల సప్లై మొత్తం ఆన్‌లైన్ చేయాలి
- వారంలోగా 22 సెంట్రల్ మెడిసిన్ స్టోర్లు
- ఫుడ్‌సేఫ్టీపై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సర్కారు ఆస్పత్రుల కోసం కొనుగోలు చేసే మెడిసిన్ ఇండెంట్ నుంచి అవి రోగికి చేరేవరకు పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌ను మూడు దశలుగా విభజించి, ప్రతి దశకు ఒక అధికారిని బాధ్యులుగా నియమించాలని తెలిపారు. సెంట్రల్ మెడికల్ స్టోర్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫార్మసీల బలోపేతం, ఫుడ్ సేఫ్టీ అంశాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటు చేస్తున్న 22 సెంట్రల్ మెడిసిన్ స్టోర్ల పనులను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ‘ఈ ఔషధి’పోర్టల్ వినియోగంపై ఫార్మసిస్టులకు వర్క్‌షాపు నిర్వహించాలని సూచించారు. అవసరమైన ఔషధాల కోసం టీజీఎంఎస్‌ఐడీసీకి సకాలంలో ఇండెంట్ పెట్టాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లోని ఫార్మసీల్లో ఏయే ఔషధాలు అందుబాటులో ఉన్నాయనేది ప్రజలు తెలుసుకొనేలా అక్కడ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాల్లో మందుల సరఫరాకు డిప్యూటీ డీఎంహెచ్‌వోలను ఇన్‌చార్జీలుగా నియమించాలని ఆదేశించారు.

ఫుడ్ సేఫ్టీపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ఫుడ్‌సేఫ్టీలో హైదరాబాద్ నగరం దేశంలోనే చిట్టచివరి స్థానంలో ఉందని జరుగుతున్న ప్రచారంపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. 2022 నాటి డేటాతో కొందరు ఇప్పుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలపటంతో.. ఫుడ్ సేఫ్టీ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. నెల రోజుల్లో 5 కొత్త మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకు 4,366 హోటళ్లు, హాస్టళ్లు, స్ట్రీట్‌ఫుడ్ స్టాల్స్‌ను అధికారులు తనిఖీ చేశారని, నిబంధనలు పాటించని 566 సంస్థలపై కేసులు నమోదు చేయడంతో పాటు, రూ.66 లక్షల జరిమానా విధించామని తెలిపారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ విభాగం అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకు చలో ఢిల్లీ

పంజగుట్ట (హైదరాబాద్): బీసీ ఉద్యమాన్ని జాతీయస్థాయిలో విస్తరించేందుకు, హక్కుల సాధనకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 5, 6 తేదీల్లో ఢిల్లీలో రెండు రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆయన వివిధ బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిసెంబర్ 5వ తేదీన ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా, 6వ తేదీన సుమారు 29 పార్టీల నేతలతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల తదితరులు

సిగరెట్ తాగొద్దన్నందుకు ఆత్మహత్య

- టెన్త్ విద్యార్థి అఘాయిత్యం



వెంకటేశ్

కోనరావుపేట(వేములవాడ): సిగరెట్ తాగొద్దని తల్లిదండ్రులు మందలించినందుకు పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన అలువాల శ్రీనివాస్, అంజవ్వ దంపతులకు ఇద్దరు కొడుకులు. రెండో కొడుకు వెంకటేశ్ (16) గ్రామంలోని హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల వెంకటేశ్ సిగరెట్ తాగుతుండగా గమనించిన తల్లిదండ్రులు మందలించారు. దీంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. కుటుంబ సభ్యులు చికిత్స చేయించడంతో కోలుకున్నాడు. అప్పటి నుంచి ఎవ్వరితో సరిగ్గా మాట్లాడకుండా దిగాలుగా ఉంటున్నాడు. తల్లిదండ్రులు మందలించారన్న విషయాన్ని మనసులో పెట్టుకొని శుక్రవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుని తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదుతో ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆచూకీ


సీమా దేవి
సుమన్ హుడా

● తొమ్మిది నెలలు... 104 మంది పిల్లలు

'సెర్చ్' ఇంజన్లీ అమ్మలు

'ఈ పిల్లల ఆచూకీ మీరు కనిపెట్టాలి' అని పై అధికారి ఆదేశించారు. 'అలాగే సార్' అనడమే కాదు 'ఎలాగైనా సరే' అనుకున్నారు మనసులో. ఢిల్లీలోని యాంటీ-హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్స్ సీమా దేవి, సుమన్ హుడా ఒక్కరు కాదు... ఇద్దరు కాదు రకరకాల కారణాలతో కనిపించకుండా పోయిన 104 మంది పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఒక ప్రాంతంలో...

'అయ్యా... నా కొడుకు వారం రోజుల నుంచి కనిపించడం లేదు...'

'ఫోటో ఉందా?

'లేదయ్యా'

మరో ప్రాంతంలో...

'మా అమ్మాయి కనిపించడం లేదు సారూ... ఎక్కడెక్కడో వెదికాం...'

ఢిల్లీ, ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాలలో కనిపించకుండా పోయిన పిల్లల సంఖ్య 104 ఆ పేద తల్లిదండ్రులలో చాలామంది దగ్గర కనీసం తమ పిల్లల ఫొటోలు కూడా లేవు. కొందరు 'మా పిల్లలు ఇలా ఉంటారు' అని పోలికలు చెప్పేవారు.

కొందరి దగ్గర ఫొటోలు ఉన్నా అవి అవుట్‌డేటెడ్ ఫొటోలు.. ఇలాంటి ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో 'ఆపరేషన్ మిలాప్' తెర మీదికి వచ్చింది. ఈ ఆపరేషన్‌ను సీమా దేవి, సుమన్ హుడా సవాలుగా తీసుకున్నారు. ఢిల్లీలో పనిచేస్తున్న ఈ కానిస్టేబుల్స్ ఎలాగైనా సరే కనిపించకుండా పోయిన పిల్లలను తిరిగి తల్లిదండ్రులకు అప్పగించాలనుకున్నారు. అదెంత కష్టమో వారికి తెలియనిది కాదు.

అయినా సరే, రంగంలోకి దిగారు. ప్రతి కేసును సవాలుగా తీసుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, హరియాణాలో ఊరూ వాడా వెదికారు.

కొన్ని సందర్భాలలో బాధితులకు పోలీసులు మాట్లాడే భాష అర్థం కాకపోయేది. పిల్లలను చివరిసారిగా గుర్తించిన ప్రాంతాల్లోని స్థానికులు పోలీసులతో మాట్లాడేందుకు నిరాకరించేవారు. ఇలాంటి సవాళ్లు ఎన్నో ఎదురైనా వెనకడుగు వేయలేదు. సైబర్ టీమ్ సహాయం కూడా తీసుకున్నారు.

ఎట్టకేలకు వారి కష్టం ఫలించింది. తప్పిపోయిన 104 మంది పిల్లలను తొమ్మిది నెలల కాల వ్యవధిలో వారి తల్లిదండ్రులకు అప్పగించడంలో సీమాదేవి, సుమన్ హుడాలు విజయం సాధించారు.

ఈ పిల్లలు కనిపించకుండా పోవడానికి ఇంట్లో నుంచి పారిపోవడం నుంచి సోషల్ మీడియాలో పరిచయం అయిన వారి మాటలు నమ్మి వెళ్లిపోవడం వరకు ఎన్నో కారణాలు ఉన్నాయి. కొత్త ప్రాంతాలకు ఇన్వెస్టిగేషన్ కోసం వెళ్లినప్పుడు స్థానికులు సీమాదేవి, సుమన్‌లను అనుమానంగా చూసేవాళ్లు. 'మీరు నిజంగా పోలీసులేనా?' అని అడిగేవారు. వారిలో నమ్మకం రావడానికి కాస్త టైమ్ పట్టేది. అయినా ఓపికగా ఎదురు చూసేవారు.

స్థానికులలో నమ్మకం వచ్చాక... ఇంటింటికి వెళ్లి వెదికేవారు.

చెత్త ఏరే పిల్లల నుంచి మొదలు రైల్వే స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది వరకు ఎంతో మంది నుంచి ఎన్నో రకాల క్లూలు సేకరించేవారు.

'ఇంతమంది పిల్లలను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చినందుకు చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. మాకు ఫిక్స్‌డ్ డ్యూటీ టైమింగ్స్ ఉండేవి కావు. తప్పిపోయిన పిల్లల గురించి ఏ చిన్న సమాచారం అందినా వెంటనే ఇంటి నుంచి బయలుదేరేవాళ్లం. కనిపించకుండా పోయిన పిల్లల్ని వెదకడంలో మా పిల్లల్ని చూసుకోవడం కుదిరేది కాదు. అయినా బాధ పడలేదు' అంటుంది సీమాదేవి.

'రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల ఎన్నో కిలోమీటర్‌ల దూరం నడవాల్సి వచ్చేది. బాగా అలిసిపోయేవాళ్లం' అంటుంది సుమన్ హుడా.

తొమ్మిది నెలల కాలంలో వారు ఇల్లు విడిచి, కుటుంబాన్ని విడిచి ఎన్నో కష్టాలు పడ్డారు. అయితే... కృతజ్ఞతతో నిండిన పిల్లల తల్లిదండ్రుల కళ్ల నుంచి వచ్చిన ఆనంద బాష్పాలను చూసిన తరువాత ఆ కష్టాలేవీ ఇప్పుడు వారికి గుర్తుకు రావడం లేదు.

ఇంటింటికి సౌర సిరులు

మనకు సూర్యుడున్నాడు. వద్దన్నా రోజూ ఉదయిస్తాడు. సిస్టమ్ ఉంటే పవర్‌ఫుల్‌గా పనిచేస్తాడు. కరెంట్ కష్టాలకు చెల్లు చీటి ఇస్తాడు.


రాధికా చౌదరి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఘనంగా 75 ఏళ్ల ఉత్సవాలను కూడా చేసుకున్నాం. కానీ ఇప్పటికీ దేశంలో కరెంటు దీపం వెలగని గ్రామాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పాడేరు, చుట్టుపక్కల గ్రామాలు కూడా.

ఇలాంటి గ్రామాల్లో వెలుగులు నింపారు ఈ హైదరాబాద్ ఇంజనీర్. వాహనం వెళ్లడానికి దారి లేని పాడేరు కొండలను కాలినడకన చుట్టి వచ్చిన రాధికా చౌదరి అక్కడి యాభై గ్రామాల్లో సౌరశక్తితో దీపాలు వెలిగించారు. కోటి ఇళ్లకు సౌర వెలుగులను అందించాలనే కేంద్రప్రభుత్వ నిర్ణయంలో భాగంగా ఆమె నాలుగు లక్షల ఇళ్లకు సర్వీస్ అందించారు. సోలార్ ఎనర్జీలో కెరీర్‌ని నిర్మించుకున్న రాధిక... పీఎం సూర్య ఘర్ యోజన పథకం ద్వారా లబ్ధి పొందమని సూచిస్తున్నారు.

మూడు తర్వాత బయటకు రారు

పాడేరు కొండల్లో నివసించే ఆదివాసీలు మధ్యాహ్నం మూడు గంటల తర్వాత బయటకు రారు. బయటకు వెళ్లిన వాళ్లు సూర్యుడు అస్తమించే లోపే తిరిగి ఇల్లు చేరాలి కాబట్టి మధ్యాహ్నం మూడు తర్వాత ఇల్లు కదలేవాళ్లు కాదు. అలాంటి వాళ్లకు సౌరశక్తితో దీపం వెలుతురును చూశారు. మన పాడేరు వాసులే కాదు, కశ్మీర్‌లోయలోని లధాక్, లే ప్రాంతాలు కూడా సౌర వెలుగును చూశాయి. కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ జిల్లాలతో సహా మొత్తం 27 రాష్ట్రాల్లో 50 పట్టణాల్లో సేవలు అందించారామె.

సోలార్ ఉమన్

రాధికకు యూఎస్‌లో ఎమ్ఎస్ న్యూక్లియర్ ఇంజనీరింగ్‌లో ఫ్రీ సీట్ వచ్చింది. సోలార్ పవర్‌తో శాటిలైట్‌లను పనిచేయించడం అనే అంశంలో కోర్సు చేయడానికి నాసా స్పాన్సర్ చేసింది. యూఎస్‌లో కొంత కాలం విండ్ ఎనర్జీలో ఉద్యోగం, మరి కొన్నేళ్లు స్వీడిష్ కంపెనీకి పని చేశారామె. ఆల్టర్నేటివ్ ఎనర్జీ సెక్టార్‌లో అడుగు పెట్టడం నుంచి సోలార్ పవర్ విభాగంలో పని చేయడంలో ఆసక్తి పెంచుకున్నారు రాధిక. ఇండియాలో సర్వీస్ ఇచ్చే అవకాశం రాగానే 2008లో ఇండియాకి వచ్చేశారు. ఆ తర్వాత ఆరేళ్లకు సోలార్ ఎనర్జీలో పని చేసిన సౌరవ్‌తో కలిసి ఫ్రేయర్ ఎనర్జీ ప్రారంభించారు. "నలుగురు వ్యక్తులం, ఓ చిన్న గది. ఆరు నెలలు జీతం తీసుకోలేదు. ఆ తర్వాత కూడా అనేక ఒడిదొడుకులు ఎదుర్కొని విస్తరించాం. ఇప్పుడు 450 మంది ఉద్యోగులతో పని చేస్తోంది మా సంస్థ" అన్నారామె. మనదేశంలో సోలార్ ఎనర్జీ విభాగంలో ఇంత భారీ స్థాయిలో సర్వీస్ అందిస్తున్న ఏకైక మహిళ రాధిక. ఏ వ్యాపారానికైనా ఇండియా చాలా పెద్ద మార్కెట్. కాబట్టి ఇండియా మొత్తాన్ని కవర్ చేయాలన్న కేంద్రప్రభుత్వం విధానాలతో కలిసి పనిచేస్తూ దేశాన్ని సౌరవెలుగులతో నింపడమే ప్రస్తుతానికి ఉన్న ఆలోచన" అన్నారామె.

ప్రత్యామ్నాయం ఇది

బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయి. విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి బొగ్గు గనుల మీద ఆధారపడడం తగ్గించి ఆల్టర్నేటివ్ ఎనర్జీని వినియోగంలోకి తెచ్చుకోవాలి. విండ్ పవర్ అనేది వ్యవస్థలు చేపట్టాల్సిందే కానీ వ్యక్తిగా చేయగలిగిన పని కాదు. ఇక మిగిలింది సోలార్ పవర్. సౌరశక్తిని వినియోగించుకోవడం సాధ్యమే. నిజమే... కానీ ఒక ఇంటికి సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాల్ చేసుకోవాలంటే ఎంత ఖర్చవుతుంది? దాదాపు లక్ష అవుతుంది. సగటు మధ్య తరగతి నుంచి 'అమ్మో ఒక్కసారిగా అంత ఖర్చా మా వల్ల కాదు' అనే సమాధానమే వస్తుంది. అలాంటి వాళ్లకు రాధిక ఇచ్చే వివరణే అసలైన సమాధానం.

> **నాలుగేళ్ల బిల్ కడితే ఇరవై ఏళ్లు**
> ఫ్రీ పవర్ సోలార్ సిస్టమ్ ఒకసారి ఇన్‌స్టాల్ చేసుకుంటే పాతికేళ్లు పని చేస్తుంది. నెలకు రెండువేల రూపాయలు కరెంటు బిల్లు కట్టే ఇంటికి రెండు కిలోవాట్ల కెపాసిటీ ప్లాంట్ అవసరమవుతుంది. దాని ఖర్చు లక్షా నలభై వేలవుతుంది. ప్రభుత్వం నుంచి 60 వేల సబ్సిడీ వస్తుంది. వినియోగదారుడి ఖర్చు 80 వేలు. ఏడాదికి 24 వేల రూపాయలు కరెంటు బిల్లు కట్టే వాళ్లకు నాలుగేళ్లలోపు ఖర్చు మొత్తం వెనక్కి వచ్చినట్లే. ఇక కనీసంగా ఇరవై ఏళ్లు సోలార్ పవర్‌ని ఫ్రీగా పొందవచ్చు. సోలార్ పవర్‌ను పరిశ్రమలకు కూడా విస్తరిస్తే కార్బన్ ఫుట్ ప్రింట్ కూడా తగ్గుతుంది.
> – రాధికా చౌదరి,
> కో ఫౌండర్, ఫ్రేయర్ ఎనర్జీ

– వాకా మంజులారెడ్డి,
ఫొటోలు : మోహనాచారి

నగధగలు

జెమ్ స్టోన్స్ ఆభరణాలు కొంటున్నారా?


విశేషిణి రెడ్డి
జీఐఏ జెమాలజిస్ట్

నవరత్నాలంటే... కెంపు, వజ్రం, నీలం, పుష్యరాగం, మరకతం, ముత్యం, పగడం, గోమేధికం, వైఢూర్యం. ఇవి కాకుండా ఆభరణాల్లో పొదిగే జాతిరాళ్లలో కనకపుష్యరాగం, ఇంద్రనీలం, అన్‌కట్ డైమండ్స్, పోల్కీ... ఇలా లెక్కకు మించి ఉంటాయి. ఈ ఆభరణాలను కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటికి తెచ్చుకున్న తర్వాత భద్రపరుచుకోవడంలో పాటించాల్సిన చిట్కాలను తెలుసుకుందాం.

● వజ్రాల ఆభరణాలకు వాటి కచ్చితత్వాన్ని పరిశీలించి నిర్ధారించడానికి ల్యాబ్‌లు, సర్టిఫికేట్ విధానం పటిష్ఠంగా ఉంది. కానీ, ఇతర జెమ్ స్టోన్స్ విషయంలో పరిశీలించి సర్టిఫికేట్ జారీ చేయడానికి ఉన్న సంస్థలు చాలా తక్కువ. కాబట్టి కొనేటప్పుడే జెమ్మాలజీ కోర్సు చేసిన వ్యాపారుల నుంచి కొనడం మంచిది.

● రత్నాలలో అత్యంత గట్టిదనం కలిగినది వజ్రం ఒక్కటే. మిగతా జెమ్ స్టోన్స్ ఏవీ వజ్రం ఉన్నంత గట్టిగా ఉండవు. ఒక మోస్తరు మెత్తటి రాళ్లు అనే చెప్పాలి. ఈ రాళ్లకు పగుళ్లిచ్చే గుణం ఉంటుంది. ఆభరణంలో పొదిగిన తర్వాత పగుళ్లు, గీతలు పడడం జరుగుతుంటుంది. కాబట్టి జెమ్‌స్టోన్స్ పొదిగిన ఆభరణాలను మెత్తటి బాక్సుల్లో పెట్టి బీరువాలో భద్రపరుచుకోవాలి. వేడుకల కోసం మరొక చోటకు వెళ్లాల్సినప్పుడు ప్రయాణాల్లో సులువుగా ఉండడానికి ఆభరణాలన్నింటినీ ఒకే బాక్సులో ఒకదాని మీద మరొకటి పెట్టేసి తీసుకెళ్లడం కొంతమందికి అలవాటు. లగేజ్ తగ్గించుకోవడానికి చేసే ఈ పని ఆభరణం మీద చాలా పెద్ద ప్రభావాన్ని చూపిస్తుంది. స్టోన్ మీద మరొక ఆభరణం బరువు పడడం వల్ల ఒత్తిడికి గురవడం, గీతలు పడడం, విరగడం కూడా జరుగుతుంది. కాబట్టి విడిగా ఒక్కో ఆభరణాన్ని ఒక్కో బాక్సులో పెట్టుకుని తీసుకెళ్లాలి.


● ఇక జెమ్ స్టోన్స్‌కి మొదట్లోనే (ఆభరణంలో అమర్చక ముందే) ఏదో ఒక ట్రీట్‌మెంట్ చేసి ఉంటారు. ఎమరాల్డ్స్ (మరకతం)కి గ్లాస్ ఫిల్లింగ్ లేదా ఆయిల్ ఫిల్లింగ్ చేసి ఉంటే ఆ విషయాన్ని షాపు వాళ్లు కొనేవాళ్లకు చెప్పాలి. అలాగే వాటిని భద్రపరిచే బాక్సులు ఆయిల్ డ్రై కాకుండా ఉండేవిధంగా ప్రత్యేకమైనవి ఉంటాయి. ఆ బాక్సులను ఆభరణం కొన్న షాపు వాళ్ల దగ్గరే అడిగి తీసుకోవాలి. ● ఎల్లో సఫైర్ (కనకపుష్యరాగం)కి కలర్ రావడానికి హీట్ ట్రీట్‌మెంట్ చేస్తారు. కొంతకాలానికి ట్రీట్‌మెంట్ ఎనర్జీ తగ్గడంతో రంగులో గాఢత కూడా తగ్గుతుంది. ఎల్లో సఫైర్ ఆభరణం కొనేటప్పుడు ట్రీట్‌మెంట్ చేసినదా లేక సహజంగానే రంగులో ఆ గాఢత వచ్చిందా అని స్పష్టంగా అడిగి తెలుసుకోవాలి.

● జెమ్ స్టోన్స్‌లో ఇన్‌క్లూజన్స్ గురించి అడిగి నిర్ధారించుకున్న తర్వాతనే కొనాలి. చిన్నపాటి ఇన్‌క్లూజన్ కూడా లేని రాళ్ల ధర చాలా ఎక్కువగా ఉంటుంది. చిన్న ఇన్‌క్లూజన్ ఉండి వాటిని ట్రీట్‌మెంట్‌తో ఫిల్ చేసి ఉంటే ధర ఒకలా ఉంటుంది. ఇన్‌క్లూజన్స్‌కి ట్రీట్‌మెంట్ చేసిన రాళ్లను ఆభరణంలో పొదిగిన తరవాత ఆ ఇన్‌క్లూజన్స్ కారణంగా ఆభరణం అందం తగ్గడం ఏమీ ఉండదు. అయితే మనం ఏ రాయికి ఎలాంటి ధర చెల్లిస్తున్నామనేది తెలుసుకుని కొనుక్కోవడం మంచిది.


వంటిల్లు

శీతాకాలం నువ్వులు

చలికాలం వచ్చేసింది. కీళ్లు బిగుసుకుపోతుంటాయి. నువ్వులతో దేహాన్ని వెచ్చబరచాలి. ఎముకలకు తగినంత శక్తినివ్వాలి. బ్రేక్‌ఫాస్ట్‌లోపాటు ఒక ఓట్స్ లడ్డు. ఈవెనింగ్ స్నాక్‌గా డేట్స్ లడ్డు. రాత్రి భోజనంలోకి వేడిగా నువ్వుల రైస్. చలికాలం పేజీలను నవ్వుతూ తిప్పేద్దాం.



డేట్స్ సెసెమీ లడ్డు



కావలసినవి: ఖర్జూరాలు – 300 గ్రాములు (సీడ్‌లెస్ అయితే 280 గ్రాములు చాలు); నువ్వులు – కప్పు; నువ్వులు – పావు కప్పు (పైన చల్లడానికి); జీడిపప్పు పలుకులు – పావు కప్పు; యాలకులు – 4.

తయారీ: ● మందపాటి బాణలిలో నువ్వులను (అన్నింటినీ) వేయించాలి (నూనె వేయకూడదు). చల్లారిన తర్వాత పావు కప్పు విడిగా తీసి పెట్టుకుని మిగిలిన నువ్వులను, యాలకులకు మిక్సీలో పొడి చేయాలి ● ఖర్జూరాలను గింజలు తొలగించి వెడల్పు పాత్రలో వేసి చిదమాలి. అందులో నువ్వుల పొడి వేసి సమంగా కలిసే వరకు వేళ్లతో చిదుముతూ కలపాలి. బాగా కలిసిన తరవాత జీడిపప్పు పలుకులను వేసి పెద్ద నిమ్మకాయంత సైజులో లడ్డులు చేయాలి. వేయించి పక్కన తీసి పెట్టిన నువ్వులను ఒక ప్లేట్‌లో పలుచగా వేయాలి. లడ్డును ఆ నువ్వుల మీద పెట్టి రోల్ చేయాలి. లడ్డుకు అంటుకున్న నువ్వులు రాలిపోకుండా ఉండడానికి రెండు అర చేతుల్లో పెట్టి గట్టిగా అదమాలి. ఇవి వారం పాటు తాజాగా ఉంటాయి.

ఓట్స్ సెసెమీ లడ్డు



కావలసినవి: ఓట్స్ – పావు కేజీ; నువ్వులు – పావు కేజీ; యాలకులు – 4; బెల్లం తురుము – ఒకటిన్నర కప్పులు; జీడిపప్పు పలుకులు – 20

తయారీ: ● మందపాటి పాత్రలో ఓట్స్ వేసి మీడియం మంట మీద వేయించాలి (నూనె లేకుండా). చిటపటలాడుతుంటే సమంగా వేగినట్లు గుర్తు. చిటపటలాడేటప్పుడు ఒకసారి గరిటెతో కలియతిప్పి దించేయాలి. వేగిన ఓట్స్‌ను ఒక ప్లేట్‌లోకి మార్చి అదే పాత్రలో నువ్వులను వేయించాలి. నువ్వులు కూడా చల్లారిన తర్వాత ఓట్స్, నువ్వులు, యాలకులను కలిపి మిక్సీలో పొడి చేయాలి. అందులో బెల్లంపొడి వేసి మరోసారి తిప్పాలి ● ఈ మిశ్రమాన్ని ఒక ప్లేట్‌లో పోసి చేత్తో చిదిమినట్లు కలిపి, జీడిపప్పు పలుకులు కలిపి పెద్ద నిమ్మకాయంత లడ్డులు చేయాలి. ఇవి వారం రోజులు తాజాగా ఉంటాయి.

సెసెమీ రైస్



కావలసినవి: నువ్వులు – వంద గ్రాములు; బియ్యం – పావు కేజీ; ఎండుమిర్చి – 6; మినప్పప్పు – టీ స్పూన్ ; నువ్వుల నూనె– టేబుల్ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం: నూనె – టీ స్పూన్; ఆవాలు – అర టీ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు.

తయారీ: ● బియ్యం కడిగి అన్నాన్ని కొంచెం పలుకుగా వండుకోవాలి. వెడల్పు పాత్రలోకి మార్చి చల్లారనివ్వాలి. అందులో ఉప్పు, టీ స్పూన్ నువ్వుల నూనె వేసి గరిటెతో జాగ్రత్తగా కలపాలి ● మిగిలిన నూనె బాణలిలో చేసి వేడెక్కిన తర్వాత మినప్పప్పు, ఎండుమిర్చి వేయించాలి. అవి వేగిన తర్వాత నువ్వులు వేసి వేయించాలి. నువ్వులు చిట్లుతున్న శబ్దం వచ్చిన తర్వాత ఒక అరనిమిషం పాటు బాగా కలియబెట్టి స్టవ్ ఆపేయాలి ● నువ్వులు, ఎండుమిర్చి చల్లారిన తర్వాత మిక్సీలో ముందుగా ఎండుమిర్చి వేసి పొడి చేయాలి. అవి గరుకుగా మెదిగిన తర్వాత బాణలిలో ఉన్న అన్నింటినీ వేసి మెత్తగా పొడి చేయాలి. ఈ పొడిని అన్నం మీద పలుచగా చల్లాలి ● అదే బాణలిలో పోపు కోసం తీసుకున్న నూనె వేడి చేసి ఆవాలు, మినప్పప్పు, కరివేపాకు వేయించాలి. ఈ పోపును అన్నంలో వేయాలి. నువ్వుల పొడి, పోపు సమంగా కలిసే వరకు గరిటెతో కలపాలి. రుచి చూసుకుని అవసరమైతే మరి కొంత ఉప్పు కలుపుకోవచ్చు.

పర్యావరణ హిత

'అమ్మో' అన్నవారే 'ఆహో' అంటున్నారు!

తూర్పు హిమాలయాలలో ఉన్న సాంగ్టీ అనే గ్రామం రకరకాలుగా కాలుష్య సమస్యలను ఎదుర్కొనేది. ఒకప్పుడు స్వచ్ఛంగా కనిపించిన సాంగ్టీ నది పరిసర ప్రాంతాలు పర్యాటకుల ప్లాస్టిక్ వ్యర్థాలతో భయపెట్టేవి. చుట్టపు చూపుగా ఈ ప్రాంతానికి వచ్చిన ఇతిషా సారా ఆ భీతావహమైన దృశ్యాలను చూసి చలించిపోయింది. ఆమె నిట్టూర్పుకే పరిమితం అయితే ఆ ప్రాంతంలో పెద్ద మార్పు తెచ్చేది కాదు....


పిల్లలతో ఇతిషా సారా

అస్సాం లోని గౌహతికి చెందిన ఇతిషా సారా పుణెలోని 'సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో చదువుకుంది. ఢిల్లీలోని అంబేద్కర్ యూనివర్సిటీలో 'సోషల్ డిజైన్' కోర్సు చేసింది. 'ఈ కోర్సు వల్ల తరగతి బయట అడుగు పెట్టడానికి, ప్రజలతో నేరుగా మాట్లాడడానికి, రోజువారీ సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడానికి నాకు అవకాశం వచ్చింది'... గతాన్ని గుర్తు చేసుకుంటుంది ఇతిషా.

తన పరిశోధన అంశానికి ఈ–వ్యర్థాలను ఎంచుకుంది. ఆ సమయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై పరిశోధనలు చేసిన వారు తక్కువ. ఈ–వ్యర్థాలకు సంబంధించి ఎన్నో పుస్తకాలు చదవడంతో పాటు ఢిల్లీ చుట్టుపక్కల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు రీసైకిలింగ్ జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లి పరిశీలించేది.

ఈ క్షేత్రస్థాయి అధ్యయనంలో ఎన్నో విషయాల గురించి అవగాహన చేసుకుంది. 'రీసైకిలింగ్'పై ఇతిషాకు ఉన్న అవగాహన సాంగ్టీని మార్చడానికి ఉపయోగపడింది.

అరుణాచల్‌ప్రదేశ్‌లోని సాంగ్టీలో అద్దె ఇంట్లో ఉంటూ, హిమాలయ ప్రాంతాల్లో పర్యావరణ స్పృహను రేకెత్తించడానికి గ్రామస్థులతో కలిసి పనిచేసింది. వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడి ఉండకుండా ఒకేచోట ఉండేలా వెదురుతో ప్రత్యేక నిర్మాణాలు చేయించింది.

కమ్యూనిటీల నిర్వహణలోని 'వేస్ట్ మేనేజ్‌మెంట్ గ్రూప్'లతో సాంగ్టీ ప్రాంతంలో ఎంతో మార్పు వచ్చింది. ఈ గ్రూప్‌లు స్థానిక సంస్కృతి, సాహిత్యాలను ప్రతిబింబించే మ్యూజిక్ ఫెస్టివల్స్‌ను కూడా నిర్వహిస్తున్నాయి.

అంతా సవ్యంగా జరుగుతుందనుకుంటున్న కాలంలో కోవిడ్ దెబ్బతో పరిసరాల పరిశుభ్రత, వేస్ట్ మేనేజ్‌మెంట్ మూలన పడ్డాయి. లాక్‌డౌన్ తరువాత ఈ ప్రాంతానికి తిరిగి వచ్చిన ఇతిషా వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను పునరుద్ధరించడానికి కష్టపడాల్సి వచ్చింది. అదే సమయంలో కమ్యూనిటీ గ్రూప్‌లలో ఉత్సాహవంతులైన కొత్త సభ్యులను చేర్చుకున్నారు.

ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణను పర్యవేక్షించేందుకు నలుగురు మహిళలు, నలుగురు పురుషులతో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు వంతుల వారీగా వ్యర్థాలను సేకరించి మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ(ఎంఆర్ఎఫ్) సెంటర్‌లకు తరలిస్తారు.

ఒకప్పుడు సాంగ్టీ పేరు వినబడగానే 'బాబోయ్' అనుకునేవారు. ఇప్పుడు అలాంటి గ్రామం 'జీరో వేస్ట్ విలేజ్'గా మారి ఎన్నో గ్రామాలకు స్ఫూర్తిని ఇస్తోంది.

> **వారిలో ఒకరిగా...**
> అప్పుడప్పుడూ వస్తూ, పోతూ పని చేయడం కంటే సాంగ్టీలోనే ఉండి పనిచేయాలనుకున్నాను. ఆ గ్రామస్థులలో ఒకరిగా కలిసి పనిచేయడం వల్ల అందరూ సహకరించారు. నన్ను వారిలో ఒకరిగా చూసుకున్నారు. 'జీరో వేస్ట్ విలేజ్'గా సాంగ్టీని నిలబెట్టే క్రమంలో ఎన్నో సవాళ్లు, సమస్యలు ఎదురయ్యాయి. అయినా సరే వెనకడుగు వేయలేదు. వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ప్రతి ఇంటిలో అవగాహన కలిగించడంలో విజయం సాధించాం.
> – ఇతిషా సారా

● యోగా

సమస్థితికి మౌంటెయిన్



పర్వతాన్ని పోలి ఉంటుంది కాబట్టి ఈ ఆసనాన్ని మౌంటెయిన్ పోజ్ అంటారు. ● పిల్లలు,పెద్దలు ఎవరైనా ఈ ఆసనాన్ని సులువు గా సాధన చేయవచ్చు. ● రెండుపాదాలను దగ్గరగా ఉంచి, నిటారుగా నిల్చోవాలి. ● భుజాలు వంచకుండా, చేతులను నేలవైపుకు చాచాలి. ● రెండు నుంచి ఐదు శ్వాసలు తీసుకొని, వదులుతూ ఉండాలి. ● తర్వాత పాదాలను దగ్గరగా ఉంచి, చేతులను తల మీదుగా తీసుకెళ్లి, ఒక చేతివేళ్లతో మరొక చేతివేళ్లను పట్టుకోవాలి. శరీరాన్ని పైకి స్ట్రెచ్ చేస్తూ శ్వాసక్రియ కొనసాగించాలి. శరీర కండరాలను బిగుతుగా ఉంచాలి. ● ఆ తర్వాత భుజాల నుంచి చేతులను పైకి లేపాలి. అరచేతులు రెండూ ఆకాశంవైపు చూస్తూ ఉండాలి. ● ఈ విధంగా చేసే సమయంలో కాలి మునివేళ్ల మీద నిలబడుతూ, శరీరాన్ని పైకి లేపాలి. కొద్దిసేపు అలాగే ఉండి, తిరిగి యథాస్థానంలోకి రావాలి. ● తర్వాత కాళ్లను ఒకదానికొకటి దూరంగా ఉంచుతూ, చేతులను కిందకు దించి, విశ్రాంత స్థితికి రావాలి.

తాడాసనం సాధన చేయడం జాయింట్స్‌పై మంచి ప్రభావాన్ని చూపుతుంది. పిల్లల చేత చేయిస్తే వారి ఎదుగుదలకు అమోఘంగా పనిచేస్తుంది.

– జి.అనూషారాకేష్, యోగా గురు

ఫిట్‌నెస్‌లో మనమెక్కడ?

ఆయుః ప్రమాణం, వైద్య సదుపాయాలు, శారీరక వ్యాయామ స్థితిగతులు, ఆరోగ్య స్థాయిలను ఆధారంగా చేసుకుని టాప్ 10 ఫిటెస్ట్ కంట్రీస్‌తో వరల్డ్ పాపులేషన్ రివ్యూ కమిటీ ఓ జాబితాను రూపొందించింది. ఆ దేశాలేవో, ఈ జాబితాలో భారత్ స్థానమేమిటో చూద్దాం.



ఐస్‌లాండ్

ఐస్‌లాండ్ ప్రజలదీ స్విట్జర్లాండ్ ప్రజల వంటి జీవనశైలే. అద్భుతమైన ప్రకృతి దశ్యాలు ఈ దేశవాసులను ఔట్‌డోర్ యాక్టివిటీస్ పట్ల ఆకర్షితులను చేస్తాయి. ఇది వారిని దైనందిన కార్యకలాపాలు, ఆరోగ్య సంరక్షణ విషయంలో చురుగ్గా ఉండేలా ప్రోత్సహిస్తాయి.

స్విట్జర్లాండ్

సహజ సుందర వాతావరణం కారణంగా ఈ దేశవాసులు ఏడాదిపొడవులనా సైక్లింగ్, వాకింగ్, టెక్కింగ్‌ల పట్ల ఉత్సాహం కనబరుస్తారు. తద్వారా శారీరక ఆరోగ్యానికి మానసిక ఆరోగ్యం బోనస్‌గా లభిస్తుంది.అందుకే ఆ దేశ ప్రభుత్వం విరివిగా ఔట్‌డోర్ యాక్టివిటీస్‌ను ప్రోత్సహిస్తుంది.

సింగపూర్

రోజువారీ శారీరక దారుఢ్యం, వ్యాయామాల పట్ల తగినంత ఆసక్తి, వ్యక్తిగత, సామాజిక ఆరోగ్య సంరక్షణకు సంబంధించి అక్కడి ప్రభుత్వం చూపే శ్రద్ధ సింగపూర్‌ను సింహభాగాన నిలిపింది.

జపాన్

సమతులాహారం, రోజువారీ శారీరక వ్యాయామాలు, ఆరోగ్య సంరక్షణలో పాటించే జాగ్రత్తలు ఆ దేశవాసుల ఆరోగ్యాన్ని, ఆయుష్షును అగ్రభాగంలో ఉండేలా చేస్తున్నాయి.

దక్షిణ కొరియా

తమ దేశవాసుల ఫిట్‌నెస్‌కోసం సౌత్ కొరియా ప్రభుత్వమే చొరవ తీసుకుంటుంది. ఔట్ డోర్ యాక్టివిటీస్ ద్వారా ఫిట్‌నెస్‌ను పెంచుకునేందుకు ప్రజలు కూడా ప్రాధాన్యమిస్తారు. ఇక్కడి వారు ఫిట్‌నెస్‌ను పెంచుకునేందుకు టెక్నాలజీని బాగా వాడతారు.

నెదర్లాండ్స్

సైక్లింగ్‌పై మక్కువ, శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ, ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే వివిధ సామాజిక వినోద కార్యక్రమాల నిర్వహణ వల్ల డచ్ ప్రజలు ఎల్లప్పుడూ చురుగ్గా ఉల్లాసంగా ఉంటారట.

స్వీడన్

ఆరోగ్యం, ఫిట్‌నెస్‌లపై ఈ దేశ ప్రజలు కనబరిచే విశేష ఆసక్తి స్వీడన్‌ను ఫిటెస్ట్ దేశాల జాబితాలో నిలిపింది. అక్కడి ప్రభుత్వం ప్రజారోగ్యంపై సమగ్ర దృష్టితో వివిధ కార్యకలాపాలను చేపట్టటమూ కారణమే.

నార్వే

ప్రపంచంలోని అత్యంత దృఢమైన మనుషులున్న దేశాల్లో ఒకటిగా నార్వే పరిగణనలో ఉంది. రకరకాల ప్రకృతి దశ్యాలకు ఆలవాలంగా ఉండే నార్వేలో ఏడాది పొడవునా స్కీయింగ్, హైకింగ్, సైక్లింగ్ వంటి ఔట్ డోర్ ఫిజికల్ యాక్టివిటీస్ అక్కడి ప్రజలకు సర్వ సాధారణం.

తైవాన్

ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ శ్రద్ధ, ఆరోగ్యరంగంలో తీసుకునే జాగ్రత్తలు, పాటించే విధి విధానాలు, సామాజిక శారీరక దార్ఢ్య కార్యక్రమాల నిర్వహణ, వాకింగ్ పాత్‌ల ఏర్పాటు, సమతులాహారం ఆవశ్యకతపై ప్రచార కార్యక్రమాల నిర్వహణ ఫిట్‌నెస్‌లో నాల్గో స్థానంలో నిలిపాయి.

ఇజ్రాయెల్

ఫిటెస్ట్ దేశాల జాబితాలో ఇజ్రాయెల్‌ది ఐదోస్థానం. చురుకైన జీవనశైలి, ఔట్‌డోర్ యాక్టివిటీస్‌కు అధిక ప్రాధాన్యతనిచ్చే కారణాన ఇది ఈ జాబితాలో చోటు సంపాదించుకుంది.

తక్కువ శారీరక శ్రమ రేటు, అధిక ఒత్తిడి, జీవనశైలివ్యాధుల పెరుగుదలతో భారత్ సతమతమవుతోంది. అందుకే ఫిటెస్ట్ దేశాల జాబితాలో ఇండియా 112వస్థానంలో కొనసాగుతోంది. ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వాలు వివిధ పథకాలు, కార్యక్రమాలను రూపొందిస్తున్నప్పటికీ ప్రజారోగ్యం విషయంలో మరింత శ్రద్ధ కనబరిచాల్సిన అవసరం ఉంది.

వీటిలో కాల్షియం పాలు అధికం

శరీరంలో కాల్షియంది చాలా కీలకమైన పాత్ర. కాల్షియం లోపం వల్ల చాలా రకాల సమస్యలు వస్తాయి. కాల్షియం లోపాన్ని సరిచేసేందుకు చాలా మంది రకరకాల మందులు వాడుతుంటారు. అలా కాకుండా ఆహార పానీయాల ద్వారానే కాల్షియం స్థాయిలను పెంచుకోవచ్చు. ఆహారం కన్నా కొన్ని రకాల పానీయాలను తాగడం ద్వారా కూడా తగినన్ని పాళ్లలో క్యాల్షియం ఉండేలా చూసుకోవచ్చు. ఆ పానీయాలేమిటో తెలుసుకుందాం. శరీరంలో కాల్షియం స్థాయిలను పెంచడానికి ఉత్తమ పానీయాలు.

వృక్షాధారితం: సాధారణంగా శరీరంలో క్యాల్షియం పెరిగేందుకు పాలు తాగడం మంచిదంటారందరూ. అయితే జంతుసంబంధమైన గేదెపాలలో కన్నా వృక్ష సంబంధమైన బాదం, సోయా వోట్ మిల్క్‌లో కూడా క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది కాబట్టి వేగన్ డైట్ తీసుకునేవాళ్లు కూడా నిరభ్యంతరంగా ఈ పాలు తాగవచ్చు.



లీఫీ స్మూతీస్: పాలకూర, మెంతికూర, చుక్కకూర వంటి ఆకుకూరలకు అల్లం, సైంధవ లవణం, కొన్ని రకాల పండ్ల ముక్కలు కలిపి తయారు చేసిన స్మూతీస్ తాగడం వల్ల శరీరానికి కాల్షియం సమృద్ధిగా అందుతుంది.



బోన్ సూప్: ఎముక ఆరోగ్యం బాగుండాలంటే కాల్షియం అవసరం. అదేవిధంగా ఎముకలకు కాల్షియం సమృద్ధిగా అందాలంటే బోన్‌సూప్ తాగడం చాలా మేలు చేస్తుందంటున్నారు పోషకాహార నిపుణులు.



నువ్వుల పాలు: గ్లాసు పాలలో కన్నా స్పూను నువ్వు గింజలలోనే ఎక్కువ కాల్షియం ఉంటుందట. అయితే నువ్వులను నమిలి తినడం కన్నా నువ్వులను నానబెట్టి రుబ్బి, వడకట్టి తీర్చిన పాలను తాగితే రోజంతటికీ కావలసిన కాల్షియం లభిస్తుంది.



టోఫు స్మూతీస్: సహజంగానే టోఫులో కాల్షియం ఎక్కువగానే ఉంటుంది. అయితే దానిలో కాల్షియం సల్ఫేట్, కొన్ని పండ్ల ముక్కలతో తయారు చేసిన దానిలో కాల్షియం మరింత సమృద్ధిగా ఉంటుంది.



కొబ్బరినీళ్లు: నీరసంగా ఉన్నప్పుడు, జ్వరపడి కోలుకుంటున్నప్పుడు కొబ్బరినీళ్ల తాగమని చెబుతుంటారు వైద్యులు. కొబ్బరినీళ్లలో ఎలక్ట్రోలైట్స్, పొటాషియం పుష్కలంగా ఉండటమే అందుకు కారణం. వాటితోపాటు కొబ్బరి నీళ్లలో కాల్షియం మోతాదు కూడా తక్కువేం కాదు.



ఆవుపాలు: గేదెపాలతో పోల్చితే ఆవుపాలలో కాల్షియం చాలా ఎక్కువ ఉంటుందట. అందువల్ల కాల్షియం లోపించిన వారిని పాలు తాగమని చెప్పినప్పుడు గేదెపాలకన్నా ఆవుపాలకే ప్రాధాన్యత ఇవ్వడం మంచిది.



పై పానీయాలలో వీలున్నవాటిని తాగుతుండటం వల్ల కాల్షియం లోపం తొందరగా భర్తీ అవుతుంది.

పెరుగు, జున్ను, మజ్జిగ, చియాసీడ్స్, గసగసాలలో కూడా కాల్షియం సమృద్ధిగా ఉంటుంది.

ఇతర ఆరోగ్య పరిస్థితులను బట్టి అందుబాటులో ఉన్న పానీయాలు తాగాలి.

● ఔరా! అంజీరా!

ఇవి మాంసాహారమా?

సాధారణం ఎవరైనా పండ్లను చూపించి.. 'ఇవి శాకాహారమా? మాంసాహారమా?' అని అడిగితే చిత్రంగా అనిపిస్తుంది. 'ఏమిటా పిచ్చి ప్రశ్న.. పండ్లలో ఎక్కడైనా మాంసం ఉంటుందా?' అంటూ కోపం తన్నుకొస్తుంది. అయితే చాలా మంది 'అంజీరా పండ్లు శాకాహారమా? మాంసాహారమా?' అనే ప్రశ్నే వేస్తున్నారు. ఎందుకంటే 'పండులందు అంజీరా పండు వేరయా' అంటున్నారు నిపుణులు. సైంటిఫిక్ రీజన్స్ చూపిస్తూ 'ఈ పండు ముమ్మాటికీ మాంసాహారమే!' అని తేల్చేస్తున్నారు.

అసలెందుకు అంజీరాను మాంసాహారం అంటున్నారంటే.. ఆ పండులో జరిగే పరాగ సంపర్క క్రియనే దానికి ప్రధాన కారణమని వివరిస్తున్నారు. పరాగ సంపర్కం కోసం కందిరీగలు.. అంజీర్ పండ్లను ఆశ్రయిస్తుంటాయి. ఆ పండ్ల సూక్ష్మ రంధ్రాల్లోనికి వెళ్లిన కందిరీగలు పరాగ సంపర్కం చేస్తాయి, అనంతరం బయటకి రాలేక కొన్ని అందులోనే చనిపోతాయి. దాంతో వాటి అవశేషాలు అంజీర్ పండులోనే విలీనమవుతాయి. అందువల్ల అది పరోక్షంగా మాంసాహారమవుతుంది కాబట్టి అంజీర్ పండ్లు మాంసాహారమేనంటున్నారు నిపుణులు.



శాకాహారులు అలాగని అంజీరాని తినడం మానేస్తే చాలా నష్టపోతారు. ఎందుకంటే అంజీరాతో ఎన్నో ఆరోగ్య ఫలితాలు అందుతాయి. వీటిలో విటమిన్లు, ఐరన్, ఫైబర్, ప్రొటీన్లు ఇలా అన్నీ పుష్కలంగా లభిస్తాయి. రోజూ తింటే శరీరానికి కావలసిన శక్తి అందుతుంది. వీటిని రాత్రిపూట నీళ్లలో నానబెట్టుకుని, ఉదయం నిద్ర లేచిన వెంటనే తింటే చాలా మంచిది. మలబద్ధకం, మూలశంక వంటి సమస్యలను ఈ పండ్లు నయం చేస్తాయి. చెడు కొవ్వును వేగంగా కరిగిస్తాయి. బరువు, హైబీపీ, షుగర్ వంటి సమస్యలను అదుపులోకి తెస్తాయి. గుండె సంబంధిత వ్యాధులు, నెలసరి సమస్యలున్నవారు, కిడ్నీ సమస్యలున్నవారు వీటిని తింటే మంచి ఫలితాలుంటాయి. ఆరోగ్యానిచ్చే ఈ పండును శాకాహారులూ నిరభ్యంతరంగా తినచ్చు.

సినిమా

అమెరికాలో భారీగా...



రామ్‌చరణ్ హీరోగా నటించిన పాన్ ఇండియన్ మూవీ 'గేమ్ చేంజర్'. శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించారు. అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ సినిమా జనవరి 10న విడుదల కానుంది. డిసెంబరు 21న అమెరికాలో 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని భారీగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఛరిష్మా డ్రీమ్స్ ప్రొడ్యూసర్, అమెరికా ఎగ్జిబిటర్ రాజేష్ కల్లెపల్లి మాట్లాడుతూ– ''ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ఇప్పటివరకు అమెరికాలో ఏ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించలేదు. తొలిసారి 'గేమ్ చేంజర్' కోసం భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను అమెరికాలో చేయనున్నందుకు ఆనందంగా ఉంది'' అన్నారు.

● రామ్‌చరణ్

మహాదేవ శాస్త్రి పాత్రలో...

విష్ణు మంచు లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై డా. మోహన్ బాబు మంచు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మోహన్‌బాబు ఓ కీలక పాత్ర చేస్తున్నారు. శుక్రవారంతో ఆయన 50 ఏళ్ల నట ప్రస్థానంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా 'కన్నప్ప' సినిమాలో మోహన్‌బాబు చేస్తున్న మహాదేవ శాస్త్రి లుక్ రిలీజ్ చేశారు. ''విష్ణు మంచు కలల ప్రాజెక్టుగా భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న చిత్రమిది. 'కన్నప్ప' చిత్రం ఏ తరానికి అయినా కొత్తగానే ఉంటుంది. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్స్, టీజర్ మూవీపై అంచనాలు పెంచాయి. తాజాగా విడుదల చేసిన మోహన్‌బాబు పోస్టర్ బజ్ క్రియేట్ చేసింది'' అని యూనిట్ పేర్కొంది. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతి ముకుందన్, ఐశ్వర్య, దేవరాజ్, ముఖేష్ రిషి, అర్పామ్ మంచు తదితరలు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.



● మోహన్‌బాబు

ప్రపంచాన్ని మార్చే శక్తి సినిమాకి ఉంది

– అక్కినేని అమల

''ఓ ఉత్తమమైన ప్రదేశంగా ప్రపంచాన్ని మార్చే శక్తి సినిమా మాధ్యమానికి ఉంది'' అని అక్కినేని అమల అన్నారు. గోవాలో జరుగుతున్న 55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ)లో అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాకు చెందిన విద్యార్థులు తీసిన షార్ట్ ఫిల్మ్ 'రోడ్ నెం 52'ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా అమల విలేకరులతో మాట్లాడారు. ''దేశంలోఎందరో ప్రతిభావంతులైన యువత సినీ రంగంలో రాణించేందుకు కృషి చేస్తున్నారని, వారిని తీర్చిదిద్దే పనిలో తాము పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. కొన్నేళ్లుగా వందలాది మందికి తమ అన్నపూర్ణ సంస్థ శిక్షణ అందించిందని, ఇప్పటికే పలువురు సినిమా రంగంలో పని చేస్తున్నారని వివరించారు. మహారాష్ట్రకు చెందిన యువకులు అచ్చ తెలుగు కథాంశం ఎంచుకుని అద్భుతమైన రీతిలో తెరకెక్కించారని 'రోడ్ నెం 52' రూపకర్తల్ని అభినందించారు అమల. 'రోడ్ నెం 52' రచయిత–దర్శకుడు సరోజ్, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ అథర్వ మహేష్ గాగ్ తమ అనుభవాలు పంచుకున్నారు.



● సరోజ్, అమల, అథర్వ

నటీమణుల పాత్రల నిడివి పెరగాలి

''నటీమణులకు తెర్మపై పోషించే పాత్రల నిడివి పెరిగితే తెరవెనుక గౌరవం కూడా పెరుగుతుంది'' అనే అభిప్రాయం 'ఇఫీ'లో నిర్వహించిన సదస్సులో వ్యక్తమైంది. సినీ పరిశ్రమలో మహిళా భద్రత అనే అంశంపై జరిగిన చర్చలో నటి–నిర్మాత వాణీ త్రిపాఠి టికూ మోడరేట్ చేసిన ప్యానెల్ పాల్గొంది. నటి సుహాసినీ మణిరత్నం మాట్లాడుతూ– ''సినిమాల్లో ఏదో ఇలా వచ్చి అలా పోయేవి కాకుండా మహిళలు తాము నటించే పాత్రలు బలంగా ఉండేలా చూసుకోవాలి'' అన్నారు. ''లొకేషన్లో మహిళలు వేధింపులకు గురి కాకూడదు. వారికి తాము చేసే పని వాతావరణంలో భద్రత, గౌరవం తప్పనిసరిగా ఉండాలి'' అని దర్శకుడు ఇంతియాజ్ అలీ పేర్కొన్నారు. ''వినోదంపై దృష్టి సారిస్తూనే సమానత్వానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు బాధ్యతాయుతమైన చిత్రనిర్మాణం సాగాలి'' అని ఖుష్బూ అన్నారు. మహిళలు తెర్మపై గౌరవప్రదంగా, తెరవెనుక సురక్షితంగా ఉండాలని, మహిళల భద్రతకి సినిమా ఉదాహరణగా ఉండాలనే పిలుపుతో ప్యానెల్ ముగిసింది.

అదే నేను... అసలు లేను!



● 'అల్లరి' నరేశ్, అమృతా అయ్యర్

'అల్లరి' నరేశ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బచ్చల మల్లి'. 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 20న విడుదల కానుంది. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అదే నేను అసలు లేను...' అంటూ సాగే రెండో పాటని మ్యూజిక్ డైరెక్టర్ తమన్ విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ పాటని ఎస్పీ చరణ్, రమ్యా బెహరా పాడారు. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'బచ్చల మల్లి' రూపొందింది. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. 'అదే నేను అసలు లేను...' పాటలో 'అల్లరి' నరేశ్, అమృతా అయ్యర్ మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుంది. వారి ఎమోషనల్ జర్నీని పొయిటిక్‌గా ప్రజెంట్ చేస్తుంది మెలోడీ పాట'' అని యూనిట్ పేర్కొంది.

ఉద్వేగం వాయిదా



● త్రిగుణ్

త్రిగుణ్, దీప్సిక జంటగా మహిపాల్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ఉద్వేగం'. పరుచూరి గోపాలకృష్ణ, శివకృష్ణ, అంజలి, శ్రీకాంత్ భరత్, సురేష్ నాయుడు ఇతర పాత్రలు పోషించారు. జి. శంకర్, ఎల్. మధు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదల కావాల్సింది. అయితే సాంకేతిక కారణాల వల్ల మరో వారం ఆలస్యంగా ఈ నెల 29న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''కోర్టు రూమ్ డ్రామాగా రూపొందిన చిత్రం 'ఉద్వేగం'' అని దర్శక–నిర్మాతలు పేర్కొన్నారు.



● అమీన్, ఏఆర్ రెహమాన్, రహీమా

మా నాన్నపై అసత్య ప్రచారం చేయొద్దు

– ఏఆర్ రెహమాన్ తనయుడు అమీన్

ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, ఆయన సతీమణి సైరా భాను పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. వారి ప్రకటన అనంతరం వస్తున్న వార్తలపై వారి తనయుడు అమీన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. ''మా నాన్న ఓ లెజెండ్. ఎన్నో ఏళ్ల నుంచి వృత్తిపరంగా అద్భుతమైన సంగీతాన్ని అందించడంతో పాటు ఎంతోమంది ప్రేమాభిమానాలను పొందారు. అలాంటి గొప్ప వ్యక్తి గురించి ఎలాంటి ఆధారాలు లేకుండా వదంతులు వ్యాప్తి చెందడం చూస్తుంటే చాలా బాధగా ఉంది. ఒక వ్యక్తి జీవితం, వారసత్వం గురించి మాట్లాడేటప్పుడు వాస్తవాలు తెలుసుకోవాలి. దయచేసి మా నాన్నపై అసత్య ప్రచారాలు వ్యాప్తి చేయడం ఆపండి. ఆయన్ని, ఆయన వృత్తిని గౌరవిద్దాం. ఈ కఠిన సమయంలో ప్రతి ఒక్కరూ మా గోప్యతను గౌరవించాలి'' అని రాసుకొచ్చారు. ఏఆర్ రెహమాన్ కుమార్తె రహీమా కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సందేశాన్ని పంచుకున్నారు. ''మనల్ని ద్వేషించే వాళ్లే వదంతులు సృష్టిస్తారు. తెలివితక్కువ వాళ్లు వాటిని వ్యాప్తి చేస్తారు. పనికి రానివాళ్లు వాటిని అంగీకరిస్తారు. దీన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకోండి'' అంటూ పోస్ట్ చేశారామె. ఇక ఈ నెల 19న ఏఆర్ రెహమాన్, సైరాల విడాకుల ప్రకటన వచ్చిన అనంతరం రెహమాన్ బృందంలోని మోహినీ దే అనే అమ్మాయి కూడా తన భర్త, తాను విడిపోతున్నట్లు ప్రకటించారు. దాంతో రెహమాన్, మోహినీ ఒకేసారి విడాకుల గురించి ప్రస్తావించడం వెనక ఏదో కారణం ఉందంటూ వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ ప్రచారాన్ని ఉద్దేశించే అమీన్, రహీమా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఇలా స్పందించి ఉంటారని ఊహించవచ్చు.

ఓటీటీ ఇది చూడొచ్చు

అమ్మయ్య బతికారు!!!

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ది డైవ్'. ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఏదైనా సమస్య వచ్చినప్పుడు పరిష్కారం కోసం చూడాలి. అంతే కానీ ఆ సమస్య వల్ల కుంగిపోకూడదు. అదే సమస్యతో పాటు మరికొన్ని సమస్యలు వచ్చినా మన మనో ధైర్యమే మనల్ని కాపాడుతుంది అన్న నమ్మకం ఉండాలి. ఈ దృక్పథంతో రూపొందిన సినిమాయే 'ది డైవ్'. 2020లో వచ్చిన నార్వే సినిమా 'బ్రేకింగ్ సర్ఫేస్'కి ఇది మూలం. 'ది డైవ్' సినిమాకి మాక్సిమిలన్ దర్శకత్వం వహించి, నిర్మించారు. ఈ సినిమా మొత్తం ఇద్దరు వ్యక్తుల మీదే నడుస్తుంది. ఓ రకంగా ఆ ఇద్దరే ఈ సినిమా అంతా కనపడే నటులు. కనిపించేది ఇద్దరు నటులే అయినా సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకుడు కూర్చున్న కుర్చీ బిగపట్టిన చేతిని వదలడు. అంతటి ఉత్కంఠభరితంగా నడుస్తుంది ఈ సినిమా స్క్రీన్‌ప్లే. ఈ సినిమా కథాంశం ఏంటంటే... మే, డ్రూ అక్కాచెల్లెళ్లు. ఓసారి ఇద్దరూ చాలా దూర ప్రాంతంలోని ఓ సముద్రపు లోయలోకి ఈతకు వెళతారు. ఇద్దరూ సముద్రంలోకి చాలా లోతుగా వెళతారు. సముద్రపు అట్టడుగు భాగంలో సరైన గాలి కానీ వాతావరణం కానీ ఉండదు. అలాంటిది ఆ ఇద్దరిలో ఒకరైన మే 80 అడుగుల నీళ్లలో ఓ బండరాయి క్రింద ప్రమాదవశాత్తు ఇరుక్కుపోతుంది. ఇప్పుడు తనను కాపాడాల్సిన బాధ్యత డ్రూ మీద పడుతుంది. డైవింగ్‌లో మే వాడుతున్న ఆక్సిజన్ సిలిండర్ 20 నిమిషాల కంటే ఎక్కువ రాదు. ఒకవేళ పైకి వచ్చి ఇంకెవరినైనా సాయం అడుగుదామనుకున్నా వీళ్లు వెళ్లింది ఓ నిర్మానుష్య ప్రాంతానికి. ఇక మిగతా కథ మొత్తం మేని డ్రూ ఎలా కాపాడుతుంది? అనే పాయింట్ మీదే ఉత్కంఠగా నడుస్తుంది. సినిమాలో డ్రూ తన అక్క కోసం పడిన బాధ, చూపించిన తెగువ ప్రేక్షకులను మైమరిపిస్తుంది. సినిమా ఆఖర్లో ప్రతి ప్రేక్షకుడు 'అమ్మయ్య బతికారు' అని అనుకోకుండా ఉండలేరు. ఓ రకంగా నేటి తల్లిదండ్రులందరూ ఈ సినిమాని తమ పిల్లల కోసం స్ఫూర్తిగా చూడాలి. ఎందుకంటే మన జీవితమనే రోడ్డు ప్రయాణంలో సమస్యలనే అడ్డంకులు వస్తే పరిష్కారంతో ముందుకు సాగిపోవాలి. అంతేకానీ వచ్చిన అడ్డంకి కోసం బాధ పడుతూ ఉంటే ఆ అడ్డంకి మన ప్రయాణానికి పూర్తిగా అడ్డమవుతుంది. వర్త్ టు వాచ్ 'ది డైవ్' ఫర్ ఎ ట్రూ స్పిరిట్.

– ఇంటూరు హరికృష్ణ



ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సాక్షి బిజినెస్
శనివారం
23-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,961	557
79,117	23,907

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,012	▲ 40
డోజోన్స్	44,226	▲ 356
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,262	▲ 113
డాక్స్	19,323	▲ 176
షాంఘై	3,267	▽ 103
నికాయ్	38,284	▲ 258

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	
76,700	▲ 840
బంగారం (22 క్యారట్)	
73,050	▲ 800
వెండి (కేజీ)	
101,000	0

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌ఎస్	84.09	85.11
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌ఎస్	105.81	108.63
€	యూరో	ఎన్‌ఎస్	87.89	90.49
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌ఎస్	53.86	55.23
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌ఎస్	54.01	56.20
S$	సింగపూర్ డాలర్	బ్యాంకులు	60.41	65.89
SAR	సౌదీ రియాల్	బ్యాంకులు	21.58	23.12
UAE D	యూఏఈ దిర్హామ్	బ్యాంకులు	22.10	23.88
¥	చైనా యువాన్	బ్యాంకులు	10.76	12.59

మంజుశ్రీ కొనుగోలుకు పీఏజీ రెడీ

- ఒప్పందం విలువ రూ. 8,000 కోట్లు!
- కంపెనీలో అడ్వెంట్ వాటా 97.54%

ముంబై: ప్లాస్టిక్ ప్యాకేజింగ్ సొల్యూషన్ల కంపెనీ మంజుశ్రీ టెక్నోప్యాక్‌ను హాంకాంగ్ పీఈ సంస్థ పీఏజీ సొంతం చేసుకోనుంది. ఇందుకు మంజుశ్రీ టెక్నోప్యాక్ మాతృ సంస్థ, యూఎస్ పీఈ దిగ్గజం అడ్వెంట్ ఇంటర్నేషనల్‌తో పీఏజీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు 95 కోట్ల డాలర్ల ఎంటర్‌ప్రైజ్ విలువ(సుమారు రూ. 8,000 కోట్లు)లో పీఏజీ, అడ్వెంట్ మధ్య డీల్ కుదిరినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతో సెబీ నుంచి మంజుశ్రీ ఇటీవలి తన ఐపీవో దరఖాస్తును అడ్వెంట్ వెనక్కి తీసుకోవలసి ఉంటుంది. మంజుశ్రీ టెక్నోప్యాక్‌లో అడ్వెంట్ 2018లో ఇన్వెస్ట్ చేసింది. తాజాగా మంజుశ్రీ టెక్నోను స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేసే సన్నాహాల్లో ఉంది. ప్రస్తుతం అడ్వెంట్‌కు మంజుశ్రీలో 97.54 శాతం వాటా ఉంది.


1983లో షురూ

రిజిడ్ ప్లాస్టిక్ ప్యాకేజింగ్ కంపెనీ మంజుశ్రీ టెక్నోప్యాక్ 1983లో ఏర్పాటైంది. బెంగళూరు కేంద్రంగా 21 ప్రాంతాలలో కార్యకలాపాలు విస్తరించింది. కాగా.. ఆసియా దేశాలపై దృష్టిపెట్టిన పీఏజీ 2019 నుంచి ఇప్పటివరకూ దేశీయంగా 1.7 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. సువామాలో నియంత్రణ వాటా సొంతం చేసుకున్న తదుపరి మరోసారి పీఏజీ భారీ డీల్‌కు తెరతీసింది.

జెప్టో రూ. 2,950 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: క్విక్‌కామర్స్ కంపెనీ జెప్టో తాజా రౌండ్‌లో భాగంగా 35 కోట్ల డాలర్లు(రూ. 2,950 కోట్లు) సమీకరించింది. ఇది దేశీ స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో అతిపెద్ద నిధుల సమీకరణగా కంపెనీ పేర్కొంది. మోతీలాల్ ఓస్వాల్‌కు చెందిన ప్రైవేట్ వెల్త్ విభాగం అధ్యక్షతన దేశీ ఇన్వెస్టర్లే పెట్టుబడులు సమకూర్చినట్లు తెలియజేసింది. దేశీ సంపన్నవర్గాలు, ఆర్థిక సంస్థలు, పలు కుటుంబ కార్యాలయాలు నిధులు అందించినట్లు వెల్లడించింది.

బుల్.. బ్యాక్



సెన్సెక్స్ 2.50% లాభంతో ఒక్క రోజులో రూ.7.32 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.432 లక్షల కోట్ల (5.12 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది.

- 1,961 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- నిఫ్టీ 557 పాయింట్లు జంప్
- కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు
- బ్యాంకులు, ఐటీ షేర్లకు భారీ డిమాండ్
- అన్ని రంగాల షేర్లకూ లాభాలే
- సూచీల ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను

ముంబై: కనిష్ట స్థాయిల వద్ద అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో శుక్రవారం స్టాక్ సూచీలు రెండున్నర శాతం పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు గడిచిన ఐదు నెలల్లో ఒకరోజులో అతిపెద్ద ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 1,961 పాయింట్లు పెరిగి 79 వేల ఎగువన 79,117 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 557 పాయింట్లు బలపడి 23,907 వద్ద స్థిరపడింది. ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్ మినహా అన్ని దేశాల సూచీలు 1.50 % ర్యాలీ చేశాయి.

ర్యాలీ ఎందుకంటే

ఐటీ, ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లలో నెలకొన్న భారీ కొనుగోళ్లు సూచీలను లాభాల పరుగు పెట్టించాయి. యూఎస్‌లో నిరుద్యోగ రేటు ఏడు నెలల కనిష్టానికి దిగి రావడం, డాలర్ ఇండెక్స్ 13 నెలల గరిష్టానికి చేరుకోవడంతో డాలర్ల రూపంలో ఆదాయాలు ఆర్జించే దేశీయ ఐటీ కంపెనీలకు షేర్లకు కలిసొచ్చింది. అలాగే అదానీ గ్రూప్ షేర్లలో రికవరీతో పాటు అదానీ గ్రూప్‌నకు రుణాలు ఇచ్చిన బ్యాంకులకు ముప్పేమీ లేదంటూ రేటింగ్ ఏజెన్సీల అభిప్రాయంతో ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లు రాణించాయి.

రోజంతా లాభాలే

అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 194 పాయింట్లు పెరిగి 77,350 వద్ద, నిఫ్టీ 69 పాయింట్లు బలపడి 23,419 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ప్రథమార్ధం నుంచే ఇన్వెస్టర్లు అన్ని రంగాల షేర్లలో పెద్ద ఎత్తున కొనుగోళ్లకు తెరతీయడంతో సూచీలు రోజంతా లాభాల్లోనే ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 2,162 పాయింట్లు ఎగసి 79,218 వద్ద, నిఫ్టీ 606 పాయింట్లు దూసుకెళ్లి 23,956 వద్ద ఇంట్రాడే గరిష్టాలు నమోదు చేశాయి.

జింకా లాజిస్టిక్ సొల్యూషన్స్ లిస్టింగ్ నిరాశ



ర్యాలీలోనూ జింకా లాజిస్టిక్ సొల్యూషన్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ. 273)తో పోలిస్తే 2% ప్రీమియంతో రూ.279 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 5% ఎగసి రూ.286 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే ఆరంభ లాభాలు నిలుపుకోవడంలో విఫలమైంది. గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో 5% నష్టపోయి రూ.260 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.4,592 కోట్లుగా నమోదైంది.

సీజన్ ముగిసినా...
సందడే సందడి


30% వరకు..

- కార్లపై కొనసాగుతున్న ఆఫర్లు
- నగదు డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన బహుమతులు
- డిసెంబర్ 31 వరకు కొనసాగే అవకాశం
- నిల్వలను తగ్గించుకునేందుకు కంపెనీల ప్రయత్నాలు

పండుగ సీజన్ ముగిసిపోయినా కార్ల విషయంలో మాత్రం ఆఫర్ల పర్వం కొనసాగుతూనే ఉంది. వివిధ కార్ల కంపెనీలు నగదు డిస్కౌంట్లు, ఇతరత్రా బహుమతులతో కస్టమర్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆటో డీలర్ల అసోసియేషన్ సమాఖ్య (ఎఫ్ఏడీఏ) గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా వాహన రిటైలర్ల దగ్గర 75–80 రోజులకు సరిపోయే నిల్వలు పేరుకుపోయాయి. వీటి విలువ సుమారు రూ. 75,000 కోట్లుగా ఉంటుంది. వాహన విక్రయాల గణాంకాలకు సంబంధించిన వాహన్ పోర్టల్ ప్రకారం నవంబర్‌లో తొలి ఇరవై రోజుల్లో 1,77,362 ప్యాసింజర్ వాహనాలు మాత్రమే అమ్ముడయ్యాయి. మరోవైపు, కార్ల కంపెనీలన్నీ కలిసి నవంబర్‌లో సుమారు 3,25,000 నుంచి 3,30,000 వరకు వాహనాలను హోల్‌సేల్‌గా డీలర్లకు సరఫరా చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న వాహన నిల్వలను తగ్గించుకోవడంపై కంపెనీలు మరింతగా దృష్టి పెడుతున్నాయి. ''ఏడాది చివరన పాత స్టాక్‌ను క్లియర్ చేసుకునేందుకు కంపెనీలు సాధారణంగా ఆఫర్లు ఇస్తుంటాయి. కానీ ఈసారి మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. డీలర్ల దగ్గర ఏకంగా 65–70 రోజులకు సరిపడా నిల్వలు పేరుకుపోయాయి. దీంతో సంస్థలు భారీగా డిస్కౌంట్లకు తెరతీశాయి. ఇది ఒక రకంగా కార్ల కొనుగోలుదార్లకు అసాధారణ అవకాశంలాంటిదే'' అని ఎస్అండ్‌పీ గ్లోబల్ మొబిలిటీ వర్గాలు తెలిపాయి.

కంపెనీలు అధికారికంగా రేట్ల తగ్గింపు లేదా డిస్కౌంట్లపై ఎటువంటి ప్రకటన చేయనప్పటికీ డిసెంబర్ 31 వరకు డీలర్ల దగ్గర చాలామటుకు మోడల్స్ ధరలపై (ఎక్స్‌షోరూమ్) 20–30 శాతం డిస్కౌంటును కొనుగోలుదార్లు ఆశించవచ్చని ఎఫ్ఏడీఏ వర్గాలు తెలిపాయి. మార్కెట్ పరిస్థితులను బట్టి డిస్కౌంట్లు ఉంటాయని మారుతీ సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ తెలిపారు. అంతగా అమ్ముడు కాని మోడల్స్ పేరుకుపోయినా, లేక అమ్ముడవుతున్న స్థాయికి మించి ఉత్పత్తి చేసినా.. ఆ నిల్వలను వదిలించుకోవడానికి భారీ డిస్కౌంట్లు ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. మరోవైపు, పెళ్లిళ్ల సీజన్, ప్రమోషనల్ ఆఫర్లు మొదలైనవి ప్యాసింజర్ కార్ల అమ్మకాలు పెరగడానికి దోహదపడగలవని ఆశిస్తున్నట్లు ఎఫ్ఏడీఏ ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. గణనీయంగా నిల్వలు పేరుకుపోయి ఉన్నందున తయారీ కంపెనీలు సరఫరాలను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఆఫర్ల వెల్లువ..

- ఎరీనా షోరూమ్‌లలో మారుతీ సుజుకీ ఇండియా తమ ఆల్టో కే10, వ్యాగన్ఆర్, సెలీరియో, ఎస్‌ప్రెసో కార్లపై రూ. 20,000–35,000 వరకు రిబేట్ ఇస్తోంది. వేరియంట్లను బట్టి స్విఫ్ట్‌పై రూ. 25,000–50,000 వరకు, బ్రెజాపై రూ. 10,000–20,000 వరకు డిస్కౌంట్ ఉంటోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రూ. 15,000 ఎక్స్ఛేంజ్ బోనస్, మోడల్‌ను బట్టి రూ. 2,100–2,300 వరకు కార్పొరేట్ డిస్కౌంట్లకు ఇది అదనమని పేర్కొన్నాయి.
- హ్యుందాయ్ మోటార్ ఇండియా తమ గ్రాండ్ ఐ10 నియోస్‌పై రూ. 35,000–45,000 వరకు, ఆరాపై రూ. 20,000 వరకు, ఐ20పై 20,000–45,000 వరకు, ఎక్స్‌టర్‌పై (నిర్దిష్ట వేరియంట్స్‌పై) రూ. 20,000–30,000 వరకు, వెన్యూపై 45,000–50,000 వరకు (వేరియంట్‌ను బట్టి), వెర్నాపై రూ. 70,000 డిస్కౌంట్ అందిస్తోంది. ఇక టక్సన్‌పై రూ. 50,000, అయానిక్ 5 ఈ–ఎస్‌యూవీపై రూ. 2 లక్షల మేర డిస్కౌంట్లు ఇస్తోంది.
- టాటా మోటార్స్ కూడా అల్ట్రోజ్‌పై రూ. 25,000, పంచ్‌పై (ఐసీఈ వెర్షన్) రూ. 20,000 నగదు డిస్కౌంట్ ఇస్తోంది. అటు టియాగో హ్యాచ్‌బ్యాక్, టిగోర్ సెడాన్, నెక్సాన్ ఎస్‌యూవీల ధరలు (ఐసీఈ మోడల్స్) వరుసగా రూ. 4.99 లక్షలు, రూ. 5.99 లక్షలు, రూ. 7.99 లక్షల నుంచి ప్రారంభమవుతున్నాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా కూడా కొన్ని మోడల్స్‌లో నిర్దిష్ట వేరియంట్లపై, లభ్యతను బట్టి, పరిమిత కాలంపాటు ఆఫర్లు అందిస్తోంది. బొలెరో నియోపై రూ. 70,000 వరకు, స్కార్పియో ఎన్‌పై రూ. 50,000, థార్ 4 X4పై రూ. 1.25 లక్షలు క్యాష్ డిస్కౌంటు ఇస్తోంది. ఎక్స్‌యూవీ 400 ఎలక్ట్రిక్‌పై ఏకంగా రూ. 3 లక్షల నగదు డిస్కౌంట్ ఉంటోంది.
- హోండా కార్స్ ఇండియా, జీప్ ఇండియా, స్కోడా ఆటో ఇండియా, ఫోక్స్‌వ్యాగన్ ఇండియా తదితర కార్ల కంపెనీలు కూడా ఏడాది ఆఖరు నాటికి నిల్వలను తగ్గించుకునేందుకు భారీ డిస్కౌంట్ ఆఫర్లు అందిస్తున్నాయి.

సన్‌టెక్ ఎనర్జీ 'ట్రూజన్ సోలార్' ప్రచారకర్తగా మహేశ్ బాబు



హైదరాబాద్: సోలార్ ఎనర్జీ సెక్టార్‌లోని సన్‌టెక్ ఎనర్జీ బ్రాండ్ 'ట్రూజన్ సోలార్'కు సినీనటుడు మహేశ్‌బాబు ప్రచారకర్తగా నియమితులయ్యారు. రూఫ్‌టాఫ్ సోలార్ ఇన్‌స్టలేషన్‌లో 2025 మార్చి నాటికి భారత్‌లో అగ్రగామిగా నిలిచేందుకు కట్టుబడి ఉన్నామని సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ వ్యవస్థాపకులు, ఎండీ, సీ.హెచ్. భవానీసురేశ్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న సంస్థతో కలిసి పనిచేయడం గౌరవంగా ఉందని మహేశ్‌బాబు తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
వెండి ఈటీఎఫ్‌లకు డిమాండ్ | టాప్ న్యూస్ యాప్‌గా ఎక్స్: మస్క్

సాక్షి స్పోర్ట్స్



హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి అరంగేట్రం

ఈ మ్యాచ్ ద్వారా ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, పేస్ బౌలర్ హర్షిత్ రాణా అంతర్జాతీయ టెస్టుల్లో అరంగేట్రం చేశారు. మ్యాచ్ ఆరంభానికి ముందు నితీశ్‌కు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి టెస్టు క్యాప్ అందించగా... హర్షిత్‌కు సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ జాతీయ జట్టు క్యాప్ ఇచ్చి అభినందించారు. భారత్ తరఫున టెస్టు మ్యాచ్ ఆడిన 315వ ఆటగాడిగా నితీశ్ కుమార్ రెడ్డి, 316వ ప్లేయర్‌గా హర్షిత్ నిలిచారు. ఇటీవల బంగ్లాదేశ్‌తో స్వదేశంలో జరిగిన టి20 సిరీస్‌లో నితీశ్ తొలిసారి జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. న్యూఢిల్లీలో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకొని అందరి దృష్టిని ఆకర్షించాడు. మరోవైపు ఆస్ట్రేలియా ఓపెనర్ మెక్‌స్వీనీ కూడా పెర్త్ మ్యాచ్‌తోనే అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు.

కుప్పకూలి... కూల్చేసి...
పెర్త్ టెస్టులో పుంజుకున్న భారత్


బుమ్రా

గత రెండు పర్యాయాలు ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌లు నెగ్గిన భారత జట్టు 'హ్యాట్రిక్' దిశగా తొలి అడుగు తడబడుతూ వేసింది. కంగారూ పేసర్లను ఎదుర్కోలేక భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. ఇక కష్టమే అనిపించిన దశలో బౌలర్లు విజృంభించి టీమిండియాను తిరిగి పోటీలోకి తెచ్చారు. ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి అరంగేట్రం టెస్టులో మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంటే... బంతితో తాత్కాలిక కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా నిప్పులు చెరిగాడు. నాయకుడు ముందుండి నడిపిస్తే ఎలా ఉంటుందో బుమ్రా చాటి చెప్పగా... అతడికి సిరాజ్, హర్షిత్ రాణా చక్కటి సహకారం అందించారు. రెండో రోజు ఇదే జోరు కొనసాగి... బౌలర్ల కృషికి బ్యాటర్ల సహకారం తోడైతే ఈ మ్యాచ్‌పై భారత్‌కు పట్టు చిక్కుతుంది.

తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 150 ఆలౌట్	ఆదుకున్న నితీశ్ రెడ్డి, రిషబ్ పంత్	ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 67/7	4 వికెట్లతో నిప్పులు చెరిగిన బుమ్రా

పెర్త్: బ్యాటర్లు విఫలమైన చోట... బౌలర్లు సత్తా చాటడంతో ఆస్ట్రేలియాతో తొలి టెస్టు తొలి రోజు భారత జట్టు మెరుగైన స్థితిలో నిలిచింది. ఐదు మ్యాచ్‌ల 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా శుక్రవారం తొలి టెస్టు ప్రారంభమైంది. పేసర్లకు స్వర్గధామం లాంటి పిచ్‌పై ఇరు జట్ల బౌలర్లు విజృంభించడంతో తొలి రోజే 17 వికెట్లు నేలకూలడం విశేషం. ఆట ముగిసే సమయానికి భారత్ భారీ ఆధిక్యం సాధించే స్థితిలో నిలిచింది. ఆస్ట్రేలియా గడ్డపై గత ఏడు దశాబ్దాల్లో ఒక టెస్టు మ్యాచ్‌లో తొలి రోజు 17 వికెట్లు పడటం ఇదే తొలిసారి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 49.4 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి అరంగేట్రం టెస్టులో (59 బంతుల్లో 41; 6 ఫోర్లు, ఒక సిక్సర్) టాప్ స్కోరర్‌గా నిలవగా... రిషబ్ పంత్ (78 బంతుల్లో 37; 3 ఫోర్లు, ఒక సిక్సర్), కేఎల్ రాహుల్ (74 బంతుల్లో 26; 3 ఫోర్లు) రాణించారు. ఆసీస్ బౌలర్లలో హాజల్‌వుడ్ 4 వికెట్లు... స్టార్క్, కమిన్స్, మార్ష్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేసింది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (28 బంతుల్లో 19 బ్యాటింగ్; 3 ఫోర్లు), స్టార్క్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో బుమ్రా 4 వికెట్లు, సిరాజ్ 2 వికెట్లు, హర్షిత్ రాణా ఒక వికెట్ తీశారు. చేతిలో 3 వికెట్లు ఉన్న ఆతిథ్య జట్టు భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 83 పరుగులు వెనుకబడి ఉంది. రెండో రోజు తొలి సెషన్‌లో వీలైనంత త్వరగా ఆస్ట్రేలియాను ఆలౌట్ చేస్తే టీమిండియాకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కుతుంది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు నిలకడగా ఆడితే ఈ టెస్టు ఫలితాన్ని శాసించే అవకాశం లభిస్తుంది.

బుల్లెట్‌లాంటి బంతులతో..

బ్యాటర్ల వైఫల్యంతో డీలా పడ్డ జట్టులో బుమ్రా తిరిగి జవసత్వాలు నింపాడు. ప్రతి బంతికి వికెట్ తీసేలా కనిపించి టీమిండియాకు శుభారంభం అందించాడు. మూడో ఓవర్‌లో మెక్‌స్వీనీ (10)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న బుమ్రా... ఏడో ఓవర్‌లో ఆసీస్‌కు డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. నాలుగో బంతికి ఉస్మాన్ ఖ్వాజా (8)ను అవుట్ చేసిన బుమ్రా... ఆ మరుసటి బంతికి ప్రమాదకర స్టీవ్ స్మిత్ (0)ను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కెప్టెన్ స్ఫూర్తితో చెలరేగిన యువ పేసర్ హర్షిత్ రాణా మంచి వేగంతో ఆకట్టుకోగా... హైదరాబాదీ పేసర్ సిరాజ్ మెయిడెన్లతో విజృంభించాడు. ఈ క్రమంలో ట్రావిస్ హెడ్ (11)ను హర్షిత్ క్లీన్ బౌల్డ్ చేశాడు. పచ్చికతో కూడిన పిచ్‌పై టాస్ గెలిచిన బుమ్రా బ్యాటింగ్ నిర్ణయం తీసుకోవడం క్రీడాభిమానులను సైతం ఆశ్చర్యానికి గురి చేసినా... ఇన్నింగ్స్ సాగుతున్న కొద్దీ అది సరైందనే భావన బలపడింది. మార్ష్ (6) రూపంలో తొలి వికెట్ ఖాతాలో వేసుకున్న సిరాజ్... క్రీజులో పాతుకుపోయిన లబుషేన్ (52 బంతుల్లో 2)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆసీస్ సారథి కమిన్స్ (3)ను బుమ్రా అవుట్ చేయడంతో ఆసీస్ ఏడో వికెట్ కోల్పోయింది. పేస్‌కు అనుకూలమైన పిచ్‌పై భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లో ఎలా ఆడతారనే అంశంపైనే ఈ మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.


నితీశ్ కుమార్ రెడ్డి


హెడ్ క్లీన్‌బౌల్డ్

నమ్మకాన్ని నిలబెట్టుకున్న నితీశ్

ప్లేయర్ల సహనానికి పరీక్ష పెట్టే పెర్త్ పిచ్‌పై మొదట మన బ్యాటర్లు ఆకట్టుకోలేకపోయారు. ఆసీస్ బౌలర్లు విజృంభిస్తుంటే... కుదురుకోవడానికి ప్రయత్నించకుండా బాధ్యతారహిత షాట్లతో వికెట్లు సమర్పించుకున్నారు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) మూడో ఓవర్‌లోనే అవుట్ కాగా... 23 బంతులు ఎదుర్కొన్న దేవదత్ పడిక్కల్ (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. ఆదుకుంటాడనుకున్న కోహ్లి (5) ఎక్కువసేపు నిలవలేకపోగా... కాస్త పోరాడిన కేఎల్ రాహుల్ అంపైర్ సందేహాస్పద నిర్ణయానికి పెవిలియన్ చేరాడు. ధ్రువ్ జురేల్ (11), వాషింగ్టన్ సుందర్ (4) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఫలితంగా భారత జట్టు 73 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అప్పటికే క్రీజులో ఉన్న పంత్‌కు నితీశ్ జత కలవడంతో భారత జట్టు కోలుకోగలిగింది. ఆసీస్ గడ్డపై మెరుగైన రికార్డు ఉన్న పంత్... కమిన్స్ బౌలింగ్‌లో కళ్లు చెదిరే సిక్స్‌తో ఆకట్టుకోగా... తొలి టెస్టు ఆడుతున్న నితీశ్ రెడ్డి ధాటిగా ఆడాడు. ఏడో వికెట్‌కు 48 పరుగులు జోడించిన అనంతరం పంత్ వెనుదిరిగాడు. పంత్ అవుటయ్యాక నితీశ్ వేగంగా ఆడి జట్టు స్కోరును 150కి చేర్చి చివరి వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మెక్‌స్వీనీ (బి) స్టార్క్ 0; రాహుల్ (సి) కేరీ (బి) స్టార్క్ 26; పడిక్కల్ (సి) కేరీ (బి) హాజల్‌వుడ్ 0; కోహ్లి (సి) ఖ్వాజా (బి) హాజల్‌వుడ్ 5; పంత్ (సి) స్మిత్ (బి) కమిన్స్ 37; జురేల్ (సి) లబుషేన్ (బి) మార్ష్ 11; సుందర్ (సి) కేరీ (బి) మార్ష్ 4; నితీశ్ రెడ్డి (సి) ఖ్వాజా (బి) కమిన్స్ 41; హర్షిత్ (సి) లబుషేన్ (బి) హాజల్‌వుడ్ 7; బుమ్రా (సి) కేరీ (బి) హాజల్‌వుడ్ 8; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 150. వికెట్ల పతనం:** 1–5, 2–14, 3–32, 4–47, 5–59, 6–73, 7–121, 8–128, 9–144, 10–150. **బౌలింగ్:** స్టార్క్ 11–3–14–2; హాజల్‌వుడ్ 13–5–29–4; కమిన్స్ 15.4–2–67–2; లయన్ 5–1–23–0; మార్ష్ 5–1–12–2.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖ్వాజా (సి) కోహ్లి (బి) బుమ్రా 8; మెక్‌స్వీనీ (ఎల్బీ) (బి) బుమ్రా 10; లబుషేన్ (ఎల్బీ) (బి) సిరాజ్ 2; స్మిత్ (ఎల్బీ) బుమ్రా 0; హెడ్ (బి) హర్షిత్ రాణా 11; మార్ష్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 6; కేరీ (బ్యాటింగ్) 19; కమిన్స్ (సి) పంత్ (బి) బుమ్రా 3; స్టార్క్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (27 ఓవర్లలో 7 వికెట్లకు) 67. వికెట్ల పతనం:** 1–14, 2–19, 3–19, 4–31, 5–38, 6–47, 7–59. **బౌలింగ్:** బుమ్రా 10–3–17–4; సిరాజ్ 9–6–17–2; హర్షిత్ రాణా 8–1–33–1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అంతర్రాష్ట్ర మండలి శాశ్వత ఆహ్వానితుడిగా కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డిని అంతర్రాష్ట్ర మండలి (ఇంటర్ స్టేట్ కౌన్సిల్) శాశ్వత ఆహ్వానితుడిగా ప్రధానమంత్రి నియమించారు. దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్రం మధ్య సహకార, సమాఖ్యవాదాన్ని పెంపొందించడంలో, సమన్వయాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించే అంతర్రాష్ట్ర మండలి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చైర్మన్‌గా ఏర్పాటైంది. ఇంటర్ స్టేట్ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీకి కేంద్రమంత్రి అమిత్ షాను చైర్మన్‌గా పునర్నిర్మించారు. అంతర్రాష్ట్ర మండలి అనేది రాజ్యాంగం ప్రకారం ఏర్పాటు చేసిన సంస్థ. ఈ కౌన్సిల్‌లో సభ్యులుగా దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, పీఎం ప్రతిపాదించిన కేంద్రమంత్రులు, వీరితో పాటుగా శాశ్వత ఆహ్వానితులుగా మరి కొంతమంది కేంద్రమంత్రులు సభ్యులుగా ఉంటారు. వీరంతా అంతర్రాష్ట్ర మండలి సమావేశాలకు హాజరుకావచ్చు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీకి కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

క్లుప్తంగా...

డాక్టర్ వరప్రసాద్‌రెడ్డికి తెలుగు వర్సిటీ పురస్కారం



నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతీ ఏడాది సాహిత్యం, లలిత కళలు, సాంస్కృతిక రంగాలకు సేవలందించే ప్రముఖుల్లో ఒకరికి విశిష్ట పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరిస్తామని, ఈ ఏడాది తెలుగు సాంస్కృతిక రంగానికి విశేషమైన సేవలందించిన శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డికి విశిష్ట పురస్కారాన్ని అందజేయాలని ఎంపిక సంఘం నిర్ణయించిందని వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య వై.రెడ్డి శ్యామల తెలిపారు. తెలుగు భాషా సంస్కృతులపై అపారమైన అభిమానం కలిగి, అలబ్ధంగా ఉన్న 284 అన్నమయ్య కీర్తనలను వెలికితీసి ప్రచురింపచేసి, తెలుగు సాంస్కృతిక వైభవ వికాసానికి కృషి చేస్తూ.. ఔత్సాహిక కళాకారులకు, విద్యార్థులకు తన శాంతా వసంతా ట్రస్ట్ ద్వారా ఆర్థిక సేవలందిస్తున్నందుకుగాను డాక్టర్ వరప్రసాద్‌రెడ్డిని ఈ పురస్కారానికి ఎంపిక చేశామని ఆమె తెలిపారు. డిసెంబర్ 2న జరిగే తెలుగు వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బాచుపల్లి ప్రాంగణంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

చర్లపల్లి పారిశ్రామిక వాడకు ఫిక్కీ అవార్డు



సాక్షి, హైదరాబాద్: స్వచ్ఛ పారిశ్రామిక పార్కులకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డు చర్లపల్లి పారిశ్రామిక పార్కుకు దక్కింది. 'ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబుల్ చాంపియన్'విభాగంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలోని చర్లపల్లి పారిశ్రామిక పార్కు అవార్డుకు ఎంపికైంది. ఢిల్లీలో జరిగిన ఫిక్కీ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర పరిశ్రమల శాఖమంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పవన్ కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. టీజీఐఐసీ పనితీరు, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు వచ్చే పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించేలా కృషిచేస్తున్న టీజీఐఐసీ పనితీరును రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఒక ప్రకటనలో అభినందించారు. సంస్థ పర్యావరణహిత పరిశ్రమల స్థాపన, మౌలిక వసతుల కల్పనకు అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులు పెట్టుబడిదారులతో పాటు ప్రజల్లోనూ సానుకూల ప్రభావం చూపిస్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు.

ఎల్కతుర్తి స్వయం సహాయక సంఘానికి అవార్డు



సాక్షి, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాల నిర్వహణలో హనుమకొండ జిల్లా 'ఎల్కతుర్తి మండల పరస్పర సహాయ పొదుపు, రుణ సహకార గ్రామ సంఘాల సమాఖ్య'దేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకుంది. సంఘాల నిర్వహణ, రుణాల చెల్లింపులు తదితర అంశాల్లో ఈ సమాఖ్య దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎన్ఐ-ఎంఎస్ఎంఈ)లో శుక్రవారం ఏపీ మాస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఎల్కతుర్తి సమాఖ్య పురస్కారాన్ని అందుకుంది. రెండో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా తవనంపల్లి మండల మహిళా సమాఖ్య అవార్డును అందుకుంది. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు చెందిన 200 మహిళా సమాఖ్యలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏపీ మాస్ సీఈవో సీఎస్ రెడ్డి వెల్లడించారు.

ఐకమత్యం, సామరస్యమే మన సభ్యత.. మన భవిష్యత్తు

- ఆ దిశగా మనం కలిసి పనిచేద్దాం
- వనవాసి, నగరవాసి కాదు.. మనమంతా భారతవాసులం అనే విషయాన్ని మరవొద్దు
- లోక్‌మంథన్ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపు
- మన ఘనమైన సాంస్కృతిక విలువలను మరింత ముందుకు తీసుకెళ్లాలి: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



బేగంపేటలో రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ఐకమత్యం, సామరస్యమే మన సభ్యత.. మన భవిష్యత్తు. ఆ దిశగా మనమంతా కలిసి పనిచేద్దాం. భారత సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మన పరంపర చాలా ఘనమైనవి. మనం భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడతాం.. పాటిస్తాం. ఇదే మన బలం, మన స్థైర్యం. విభిన్న సంస్కృతులు ఒకేచోట ఉండటం చాలా గొప్ప విషయం. ఇవన్నీ కలిసిన సుందరమైన ఇంద్రధనస్సు లాంటి దేశం మనది. వనవాసి, నగరవాసి కాదు.. మనమంతా భారతవాసులం అనే విషయాన్ని మరవొద్దు.'అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. శుక్రవారం శిల్పాకళా వేదికలో 'లోక్‌మంథన్ భాగ్యనగర్-2024'ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు.

సంస్కృతి, సంప్రదాయాలను పటిష్టం చేయాలి

'విదేశీ శక్తులు శతాబ్దాలుగా మన మీద జులుం ప్రదర్శించాయి. మన సంస్కృతిని, భాషను, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను విధ్వంసం చేశాయి. మనలో ఐకమత్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారు. మనలో బానిస మూలాలను చొప్పించారు. అయితే మన దేశ ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను మరవకుండా పాటిస్తూ వాటిని నిరంతరం జీవింపజేశారు. ఇకపైనా వాటిని కొనసాగించాల్సినవసరం ఉంది. మరింత పటిష్టం చేయాల్సి ఉంది. దేశ ప్రజల్లో సాంస్కృతిక, స్వాభిమాన్ భావన నెలకొల్పాల్సి ఉంది..'అని రాష్ట్రపతి అన్నారు.

సాంస్కృతిక విలువలను ముందుకు తీసుకెళ్లాలి: గవర్నర్

భాషలు, సంస్కృతులు, జీవన విధానాలు.. ఇలా ఎన్నో రంగాల్లో భిన్నత్వంలో ఏకత్వమున్న దేశం మనది. ఎన్నో కుట్రలు తట్టుకుని నిలబడిన ఘనమైన చరిత్ర మనకుంది. విదేశీ కుట్రలు తట్టుకుని నిలబడిన మనం.. ఐకమత్యం, సామరస్యంతో ఘనమైన సాంస్కృతిక విలువలను మరింత ముందుకు తీసుకెళ్లాలి. ఇదే మన పురాణేతిహాసాల సారం..'అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు.

జాతీయ ఐక్యతకు సంబంధించిన కుంభమేళా: కిషన్‌రెడ్డి

'లోక్‌మంథన్ 'దేశమే అన్నింటికన్నా శ్రేష్ఠం'అనే భావనతో పనిచేస్తోంది. ఇదొక జాతీయవాద, జాతీయ ఐక్యతకు సంబంధించిన కుంభమేళా వంటిది. భారతీయ పరంపర, సంస్కృతి, కళలు, ఆదివాసీల జీవన విధానం, సామాజిక ఏక్తా, భారతీయ జ్ఞాన-విజ్ఞాన సంపద ఇలా విభిన్న క్షేత్రాల్లో భారతీయ లోక విచార్, వ్యవహార్, వ్యవస్థకు సంబంధించి విభిన్న అంశాల్లో ఇక్కడ విస్తృతంగా చర్చ జరుగుతోంది..'అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్, ప్రజ్ఞాభారతి చైర్మన్ టి.హనుమాన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రపతి పర్యటన

రెండురోజుల రాష్ట్ర పర్యటన ముగించుకుని శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీ బయలుదేరిన రాష్ట్రపతికి బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, త్రివిధ దళాల అధికారులు వీడ్కోలు పలికారు. రాష్ట్రపతికి మంత్రి సీతక్క ఒక చిత్రపటాన్ని బహూకరించారు.

ఆలోచనలు మారితేనే లక్ష్యాలు సాధించగలం

'భారతదేశం ప్రస్తుతం బానిసత్వ మూలాలను తొలగించుకునే ప్రయత్నం చేస్తోంది. రాజ్‌పథ్ పేరు కర్తవ్యపథ్‌గా మారింది. రాష్ట్రపతి భవన్‌లో దర్బార్ హాల్ పేరును గణతంత్ర మండప్‌గా మార్చాం. ఇది బానిసత్వ ఆలోచనలను తొలగించే దిశగా జరుగుతున్న ప్రయత్నం. ఇందుకు తగ్గట్టుగా మన ఆలోచనలు కూడా మారాలి. అప్పుడే మనం అనుకున్న లక్ష్యాలను సాధించగలం. ఇటీవల న్యాయదేవత విగ్రహాన్ని ఆవిష్కరించాం. ఆ విగ్రహానికి గతంలో మాదిరిగా కళ్లకు నల్లని గంతలు లేవు. ఇది మనం సాధిస్తున్న మార్పునకు సంకేతం. దేశ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం ఇది. ఈ కార్యక్రమంలో భాగంగా అహల్యాబాయ్ హోల్కర్, రాణీ రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరాంగనలపై ప్రదర్శనలు నిర్వహించడం హర్షణీయం..' అని ముర్ము పేర్కొన్నారు.

యెజిదీలను కాపాడండి

- ఐరాస వేదికలపై మా తరఫున గళమెత్తండి.. భారత ప్రభుత్వానికి యెజిదీ ప్రతినిధుల విజ్ఞప్తి
- 'లోక్‌మంథన్'ఆహ్వానంపై హైదరాబాద్‌కు వచ్చిన యెజిదీల బృందం



లోక్‌మంథన్ భాగ్యనగర్ కార్యక్రమంలో యెజిదీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు తమ జనాభా క్షీణించిపోతున్న నేపథ్యంలో.. కుర్ద్ అల్పసంఖ్యాక మతస్తులైన యెజిదీలు భారత్‌తో పాటు ఇతర దేశాల నుంచి సహాయ సహకారాలను కోరుకుంటున్నారు. అంతర్ధానమైపోయే స్థితిలో ఉన్న తమ జాతిని కాపాడమంటూ వేడుకుంటున్నారు. ప్రపంచంలోనే పురాతన జన జాతుల్లో ఒక్కటైన ఇరాక్‌లోని కుర్ద్ యెజిదీ ప్రజలు తీవ్రమైన పీడన, సంఘర్షణ, నరమేధం లాంటి దారుణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం ఏడెనిమిది లక్షల జనాభా ఉండగా..ఇప్పుడు ఆ సంఖ్య కేవలం 2 లక్షలకు తగ్గిపోయిందంటే వారు నివసిస్తున్న చోట్ల ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇరాక్‌లోని ఉత్తర ప్రాంతంతో పాటు టర్కీ, సిరియా, ఇరాన్ తదితర చోట్ల ఈ జాతి ప్రజలు ఉండొచ్చునని అంచనా వేస్తున్నారు. ఇరాక్‌లోని సింజార్ ప్రావిన్స్‌లో గత పదేళ్లుగా ఈ వర్గం ప్రజలపై ఐసిస్ (ఇస్లామిక్ స్టేట్) జరిపిన ప్రాణాంతక దాడుల్లో వేలాదిమంది పురుషులు మృత్యువాత పడ్డారు. దాడుల సందర్భంగా బంధించిన మహిళలను సెక్స్ బానిసలుగా మార్చుకున్నారు. వారి పిల్లలను కూడా కట్టు బానిసలుగా మార్చేసి దుర్భర జీవితాన్ని గడిపే స్థితికి చేర్చారు. హిందూ సమాజానికి దగ్గరగా ఉన్న తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఇతర ప్రత్యేకతలను 'లోక్‌మంథన్-భాగ్యనగర్-2024'లో ప్రదర్శించేందుకు నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానంపై యెజిదీ బృందం సభ్యులు హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.

త్వరలో ప్రధాని తదితరులకు లేఖలు రాస్తాం

హిందువుల మాదిరిగా భూమి, నీరు, గాలి, అగ్ని, ఆకాశం.. 'పంచభూతాలను'వారు ఆరాధిస్తారు. ఈ నేపథ్యంలో తాము ఎదుర్కొంటున్న విపత్తుల గురించి భారత్ గొంతెత్తడంతో పాటు ఇతర దేశాల మద్దతును కూడా కూడగట్టడం ద్వారా తమ జాతి అంతర్ధానం కాకుండా ఏదైనా ఒక సురక్షిత ప్రాంతాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని యెజిదీ నేషనల్ యూనియన్ అధ్యక్షుడు ఖుద్రు హజోయన్ కోరారు. ఐరాస భద్రతా సమితిలో తమ సమస్యలను లేవనెత్తాలని కోరుతూ త్వరలోనే ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జయశంకర్, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌లకు లేఖలు రాయనున్నట్టు తెలిపారు. దాదాపు 40 ఏళ్ల క్రితం కుర్దిస్తాన్ ప్రాంతంలో 98 శాతమున్న యెజిదీలు ప్రస్తుతం 2 శాతానికి కుదించుకుపోయారని చెప్పారు. నరమేధం నేపథ్యంలో తమకు అర్మేనియా ఆశ్రయం కల్పించిందని, ఇప్పుడు తాము అక్కడి నుంచే అధికార బృందంగా హైదరాబాద్ వచ్చామన్నారు. అర్మేనియా, రష్యా, జార్జియా అంతర్జాతీయ వేదికలపై తమకు మద్దతు అందిస్తున్నాయని వివరించారు.

కోటి దాటిన సమగ్ర సర్వే..

ఏడు జిల్లాల్లో దాదాపు పూర్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది. ఈనెల 6వ తేదీన సర్వే ప్రారంభం కాగా.. తొలి మూడు రోజులు ఇళ్ల గుర్తింపు, స్టిక్కర్లు అంటించే ప్రక్రియ జరిగింది. ఆ తర్వాత ఈనెల 9వ తేదీ నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమైంది. ఈనెల 22వ తేదీ నాటికి కోటి నివాసాల్లో సర్వే పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 1,16,14,349 ఇళ్లను అధికారులు గుర్తించారు. గ్రామీణ ప్రాంతాల్లో 64,41,183 ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో 51,73,166 ఇళ్లు ఉన్నాయి. వీటి సర్వే ప్రక్రియ ఈనెల 9న ప్రారంభం కాగా.. శుక్రవారానికి 1,01,40,767 ఇళ్లలో సర్వే పూర్తి చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 87.1 శాతం సర్వే పూర్తయింది. జన సాంద్రత ఎక్కువగా గ్రేటర్ హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో సర్వే కాస్త ఆలస్యమైంది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో శుక్రవారం నాటికి ఎనిమిది జిల్లాల్లో సర్వే దాదాపు ముగిసిందని అధికారులు తెలిపారు. ములుగు, జనగాం జిల్లాల్లో వంద శాతం పూర్తి కాగా.. నల్లగొండ, మెదక్ జిల్లాల్లో 99.9%, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, గద్వాలలో 99% చొప్పున సర్వే పూర్తయింది. కామారెడ్డి జిల్లాలో 98.5%, మంచిర్యాల, అసిఫాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో 98 శాతం సర్వే జరిగింది.

మధ్యవర్తిత్వమే మంచిది..

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్
- వేగంగా కేసుల పరిష్కారం
- ఆర్బిట్రేషన్‌కు పెరుగుతున్న ఆదరణ
- సామాన్యులకూ మధ్యవర్తిత్వ సేవలందాలి: సీఎం రేవంత్
- ఐఏఎంసీలో కామన్‌వెల్త్ మీడియేషన్-ఆర్బిట్రేషన్ కాన్ఫరెన్స్



సదస్సులో పీటర్ డి. మెనార్డ్, శ్రీలంక న్యాయమూర్తి జస్టిస్ మహమ్మద్ నవాజ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వ విధానానికి ఆదరణ పెరుగుతోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ తెలిపారు. ప్రజలు దీర్ఘకాలంపాటు కోర్టు విచారణకు వెళ్లకుండా న్యాయపరంగా వివాదాలను పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం సులువైన మార్గమని చెప్పారు. కామన్వెల్త్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)లో శుక్రవారం 'ది కామన్‌వెల్త్ మీడియేషన్-ఆర్బిట్రేషన్ కాన్ఫరెన్స్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ గవాయ్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, శ్రీలంక న్యాయమూర్తి జస్టిస్ మహమ్మద్ నవాజ్, పీటర్ డి.మెనార్డ్ కేసీ పాల్గొన్నారు. కార్యక్రమంలో జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ 2023, ఏప్రిల్ నుంచి 2024, మార్చి మధ్యవర్తిత్వంతో 1,45,000 కేసులు పరిష్కారం అయ్యాయని వివరించారు. ఇవి 2021-2022తో పోలిస్తే 2,000 ఎక్కువ అని చెప్పారు. మధ్యవర్తిత్వానికి మరింత ప్రచారం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. భవిష్యత్‌లో కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. ఆసియా దేశాల్లో మధ్యవర్తిత్వానికి ఆదరణ పెరుగుతోందని తెలిపారు. మధ్యవర్తిత్వాన్ని మరింత పెంపొందించే దిశ చర్చ జరగాలని ఆకాంక్షించారు.

మధ్యవర్తిత్వం సామాన్యులకూ చేరాలి

మధ్యవర్తిత్వంతో కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులకు ఇది చక్కని మార్గమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే, ఈ మధ్యవర్తిత్వ విధానాన్ని పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలకే కాకుండా.. సామాన్యులకూ చేరువ చేయాలని కోరారు. న్యాయస్థానాలపై పెరిగిపోతున్న కేసుల భారాన్ని తగ్గించేందుకు ఆర్బిట్రేషన్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్‌లో పెట్టుబడిదారులకు, బడా పారిశ్రామిక వేత్తలకు ఐఏఎంసీ సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. కోర్టుల్లో కేసులు భారీగా పేరుకుపోవటం న్యాయవ్యవస్థకు సవాల్‌గా మారిందని, ఈ భారాన్ని తగ్గించడానికి మధ్యవర్తిత్వ విధానం చక్కని మార్గమని సూచించారు. ఆర్బిట్రేషన్ మ్యాప్‌లో లండన్, సింగపూర్ తర్వాత హైదరాబాద్ ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. ఆర్బిట్రేషన్ సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావడంపై మరో సదస్సు నిర్వహించాలని కోరారు.

మన సంభాషణలను రహస్యంగా వినేస్తున్న స్మార్ట్ ఫోన్లు
మనం దేని గురించి మాట్లాడితే.. ఆ అంశంపై యాడ్స్
వెబ్‌సైట్ల నుంచి సోషల్ మీడియా ఏది ఓపెన్ చేసినా అవే ప్రకటనల గోల



ష్.. మీ ఫోన్ వింటోందా?

ఇలా కనిపెట్టండి.. దాని పని పట్టండి

ఇంటర్నెట్ సెర్చింగ్ నుంచి మైక్రోఫోన్‌తో నిఘా దాకా..

మీరు ఏదైనా ప్రదేశం గురించో, మరేదైనా సమాచారం కోసమో ఇంటర్నెట్‌లో సెర్చింగ్ చేస్తే.. ఆ తర్వాత మీ ఫోన్‌లో, కంప్యూటర్‌లో ఆ ప్రదేశం, సమాచారానికి సంబంధించిన ప్రకటనలు ప్రత్యక్షమవుతూ ఉంటాయి. ఉదాహరణకు మనం ఢిల్లీలో మంచి హోటళ్లు ఏమేం ఉన్నాయని సెర్చ్ చేశామనుకోండి. ఆ తర్వాత కొన్నిరోజుల వరకు మనం ఏ వెబ్‌సైట్లు ఓపెన్ చేసినా.. వాటిలో ఢిల్లీలోని హోటళ్ల సర్వీసులు, ట్రావెల్ ఏజెన్సీల ప్రకటనలు కనిపిస్తూ ఉంటాయి. ఇంతవరకు మనకు తెలిసిందే. కానీ మన ఫోన్ మనం ఏం మాట్లాడుతున్నాం, దేని గురించి మాట్లాడుతున్నామనేదీ తెలుసుకుంటోంది. ఫోన్‌లోని మైక్రోఫోన్ ద్వారా నిఘాపెడుతోంది. మరి మన ఫోన్ ఇలా మనపై నిఘా పెట్టిందా లేదా అనేది చిన్న ట్రిక్ ద్వారా తెలుసుకోవచ్చని 'నార్డ్ వీపీఎన్' సంస్థ టెక్ నిపుణులు చెబుతున్నారు.

మనపై ఫోన్ నిఘా గుట్టు తేల్చేద్దాం ఇలా..



1. మీరు ఇప్పటివరకు ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయని, సోషల్ మీడియాలో పెట్టని, ఎప్పుడూ మాట్లాడని ఒక కొత్త టాపిక్‌ను ఎంచుకోండి.
2. మీ ఫోన్‌ను మీకు దగ్గరలో పెట్టుకుని ఈ టాపిక్‌పై నాలుగైదు రోజులు తరచూ మాట్లాడండి. ఎవరితోనైనా చర్చించండి. ఉదాహరణకు ఏదైనా దేశం, అక్కడి నగరాలు, టూరిస్టు ప్లేసులు, రెస్టారెంట్లు వంటి అంశాలను మాట్లాడండి.
3. అయితే ఈ టాపిక్‌కు సంబంధించి ఇంటర్నెట్‌లో, సోషల్ మీడియాలో ఎక్కడా సెర్చింగ్, పోస్టింగ్ వంటివి చేయకూడదు. కేవలం ఫోన్‌ను మీకు సమీపంలో పెట్టుకుని సదరు టాపిక్‌పై మాట్లాడాలి. మిగతా విషయాల్లో మీ ఫోన్‌ను మామూలుగానే వాడుతూ ఉండాలి.
4. 4,5 రోజుల తర్వాతి నుంచి మీ ఫోన్‌లో, మీ ఈ-మెయిల్‌తో లింక్ అయి ఉన్న స్మార్ట్ టీవీలు, ట్యాబ్లెట్లు, కంప్యూటర్లలో.. మీరు చూసే వెబ్‌సైట్లు, సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే యాడ్స్‌ను కాస్త గమనిస్తూ ఉండండి.

ఒకవేళ మీరు మాట్లాడిన అంశానికి సంబంధించి యాడ్స్ తరచూ కనిపిస్తూ ఉంటే.. ఫోన్ మీపై నిఘా పెట్టి, మీ సంభాషణలలోని టాపిక్స్‌ను యాడ్స్ కోసం వాడుతున్నట్టే.

ఈ నిఘా నుంచి బయటపడేదెలా?



- ఫోన్‌లో సోషల్ మీడియా, ఈ-కామర్స్, బ్యాంకింగ్ వంటి ముఖ్యమైన యాప్స్ నుంచి.. గేమ్స్, యుటిలిటీస్ యాప్స్ వరకు ఉంటాయి. వాటిని ఇన్‌స్టాల్ చేసినప్పుడు స్టోరేజీ, మైక్రోఫోన్, కెమెరా వంటి పర్మిషన్లు ఇస్తుంటాం. ఇక్కడే సమస్య మొదలవుతుంది.
- పెద్ద కంపెనీల యాప్‌లతో సమస్య ఉండకపోవచ్చుగానీ.. గేమ్స్, యుటిలిటీస్, ఎంటర్‌టైన్‌మెంట్ కోసం ఇన్‌స్టాల్ చేసుకునే యాప్‌లు, యాడ్స్‌పై లింకులను క్లిక్‌చేయడం ద్వారా డౌన్‌లోడ్ అయ్యే యాప్‌లతో ఇబ్బంది ఉంటుంది. ఇలాంటి యాప్‌లకు ఇచ్చే పర్మిషన్లు దుర్వినియోగమై.. మీ ఫోన్‌తోనే మీపై నిఘా మొదలవుతుంది. అందువల్ల ముఖ్యమైన యాప్స్ మాత్రమే ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- యాప్స్‌కు అవసరమైన పర్మిషన్లు మాత్రమే ఇవ్వాలి. అప్పుడప్పుడూ ఏయే యాప్స్‌కు ఏ పర్మిషన్లు ఇచ్చినదీ, సెట్టింగ్స్‌లోకి వెళ్లి పరిశీలించాలి. అనవసర యాప్స్‌కు ఇచ్చిన పర్మిషన్లను తొలగించాలి. వీలైతే అవసరం లేని యాప్స్‌ను తొలగించేయడం మంచిది.
- ఫోన్‌లోని వాయిస్ అసిస్టెంట్ యాప్ సెట్టింగ్స్‌లో 'ఆలో వెన్ లాక్‌డ్'ఆప్షన్‌ను డిజేబుల్ చేయాలి. దీనితో ఫోన్ లాక్ అయి ఉన్నప్పుడు మైక్రోఫోన్ వాడకుండా ఉంటుంది.

- సాక్షి సెంట్రల్ డెస్క్

వడ్ల కుప్పకు ఒర్కు పట్టా అయ్యి..

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు
- చలికి వణుకుతూ వడ్ల కుప్పలకు రాత్రిపూట కాపలా
- తేమ కారణంతో కాంటా ఆలస్యం చేస్తున్న అధికారులు
- వడ్లు లారీ ఎక్కేవరకు రక్షణ రైతుల దేనని స్పష్టీకరణ



సూర్యాపేట జిల్లా వట్టె ఖమ్మం పహాడ్ గ్రామ ఐకేపీ కేంద్రంలో రాత్రి వేళ దంపతుల కాపలా

చివ్వెంల (సూర్యాపేట)/మద్దిరాల: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకొనేందుకు అన్నదాతలు కుటుంబాలను వదిలి కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ఎండకు ఎండుతూ.. చలికి వణుకుతూ కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేయటంలో జాప్యమవుతుండటంతో తమ వడ్లను కాపాడుకొనేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. కాంటా వేసి బస్తాల్లో నింపిన ధాన్యాన్ని అక్కడి నుంచి తరలించే వరకు కూడా కాపాడాల్సిన బాధ్యత రైతులదేనని అధికారులు తెగేసి చెప్పుండటంతో రైతులు అక్కడే పడిగాపులు పడుతున్నారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని వివిధ గ్రామాల్లో 18 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 4 పీఏసీఎస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు రైతులు 15 రోజుల క్రితం వడ్లు తెచ్చారు. తేమశాతం అధికంగా ఉందన్న కారణంతో అధికారులు కాంటా వేయకపోవడంతో పగలు అరబెట్టి, రాత్రిళ్లు వడ్ల కుప్పల వద్దనే పడుకొంటున్నారు. కాంటాలు వేసిన చోట రెండు రోజులుగా వడ్లను మిల్లులకు తరలించకపోవటంతో రైతులు ధాన్యం బస్తాల వద్ద రాత్రిపూట కాపలాగా ఉంటున్నారు. ధాన్యం బస్తాలు కాంటా వేసింది మొదలుకొని లారీలో లోడ్‌లో అయ్యే వరకు వాటి బాధ్యత రైతులదే అని నిర్వాహకులు తెలుపడంతో చేసేది లేక రాత్రిపూట బస్తాల వద్ద ఎముకలు కొరికే చలిలో కాపలా కాస్తున్నారు.

తేమ శాతంపై సడలింపు ఇవ్వాలి

కింది ఫొటోలో ఉన్న రైతు వెంకన్నది సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని రెడ్డిగూడెం. 15 రోజుల క్రితం వడ్లను తెచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పోశాడు. 2రోజుల క్రితం ధాన్యంపైన కప్పిన పట్టా తొలగించి ఉండడంతో దొంగతనం జరిగిందేమోనన్న అనుమానంతో రాత్రిపూట చలికి వణుకుతూ అక్కడే పడుకుంటున్నాడు. ధాన్యం ఎంత ఆరబెట్టినా చలి తీవ్రత కారణంగా తేమ శాతం తగ్గడం లేదు. అధికారులు సన్న ధాన్యానికి 14 శాతం తేమ ఉండాలనే నిబంధన పెట్టకుండా.. దొడ్డు వడ్ల మాదిరిగానే 17 శాతానికి పెంచి త్వరగా కాంటా వేయాలని వెంకన్న కోరుతున్నాడు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి:

ఆ ఊరికో పేరుంది. ఊరి పేరున వందల ఎకరాల భూములు రికార్డుల్లో నమోద య్యాయి. కానీ ఆ ఊళ్లలో ఇళ్లు ఉండవు. మనుషులూ నివసించరు. జనావాసాలు లేకున్నా అవి ఊళ్లే అంటే నమ్మాలి మరి. రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ అవి గ్రామాలు గానే కొనసాగుతున్నాయి. మరికొన్ని ఊళ్లకు పేర్లున్నా.. రికార్డుల్లో మాత్రం లేవు. తాతల కాలం కిందట అక్కడ ఊళ్లు ఉండేవని చెబుతుంటారు. కొన్ని ఊళ్లలో ఇళ్లు, కోట లున్న ఆనవాళ్లు ఉండగా, మరికొన్ని చోట్ల ఆలయాలున్నాయి. కామారెడ్డి జిల్లాలోని ఇలాంటి ఊళ్లపై 'సాక్షి'కథనమిది.


బిచ్కుంద మండలం మల్కాపూర్ హనుమాన్ ఆలయం

ఊరు 'నామ'మాత్రం!

రెవెన్యూ రికార్డుల్లో ఊళ్లుగా నమోదు | **మరికొన్ని శివారు గ్రామాలుగా...** | **ఇళ్లు ఉండవు.. మనుషులు నివసించరు**


కామారెడ్డి మండలం భూకోన్‌పల్లిలో హనుమాన్ ఆలయం

కామారెడ్డి జిల్లాలో పూర్వీకులు వలస వెళ్లడంతో కొన్ని ఊళ్లు కనుమరుగైతే.. మరికొన్ని చోట్ల ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ఇంకొన్ని చోట్ల గుడులు, ఆలయాలు మిగిలాయి.

- గాంధారి మండలంలో బంగారువాడి, కోనాయిపల్లి గ్రామాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. కానీ అక్కడ జనాలెవరూ నివసించరు. వ్యవసాయ భూముల్లో పంటలు మాత్రం సాగవుతున్నాయి. వందల ఏళ్ల కిందట అక్కడ ఊళ్లు ఉండేవని చెబుతారు.
- కామారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలోని తాడ్వాయి మండలంలో అబ్దుల్లా నగర్ పేరుతో రెవెన్యూ రికార్డుల్లో ఊరుంది. వందల ఎకరాల భూములున్నాయి. అక్కడ అన్ని పంట చేలు, గుట్టలు, చెట్లు ఉన్నాయి. ఈమధ్య ఆ ప్రాంతంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు కొనుగోలు చేసి వెంచర్లు మొదలుపెట్టారు.
- కామారెడ్డి పట్టణ శివార్లలో సరంపల్లి గ్రామ పరిధిలో భూకన్‌పల్లి అనే ఊరుంది. అక్కడ ప్రఖ్యాత హనుమాన్ ఆలయం ఉంది. సరంపల్లి గ్రామ పరిధిలోకి వచ్చే భూకన్‌పల్లి హనుమాన్ ఆలయం వద్దకు భక్తులు వస్తుంటారు. సరంపల్లి గ్రామస్తులకు ఇంటి దైవం కూడా. చాలామంది ఆ ఊరి జనం తమ పిల్లలకు అంజయ్య, ఆంజనేయులు, అంజవ్వ, అంజమ్మ అనే పేర్లు పెట్టుకున్నారు. కొన్ని కుటుంబాల్లో అయితే పెద్ద అంజయ్య, చిన్న అంజయ్య అన్న పేర్లు కూడా ఉండడం విశేషం.

యాభైకి పైగా ఉనికిలో లేని గ్రామాలు

కామారెడ్డి జిల్లాలో ఉనికిలో లేని రెవెన్యూ గ్రామాలు యాభైకి పైగా ఉంటాయని అంచనా. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఉనికి కోల్పోయిన ఆ ఊళ్లలో వ్యవసాయం మాత్రం కొనసాగుతోంది. కామారెడ్డి పట్టణానికి సమీపంలోని గ్రామాల్లో అయితే భూముల విలువ విపరీతంగా ఉంది. ఊరులేని ఊరిలో భూముల ధరలు మాత్రం ఆకాశాన్నంటడం విశేషం.



- మాచారెడ్డి మండల కేంద్రం పరిధిలో పోలోనిపల్లి అనే పేరుతో ఓ ఊరుంది. అక్కడ అప్పట్లో కొన్ని కుటుంబాలు నివసించేవి. కాలక్రమేణ వారంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. వ్యవసాయ భూ ములున్నాయి. అక్కడి పురాతన రామాలయం వద్ద తపోవనాశ్రమానికి భక్తులు వచ్చిపోతుంటారు.
- బిచ్కుంద మండలంలో 200 ఏళ్ల కిందట మల్కాపూర్ గ్రామం ఉండేది. ఇప్పుడు అక్కడ గ్రామం లేదు. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం నమోదైంది. బిచ్కుంద మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని ఆ ఊరిలో హనుమాన్ ఆలయం ఉంది. ఏటా ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.


నస్రుల్లాబాద్ మండలం తిమ్మానగర్ గ్రామంలో గుడి, కోట ఆనవాళ్లు

బాన్సువాడలో వాసుదేవునిపల్లి ఉంది. చింతల నాగారం పేర్లతో ఊళ్లున్నాయి. కానీ అక్కడ ఇళ్లు లేవు. మనుషులు ఉండరు. పొలాలు మాత్రమే ఉన్నాయి.

దోమకొండ మండలం లింగుపల్లి సమీపంలో కుందారం అనే గ్రామం రికార్డుల్లో ఉంది. ఇక్కడ ఎలాంటి ఇళ్లు లేవు.

నస్రుల్లాబాద్ మండలం తిమ్మానగర్ పేరుతో రెవెన్యూ రికార్డుల్లో ఊరుంది. అక్కడ ఎలాంటి నివాసాలు లేవు. పూర్వ కాలంలో కోట ఉన్న ఆనవాళ్లున్నాయి. పాత గుడి ఉండగా, కొత్తగా నిర్మాణం మొదలుపెట్టారు.

ఇదే మండలంలోని పోశెట్టిపల్లి అనే పేరుతో రికార్డుల్లో ఊరుంది. అక్కడ ఇళ్లు లేవు. వ్యవసాయ భూములున్నాయి. ఈ రెండు ఊళ్ల పరిధిలోని భూములు బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన వారికే ఉన్నాయి. కాగా ఆయా గ్రామాలు ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. ఆ గ్రామాల పేరుతోనే పట్టా పాస్ పుస్తకాలు జారీ అవుతాయి.

మహిళలకు 'అభయ'ం

- ఆటోల్లో మహిళల సురక్షిత ప్రయాణానికి ప్రత్యేక యాప్
- ఆటోలో డ్రైవర్, వివరాలతో క్యూఆర్ కోడ్
- ఆపద ఎదురైతే స్కాన్ చేస్తే సరి
- పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఆటో లైవ్ లొకేషన్
- ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సదుపాయం
- సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో అమలు



ఆటోలకు అభయ యాప్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను అతికిస్తున్న సీపీ అనురాధ (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: ఒంటరిగా ఆటోలో ప్రయాణించేందుకు మహిళలు ఆందోళన చెందనక్కరలేదు. అనుకోని సంఘటనలు ఎదురవుతాయని సంకోచించనక్కరలేదు. ఏ సమయంలోనైనా మహిళల సురక్షిత ప్రయాణానికి పోలీస్ శాఖ వినూత్న విధానానికి రూపకల్పన చేసింది. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా అభయ యాప్‌ను 'మై ట్యాక్సీ సేఫ్'ట్యాగ్ లైన్‌తో రూపకల్పన చేసింది. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో అమలవుతున్న ఈ వినూత్న విధానంపై సాక్షి కథనమిది.

ఆటో డ్రైవర్ సీటు వెనకాలే..

ఇన్నాళ్లు ఒంటరిగా యువతులు, మహిళలు ఆటోలో ప్రయాణించాలంటే కొంత ఇబ్బంది పడేవారు. ఇకపై ఆటోలో ప్రయాణించేటప్పుడు వారికి మరింత భద్రత లభిస్తుంది. ప్రతి ఆటోలో.. ఆటో వివరాలతో పొందుపరిచిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను.. ఆటో డ్రైవర్ సీటు వెనకాల అంటిస్తున్నారు.

స్కాన్ చేస్తే ఆటో డ్రైవర్ వివరాలు

ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో సురక్షితంగా లేమని భావిస్తే.. డ్రైవర్ సీటు వెనకాల అతికించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. గూగుల్ క్రోమ్ ద్వారా కెమెరా బటన్ నొక్కి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. ఇది లేకపోతే క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్కానింగ్ చేసే వీలుంది. వెంటనే డ్రైవర్ ఫొటో, వివరాలతో పాటు ఆటో వివరాలు కూడా వస్తాయి. స్కాన్ చేసిన మహిళ ఏదైనా ఆపదలో ఉంటే.. మొబైల్ నంబర్‌ను యాప్‌లో నమోదు చేసి 'ట్రేస్ ద లొకేషన్'నమోదు చేయాలి. అత్యవసర కాల్, అత్యవసర ఫిర్యాదు నమోదు చేసిన వెంటనే.. ప్రయాణికురాలు ప్రయాణిస్తున్న ఆటో లైవ్ లొకేషన్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్తుంది. ఆటో దిగేవరకు కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగే అవకాశం ఉంటే.. కమాండ్ రూమ్ ద్వారా సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగానే.. అక్కడి పోలీసులు వెళ్లి తగు రక్షణ చర్యలు తీసుకుంటారు. ఆటోలో ఏమైనా వస్తువులు మరిచిపోయినా.. ఆటోను వెంటనే గుర్తించే అవకాశం ఉంటుంది.

ఈ ఆటో సేఫేనా?

ప్రయాణించే ముందు ఈ ఆటో సేఫేనా? అన్నది స్కాన్ చేసి తెలుసుకోవచ్చు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే ఆటో సేఫ్ కాకపోతే 'నాట్ సేఫ్.. రెడ్ సిగ్నల్'అని వస్తుంది. ఇది మహిళల సురక్షిత ప్రయాణానికి దోహదపడుతుంది. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించినా, నిర్లక్ష్యంగా నడిపినా, తాగి నడిపినా, హిట్ అండ్ రన్ చేసినా కూడా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ప్రయాణికులు తాము ప్రయాణిస్తున్న వాహనానికి రేటింగ్ కూడా ఇవ్వొచ్చు. ఇందుకు 'మై ట్యాక్సీ సేఫ్'అని ట్యాగ్‌లైన్‌ను పొందుపరిచారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుమారు 2,500 ఆటోలుండగా.. ఇప్పటివరకు 1,450 ఆటోలను అభయ యాప్‌లో వివరాలతో నమోదు చేశారు.

మహిళలకు మరింత రక్షణ



అభయ యాప్ మహిళలకు మరింత రక్షణకు దోహదపడుతుంది. జిల్లాలోని ఆటోలన్నిటినీ అభయ యాప్ పరిధిలోకి తీసుకొస్తున్నాం. ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో.. డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లొకేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి. ఆటో లొకేషన్ మా కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది. వెంటనే మా సిబ్బంది స్వయంగా పర్యవేక్షిస్తారు. ఈ యాప్ ప్రయాణికులు..ఆటో డ్రైవర్లకు కూడా రక్షణగా ఉంటుంది.

– డాక్టర్ అనురాధ, పోలీసు కమిషనర్, సిద్దిపేట

మాకెంతో ఉపయోగం



అభయ యాప్ మాకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ప్రయాణికులకు ఎంతో రక్షణగా ఉంటుంది. బీమా సైతం చేయించడంతో మా కుటుంబానికి ఎంతో భరోసా ఉంటుంది.

– రాజమల్లు, ఆటో డ్రైవర్

ఆటో డ్రైవర్లకు కూడా రక్షణ

అభయ యాప్‌లో ఆటో డ్రైవర్ వివరాలు నమోదు చేయించుకునేందుకు రూ.300 చెల్లించాలి. ఆటో వివరాలు నమోదు చేసిన తర్వాత మూడు క్యూఆర్ కోడ్‌ల స్టిక్కర్లు ఇస్తారు. ఒకటి ఆటోకు ముందు.. ఆటో డ్రైవర్ సీటు వెనకాల, మరొకటి ఆటో వెనకాల అతికించాలి. మరో రూ.50తో ఆటో డ్రైవర్‌కు బీమా చేయిస్తున్నారు. ఆటో డ్రైవర్ ప్రమాదంలో మరణిస్తే రూ.లక్ష అందించనున్నారు. ఈ బీమా ఏడాది పాటు వర్తిస్తుంది. ఇలా ఈ యాప్ డ్రైవర్, ప్రయాణికులకు ఉపయోగపడుతుంది.

మత్స్యశాఖ ప్రగతికి మకుటం

రాష్ట్ర మత్స్యశాఖకు ఉత్తమ అంతర్గత మత్స్యకారుల జాతీయ అవార్డు

2024లో చేపట్టిన అభివృద్ధి, వినూత్న కార్యక్రమాలకు గుర్తింపు

సాక్షి, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ 2024లో చేపట్టిన అభివృద్ధి, వినూత్న కార్యక్రమాలకు 'ఉత్తమ అంతర్గత మత్స్యకారుల జాతీయ అవార్డు'ను గెలుచుకుంది. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో.. కేంద్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలశాఖ మంత్రి రాజీవ్ సింగ్ అవార్డును ప్రదానం చేశారు. అవార్డును తెలంగాణ మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక ఆల అందుకున్నారు. ఈ పురస్కారాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు.

అవార్డు ఎందుకంటే?

రాష్ట్రంలో 5,901 మత్స్య సహకార సంఘాలు 4,13,120 సభ్యులతో పనిచేస్తున్నాయి. డిసెంబర్ 2023 నుండి 225 కొత్త సంఘాలను ఏర్పాటు చేసి, 8,069 కొత్త సభ్యులను చేర్చడం ద్వారా సహకార సంఘాల విస్తరణను బలోపేతం చేసింది. మొత్తం 4.16 లక్షల మత్స్యకారుల బీమా కోసం.. రూ.139.77 లక్షల ప్రీమియం చెల్లించి ఆదర్శంగా నిలిచింది. కొత్త మత్స్య కుంటల నిర్మాణానికి రూ.2,145.44 లక్షల వ్యయంతో 195.94 హెక్టార్లకు అనుమతులు మంజూరు చేసింది.

కొర్రమీను చేపల సంరక్షణకు..

మంచిర్యాల జిల్లా ఎల్లంపల్లి జలాశయం వద్ద కొర్రమీను చేపల సంరక్షణ కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఐసీఏఆర్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్‌వాటర్ ఆక్వాకల్చర్ (సీఐఎఫ్ఏ) సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో ఆధునిక మత్స్య మార్కెట్ నిర్మాణం జరుగుతోంది. 'ఇందిర మహిళా శక్తి' పథకంలో 32 మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లను 60% సబ్సిడీతో మహిళా సంఘాలకు అందజేయనున్నారు. ఈ ఏడాది 4.56 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తితో రూ.7,059.04 కోట్ల ఆదాయాన్ని సాధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్స్యరంగం కీలకపాత్ర పోషించింది. ఈ విజయాలతో తెలంగాణ రాష్ట్రం దేశంలో మత్స్యరంగంలో నూతన ఒరవడి సృష్టించి అగ్రస్థానంలో నిలిచింది.



'ఉత్తమ అంతర్గత మత్స్యకారుల జాతీయ అవార్డు'ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక ఆల తదితరులు

రాష్ట్రపతితో మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు భేటీ

సాక్షి, హైదరాబాద్: తాను రచించిన 'తెలంగాణ ప్రాంత గిరిజనుల సమస్యలు, వాటికి చట్టపరమైన పరిష్కారాలు' పుస్తకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు.. మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్ రావు అందజేశారు. రాజ్‌భవన్‌లో శుక్రవారం రాష్ట్రపతిని విద్యాసాగరరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఏజెన్సీ, ఇతర ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆ సమస్యలకు చట్టపరంగా చూపాల్సిన పరిష్కారాలను తన పుస్తకంలో పొందుపరిచినట్టు విద్యాసాగర్‌రావు వివరించారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల అవినీతిపై రాహుల్ దృష్టి సారించాలి

బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న అవినీతిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టి సారించాలని బీజేపీ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి సూచించారు. కుట్రలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ప్రధాని మోదీ, అదానీలపై విమర్శలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అదానీకి రెడ్ కార్పెట్ వేస్తుంటే.. రాహుల్ గాంధీ మాత్రం విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు తమకు అనుకూలంగా రావడం లేదని అర్థం కావడంతో ప్రజల దృష్టి మళ్లించడానికి రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని పొంగులేటి ఆరోపించారు. ఈమేరకు ఢిల్లీలో ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈర్ష్య, అసూయతోనే రాహుల్ గాంధీ ప్రధాన మోదీ, అదానీలపై బురద జల్లే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చైనాతో కాంగ్రెస్ పార్టీ చేసుకున్న ఒప్పందం ప్రకారం రాహుల్ గాంధీ విమర్శలు చేస్తున్నట్లు అనుమానం వ్యక్తం అవుతోందన్నారు. దేశ, విదేశాల్లో ప్రధాని మోదీకి వస్తున్న ఆదరణను ఓర్చుకోలేక రాహుల్ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పు జరిగితే చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని, దానికి బీజేపీ అడ్డు రాదని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాస్తా ఇప్పుడు ఇండియన్ కమర్షియల్ కాంగ్రెస్‌గా మారిందని పొంగులేటి మండిపడ్డారు.

బీఆర్ఎస్‌లో మిగిలేది ఐదారుగురు ఎమ్మెల్యేలే

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమని, ఆ పార్టీలో ఐదారుగురు ఎమ్మెల్యేలు తప్ప ఎవరూ మిగలరని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నన్నాళ్లు నిర్లజ్జగా రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన బీఆర్ఎస్ నేతలు, పాపాలు గోచీలో పెట్టుకుని కాశీకి వెళ్లిన తరహాలో వ్యవహరించారని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేల అనర్హత విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్‌కు చెంప పెట్టులాంటిదన్నారు. అన్ని విషయాలు తెలిసి కూడా ఈ విషయంలో బీఆర్ఎస్ కోర్టుకు వెళ్లిందన్నారు. కోర్టు తీర్పు రాకుండానే ఉప ఎన్నికలు వచ్చేసినట్టు కేటీఆర్ ఎగిరెగిరి పడ్డారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, పార్టీలకు పార్టీలను విలీనం చేసుకున్నారని, ప్రతిపక్ష పార్టీలు ఎంత గగ్గోలు పెట్టినా కేసీఆర్ లెక్క చేయలేదని మండిపడ్డారు. అధికారం పోయిన తర్వాత బీఆర్ఎస్‌కు రాజ్యాంగం, న్యాయస్థానాలు గుర్తుకు వచ్చాయని అన్నారు.

ఆరుగురు డీఈవోల మార్పు

సాక్షి, హైదరాబాద్: ఆరుగురు జిల్లా విద్యాశాఖాధికారులకు (డీఈవో) అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల డీఈవో జగన్‌మోహన్ రెడ్డికి రాజన్న సిరిసిల్ల, జనగాం డీఈవో శ్రీరామ్‌కు జగిత్యాల జిల్లా బాధ్యతలు అప్పగించారు. రాజన్న సిరిసిల్ల డీఈవోను నాగర్‌కర్నూల్‌కు మార్చారు. జనగాం ఏడీకి అదే జిల్లాకు డీఈవోగా పోస్టింగ్ ఇచ్చారు. నాగర్‌కర్నూల్ డీఈవో గోవింద రాజులుకు నారాయణపేట, గద్వాల్ బాధ్యతలు అప్పగించారు. నారాయణపేట డీఈవోగా ఉన్న మహ్మద్ అబ్దుల్ ఘనీని వనపర్తికి బదిలీ చేశారు.

దౌడు తీస్తుంటే 'భౌ'గుంది

శునకాలకు పరుగు పందెం పోటీలు


గట్టులో శునకాలకు పరుగు పందెం పోటీలు

గట్టు (జోగుళాంబ గద్వాల జిల్లా): జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలకేంద్రంలోని భవానీమాత జాతర సందర్భంగా శుక్రవారం శునకాలకు పరుగు పందెం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 20 శునకాలు పోటీల్లో పాల్గొన్నాయి. కుచినేర్లకు చెందిన వెల్డింగ్ రాముడి శునకం మొదటిస్థానంలో నిలిచి రూ.10 వేలు దక్కించుకుంది. బల్గెరకు చెందిన మల్లయ్య శునకం రెండోస్థానంలో నిలిచి రూ.6 వేలు, కర్ణాటకలోని కద్లురుకు చెందిన గొరేశ్ శునకం మూడో స్థానంలో నిలిచి రూ.4 వేలు, పులికల్ రాజాపురానికి చెందిన మల్లయ్య శునకం నాలుగో స్థానంలో నిలిచి, రూ.2 వేలు దక్కించుకున్నాయి. విజేతలకు పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, బజారి, సుదర్శన్‌రెడ్డి, ప్రాణేశ్‌లు బహుమతులు అందజేశారు.

కొలువుల్లోనూ విభిన్న 'ప్రతిభావంతులు'

> విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, వారు నిలదొక్కుకునేలా నైపుణ్య శిక్షణ అందించడం సామాజిక బాధ్యతగా కంపెనీలు భావిస్తున్నాయి.
> – సౌందర్య రాజేష్, అవతార్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్

> ఐటీసీ హోటల్స్‌తో పాటు అనుబంధ సంస్థల్లో 390 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు ఇచ్చాం. వారికి తగిన శిక్షణ ఇస్తున్నాం, బ్రెయిలీ సంకేతాలు, సులభంగా వెళ్లి వచ్చేందుకు అనుకూలమైన ర్యాంప్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.
> – అమిత్ ముఖర్జీ, ఐటీసీ హెచ్‌ఆర్ హెడ్

- భారతీయ కంపెనీల్లో పెరుగుతున్న నియామకాలు
- 58శాతం నుంచి 98శాతానికి పెరిగిన దేశీయ సంస్థల నియామకాలు
- ఉద్యోగంతోపాటు సాధికారతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ
- 155 కంపెనీలపై ఎంఐసీఐ సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: ఉరుకులు పరుగులు పెట్టే ఉద్యోగ ప్రపంచంలో పోటీ తట్టుకుని నిలబడాలన్నా, నిలిచి గెలవాలన్నా విభిన్న ప్రతిభావంతులకు ఒకింత కష్టం. దీంతో సాధారణంగా కార్పొరేట్ కంపెనీలు సైతం అన్ని అవయవాలూ బాగున్నవారిని ఉద్యోగంలో చేర్చుకుంటే ఉత్పాదకత బాగుంటుందని భావిస్తుంటాయి. అయితే ప్రస్తుతం పరిస్థితుల్లో మార్పు వస్తోంది. దేశీయ కార్పొరేట్ కంపెనీలు సామాజిక బాధ్యతగా విభిన్న ప్రతిభావంతులకు కొలువుల్లో ప్రాధాన్యం ఇస్తున్నాయి. అనేక విభాగాల్లోని పోస్టుల్లో వారి నియామకాన్ని వేగవంతం చేయడమే కాకుండా సాధికారత సాధించేలా ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ కూడా ఇస్తున్నాయి. దేశంలోని 155 భారతీయ కంపెనీలపై అవతార్ సంస్థ నిర్వహించిన 'మోస్ట్ ఇన్‌క్లూజివ్ కంపెనీస్ ఇండెక్స్(ఎంఐసీఐ) సర్వే నివేదికలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. విభిన్న ప్రతిభావంతులకు అవకాశాలు ఇస్తున్న కంపెనీలు 2019లో 58శాతం ఉండగా తాజాగా 98శాతానికి పెరిగాయి. వీరికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వడంలో మిడ్–క్యాప్ ఐటీ సేవల సంస్థ ఎంఫాసిస్ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోంది. నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఫర్ డిజేబుల్డ్ పీపుల్(ఎన్‌సీపీఈడీపీ) అనే జాతీయ స్వచ్ఛంద సంస్థ ఉద్యోగ నియామకాల్లో తన వంతు చొరవ చూపిస్తోంది. ఈ సంస్థ 'ది మిస్సింగ్ మిలియన్' ప్రాజెక్ట్‌లో దేశంలోని విభిన్న ప్రతిభావంతుల సంఖ్య, వారికి ఉన్న వైకల్యా రకాలు, అవసరమైన నైపుణ్యం, అందించాల్సిన సహకారం వంటి వివరాలను సేకరించి అందుబాటులోకి తెస్తోంది. దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 2.68 కోట్ల మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నట్టు లెక్కలు తేల్చారు. వాస్తవానికి అన్ని రకాల వైకల్యాలను పరిగణనలోకి తీసుకుని తాజాగా సర్వే నిర్వహిస్తే 10 కోట్లకుపైగా ఉంటారని అంచనా. వీరికి తగిన విద్యను అందించి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించగలిగితే ఆర్థికంగా పురోగతి సాధించగలుగుతారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

ఉద్యోగం.. నైపుణ్యం

యువతతో పోటీపడి విభిన్న ప్రతిభావంతులు రాణించాలంటే వారు చదువు ద్వారా సాధించిన ఉద్యోగానికి తోడు సరైన నైపుణ్య శిక్షణ కూడా అవసరమని అనేక కంపెనీలు గుర్తించి ఆదిశగా దృష్టిపెట్టాయి. వారి విద్యకు తగిన ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఏ విధమైన శిక్షణ అవసరమో గుర్తించి అందిస్తున్నామని స్పార్కిల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్–కమ్యూనికేషన్స్ వైస్ ప్రెసిడెంట్, హెడ్ దీపా నాగరాజ్ తెలిపారు. సామాజిక బాధ్యతగా ఐటీసీ సంస్థ బెంగళూరులో విభిన్న ప్రతిభావంతులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత కోల్‌కతా, హౌరాల్లో నిర్వహించింది. ఇక్కడ సాంకేతిక నైపుణ్యంతోపాటు వ్యక్తిత్వ వికాసం, నిర్వహణ, నైపుణ్య శిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపు వంటి వాటిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ నియామకాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దారు. విభిన్న ప్రతిభావంతుల కోసం పని చేస్తున్న సార్థక్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి అమెజాన్ సంస్థ గతేడాది గురుగ్రామ్‌లో గ్లోబల్ రిసోర్స్ సెంటర్(జీఆర్‌సీ)ని ప్రారంభించింది. ఈ కేంద్రంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు వారికి అవసరమైన సాయం, ఉద్యోగ అవకాశాలను అందించేలా తోడ్పడుతోంది. వినికిడిలోపం, దృష్టిలోపం, లోకోమోటర్ వైకల్యాలు ఉన్న వారికి తగిన శిక్షణ అందించి ఉపాధి చూపేలా దృష్టి సారించింది.

డ్రోన్ ఆపరేషన్‌లో శిక్షణ



గరుడ ఏరోస్పేస్ డ్రోన్ తయారీ కంపెనీ విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈక్వాలిటీ డ్రోన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇటీవల చెన్నైలో పది రోజులపాటు వారికి ఉచిత నైపుణ్య శిక్షణ అందించింది. అంధ సంఘాల నుంచి సేకరించిన సమాచారంతో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ దృష్టిలోపం ఉన్న వారికి బ్రెయిలీ బీమా పాలసీని ప్రారంభించింది.

భారతీయ సంస్కృతిపై విదేశీయుల ఆసక్తి



- చీర, పంచె కట్టులో పలువురి దర్శనం
- శ్రీసత్యసాయి సేవలను కొనియాడిన విదేశీయులు
- నేడు శ్రీసత్యసాయి బాబా 99వ జయంతి

సాక్షి, పుట్టపర్తి (శ్రీసత్యసాయి జిల్లా): దేశ, విదేశాల నుంచి వచ్చిన మహిళలు భారతీయ సంస్కృతిపై ఇష్టం పెంచుకున్నారు. చీర, పంచెకట్టులో దర్శనమిచ్చారు. వివిధ దేశాల నుంచి వచ్చి అక్కడి విధానాలను పరిచయం చేయడమే కాకుండా.. స్థానిక అలవాట్లను వంటబట్టించుకున్నారు. సత్యసాయిబాబా నడయాడిన పుట్టపర్తికి పలు దేశాల నుంచి భక్తులు నిత్యం వస్తుంటారు. తెలుగోడి ఖ్యాతిని ప్రపంచ స్థాయికి సత్యసాయి తీసుకెళ్లారని చెబుతున్నారు. అంతేకాకుండా శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు సేవలు మరువలేనివని కొనియాడుతున్నారు. ఓసారి పుట్టపర్తికి వస్తే.. మళ్లీ మళ్లీ రావాలనిపిస్తోందని చెబుతున్నారు. ఎన్ని సమస్యలతో వచ్చినా.. మందిరంలో అడుగు పెట్టాక ప్రశాంతత వస్తుందని పేర్కొంటున్నారు. శనివారం శ్రీసత్యసాయి 99వ జయంతి సందర్భంగా విదేశీయులతో 'సాక్షి' మాటామంతీ..

ప్రశాంతతకు మారుపేరు



పుట్టపర్తికి చాలా ఏళ్ల నుంచి వస్తున్నా. వచ్చిన ప్రతిసారీ నెల రోజులు ఉంటా. ఫుడ్ బాగా నచ్చింది. తెలుగు నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నా. చీరకట్టు చాలా నచ్చింది. సత్యసాయి కోట్ల మంది గుండెల్లో కొలువై ఉన్నారు. – మెరియిల్లె, ఫ్రాన్స్

మళ్లీ మళ్లీ రావాలనిపిస్తోంది



పుట్టపర్తి గురించి చాలా ఏళ్లుగా వింటున్నా. తొలిసారి 15 రోజుల క్రితం వచ్చా. ఇక్కడే ఉండాలనిపిస్తోంది. ఒక వ్యక్తి ఇంతమందికి ఓ శక్తిలా మారి.. ఒక ఊరిని తయారు చేశారంటే మామూలు విషయం కాదు. – ఒట్టావి, ఫ్రాన్స్

సంప్రదాయాలు బాగున్నాయి



తెలుగు సంప్రదాయం నచ్చింది. చీరకట్టుకోవడం, తెలుగు వంటకాలు నేర్చుకున్నా. సెంట్రల్ ట్రస్టు సేవలు చాలా బాగున్నాయి. విద్య, వైద్యంపై భగవాన్ శ్రీసత్యసాయి సేవలను చరిత్ర మరువదు. – డానేలా, ఇటలీ

సాయిబాబా వ్యక్తి కాదు.. శక్తి



1980 నుంచి పుట్టపర్తికి వస్తున్నా. సాయిబాబా ఓ వ్యక్తి కాదు.. ఆయన ఓ శక్తి. ఇక్కడ చాలామంది పరిచయమయ్యారు. సొంత బంధువుల్లా ఆదరిస్తారు. తెలుగు కూడా మాట్లాడటం నేర్చుకున్నా. – లిండా, లండన్

సాయిబాబానే బతికించారు



ఇక్కడకు చాలాసార్లు వచ్చాను. నేను మూడుసార్లు రోడ్డు ప్రమాదాలకు గురయ్యా. బాబానే బతికించాడని నమ్ముతున్నా. ఏటా బాబా జయంతి వేడుకలు మిస్ కాకుండా వస్తా. దోశ అంటే చాలా ఇష్టం. – ఫెర్నాండో, ఇటలీ

అతిథులకు లోటు రానివ్వం

భగవాన్ శ్రీసత్యసాయి బాబా భక్తులకు ఎలాంటి లోటు రానివ్వం. ఏ దేశం నుంచి అతిథులు వచ్చినా సాదరంగా స్వాగతిస్తాం. వారికి కావాల్సిన వసతి ఏర్పాటు చేస్తున్నాం. బాబా ఆశయాల సాధన మేరకు శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు సేవలు ఉన్నాయి. చిన్న గ్రామాన్ని ప్రపంచానికే పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి భగవాన్ శ్రీసత్యసాయిబాబా.
– ఆర్‌జే రత్నాకర్‌రాజు, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ

మరిన్ని నిధుల మంజూరుకు వరల్డ్ బ్యాంక్ అంగీకారం

ఏపీ ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈలకు అందిస్తోన్న ప్రోత్సాహకాలు, కార్యక్రమాల అమలు తీరును ప్రపంచబ్యాంక్ ప్రతినిధులు ప్రశంసించారని, ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయడానికి అంగీకరించినట్లు ఏపీ ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్ తెలిపారు. రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈలను పటిష్టం చేయడానికి గత ప్రభుత్వ హయాంలో ప్రపంచబ్యాంకు నిధులతో మొదలు పెట్టిన రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్‌ఎంఈ ఫెర్మామెన్స్ (ర్యాంప్) పథకం అమలు తీరును ప్రపంచబ్యాంకు ప్రతినిధులు పరిశీలించారు. శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నైపుణ్య శిక్షణను అందించడం ద్వారా కొత్త పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఏపీలో ఎంఎస్‌ఎంఈల పనితీరుపై ప్రపంచబ్యాంకు ప్రతినిధుల బృందం కేంద్రానికి తుది నివేదిక ఇవ్వనుందని, అనంతరం రాష్ట్రానికి మరిన్ని నిధులు వచ్చే అవకాశముందన్నారు. ప్రపంచబ్యాంకు ప్రతినిధులు కేఆర్ రాజేశ్వరి, అతుల్ ఇనందార్, మిలన్ శర్మ, హర్ష ఝూన్‌ఝూరియా తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సెలవులపై ఆంక్షలు సరికాదు: పీటీఎఫ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సెలవుల వినియోగంపై ఆంక్షలు సరికాదని ఆంధ్రప్రదేశ్ పూలే టీచర్స్ ఫెడరేషన్ ఓ ప్రకటనలో ఖండించింది. సెలవులపై ఆంక్షలు విధించడం ఇబ్బందికర పరిణామమని, తమను ఒత్తిడికి గురి చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

పనివేళల పెంపు రద్దు చేయండి

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనివేళలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు పెంచుతూ పైలట్ ప్రాజెక్టు పేరుతో అమలు చేయాలన్న ఉత్తర్వులను నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని, తక్షణమే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేసింది.

పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులను పునరుద్ధరించాలి

పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులను పునరుద్ధరించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా జిల్లా పరిషత్ సీనియర్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేసింది.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 60,802 మంది స్వామిని దర్శించుకోగా 21,930 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.21 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేకాలు



చౌడేపల్లె: చిత్తూరు జిల్లాలో పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. తొలుత వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారి గర్భాలయాన్ని మామిడి, వేపాకు, పూల తోరణాలతో ముస్తాబు చేశారు. కార్తీక మాసం మూడో శుక్రవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఉపవాస దీక్షలతో తరలి వచ్చిన అమ్మవారికి పూజలు చేశారు.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



తిరుచానూరు (చంద్రగిరి) : తిరుచానూరు శ్రీపద్మావతీదేవి శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సిరులతల్లిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు పాంచరాత్ర ఆగమోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం అలంకార మండపంలో తిరుచ్చిపై ఆశీనులైన శ్రీవారి పట్టపురాణి, నాలుగు మాడవీధులలో ఊరేగారు.

ఆగమోక్తంగా లక్ష బిల్వార్చన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహించారు. మొదట స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, రుత్వికులు ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యా సమాచారం

రీసెర్చ్ అసోసియేట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: మహిళా వర్సిటీలో రీసెర్చ్ అసోసియేట్, సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఎం–ఉషా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ సి.వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం–ఉషా, ఎంఈఆర్‌యూ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వ మంజూరు చేసిన ప్రాజెక్టుల కోసం పనిచేసేందుకు నియామకాలకు పూనుకున్నట్లు తెలియజేశారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వచ్చే నెల 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పాఠశాలల పని వేళల పెంపు సరికాదు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టనున్న పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయం తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షిని తమ కార్యాలయంలో ఆపస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల పని సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించడం వల్ల ఉపాధ్యాయులే కాకుండా విద్యార్థులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పుడు ఉన్న పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగించాలని కోరారు.

వైవీయూ, కేరళ క్రైస్ట్ కళాశాల మధ్య ఎంఓయూ

వైవీయూ : యోగివేమన విశ్వ విద్యాలయంలోని ఎర్త్ సైన్సెస్ విభాగం, కేరళలోని ఇరింజలగూడ క్రైస్ట్ కాలేజీ(అటానమస్) జియాలజీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ఎర్త్ సైన్సెస్ హెచ్‌ఓడీ ఆచార్య తుమ్మలకుంట శివప్రతాప్, లక్ష్మీప్రసాద్, క్రైస్ట్ కాలేజీ ఆచార్యులు లింటో అలప్పట్, డాక్టర్ రేష్మి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో కడప మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 17,18,19 తేదీలలో చిలుకలూరిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్–14 క్యాటగిరి విభాగంలో వినయ్ కుమార్, అకాష్, యశ్వంత్, రవికుమార్ ప్రథమ స్థానం, అండర్–17 విభాగంలో యశ్వంత్, దీపు, మణికంఠ ద్వితీయ స్థానం సాధించారు.

మీడియా పాయింట్

అధికార మత్తులో మంత్రి సవిత వ్యాఖ్యలు



మంత్రి సవిత వ్యాఖ్యలు హేయమైనవి. ఒక మహిళా మంత్రిగా ఉండి ఇలా మాట్లాడటం సిగ్గుచేటు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు కనీస విలువ లేదు. వైఎస్ జగన్ మహిళలకు పెద్దపీట వేశారు. మహిళలను కించపరిచే సంస్కృతి చంద్రబాబుది. 2014 –19లో సీఎంగా ఉన్న చంద్రబాబే మహిళలను కించపరిచేలా మాట్లాడారు. నోటితో చెప్పలేని విధంగా బాలకృష్ణ మహిళలను అవమానించారు. తక్షణమే మహిళలందరికీ మంత్రి సవిత క్షమాపణ చెప్పాలి. బీసీ మహిళా మంత్రి అయి ఉండి అధికార మత్తులో మహిళలు గంజాయి మత్తుకు అలవాటు పడ్డారని దారుణంగా మాట్లాడారు.
– వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ.

సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి



బాధ్యత గల మంత్రులు సభలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. మంత్రి సవిత మహిళలను అవమానించేలా మాట్లాడారు. సంక్షేమాన్ని అద్భుతంగా అమలు చేసిన నాయకుడు వైఎస్ జగన్. మహిళలు గంజాయి, మద్యానికి బానిసలైపోయారని మంత్రి అనడం దారుణం. సవిత వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. ఆరు నెలల కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను అవమాన పరచడమే లక్ష్యంగా పెట్టుకుంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వయంగా హోం మంత్రిని అవమానపరుస్తూ లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ముస్లిం మైనారిటీల గురించి చులకనగా మాట్లాడారు. మంత్రి సవిత మాట్లాడుతూ జగన్ డీబీటీ ద్వారా అకౌంట్లలో వేసిన డబ్బులతో మహిళలు గంజాయికి అలవాటు పడ్డారని చాలా నీచంగా మాట్లాడారు.
– కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ.

మహిళలకు సవిత క్షమాపణలు చెప్పాలి



సభలో మంత్రి సవిత తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. ఆమె తక్షణమే రాష్ట్రంలోని మహిళలకు క్షమాపణ చెప్పాలి. మంత్రి పదే పదే సభలో కాపుల గురించి ప్రస్తావించారు. ఈ ఆరు నెలల్లో కాపులకు మీరు ఏం చేశారో చెప్పాలి. పది వేల కోట్లు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదు. దేశంలో ఎవరూ చేయనంత సంక్షేమం కాపులకు వైఎస్ జగన్ చేశారు. శాసనమండలిలో బీసీ మంత్రి తీవ్రమైన పదాలు ఉపయోగిస్తున్నారు. గతంలో డీబీటీ క్రింద డబ్బులు తీసుకున్న మహిళలు గంజాయి మత్తుకు అలవాటు పడ్డారని మహిళా మంత్రి మాట్లాడటం కరెక్ట్ కాదు.
– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ

తోటి మహిళలను అవమానిస్తారా?



ఎస్సీ, బీసీ, మైనార్టీలను అవమానించేలా కూటమి నేతల వైఖరి ఉంది. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్..హోంమంత్రిని చులకన చేసి మాట్లాడారు. దళిత హోంమంత్రి పదవిలో ఉండటం వల్లే చులకనగా మాట్లాడారని మేం భావిస్తున్నాం. మంత్రి సత్యకుమార్ ముస్లిం, మైనార్టీలను కించపరిచేలా మాట్లాడారు. ఈరోజు మంత్రి సవిత.. మహిళలు గంజాయి, మద్యానికి అలవాటుపడిపోయారంటున్నారు. మంత్రులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వెనుక పెద్దలు ఉన్నారని మేం భావిస్తున్నాం. ఇలాంటి వ్యాఖ్యలు మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు. ప్రతీ ప్రైవేట్ స్కూల్‌లో 25 శాతం పేదలకు సీట్లు కేటాయించాలని చట్టం చెబుతోంది. వైఎస్ జగన్ అమ్మఒడి ద్వారా పేదలు చదువుకునేలా చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థుల కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలి.
– బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

మంత్రి సవితది బాధ్యతారాహిత్యం



శాసనమండలిలో బీసీ మహిళా మంత్రి సవిత చేసిన వ్యాఖ్యాలు రాష్ట్రంలోని మహిళలను తలదించుకునేలా చేశాయి. జగన్ ప్రభుత్వ పాలనలో మహిళలకు ఎక్కువ లబ్ధి జరిగిందనేది జగమెరిగిన సత్యం. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే పరిస్థితి ఏర్పడింది. అలాంటి మహిళలను అవహేళన చేస్తూ.. గత ప్రభుత్వంలో లబ్ధి పొందిన మహిళలు గంజాయికి అలవాటు పడ్డారని అనడం మంచిది కాదు. వైఎస్ జగన్ సీఎం గా ఉన్నప్పుడు మహిళలకు డీబీటీ ద్వారా రెండు లక్షల 75 వేల కోట్లు ఇచ్చారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు కాపులు గురించి మాట్లాడుతూ రూ. 10 వేల కోట్లు కాపుల కోసం ఖర్చు పెడతామన్నారు. అందుకే ప్రజలు ఓట్లేశారు.. కాబట్టే అధికారంలోకి వచ్చారు. ఈ 6 నెలల్లో కాపులకు ఏమిచ్చారు? బడ్జెట్లో నిధులు ఎందుకు కేటాయించలేదు? చెప్పాలి.
– వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

మహిళాలోకాన్ని ఉలిక్కిపడేలా చేశాయి



కూటమి ప్రభుత్వంలో మంత్రులు సహనం కోల్పోయి మాట్లాడుతున్నారు. వీరి వ్యాఖ్యలతో సభ్య సమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడుతోంది. శాసనమండలిలో శుక్రవారం మంత్రి సవిత మహిళల గురించి చేసిన వ్యాఖ్యలు మహిళాలోకాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. వీటిని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారంటే ఆమె ఏ స్థాయిలో మహిళలను కించపరిచారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సాక్షాత్తూ మహిళా హోంమంత్రిని ఉద్దేశించి ఏం మాట్లాడారో మహిళలంతా గమనించారు. మంచి పాలన అందించమని ప్రజలు పట్టం కడితే కూటమి ప్రభుత్వంలోని సీఎం మొదలుకొని మంత్రులంతా దోచుకో.. తినుకో..పంచుకో అనేలా పాలన సాగిస్తూ ఊగిపోతున్నారు. మహిళలు గంజాయి తాగి మత్తు ఎక్కలేదు, అధికార మత్తులో మంత్రులు ఊగిపోతున్నారు.
– టి. కల్పలత రెడ్డి, ఎమ్మెల్సీ.

సంప్రదాయాలకు చంద్రబాబు పాతర



దశాబ్దాల పాటు అనుసరిస్తున్న సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతున్న కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రభుత్వంగా మిగిలిపోతుంది. పీఏసీ చైర్మన్ పదవిని ప్రధాన ప్రతిపక్ష పార్టీకి ఇవ్వకుండా కూటమి పార్టీకి ఇవ్వడం అనైతికం, నియంతృత్వం. ఇదే టీడీపీకి భవిష్యత్తులో శాపమై కూర్చుంటుంది. ఇది తన గోతిని తనే తవ్వుకున్నట్లు అవుతుంది. ప్రతిపక్ష పార్టీకి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవి నేడు కూటమిలోని జనసేనకు ఇవ్వడమంటే, చివరి సంవత్సరంలో జనసేన ప్రతిపక్షంగా మారుతుందని తథాస్తు దేవతలు ఆశీర్వదించినట్లవుతుంది.
– ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

మంత్రి సవిత దుర్మార్గంగా మాట్లాడారు



శాసనమండలిలో బాధ్యతగల మంత్రి సవిత బాధ్యతారాహిత్యంగా మాట్లాడారు. వైఎస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు డీబీటీ ద్వారా అందజేసిన డబ్బుతో మహిళలు గంజాయికి అలవాటు పడ్డారని జుగుప్సాకరంగా మాట్లాడారు. ప్రజలను అవమానించడమే తప్ప కూటమి నేతలకు మరో పనిలేదు. ఇదేనా మీ సంస్కారం, మీ నాయకుడు నేర్పిన సిద్ధాంతాలు ఇవేనా? గత ప్రభుత్వం పై విమర్శలు చేయడం తప్ప ఇప్పుడు వారేం చేస్తున్నారో చెప్పలేకపోతున్నారు.
– ఎమ్మెల్సీ ఇషాక్ బాషా

ఇంధన భద్రతపై విద్యార్థులకు వీడియో పోటీలు

సాక్షి, అమరావతి: జాతీయ ఇంధన భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు షార్ట్ వీడియో పోటీలు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు ×ఇంధన సమర్థత–ఇధన పరిరక్షణ× (ఎనర్జీ ఎఫిషియన్సీ అండ్ ఎనర్జీ కన్జర్వేషన్) అంశంపై గరిష్టంగా 2 నిమిషాల వీడియోలు రూపొందించి పంపించాలని సూచించారు. ఏపీ స్టేట్ ఎనర్జీ పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు విద్యార్థులు డిసెంబర్ 5వ తేదీలోగా వీడియోలను పంపించాలని, ఈమేరకు డీఈవోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు, మరో 10 మంది విజేతలకు ప్రోత్సాహ బహుమతిగా రూ.2 వేల చొప్పున ప్రదానం చేస్తారని తెలిపారు. వీడియోలను ఆయా పాఠశాల యాజమాన్యం ద్వారా https://forms.gle/g1PcAtYicfkm8VrT6 లింక్‌కు పంపించాలని సూచించారు.

వైద్య సేవా ట్రస్ట్ వైస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ


సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ వైస్ చైర్మన్‌గా సీతంరాజు సుధాకర్ శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణ, మాజీ మంత్రి కిడారి శ్రవణ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

రాయచోటిలో క్రిటికల్ కేర్ బ్లాక్!

- ఆరోగ్యశాఖా మంత్రిని కోరిన మరో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటు నిమిత్తం రూ.30 కోట్లు మంజూరు చేసేందుకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చినట్లు మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విజయవాడ సచివాలయంలో శుక్రవారం సత్యకుమార్ యాదవ్‌ను కలిసి ఈ మేరకు విన్నవించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు సమగ్ర సంరక్షణను అందించడానికి రాయచోటిలో ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఏర్పాటుచేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ల ఏర్పాటు ద్వారా తీవ్రమైన కేసులకు చికిత్స అందించే సౌకర్యాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రస్తుతమున్న ఐసీయు సామర్థ్యం సరిపోదన్నారు.

'మండలి' చైర్మన్‌గా మోషేన్‌రాజుకు మూడేళ్లు పూర్తి



సాక్షి, అమరావతి : శాసన మండలి చైర్మన్‌గా మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న కొయ్యే మోషేన్‌రాజుకు పలువురు సభ్యులు అభినందనలు తెలిపారు. శుక్రవారం సభ ప్రారంభం కాగానే పలువురు సభ్యులు మాట్లాడుతూ.. సభను సమర్థవంతంగా నడిపించడంలో మోషేన్‌రాజు కృషిని ప్రశంసించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలకు పెద్దపీట వేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. అణచివేతకు గురైన వర్గాలకు గౌరవం దక్కాలన్న అంబేడ్కర్ స్ఫూర్తి శాసన మండలిలో ఆచరణకు నోచుకోవడం గొప్ప విషయమన్నారు. టీడీపీ ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, దువ్వారపు రామారావు, పి. అశోక్‌బాబు మోషేన్‌రాజుకు అభినందనలు తెలిపారు.







● సినిమా చూద్దామా?



విష్... కోరిక మంచిదైతే తీరుతుంది



మనకందరికీ విషెస్ వుంటాయి. మన విష్ తీరాలని ప్రతి రోజూ దేవుడిని కోరుకుంటాం. ఒకవేళ విష్ తీర్చే విజార్డ్ మనకు దొరికితే సూపర్‌గా వుంటుంది కదా. అలాంటి కాన్సెప్ట్‌తో తీసిన సినిమానే ఈ విష్. వాల్ట్ డిస్నీ ప్రొడ్యూస్ చేసిన ఈ యానిమేటడ్ ఫాంటసీ మూవీ హాట్‌స్టార్ ప్లాట్‌ఫాంలో స్ట్రీం అవుతోంది. క్రిస్బక్, ఫాం అనే ఇద్దరు డైరెక్టర్స్ ఈ మూవీని కలిసి తీశారు.

ఇంక ఈ మూవీ స్టోరీ ఏంటంటే మెడిటేరియన్ సీలోని ఓ ఐలాండ్‌లో కింగ్‌డమ్ ఆఫ్ రోజాస్ అనే రాజ్యం వుంటుంది. ఆ రాజ్యానికి రాజు మాగ్నిఫికో, రాణి అమాయ. మాగ్నిఫికో రాజు తన మంత్రశక్తితో నెలకో సారి ప్రజలలో ఒకరికి చెందిన ఒక విష్‌ను తీరుస్తూ వుంటాడు. అది కూడా ఓ పెద్ద ఉత్సవంలా చేసి. ఎవరికైతే విష్ కావాలో వాళ్ళని మాగ్నిఫికో ఇంటర్వ్యూ చేసి వారి విష్‌ను మాత్రం తీరుస్తాడు. అలాంటి టైంలో ఈ సినిమా హీరోయిన్ ఆషా తన తాత సబినో 100వ బర్త్‌డేకి ఆయన్ను సంతోష పెట్టాలని రాజు దగ్గరకు ఇంటర్వ్యూకి వెళ్ళి సక్సెస్ అవుతుంది. అయితే రాజు 'నీ విష్ తీరుస్తానుగానీ మీ తాత విష్ తీర్చను' అంటాడు. ఆషా ఈ విషయంలో బాగా బాధపడి ఆకాశంలో వున్న స్టార్‌ను తన విష్‌ను గ్రాంట్ చేయమని ప్రే చేస్తుంది. అనుకోకుండా ఆషా కోసం స్టార్ ఒక బాల్ రూపంలో వచ్చి మాజిక్ చూపిస్తుంది. ఇంక మిగతా స్టోరీ అంతా స్టార్ మాజిక్‌తో కింగ్ మాగ్నిఫికోని ఆషా ఎలా ఎదుర్కొంటుందనేదే ఈ విష్ మూవీ. స్టన్నింగ్ మాజిక్ ఎఫెక్ట్స్‌తో సూపర్ గ్రాండ్ విజువల్స్‌తో విష్ మూవీ మీకు ఈ వీక్ సూపర్ ఎంటర్‌టైనర్. గో అండ్ వాచిట్.

- ఇంటూరు హరికృష్ణ

● చూడు చూడు ప్రపంచం

ఆ స్కూల్లో ఫీజు తీసుకోరు










మామూలుగా అయితే స్కూల్లో టీచర్లు పిల్లలకు పాఠాలు చెప్తారు. హోంవర్క్ రాసుకురమ్మని చెప్తారు. పరీక్షలు పెట్టి మార్కులు వేస్తారు. పైగా ఇవన్నీ చేసినందుకు ప్రైవేటు స్కూళ్లలో ఫీజు తీసుకుంటారు. అయితే థాయ్‌లాండ్‌లో ఉన్న 'మెషై పట్టానా స్కూల్'(ఞఛిజ్ఞీజీ ఞ్చఞ్చ ఛిజాౌ)లో మాత్రం అందుకు పూర్తి భిన్నం. ఈ బడినే ప్రపంచవ్యాప్తంగా 'ఞ్చఞఛౌ ఛిజాౌ' అని కూడా అంటారు. ఇక్కడ పిల్లలకు పాఠాలతోపాటు సేవ చేయడం నేర్పిస్తాను. సమాజంలో ఎలా బతకాలో నేర్పిస్తారు. తోటివారిని ఎలా గౌరవించాలో, వృద్ధులతో ఎలా నడుచుకోవాలో, పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలో.. ఇవన్నీ నేర్పిస్తారు. ఇవన్నీ నేర్పినందుకు వారు ఫీజేమీ తీసుకోరు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిసి 400 చెట్లు నాటితే చాలు. థాయ్‌లాండ్‌కు చెందిన మెషై విరవైద్య అనే ప్రముఖ సామాజిక కార్యకర్త, న్యాయవాది 2008లో ఈ పాఠశాలను ప్రారంభించారు. స్కూళ్లలో పెరుగుతున్న పేద, ధనిక తారతమ్యం, పాఠశాలలు కేవలం పుస్తకాలు బట్టీ వేసే ప్రదేశాలుగా మారిపోవడం వంటివి గమనించి తాను ఈ స్కూల్‌ని స్థాపించినట్లు ఆయన వివరిస్తారు. బడిలో అందరూ ఒకచోట చేరి సంస్కారాన్ని, సామాజిక సేవనీ, పౌరబాధ్యతలనూ నేర్చుకోవాలని అంటారు. దానికి తగ్గట్టే ఈ పాఠశాల విధివిధానాలను ఆయన రూపొందించారు. ఇక్కడ మామూలు తరగతులతోపాటు కూరగాయలు పండించడం, పశువుల్ని పెంచడం, కళాకృతులు తయారు చేయడం, వంటలు చేయడం వంటివి నేర్పిస్తారు. దీంతోపాటు విద్యార్థులను బృందాలుగా ఏర్పరిచి, వారికొక నాయకుణ్ని నియమిస్తారు. వారిని సమన్వయం చేసుకుంటూ, వారిలో స్ఫూర్తి నింపుతూ సాగేలా అతనికి తర్ఫీదు ఇస్తారు. ఇక్కడ బాధ్యతలన్నీ విద్యార్థులే తీసుకుంటారు. కొత్తవారిని స్కూల్లో చేర్చుకోవడం, కొత్త టీచర్లను విధుల్లోకి తీసుకోవడం వంటి పనుల కోసం 'స్టూడెంట్ బోర్డ్' పని చేస్తుంది. స్కూల్‌కి కావాల్సిన వస్తువులు కొనడం, ఇచ్చిన నిధుల్ని సక్రమంగా ఖర్చు చేయడం కూడా వారి బాధ్యతే. ఇక్కడ వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారు ఫీజు చెల్లించనవసరం లేదు. అయితే పాఠశాలల్లో జరిగే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలి. ప్రతి విద్యార్థి ఏడాదిలో 400 గంటలు సమాజ సేవ చేయాలి. అది ఇక్కడ కచ్చితమైన నిబంధన. స్త్రీలను ఎలా అర్థం చేసుకోవాలి, వారి మానసిక పరిస్థితి, శారీరక ఇబ్బందులేమిటనే అంశాలపై ఇక్కడి విద్యార్థులకు ప్రత్యేక తరగతులుంటాయి. దీనివల్ల వారిలో తోటివారి పట్ల అవగాహన, ఆత్మీయత పెరుగుతాయని మెషై విరవైద్య వివరిస్తున్నారు.

● మహనీయులు

థామస్ ఆల్వా ఎడిసన్

కష్టాలు ఎన్ని వచ్చినా జీవితాన్ని వెలిగించుకున్నాడు



ఆ పిల్లవాడు స్కూల్‌కి వెళితే తెలివి లేదని, చదువు రాదని టీచర్లు భావించారు. 'మీ పిల్లాణ్ణి స్కూల్‌కు పంపడం వేస్ట్' అని టీచర్లు ఓ చీటీలో రాసి అతని చేతికిచ్చి ఇంటికి పంపించేశారు కూడా. అతనా చీటీని తల్లికి చూపించాడు. ఆమె అది చదివి చాలా బాధపడినా కుంగిపోలేదు. తన కొడుక్కి తానే గురువుగా మారాలని నిర్ణయించుకుంది. ఇంట్లోనే అతనికి చదవడం, రాయడం నేర్పింది. స్కూల్లో ఇబ్బంది పడ్డ ఆ పిల్లాడు ఇంట్లో ఎంతో ఉత్సాహంగా చదువుకునేవాడు. ఆ తర్వాత పుస్తకాలు చదవడం మొదలుపెట్టాడు. ప్రపంచంలో అప్పుడప్పుడే మొదలవుతున్న సాంకేతిక మార్పులను గుర్తించి, ఆవిష్కరణ పట్ల ఆసక్తి పెంచుకున్నాడు. ఇంట్లో తనకు అందుబాటులో ఉన్న వస్తువులతో ప్రయోగాలు చేయడం ప్రారంభించాడు. ఏదైనా సమస్యకు పరిష్కారం కనుక్కోవడం అతనికి చాలా ఆసక్తిగా ఉండేది. ఒక పరిష్కారం ఆ సమస్యను తీర్చలేదనిపిస్తే వెంటనే మరో పరిష్కారం వెతికేవాడు. అతనికి 12 ఏళ్లు వచ్చేసరికి ఒక చెవి వినిపించడం మానేసింది. రెండో చెవిలోనూ సమస్య మొదలైంది. అయితే అతని వైకల్యం కూడా అతనికి సాయం చేసింది. చెవులకు ఏదీ వినిపించకపోవడం వల్ల చేస్తున్న పని మీద మరింత శ్రద్ధ చూపేవాడు.

ఆ తర్వాత ఎన్నో కష్టనష్టాలను భరించి తను సంపాదించిన డబ్బుతో ప్రయోగ పరికరాలు కొనుక్కునేవాడు. రాత్రిపూట బయట పని చేసి పగలు ఇంట్లో ఉండి పరిశోధనలు చేసేవాడు. 22 ఏళ్ల వయసులో తొలిసారి ఎలక్ట్రిక్ ఓట్ రికార్డర్ కనుగొన్నాడు. ఆ తర్వాత మల్టీప్లెక్స్ టెలీగ్రాఫిక్ వ్యవస్థను తయారు చేశాడు. దీనిద్వారా ఒకేసారి రెండు టెలిగ్రాఫ్‌లు పంపే విధానాన్ని రూపొందించాడు. ఆయనకు బల్బు కనిపెట్టాలన్న ఆలోచన వచ్చింది. అందుకు ఎన్నోసార్లు ఓడిపోయాడు. అయినా ఏనాడూ విసుగు చెందక మళ్లీ మళ్లీ ప్రయత్నించాడు. చివరకు 1879లో తొలిసారి బల్బు కనుగొన్నాడు. అదొక్కటే కాదు, తన జీవితకాలంలో 1,093 వస్తువులను కనుగొన్నాడు. ఆయనే థామస్ ఆల్వా ఎడిసన్. ప్రపంచ శాస్త్రవేత్తల్లో తనకంటూ ప్రత్యేక చరిత్రను రాసుకున్న వ్యక్తి. ఎన్ని కష్టాలు వచ్చినా కుంగిపోకుండా వాటిని ఎదుర్కొంటూ ముందుకు సాగారు.

● పాడుదాం గేయం

మా బడి

అదిగో అదిగో మా బడి
బంగారు భవితకు పెట్టుబడి
అదే అదే మా బడి
చదువుల తల్లిని కొలిచే గుడి

గణగణమంటూ గంట మోగితే
చకచకమంటూ బడికి చేరతాం
ఒకటిగా నిలిచి ప్రార్థన చేసి
తరగతులకు మేము తయారవుతాం

అల్లరి చేయక పాఠం వింటూ
కొత్త సంగతులెన్నో నేర్చుకుంటాం
తోటివారితో తగవులాడక
ఐకమత్యంతో ముందుకు సాగుతాం

పరీక్షల్లో ప్రతిభ చూపి
పెద్దల చేత మెప్పును పొందుతాం
అడిగిన ప్రశ్నలకు జవాబులిస్తూ
అందరితో ఔరా అనిపించుకుంటాం

మైదానంలో పరుగులు పెడుతూ
ఉత్సాహంతో ఉరకలు వేస్తాం
సాయంవేళ టాటా చెప్పుకొని
భద్రంగా ఇంటికి చేరుతాం

అదిగో అదిగో మా బడి
బంగారు భవితకు పెట్టుబడి
అదే అదే మా బడి
చదువుల తల్లిని కొలిచే గుడి

● ఈ సామెత తెలుసుకోండి!

'నిండు కుండ తొణకదు'





ఇప్పుడంటే చాలామంది ఇళ్లల్లో ఫ్రిజ్‌లు ఉన్నాయి. గతంలో చల్లని నీళ్ల తాగాలంటే కుండనే వాడేవారు. కుండలో పోసిన నీళ్ల తాజాగా, చల్లగా ఉంటాయి. మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కుండ ఖాళీగా ఉంటే, అటూఇటూ ఒరిగి కింద పడుతుంది. దాన్నిండా నీళ్లు నింపి పెడితే తొణకకుండా స్థిరంగా ఉంటుంది. అలాగే అన్నీ తెలిసినవారు స్థిరంగా, స్థిమితంగా ఉంటారు. దేనికీ అతిగా స్పందించరు. నిదానాన్ని పాటిస్తారు. సగం సగం తెలిసినవారు మాత్రం హడావిడి పడుతూ ఆర్భాటంగా ఉంటారు. అలాంటి సందర్భంలో ఈ సామెత వాడతారు. కాబట్టి మనం నిండు కుండలా ఉండాలి.

● తెలుసుకుందాం

వీడియో గేమ్స్.. ఎక్కడ పుట్టాయో తెలుసా?





పిల్లలూ! వీడియో గేమ్స్ ఆడటమంటే మీకు చాలా ఇష్టమా? సెలవుల్లో ఇంట్లో కూర్చుని గంటల తరబడి ఆడుతుంటారా? మరి వాటి చరిత్రేమిటో తెలుసుకుందామా?

వీడియో గేమ్స్ పుట్టి దాదాపు 66 ఏళ్ల దాటుతోంది. 1958లో విలియం ఆల్ఫ్రెడ్ హిగిన్‌బోతమ్ అనే అమెరిన్ భౌతిక శాస్త్రవేత 'టెన్నిస్ ఫర్ టూ' అనే వీడియో గేమ్ తయారు చేశారు. 1960 తర్వాత కంప్యూటర్ల వాడకం పెరుగుతున్న సమయంలో కంప్యూటర్ శాస్త్రవేత్తలు గ్రాఫిక్స్ ఆధారంగా గేమ్స్ తయారు చేశారు. అనంతరం 1962లో అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు 'స్టార్‌వార్' అనే వీడియో గేమ్ తయారు చేశారు. ఆ తర్వాత 1970లో ఇళ్లల్లో వీడియో గేమ్స్ ఆడుకునేందుకు ఞ్చఞ్చౌ ఛీఽఞ్చఽఅనే సంస్థ గేమ్ కన్సోల్‌ని తయారు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఈ వీడియో గేమ్స్ అమెరికా అంతటా ప్రాచుర్యం పొందాయి. ఆ తర్వాత మరికొన్ని కంపెనీలు సైతం కొత్తగా వీడియోగేమ్స్ తయారు చేశాయి.

వీడియో గేమ్స్ ప్రధానంగా పిల్లల కోసమే తయారు చేసినా పెద్దలు కూడా వీటిని ఇష్టపడుతున్నారని కంపెనీలు గుర్తించాయి. మరిన్ని కొత్త గేమ్స్‌ని అందుబాటులోకి తెచ్చాయి. ఒకానొక దశలో చాలా గేమ్స్‌కి కాపీలు, పైరసీ వెర్షన్లు వచ్చేశాయి. దీంతో జనానికి నాణ్యమైన గేమ్స్ అందుబాటులో లేకుండా పోయాయి. 1983 నుంచి 1985 మధ్యలో అమెరికాలోని వీడియో గేమ్స్ తయారీ సంస్థలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి.

ఆ తర్వాత వీడియో గేమ్స్ మార్కెట్లోకి జపాన్ దూసుకొచ్చింది. కొత్త కొత్త గేమ్స్‌ని అందుబాటులోకి తెస్తూ ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ ఏర్పడేలా చేసింది. దీంతో సంస్థలు కొత్త టెక్నాలజీ ఉపయోగించి మరిన్ని నాణ్యమైన, క్రియేటివ్ గేమ్స్ తయారు చేయడం మొదలుపెట్టాయి. ఇంటర్‌నెట్ వాడకం మొదలయ్యాక వీడియోగేమ్స్ మరింతగా అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్‌ఫోన్స్, ట్యాబ్స్ వచ్చాక అందరూ సులభంగా వీడియో గేమ్స్ ఆడేస్తున్నారు. వీటికోసం ప్రత్యేకమైన యాప్స్ కూడా ఉన్నాయి.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వీడియో గేమ్స్ మార్కెట్ రూ.1.5 లక్షల కోట్లతో నడుస్తోంది. వేల మంది ఈ రంగంలో పని చేస్తున్నారు. వీడియో గేమ్స్ తయారు చేసేందుకు ప్రత్యేకంగా గేమ్ డిజైనర్లు ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా రెండు వేల వీడియో గేమింగ్ స్కూల్స్ ఉన్నాయి. అందులో వీడియో గేమింగ్ తయారీ గురించి నేర్పిస్తారు. వీడియో గేమ్స్‌లో ఎక్కువమంది యాక్షన్, స్పోర్ట్స్, సాహసయాత్రలు వంటివి ఇష్టపడుతుంటారు. ఇదీ వీడియో గేమ్స్ చరిత్ర.

అయితే చదువు పక్కన పెట్టి వీడియో గేమ్స్ ఆడటం ఏమాత్రం మంచిది కాదు. గంటల తరబడి ఆడటం కూడా చాలా ప్రమాదకరం. అదొక వ్యసనం అవుతుంది. రాత్రి పగలూ ఆడాలనిపిస్తుంది. భవిష్యత్తుకే ప్రమాదం. కాబట్టి సెలవు రోజుల్లో కొద్దిసేపు మాత్రమే వీడియో గేమ్స్ ఆడండి. సరేనా?

● కథ

కోతీ కొబ్బరికాయలూ



అది ఎండాకాలం. అడవిలో ఉన్న ఒక కుందేలు ఎండలో తిరిగి తిరిగీ దానికి బాగా వేడి చేసింది. దాంతో అది మంచమెక్కింది. అది చూసి పిల్లకుందేలు బాధపడతా వుంటే కోడిపుంజు చూసి 'చూడల్లుడూ! కొబ్బరినీళ్ళు చానా చలువ. అవి గనుక మూడు పూటలా తాపించినావనుకో దెబ్బకు వేడంతా దిగిపోయి మళ్ళా మునుపటి మాదిరి ఐపోతాది. పో... పోయి కోతిమామ ఎక్కడున్నాడో అడిగి కొన్ని కాయలు తీసుకొని రాపో' అని చెప్పింది.

పిల్లకుందేలు అలాగేనని కోతిని వెదుక్కుంటా బైలుదేరింది. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టు ఆ కోతి ఒక కొబ్బరిచెట్టు మీద హాయిగా కొబ్బరినీళ్ళు తాగుతా కనబడింది. అది చూసిన పిల్లకుందేలు 'కోతిమామా కొన్ని కాయలు కోసివ్వవా. మా అమ్మకు వేడి చేసి నీరసం వచ్చింది' అంది.

కానీ ఆ కోతికి చాలా పొగరు 'ఫో.. ఫో... నీకు కాయలు తెంపివ్వడం కన్నా నాకింకేం పని లేదనుకుంటున్నావా' అంటూ కసిరింది.

పాపం... కుందేలు పిల్లకి ఏడుపొచ్చింది. కళ్ళ నిండా నీళ్ళు కారిపోతా వుంటే బాధతో ఇంటికి పోసాగింది. అంతలో దానికి ఒక ఏనుగు ఎదురొచ్చింది.

'ఏం బాబూ... అలా కళ్ళనీళ్ళు పెట్టుకోని పోతా వున్నావు' అని అడిగింది. కుందేలు పిల్ల జరిగిందంతా చెప్పింది.

అది విన్న ఏనుగు 'అరెరే... కోతి అలా అనిందా. ఐనా ఆపదలు వచ్చినపుడు ఒకరికొకరు సాయం చేసుకోకుంటే ఎలా. దా నా వెంబడి' అంటూ కుందేలు పిల్లను మీద ఎక్కించుకోని కొబ్బరి చెట్టు దగ్గరికి పోయింది.

కొబ్బరి చెట్టు మీద కోతి హాయిగా కూర్చుని. తొండంతో ఏనుగు కొబ్బరి చెట్టును పట్టుకొని అటూ యిటూ వూపసాగింది. పైన వున్న కోతి అదిరిపడింది. 'ఏయ్... ఏనుగు మామా... ఎందుకలా వూపుతా వున్నావు. కిందపడేలా వున్నా. ఆపాపు' అంటూ కంగారుగా అరిచింది.

'పక్కవాళ్ళ గురించి కొంచం గూడా పట్టించుకోని నీలాంటి వాళ్ళతో నాకు అనవసరం. నీవు కిందపడి... కాలిరిగితే నాకేమి, చెయ్యిరిగితే నాకేమి. మాకు కొబ్బరికాయలు కావాలి అంతే...' అంటూ మరింత గట్టిగా సరసరసర ఊపసాగింది. కోతికి గిర్రున కళ్ళు తిరగసాగాయి. భయంతో కొబ్బరి మట్టను గట్టిగా పట్టుకోని 'ఏనుగు మామా... బుద్ధి పొరపాటయి అలా అన్నా. ఈ ఒక్కసారికి మన్నించు. ఇంకెప్పుడూ ఎవరినీ అలా బాధపెట్టను. అందరితోనూ కలసిమెలసి మంచిగా వుంటా' అంది వణికిపోతూ. ఏనుగు కొబ్బరిచెట్టును ఊపడం ఆపింది. కోతి బిరబిరా మంచి మంచి నీళ్ళ కాయలు తెంపుకోని కిందికి దిగి వచ్చింది. ఏనుగు అవన్నీ తీసుకోని కుందేలు పిల్లకు ఇచ్చింది. అది సంబరంగా ఏనుగుమామకు, కోతిమామకు ముద్దుపెట్టి కాయలు తీసుకొని ఉరుక్కుంటా ఇంటికి పోయింది.

- డా.ఎం.హరికిషన్

బిజినెస్ రీల్

టాప్ న్యూస్ యాప్‌గా ఎక్స్: మస్క్



న్యూఢిల్లీ: భారత్‌లోని యాప్ స్టోర్‌లో సామాజిక మాధ్యమం ఎక్స్ (గతంలో ట్విటర్) ప్రస్తుతం టాప్ న్యూస్ యాప్ అని ఎలాన్ మస్క్ తెలిపారు. భారత్‌లో యాపిల్ యాప్‌స్టోర్‌లో ఎక్స్ మొదటి స్థానంలో నిలిచిన న్యూస్ యాప్ అని డోజ్‌డిజైనర్ అనే ఒక వినియోగదారు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన తర్వాత.. భారత్‌లో వార్తల కోసం ప్లాట్‌ఫామ్ నిజంగా నంబర్ వన్ అయిందని బిలియనీర్ ఎలాన్ మస్క్ అన్నారు. మస్క్ 2022 అక్టోబర్‌లో ఎక్స్‌ను (గతంలో ట్విటర్) 44 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేశారు.

బీఎండబ్ల్యూ కార్ల ధరలు ప్రియం

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ సంస్థ బీఎండబ్ల్యూ ఇండియా వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అన్ని మోడళ్ల ధరలను 3 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించింది. కంపెనీ భారత్‌లో ఉత్పత్తి చేస్తున్న కార్ల శ్రేణిలో 2 సిరీస్ గ్రాన్ కూపే, 3 సిరీస్ లాంగ్ వీల్‌బేస్, 5 సిరీస్ లాంగ్ వీల్‌బేస్, 7 సిరీస్ లాంగ్ వీల్‌బేస్, ఎక్స్1, ఎక్స్3, ఎక్స్5, ఎక్స్7తోపాటు ఎం340ఐ ఉన్నాయి. అలాగే బీఎండబ్ల్యూ విదేశాల్లో పూర్తిగా తయారైన ఐ4, ఐ5, ఐ7, ఐ7 ఎం70, ఐఎక్స్1, ఐఎక్స్, జెడ్4 ఎం40ఐ, ఎం2 కూపే వంటి మోడళ్లను సైతం ఇక్కడ విక్రయిస్తోంది. తయారీ ఖర్చులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అధిక నిర్వహణ వ్యయాల కారణంగా 2025 జనవరి 1 నుండి అన్ని మోడళ్లపై ధరలను 3 శాతం వరకు అధికం చేస్తున్నట్టు గత వారం మెర్సిడెస్ బెంజ్ ప్రకటించింది. భారత్‌లో మెర్సిడెస్ బెంజ్ కార్ల ధరలు జీఎల్‌సీకి రూ.2 లక్షల నుండి టాప్-ఎండ్ మెర్సిడెస్ మైబాహ్ ఎస్ 680 లగ్జరీ లిమజీన్‌కి రూ.9 లక్షల వరకు ప్రియం కానున్నాయి.

డిసెంబర్ 23 నుంచి సెన్సెక్స్‌లోకి జొమాటో

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో డిసెంబర్ 23 నుంచి బీఎస్ఈ సెన్సెక్స్‌లో చోటు లభించనుంది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ స్థానాన్ని దక్కించుకోనుంది. బీఎస్ఈ అనుబంధ సంస్థ ఏషియా ఇండెక్స్ ఈ విషయాలు వెల్లడించింది. గత ఏడాది వ్యవధిలో గణనీయంగా ర్యాలీ చేసిన జొమాటోకి, సెన్సెక్స్‌లో చోటు దక్కించుకోవడం కీలక మైలురాయిగా నిలవనుంది. మరోవైపు, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సంస్థలు ఇండెక్స్ నుంచి నిష్క్రమించనున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

23-11-2024

విశాఖ	575-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	570-00
వరంగల్	572-00
రిటైల్ ధర	6.30

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBIN	814.55	4.33
BAJFINANCE	6,720.00	3.93
TITAN	3,302.00	3.89
ITC	474	3.69
TCS	4,221.95	3.66

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	9,468.00	0.39
HDFCBANK	1,742.10	0.05
AXISBANK	1,141.80	0.23
HEROMOTOCO	4,788.00	0.42
HINDALCO	652	0.61

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,030
ఎన్ఎస్ఈ	1,01,525
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,58,363
ఎఫ్ఐఐ	- 1,278
డీఐఐ	+ 1,722

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.33	$ 70.01
బ్రెంట్	75.28	$ 74.23

రిటైర్మెంట్ సన్నద్ధతలో
తూర్పు భారత్ టాప్

54 పాయింట్లతో మొదటి స్థానం / పశ్చిమ భారత్‌కు **49** / ఉత్తరాది, దక్షిణాదికి **48** / మ్యాక్స్‌లైఫ్, కాంటార్ అధ్యయనం వెల్లడి



కోల్‌కతా: విశ్రాంత జీవనం (రిటైర్మెంట్ తర్వాత) కోసం సన్నద్ధతతో తూర్పు భారత్ ప్రజలు ఇతర ప్రాంతాల వారితో పోల్చితే ముందున్నారు. ఇండియా రిటైర్మెంట్ ఇండెక్స్‌లో సున్నా నుంచి నూరు వరకు స్కేల్‌పై ఉత్తర భారత్ 54 పాయింట్ల వద్ద ఉంది. అదే దక్షిణాది, ఉత్తరాది ప్రాంతాలు రిటైర్మెంట్ జీవితానికి సన్నద్ధతలో 48 పాయింట్ల వద్దే ఉన్నాయి. పశ్చిమ భారత్ 49 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది.

జాతీయ సగటు 49 పాయింట్లుగా ఉంది. కాంటార్‌తో కలసి మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నిర్వహించిన 'ఇండియా రిటైర్మెంట్ ఇండెక్స్ అధ్యయనం' నాలుగో ఎడిషన్ నివేదిక ఈ వివరాలు వెల్లడించింది. పట్టణ వాసుల్లో రిటైర్మెంట్ సన్నద్ధత ఎలా ఉంది, దీనిపై వారిలో ఉన్న అవగాహన, ఆకాంక్షలు, రిటైర్మెంట్ సమయంలో ఎదుర్కొనే సవాళ్లు, ప్రణాళికల గురించి ఈ అధ్యయనం తెలుసుకునే ప్రయత్నం చేసింది. దేశవ్యాప్తంగా 28 పట్టణాల్లో 25-65 ఏళ్ల వయసులోని వారి అభిప్రాయాలు తెలుసుకుంది.

అధ్యయనం వివరాలు..

తూర్పు భారత్‌లో 72 శాతం మంది రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్ చేస్తున్నారు. గతేడాది ఇది 67 శాతంగా ఉంది. ఇదే ప్రాంతంలో 82 శాతం మంది ఆరోగ్యం కాపాడుకుంటామని నమ్మకంగా చెప్పారు. 67 శాతం మంది లైఫ్ ఇన్సూరెన్స్‌ను రిటైర్మెంట్ భద్రత కోసం ఎంపిక చేసుకుంటున్నారు. ప్రతి నలుగురిలో ఒకరికి ఎన్‌పీఎస్ ఖాతా ఉంది. ఈ ప్రాంతంలో జీవిత బీమాపై 97 శాతం మందికి, హెల్త్ ఇన్సూరెన్స్‌పై 90 శాతం మందికి అవగాహన ఉంది.

- పశ్చిమ భారత్‌లో 66 శాతం మంది, ఉత్తర భారత్‌లో 60 శాతం, దక్షిణ భారత్‌లో 58 శాతం మంది రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నారు.
- తూర్పు భారత్‌లో 56 శాతం మంది 35 ఏళ్లలోపే రిటైర్మెంట్ ప్రణాళిక మొదలు పెట్టడాన్ని సమర్థించారు. 50 ఏళ్లకు పైబడిన వారిలో 94 శాతం మంది ముందుగా రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు ప్రారంభించకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు.
- కనీస అవసరాలను తీర్చుకునే విషయంలో 62 శాతం మంది, పిల్లల భవిష్యత్ విషయమై 64 శాతం మందిలో ఆందోళన కనిపించింది.
- 94 శాతం మంది కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి సహకారం విషయంలో విశ్వాసాన్ని వ్యక్తం చేయగా, 64 శాతం మంది ఒంటరితనం విషయంలో ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న పర్యావరణం పట్ల 76 శాతం మందిలో ఆందోళన కనిపించింది.
- తూర్పు భారత్‌లో ప్రతి నలుగురిలో ఒకరు రిటైర్మెంట్ తర్వాత కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి వస్తుందని చెప్పారు.
- ప్రతి ముగ్గురిలో ఒకరు వైద్య అవసరాలు, పిల్లల భవిష్యత్‌కూ తమ ప్రణాళికల్లో భాగంగా ప్రాధాన్యం ఇస్తున్నారు.

పెరుగుతున్న ప్రాధాన్యత..

"జీవనకాలం పెరుగుతుండడంతో భారతీయులకు రిటైర్మెంట్ ప్రణాళిక అత్యంత కీలకంగా మారుతోంది. మా అధ్యయనంలో గుర్తించిన అంశాలు మారుతున్న రిటైర్మెంట్ అవసరాలు, ప్రాధాన్యతలను అర్థం చేసుకునేందుకు ఉపకరిస్తాయి. దేశవ్యాప్తంగా రిటైర్మెంట్ విషయమై సమగ్రమైన విధానాన్ని అనుసరించేందుకు ఈ అధ్యయనం స్ఫూర్తినిస్తుంది.

– ఈవీపీ రాహుల్ తల్వార్, మ్యాక్స్‌లైఫ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్

ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడుల వెల్లువ

అక్టోబర్‌లో రూ.41,887 కోట్ల రాక

క్రితం నెల కంటే 22 శాతం అధికం

సిప్ రూపంలో ఆల్‌టైమ్ గరిష్టం



న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అక్టోబర్‌లోనూ రికార్డు స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ ఇన్వెస్టర్లు ఈక్విటీల పట్ల విశ్వాసం కొనసాగించారు. దీంతో అన్ని విభాగాల్లోనూ కలిపి రూ.41,887 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెప్టెంబర్ నెల గణాంకాలతో (రూ.34,419 కోట్లు) పోల్చి చూస్తే 22 శాతం పెరిగాయి. వరుసగా 44వ నెలలోనూ నికరంగా ఈక్విటీ పథకాల్లోకి పెట్టుబడులు రావడం గమనార్హం. ఇదే నెలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) రూ.94,000 కోట్లను ఈక్విటీల నుంచి ఉపసంహరించుకున్నారు. అలాంటి తరుణంలోనూ సిప్, లంప్‌సమ్ రూపంలోఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగించడం ఈక్విటీలకు మద్దతుగా నిలిచింది. ఈ గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసింది.

విభాగాల వారీగా..

- ఈక్విటీల్లో దాదాపు అన్ని విభాగాలూ పెట్టుబడులను ఆకర్షించాయి. సెక్టోరల్/థీమ్యాటిక్ ఫండ్స్‌కు ఆదరణ కొనసాగింది. ఇవి అత్యధికంగా రూ.12,278 కోట్లను రాబట్టాయి.
- ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి రూ.5,180 కోట్లు వచ్చాయి. సెప్టెంబర్‌లో ఇదే విభాగం రూ.3,214 కోట్లను ఆకర్షించింది.
- స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.3,771 కోట్లు, మల్టీక్యాప్ ఫండ్స్‌లోకి రూ.3,596 కోట్ల చొప్పున వచ్చాయి.
- వరుసగా గత ఆరు నెలల నుంచి ఫోకస్డ్, ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ పెట్టుబడులు కోల్పోతుండగా.. అక్టోబర్‌లో ఈ ధోరణి మారింది. ఫోకస్డ్ ఫండ్స్ రూ.693 కోట్లు, ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ రూ.383 కోట్ల చొప్పున ఆకర్షించాయి.
- ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌ల్లోకి 620 శాతం అధికంగా రూ.23,428 కోట్లు రావడం గమనార్హం. సెప్టెంబర్‌లో ఇవి రూ.3,254 కోట్లుగానే ఉన్నాయి.
- గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.1,961 కోట్లు వచ్చాయి.
- మీడియం డ్యురేషన్, క్రెడిట్ రిస్క్ ఫండ్స్ మినహా డెట్ విభాగంలో అన్ని రకాల పథకాల్లోకి అక్టోబర్‌లో నికరంగా పెట్టుబడులు వచ్చాయి. అత్యధికంగా లిక్విడ్ ఫండ్స్ రూ.83,863 కోట్లు, ఓవర్‌నైట్ ఫండ్స్ రూ.25,783 కోట్ల చొప్పున ఆకర్షించాయి.
- క్రెడిట్ రిస్క్ ఫండ్స్ నుంచి రూ.357 కోట్లను ఇన్వెస్టర్లు ఉపసంహరించుకున్నారు. మీడియం డ్యురేషన్ ఫండ్స్ రూ.149 కోట్లను కోల్పోయాయి.
- మనీ మార్కెట్ ఫండ్స్‌లోకి రూ.25,303 కోట్లు, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లోకి రూ.7,053 కోట్లు, లో డ్యురేషన్ ఫండ్స్‌లోకి రూ.5,600 కోట్ల చొప్పున వచ్చాయి.
- అన్ని రకాల హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.16,863 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇందులో ఆర్బిట్రేజ్ ఫండ్స్ రూ.7,181 కోట్లు, మల్టీ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ రూ.3,796 కోట్లు, డైనమిక్ అస్సెట్ అలోకేషన్/బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ రూ.2,456 కోట్ల చొప్పున ఆకర్షించాయి.
- అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని పెట్టుబడుల విలువ అక్టోబర్ చివరికి రూ.66.98 లక్షల కోట్లకు వృద్ధి చెందింది. సెప్టెంబర్ చివరికి ఉన్న రూ.66.82 లక్షల కోట్లతో పోల్చితే 0.25 శాతం పెరిగింది.

సిప్ పెట్టుబడులు రూ.25,323 కోట్లు

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.25,323 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఒక నెలలో గరిష్ట సిప్ పెట్టుబడుల రికార్డు ఇది. సెప్టెంబర్‌లో ఇవి రూ.24,509 కోట్లుగా ఉన్నాయి. రిటైల్ ఇన్వెస్టర్ల ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) 17.23 కోట్లకు పెరిగాయి. ఇందులో సిప్ ఫోలియోలు 10.12 కోట్లుగా ఉన్నాయి. ''అన్ని విభాగాల పథకాల్లోకి పెట్టుబడుల ప్రవాహం బలంగా ఉంది. సిప్ పెట్టుబడులు ఆల్‌టైమ్ గరిష్టం రూ.25,000 కోట్లకు చేరాయి. కొత్త పథకాల (ఎన్ఎఫ్‌వోలు) పట్ల ఆసక్తి కొనసాగింది. ఇవి రూ.6,000 కోట్లను సమీకరించాయి''అని టాటా అస్సెట్ మేనేజ్‌మెంట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఆనంద్ వరదరాజన్ తెలిపారు.

వెండి ఈటీఎఫ్‌లకు డిమాండ్

- అక్టోబర్‌లో నాలుగు రెట్లు ప్లస్
- ఏయూఎం @ రూ. 12,331 కోట్లు



కోల్‌కతా: ఇటీవల కొంతకాలంగా వెండి ఈటీఎఫ్‌లు పెట్టుబడులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఏడాది కాలంలో సిల్వర్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) విలువ నాలుగు రెట్లు ఎగసింది. వెరసి గత నెల(అక్టోబర్) కల్లా వెండి ఈటీఎఫ్‌ల ఏయూఎం రూ. 12,331 కోట్లను తాకింది. 2023 అక్టోబర్‌లో ఈ విలువ కేవలం రూ. 2,845 కోట్లుగా నమోదైంది. ఇన్వెస్టర్లు సిల్వర్‌ను దేశీయంగా ధరల పెరుగుదలతోపాటు, రాజకీయ, భౌగోళిక అనిశ్చితులకు హెడ్జింగ్‌గా భావించడం ఇందుకు జతకలిసినట్లు రేటింగ్ సంస్థ ఇక్రా అనలిటిక్స్ పేర్కొంది. ఈ వివరాల ప్రకారం..

2022లో షురూ

సిల్వర్ ఈటీఎఫ్‌లకు 2022లో తెరతీశారు. వీటి అందుబాటు, పారదర్శకతల కారణంగా రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి వీటికి డిమాండ్ పెరుగుతోంది. దీంతో సిల్వర్ ఈటీఎఫ్ ఫోలియోల సంఖ్య 215 శాతం జంప్‌చేసి 4.47 లక్షలకు చేరింది. 2023 అక్టోబర్‌లో ఇది 1.42 లక్షలు మాత్రమే. ఈ కాలంలో నికర పెట్టుబడులు 24 శాతం ఎగశాయి. రూ. 643 కోట్లను తాకాయి. మరోపక్క మార్కెట్లో 2023 ఏప్రిల్‌లో 8 వెండి ఈటీఎఫ్‌లు నమోదుకాగా.. 2024 ఆగస్టుకల్లా 12కు పెరిగినట్లు ఇక్రా అనలిటిక్స్ మార్కెట్ డేటా హెడ్, సీనియర్ వీపీ అశ్వినీ కుమార్ వెల్లడించారు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు కొనసాగుతుండటంతో సిల్వర్ ఈటీఎఫ్‌లకు డిమాండ్ కొనసాగనున్నట్లు కుమార్ అంచనా వేశారు.

సులభ నిర్వహణ

సులభంగా స్టోర్ చేయగలగడం, తగినంత లిక్విడిటీ, చౌక వ్యయాలు వంటి అంశాలు సిల్వర్ ఈటీఎఫ్‌లకు ఆకర్షణను పెంచుతున్నాయి. ఫిజికల్ కొనుగోళ్లకు జీఎస్‌టీ వర్తించే సంగతి తెలిసిందే. స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టికావడంతో పెట్టుబడులకు లిక్విడిటీ సైతం ఉంటుంది. యూనిట్ల రూపంలో సులభంగా లావాదేవీలు చేపట్టవచ్చునని కుమార్ తెలియజేశారు. అంతేకాకుండా వీటిలో పెట్టుబడులు ఉత్తమ రిటర్నులను సైతం అందిస్తున్నాయి. నెల రోజుల్లో 7.6 శాతం, 3 నెలల్లో 16 శాతం, 6 నెలలు పరిగణిస్తే 20.25 శాతం సగటున రాబడినిచ్చాయి. ఏడాది కాలాన్ని తీసుకుంటే 32.5 శాతం రిటర్నులు అందించాయి. ఇదే కాలంలో గోల్డ్ ఈటీఎఫ్‌ల రాబడులతో పోలిస్తే ఇవి అధికంకావడం గమనార్హం!

ఈపీఎఫ్‌వో కిందకు 18.81 లక్షల మంది

సెప్టెంబర్‌లో 9.33 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యులు సెప్టెంబర్‌లో 18.81 లక్షల మంది పెరిగారు. క్రితం ఏడాది ఇదే నెలలోని గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 9.33 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. ఉపాధి అవకాశాల పెరుగుదలను ఇది సూచిస్తోంది. వీరిలో 9.47 లక్షల మంది కొత్త సభ్యులు. క్రితం ఏడాది ఇదే నెల కంటే 6.22 శాతం పెరిగారు. సభ్యుల్లో 8.36 లక్షల మంది 18-25 ఏళ్లలోపు వారే (60 శాతం) కావడం గమనార్హం. అంటే వీరు మొదటిసారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్టు అర్థం చేసుకోవచ్చు. 14.10 లక్షల మంది సభ్యులు సెప్టెంబర్ నెలలో ఈపీఎఫ్‌వో పరిధిలోనే ఒక సంస్థ నుంచి మానేసి, మరో సంస్థలో చేరారు. వార్షికంగా క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే ఇది 18 శాతం అధికం. కొత్త సభ్యుల్లో 2.47 లక్షల మంది మహిళలు ఉన్నారు. 9 శాతం వృద్ధి నమోదైంది. సెప్టెంబర్ నెల మొత్తం మీద నికరంగా చేరిన మహిళా సభ్యుల సంఖ్య 3.70 లక్షలుగా ఉంది. ఇది కూడా 12 శాతం అధికం.

21 శాతం మహారాష్ట్ర నుంచే..

సెప్టెంబర్ నెలలో నికర సభ్యుల చేరికలో మహారాష్ట్ర నుంచే 21.20 శాతం మంది ఉన్నారు. ఇక కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, హర్యానా, గుజరాత్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ నుంచి విడిగా 5 శాతం కంటే ఎక్కువ సభ్యులు చేరారు. నైపుణ్య సేవలు, ట్రేడింగ్-వాణిజ్య సంస్థలు, ఎలక్ట్రికల్, మెకానికల్, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, వస్త్రాల తయారీ, క్లీనింగ్, స్వీపింగ్ సేవలు, హాస్పిటళ్లలో ఎక్కువ మందికి ఉపాధి లభించింది.

నోకియాకు భారీ ఆర్డర్



న్యూఢిల్లీ: టెలికం పరికరాల తయారీలో ఉన్న ఫిన్లాండ్ దిగ్గజం నోకియా తాజాగా భారతీ ఎయిర్‌టెల్ నుండి భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. ఇందులో భాగంగా భారత్‌లోని ముఖ్య నగరాలు, రాష్ట్రాలలో నోకియా తయారీ 4జీ, 5జీ పరికరాలను వినియోగంలోకి తెస్తారు. రీఫ్‌షార్క్ సిస్టమ్ ఆన్ చిప్ టెక్నాలజీ ఆధారిత బేస్ స్టేషన్స్, బేస్‌బ్యాండ్ యూనిట్స్, మాసివ్ మల్టిపుల్ ఇన్‌పుట్ మల్టిపుల్ ఔట్‌పుట్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్‌ను నోకియా అందించనుంది. 'వీటి చేరికతో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను అసాధారణమైన 5జీ సామర్థ్యం, కవరేజీతో మెరుగుపరుస్తాయి. అలాగే నెట్‌వర్క్ వికాసానికి మద్దతు ఇస్తాయి. ఎయిర్‌టెల్ యొక్క ప్రస్తుత 4జీ నెట్‌వర్క్‌ను మల్టీబ్యాండ్ రేడియోలు, బేస్‌బ్యాండ్ పరికరాలతో నోకియా ఆధునీకరించనుంది. ఇది 5జీకి కూడా మద్దతు ఇస్తుంది' అని నోకియా వెల్లడించింది. నోకియాతో ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం సంస్థ నెట్‌వర్క్ మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని రుజువు చేస్తుందని భారతీ ఎయిర్‌టెల్ వైస్ చైర్మన్, ఎండీ గోపాల్ విట్టల్ ఈ సందర్భంగా తెలిపారు. వినియోగదారులకు అసమానమైన అనుభవాన్ని అందిస్తుందని, ఈ నెట్‌వర్క్ పర్యావరణ అనుకూలమైనదని వివరించారు. ఎయిర్‌టెల్‌కు రెండు దశాబ్దాలకుపైగా సేవలు అందిస్తూ 2జీ, 3జీ, 4జీ, 5జీ నెట్‌వర్క్ ఉపకరణాలను నోకియా సరఫరా చేస్తోంది.

రియల్టీలో ఈక్విటీ పెట్టుబడుల జోరు

- 2024లో 11 బిలియన్ డాలర్ల అంచనా
- గతేడాది 7.4 బిలియన్ డాలర్ల రాక



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగంలో దేశంలో ప్రస్తుత సంవత్సరం ఈక్విటీ పెట్టుబడులు 49 శాతం పెరిగి 11 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని పరిశ్రమల సమాఖ్య సీఐఐ, రియల్టీ కన్సల్టెంట్ సీబీఆర్ఈ నివేదిక తెలిపింది. ఆస్తులకు బలమైన డిమాండ్ ఈ స్థాయి జోరుకు కారణమని వివరించింది. '2023లో ఈక్విటీ పెట్టుబడులు ఈ రంగంలో 7.4 బిలియన్ డాలర్లు. ఈక్విటీ మూలధన ప్రవాహం 2024 జనవరి-సెప్టెంబర్ మధ్య 8.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 46 శాతం వృద్ధిని నమోదు చేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో 2024లో మొత్తం ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ మొదటిసారిగా 10 బిలియన్ డాలర్లను అధిగమించి కొత్త రికార్డును నమోదు చేయబోతున్నాయి. నిర్మాణం పూర్తి అయిన ఆఫీస్ అసెట్స్‌లో పెట్టుబడుల పునరుద్ధరణ, రెసిడెన్షియల్ విభాగంలో స్థలాల కోసం బలమైన డిమాండ్‌తో ప్రస్తుత సంవత్సరం మొత్తం ఈక్విటీ పెట్టుబడులు 10-11 బిలియన్ డాలర్ల శ్రేణిలో ఉంటాయి. 2024 జనవరి-సెప్టెంబర్ మధ్య పరిశ్రమ అందుకున్న నిధుల్లో విదేశీ ఇన్వెస్టర్ల వాటా 3.1 బిలియన్ డాలర్లు ఉంది. ఇందులో ఉత్తర అమెరికా, సింగపూర్ ఇన్వెస్టర్లు 85 శాతం సమకూర్చారు. సెబీ యొక్క ఎస్ఎం-ఆర్ఈఐటీ ఫ్రేమ్‌వర్క్‌తో ద్వితీయ శ్రేణి నగరాల్లో అధిక నాణ్యత గల చిన్న స్థాయి ఆస్తులు కూడా వ్యూహాత్మక మూలధన విస్తరణకు కొత్త మార్గాలను అందజేస్తాయి' అని నివేదిక వివరించింది.

2030 నాటికి
సేవల ఎగుమతులదే పైచేయి



న్యూఢిల్లీ: దేశ ఎగుమతుల్లో వస్తువులను సేవలు అధిగమించనున్నాయి. 2030 మార్చి నాటికి 618.21 బిలియన్ డాలర్లకు (51.92లక్షల కోట్లు) చేరుకుంటాయని స్వతంత్ర పరిశోధనా సంస్థ 'గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్' (జీటీఆర్ఐ) అంచనా వేసింది. అదే కాలంలో వస్తు ఎగుమతుల విలువ 613 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని తెలిపింది. 2018-19 నుంచి 2023-24 వరకు దేశ వస్తు ఎగుమతులు ఏటా 5.8 శాతం చొప్పున కాంపౌండెడ్ వృద్ధి చెందాయని, ఇదే కాలంలో సేవల ఎగుమతులు 10.5 శాతం చొప్పున పెరుగుతూ వచ్చాయని జీటీఆర్ఐ నివేదిక తెలిపింది. ఇదే స్థాయిలో వృద్ధి కొనసాగితే 2030 మార్చి నాటికి సేవల ఎగుమతులు 618.21 బిలియన్ డాలర్లకు, వస్తు ఎగుమతులు 613 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని అంచనా కట్టింది.

ఐటీ, సాఫ్ట్‌వేర్, ఓబీఎస్ హవా..

భారత సేవల రంగం వృద్ధిలో అధిక భాగం సాఫ్ట్‌వేర్, ఐటీ సేవలు, ఇతర వ్యాపార సేవల (ఓబీఎస్) నుంచే ఉంటోందని.. 2023-24 ఎగుమతుల్లో వీటి వాటా 86.4 శాతంగా ఉన్నట్టు జీటీఆర్ఐ తెలిపింది. ఓబీఎస్ పరిధిలోని న్యాయ సేవలు, అకౌంటింగ్, పన్ను సంబంధిత సేవలు, మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, మార్కెట్ పరిశోధన కలిపి 2023-24లో 10.28 బిలియన్ డాలర్ల ఎగుమతులు నమోదైనట్టు జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. మొత్తం సేవలు ఎగుమతుల్లో ఓబీఎస్ వాటా 33.2 శాతంగా ఉన్నట్టు చెప్పారు. దేశంలో అత్యంత నైపుణ్య మానవ వనరులు, అభివృద్ధి చెందుతున్న ఐటీ సదుపాయాలు అంతర్జాతీయ సేవల కేంద్రంగా భారత్ ప్రతిష్టను పెంచుతున్నట్టు జీటీఆర్ఐ తెలిపింది. జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్(ఎంఎల్), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) భారత కంపెనీల అవకాశాలను అధికం చేస్తున్నట్టు పేర్కొంది. ''సాఫ్ట్‌వేర్, ఐటీ సేవలు అతిపెద్ద విభాగంగా ఉండగా, వృద్ధిలో ఈ విభాగాన్ని ఓబీఎస్ దాటిపోనుంది. ప్రత్యేకమైన సేవలకు అంతర్జాతీయంగా డిమాండ్ పెరుగుతోంది''అని శ్రీవాస్తవ తెలిపారు.

యూఎస్ వెలుపల ఐటీ సేవల విస్తరణ..

యూఎస్‌కు బయట ఐటీ ఎగుమతులను వైవిధ్యం చేసుకోవడం మొదట చేయాల్సిన పనిగా జీటీఆర్ఐ పేర్కొంది. దేశ ఐటీ ఎగుమతుల్లో 70 శాతం యూఎస్‌కే వెళుతున్న నేపథ్యంలో, అక్కడి విధానాల్లో మార్పుల రిస్క్ ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడింది. ''ప్రెసిడెంట్‌గా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ఔట్‌సోర్స్‌ను విమర్శించడం, హెచ్-1బీ వీసా పాలసీల కట్టడి తదితర విధానాలు ఈ రిస్క్‌లను గుర్తు చేస్తున్నాయి. ఆటోమేషన్, కృత్రిమ మేధ (ఏఐ) 40 శాతం మేర ఐటీ ఉద్యోగులకు ముప్పుగా మారే ప్రమాదం కూడా ఉంది'' అని శ్రీవాస్తవ తెలిపారు. ఇతర మార్కెట్లకు విస్తరించడం, డిజిటల్ పరివర్తన, ఏఐ ఇంటిగ్రేషన్ యూఎస్‌పై ఎక్కువగా ఆధారపడడాన్ని తగ్గిస్తాయని పేర్కొన్నారు. ఓబీఎస్ ఎగుమతులను ప్రోత్సహించాలని జీటీఆర్ఐ నివేదిక సూచించింది. ఈ విభాగంలో ఎగుమతులకు గణనీయమైన అవకాశాలు న్నప్పటికీ, భారత సంస్థలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదని పేర్కొంది. ఇంజనీరింగ్, పరిశోధన, మేనేజ్‌మెంట్ నిపుణులకు అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలపై అవగాహన పెరిగితే వృద్ధి అవకాశాలను మరింత ఇతోధికం చేసుకోవచ్చని తెలిపింది.

‘దేశం కోసం బుల్లెట్ తీసుకునేందుకు సిద్ధపడు’

గంభీర్ చెప్పిన మాట తనలో స్ఫూర్తి రగిల్చిందన్న నితీశ్ రెడ్డి



పెర్త్: ఆస్ట్రేలియాతో తొలి మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ టెస్టు అరంగేట్రం చేసిన ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. కంగారూ గడ్డపై మ్యాచ్‌కు ముందు కాస్త ఒత్తిడిలో ఉన్న సమయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తనతో... ‘దేశం కోసం బుల్లెట్ తీసుకునేందుకు సిద్ధపడు’ అని చెప్పి స్ఫూర్తి నింపాడని నితీశ్ చెప్పాడు. పేస్‌కు సహకరిస్తున్న పెర్త్ పిచ్‌పై సీనియర్ ఆటగాళ్లే విఫలమైన చోట నితీశ్ రెడ్డి విజృంభించాడు. స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్, మార్ష్ వంటి పేసర్లను ఎదుర్కొంటూ పరుగులు రాబట్టి సత్తా చాటాడు. మ్యాచ్ అనంతరం నితీశ్ మాట్లాడుతూ... ‘పెర్త్ గురించి చాలా విన్నా. దీంతో మ్యాచ్‌కు ముందు కాస్త ఆందోళన చెందాను. బౌన్సర్లను ఎదుర్కోవడం కష్టం అనిపించినా... ఆ సమయంలో కోచ్ గంభీర్ నెట్స్‌లో చెప్పిన మాటలు గుర్తు చేసుకున్నా. ‘ప్రత్యర్థి బౌలర్లు బౌన్సర్లు సంధిస్తే... అది దేశం కోసం బుల్లెట్ అనుకో’ అని కోచ్ చెప్పారు. ‘మ్యాచ్ ఆరంభానికి ఒకరోజు ముందే అరంగేట్రం చేయనున్నట్లు తెలిసింది. విరాట్ కోహ్లి చేతుల మీదుగా టెస్టు క్యాప్ అందుకోవడం గొప్ప అనుభూతి. చిన్నప్పటి నుంచి కోహ్లి ఆట చూస్తూ పెరిగా... అలాంటిది ఇప్పుడు విరాట్ భాయ్‌తో కలిసి ఆడే అవకాశం దక్కడం చాలా ఆనందంగా ఉంది. భారత్ ‘ఎ’ తరఫున ఆస్ట్రేలియా ‘ఎ’తో అనధికారిక టెస్టు సిరీస్ ఆడటం ఎంతో ఉపకరించింది. ఇక్కడి పిచ్‌లపై ఒక అవగాహన ఏర్పడింది. భారత్‌తో పోల్చుకుంటే పూర్తి భిన్నమైన పరిస్థితుల్లో మెరుగైన ప్రదర్శన చేయడం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. పిచ్ నుంచి స్పిన్నర్లకు పెద్దగా సహకారం లేకపోవడంతో లయన్‌ను లక్ష్యంగా చేసుకొని వేగంగా పరుగులు రాబట్టా. పంత్‌తో కలిసి బ్యాటింగ్ చేయడం బాగుంది. క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తే వికెట్లు దక్కుతాయని ముందే అనుకున్నాం. బుమ్రా, సిరాజ్, హర్షిత్ అదే చేసి చూపెట్టారు. ప్రస్తుతానికి వికెట్ పేస్ బౌలింగ్‌కు అనుకూలంగా కనిపిస్తోంది’ అని నితీశ్ వివరించాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా జట్టులో చోటు దక్కించుకున్న నితీశ్‌కు తొలి రోజు బౌలింగ్ చేసే అవకాశం రాలేదు.



సాత్విక్-చిరాగ్ జోడీ సంచలనం

ప్రపంచ మూడో ర్యాంక్ జంటపై విజయం ● చైనా మాస్టర్స్ టోర్నీలో సెమీఫైనల్లోకి

షెన్‌జెన్: పారిస్ ఒలింపిక్స్ తర్వాత పాల్గొంటున్న తొలి టోర్నమెంట్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ అదరగొడుతోంది. చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జంట సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రపంచ మూడో ర్యాంక్ ద్వయం కిమ్ అస్ట్రుప్-ఆండెర్స్ స్కారప్ రసముసేన్ (డెన్మార్క్)తో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ 21-16, 21-19తో గెలిచింది. 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ తొలి గేమ్‌లో స్పష్టమైన ఆధిపత్యం కనబరిచింది. ఒక్కసారి కూడా స్కోరును సమం కానివ్వలేదు. రెండో గేమ్‌లో మాత్రం గట్టిపోటీనే లభించింది. డెన్మార్క్ జంట తీవ్రంగా పోరాడటంతో పలుమార్లు స్కోరు సమమైంది. చివర్లో స్కోరు 19-19 వద్ద సమంగా ఉన్నపుడు భారత జోడీ వరుసగా రెండు పాయింట్లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. గత ఏడాది ఇదే టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ జంట సాత్విక్-చిరాగ్ నేడు జరిగే సెమీఫైనల్లో జిన్ యోంగ్-జే సియో సెయింగ్ (దక్షిణ కొరియా) జోడీతో తలపడుతుంది. గతంలో కిమ్ అస్ట్రుప్-స్కారప్‌లతో తొమ్మిదిసార్లు తలపడి, ఆరుసార్లు ఓడిపోయిన భారత జంట ఈ ఏడాది డెన్మార్క్ ద్వయంపై రెండోసారి గెలిచింది. ఇండియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్లోనూ డెన్మార్క్ జోడీనే సాత్విక్-చిరాగ్ ద్వయం ఓడించింది.

పోరాడి ఓడిన లక్ష్య సేన్

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్ వన్ లక్ష్య సేన్‌కు నిరాశ ఎదురైంది. ప్రపంచ మూడో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సన్ (డెన్మార్క్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 18-21, 15-21తో ఓడిపోయాడు. 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌లో మూడుసార్లు ఆధిక్యంలోకి వెళ్లి దానిని వృథా చేసుకున్నాడు. రెండో గేమ్‌లో మాత్రం ఆంటోన్సన్‌దే పైచేయిగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతక పోరులో ఓడిపోయి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్న లక్ష్య సేన్... విశ్వ క్రీడల తర్వాత ఆడిన నాలుగు టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్‌ను దాటి ముందుకెళ్లలేకపోయాడు.

రాహుల్ అవుట్‌పై రగడ

అనుమానం ఉన్నప్పుడు అవుట్ ఎలా ఇస్తారన్న విశ్లేషకులు



పెర్త్: ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో భారత ఓపెనర్ కేఎల్ రాహుల్ అవుట్‌పై వివాదం చెలరేగింది. స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ 22వ ఓవర్ రెండో బంతికి రాహుల్ సందేహాస్పద రీతిలో పెవిలియన్ చేరాడు. ఫీల్డ్ అంపైర్ మొదట నాటౌట్‌గా ప్రకటించగా... క్యాచ్ అవుట్ కోసం ఆసీస్ డీఆర్ఎస్‌కు వెళ్లింది. పలుమార్లు రీప్లేలు పరిశీలించిన థర్డ్ అంపైర్ రాహుల్‌ను అవుట్‌గా ప్రకటించాడు. అయితే రివ్యూల్లో స్పష్టత రాకపోయినా... థర్డ్ అంపైర్ రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ ఫీల్డ్ అంపైర్ నిర్ణయాన్ని మార్చడం వివాదాస్పదమైంది. ‘బంతి బ్యాట్‌ను సమీపించిన సమయంలో అవుట్ సైడ్ ఎడ్జ్‌పై స్పైక్ కనిపించింది’ అని థర్డ్ అంపైర్ పేర్కొనగా... ఇది సరైన నిర్ణయం కాకపోవచ్చని కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్న భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. నిర్దిష్టమైన రుజువు లేకుండా ఫీల్డ్ అంపైర్ నిర్ణయాన్ని తప్పుబట్టడం సరైంది కాదని వ్యాఖ్యానించాడు. ‘ఫీల్డ్ అంపైర్ నిర్ణయాన్ని మార్చే ఆధారాలేవీ రీప్లేలో కనిపించలేదు. నా వరకైతే తగిన రుజువు లేకుండా నిర్ణయాన్ని సమీక్షించడం సరైంది కాదు’ అని రవిశాస్త్రి అన్నాడు. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు మైక్ హస్సీ కూడా ఇలాంటి అభిప్రాయమే వ్యక్తం చేశాడు. ‘ఇది వివాదాస్పద నిర్ణయం. స్నికోపై స్పైక్ రావడం వాస్తవమే కానీ అది బంతి బ్యాట్‌ను తాకినప్పుడు వచ్చిందా లేక ప్యాడ్ తాకినప్పుడా అనేది తేలాలి. దీనిపై నాకు కూడా సందేహాలు ఉన్నాయి’ అని హస్సీ అన్నాడు. ఆసీస్ మాజీ కెప్టెన్ మార్క్‌వా మాట్లాడుతూ... ‘ఇది చాలా ధైర్యంతో కూడిన నిర్ణయం. దీంతో రాహుల్ సంతృప్తిగా ఉండకపోవచ్చు’ అని అన్నాడు. ‘మరో కోణం నుంచి చూడాలని థర్డ్ అంపైర్ కోరినా... అది అందుబాటులో లేకపోయింది. మరి ఇలాంటి సందేహాస్పద పరిస్థితిలో అంపైర్ నిర్ణయాన్ని మార్చడం ఎందుకు’ అని భారత మాజీ ఆటగాడు వసీమ్ జాఫర్ ట్వీట్ చేశాడు. ‘స్పష్టత లేనప్పుడు అవుట్ ఇవ్వకూడదు’ అని ఇర్ఫాన్ పఠాన్ ‘ఎక్స్’లో పోస్ట్ చేశాడు.



ఫైనల్లో రిత్విక్ జోడీ

సాక్షి, హైదరాబాద్: రొవరెటో ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో రిత్విక్-శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీకి ఒలెగ్ ప్రిహొడ్కో (ఉక్రెయిన్)-జెల్లీ సెల్స్ (నెదర్లాండ్స్) జంట నుంచి ‘వాకోవర్’ లభించింది. నేడు జరిగే ఫైనల్లో థియో అరిబెగ్ (ఫ్రాన్స్)-ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్) ద్వయంతో రిత్విక్-బాలాజీ జంట తలపడుతుంది.

విష్ణువర్ధన్ జంట ఓటమి



సాక్షి, హైదరాబాద్: కాలాబురాగి ఓపెన్ అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగం నుంచి హైదరాబాద్ ప్లేయర్లు విష్ణువర్ధన్, రిషబ్ అగర్వాల్ నిష్క్రమించారు. కర్ణాటకలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్స్‌లో విష్ణువర్ధన్-సిద్ధాంత్ బంథియా (భారత్) 2-6, 3-6తో అగఫొనోవ్-బొబ్రోవ్ (రష్యా) చేతిలో... రిషబ్-కబీర్ హన్స్ (భారత్) 2-6, 3-6తో నితిన్ కుమార్ సిన్హా (భారత్)-నిక్ చాపెల్ (అమెరికా) చేతిలో ఓడిపోయారు.

దేశవాళీ ధనాధన్‌కు అంతా సిద్ధం

నేటి నుంచి ముస్తాక్ అలీ టి20 టోర్నీ



డిఫెండింగ్ చాంపియన్ పంజాబ్

న్యూఢిల్లీ: దేశవాళీ ధనాధన్ మెరుపుల ‘షో’కు రంగం సిద్ధమైంది. సాధారణంగా ఐపీఎల్ మెగా వేలానికి ముందే ఈ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీని నిర్వహిస్తారు. దీంతో ప్లేయర్లకు ఫ్రాంచైజీలను ఆకర్షించే అవకాశం లభించేది. కానీ ఈసారి వేలానికి ఏమాత్రం సంబంధం లేకుండా ఈ టి20 టోర్నీ శనివారం నుంచి దేశంలోని వివిధ నగరాల్లో (హైదరాబాద్, విశాఖపట్నం, విజయనగరం, రాజ్‌కోట్, ఇండోర్, ముంబై) జరగనుంది. ఠాకూర్ తిలక్ వర్మ సారథ్యంలో హైదరాబాద్ జట్టు ఈ టోర్నీలో పోటీపడనుంది. రాజ్‌కోట్‌లో నేడు జరిగే గ్రూప్ ‘ఎ’ తొలి లీగ్ మ్యాచ్‌లో మేఘాలయ జట్టుతో హైదరాబాద్ తలపడుతుంది. ఉప్పల్ స్టేడియంలో ఈనెల 25న జరిగే గ్రూప్ ‘ఇ’ తొలి లీగ్ మ్యాచ్‌లో నాగాలాండ్ జట్టుతో ఆంధ్ర పోటీపడుతుంది. డిసెంబర్ 15వ తేదీన జరిగే ఫైనల్‌తో ఈ టోర్నీ ముగుస్తుంది. ఈ టోర్నీలో పాల్గొంటున్న మొత్తం 38 జట్లను ఐదు గ్రూప్‌లుగా విభజించారు. డిఫెండింగ్ చాంపియన్‌గా పంజాబ్ జట్టు ఉంది.

బరిలో స్టార్ క్రికెటర్లు...

భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా (బరోడా), మొహమ్మద్ షమీ (బెంగాల్), శ్రేయస్ అయ్యర్ (ముంబై), యుజువేంద్ర చహల్ (హరియాణా) తదితరులతో పాటు దేశవాళీ స్టార్లు అభిషేక్ పొరెల్ (బెంగాల్), షారుక్ ఖాన్ (తమిళనాడు), అభినవ్ మనోహర్ (కర్ణాటక), మానవ్ సుతార్ (రాజస్తాన్), కరుణ్ నాయర్ (విదర్భ), కృనాల్ పాండ్యా (బరోడా), దీపక్ హుడా (రాజస్తాన్) ముస్తాక్ అలీ ట్రోఫీలో మెరిపించడానికి ‘సై’ అంటున్నారు. ఇందులో ఒక్క హార్దిక్ పాండ్యానే రిటెయిన్ ప్లేయర్ కాగా మిగతా వారంతా ఫ్రాంచైజీలు ఎంపిక చేసుకోవాలని... తమపై కోట్ల రూపాయాలు కురవాలని గంపెడాశలతో ఉన్నారు. వేలాన్ని పక్కన బెడితే ముస్తాక్ అలీ టోర్నీలో ఏటికేడు పోటీ పెరుగుతోంది. ఆటగాళ్లు తమ సత్తా చాటుకుంటున్నారు. గాయం నుంచి కోలుకున్నాక రంజీ బరిలో దిగిన వెటరన్ సీమర్ షమీ మధ్యప్రదేశ్‌పై నిప్పులు చెరిగాడు. 7 వికెట్లతో అదరగొట్టిన 34 ఏళ్ల సీమర్ తనలో ఇంకా పేస్ పదును ఏమాత్రం తగ్గలేదని నిరూపించుకున్నాడు. ప్రస్తుతం ఆసీస్‌లో జరుగుతున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీకి ఎంపిక కాలేకపోయినా... ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్‌లో పేస్ షమీ ఆడే అవకాశాల్ని తోసిపుచ్చలేం. ఈ టి20 టోర్నీలోనూ ఫిట్‌నెస్ నిరూపించుకుంటే ఆసీస్ ఫ్లయిట్ ఎక్కడం దాదాపు ఖాయమవుతుంది.

ఏ గ్రూప్‌లో ఎవరంటే...

గ్రూప్ ‘ఎ’: హైదరాబాద్, మధ్యప్రదేశ్, బెంగాల్, మేఘాలయ, పంజాబ్, మిజోరం, బిహార్, రాజస్తాన్.
గ్రూప్ ‘బి’: బరోడా, సిక్కిం, గుజరాత్, సౌరాష్ట్ర, కర్ణాటక, ఉత్తరాఖండ్, తమిళనాడు, త్రిపుర.
గ్రూప్ ‘సి’: హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, హరియాణా, జమ్మూ కశ్మీర్, మణిపూర్, ఢిల్లీ, అరుణాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్.
గ్రూప్ ‘డి’: ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి, అస్సాం, విదర్భ, రైల్వేస్, ఒడిశా, చండీగఢ్.
గ్రూప్ ‘ఇ’: ఆంధ్ర, నాగాలాండ్, కేరళ, ముంబై, గోవా, సర్వీసెస్, మహారాష్ట్ర.

వచ్చే ఐపీఎల్ మార్చి 14 నుంచి

మే 25న ఫైనల్ ● 2026, 2027 సీజన్ల షెడ్యూల్ తేదీలు కూడా ప్రకటించిన బీసీసీఐ



న్యూఢిల్లీ: వచ్చే సీజన్ సహా మూడేళ్లకు సంబంధించిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్ తేదీలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించింది. 2025 ఐపీఎల్ టోర్నీ మార్చి 14న మొదలై మే 25న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. 2026 సీజన్ మార్చి 15 నుంచి మే 31 వరకు... 2027 సీజన్ మార్చి 14 నుంచి మే 30 వరకు నిర్వహించనున్నట్లు బోర్డు తెలిపింది. మ్యాచ్‌ల సంఖ్యను కూడా పెంచే ప్రణాళికల్లో బీసీసీఐ ఉంది. అందుబాటులో ఉన్న పదిన్నర వారాల విండోలోనే పెంచే మ్యాచ్‌ల నిర్వహణపై బోర్డు, ఐపీఎల్ పాలక మండలి కసరత్తు చేస్తోంది.

వేలంలో ఆర్చర్

రేపు, ఎల్లుండి సౌదీ అరేబియాలో జరిగే ఆటగాళ్ల మెగా వేలంలో పాల్గొనే తుది ఆటగాళ్ల జాబితాను బోర్డు ఖరారు చేసింది. ఇంగ్లండ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ జోఫ్రా ఆర్చర్, ప్రవాస భారతీయుడైన అమెరికన్ పేసర్ సౌరభ్ నేత్రవాల్కర్, అన్‌క్యాప్డ్ ముంబై వికెట్ కీపర్ బ్యాటర్ హార్దిక్ తమోరేలను కొత్తగా తుది ప్లేయర్ల జాబితాలో చేర్చింది. సుదీర్ఘ కాలంగా ఆర్చర్ గాయాలతో సతమతమవుతున్నాడు. దీంతో జాతీయ జట్టు ఇంగ్లండ్‌కూ రెగ్యులర్‌గా ఆడటం లేదు. గత సీజన్ ఐపీఎల్ (2023)లో కొన్ని మ్యాచ్‌ల్లో బరిలోకి దిగినా మళ్లీ గాయంతో తిరుగుముఖం పట్టాడు. కరోనా వైరస్ నేపథ్యంలో యూఏఈలో నిర్వహించిన 2020 సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన ఆర్చర్ అద్భుత ప్రదర్శన చేశాడు. 20 వికెట్లు తీసిన ఈ సీమ్ ఆల్‌రౌండర్ ‘మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్’ (ఎంవీపీ) అవార్డుకు ఎంపికయ్యాడు. ఓవరాల్ ఐపీఎల్ కెరీర్‌లో మొత్తం 40 మ్యాచ్‌లాడిన అతను 48 వికెట్లు పడగొట్టాడు. అతను రూ. 2 కోట్ల ప్రాథమిక ధరతో ఫాస్ట్ బౌలర్ల జాబితాలో తొలి సెట్‌లో మొదటి రోజే వేలానికి రానున్నాడు. ఈ ఏడాది అమెరికా, విండీస్‌లలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో సౌరభ్ నేత్రవాల్కర్ అదరగొట్టాడు. ఎవరూ ఊహించని విధంగా అమెరికా జట్టు ‘సూపర్-8’కు అర్హత సాధించడంలో సౌరభ్ పాత్ర ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో సౌరభ్‌పై కూడా రూ.కోట్లు కురిసే అవకాశం లేకపోలేదు.



అశు మలిక్

దబంగ్ ఢిల్లీ దూకుడు

జైపూర్ పింక్ పాంథర్స్‌పై విజయం

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో దబంగ్ ఢిల్లీ ఆరో విజయం నమోదు చేసుకుంది. శుక్రవారం జరిగిన పోరులో దబంగ్ ఢిల్లీ 35-21 పాయింట్ల తేడాతో మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌పై విజయం సాధించింది. దబంగ్ ఢిల్లీ తరఫున స్టార్ రెయిడర్ అశు మలిక్ 9 పాయింట్లతో సత్తా చాటగా.. యోగేశ్ దహియా 5 పాయింట్లు సాధించాడు. జైపూర్ పింక్ పాంథర్స్ తరఫున అర్జున్ దేశ్వాల్ 7 పాయింట్లతో పోరాడినా అతడికి సహచరుల నుంచి సరైన తోడ్పాటు లభించలేదు. లీగ్‌లో ఇప్పటి వరకు 13 మ్యాచ్‌లు ఆడిన దబంగ్ ఢిల్లీ 6 విజయాలు, 5 పరాజయాలు, 2 ‘టై’లతో 40 పాయింట్లు ఖాతాలో వేసుకొని మూడో స్థానానికి చేరింది. జైపూర్ పింక్ పాంథర్స్ పట్టికలో ఏడో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 40-24 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. యూపీ యోధాస్ రెయిడర్ భవానీ రాజ్‌పుత్ 10 పాయింట్లతో విజృంభించగా... డిఫెన్స్‌లో హితేశ్ 6 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. తమిళ్ తలైవాస్ తరఫున విశాల్ చాహల్, నితీశ్ కుమార్ చెరో ఆరు పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది. తాజా సీజన్‌లో 5 విజయం నమోదు చేసుకున్న యూపీ యోధాస్ 33 పాయింట్లతో పట్టికలో ఎనిమిదో స్థానానికి చేరగా... గత ఐదు మ్యాచ్‌ల్లో నాలుగో పరాజయం మూటగట్టుకున్న తమిళ్ తలైవాస్ 28 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. లీగ్‌లో భాగంగా శనివారం గుజరాత్ జెయింట్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 8 గంటకు), జైపూర్ పింక్ పాంథర్స్‌తో హరియాణా స్టీలర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

సోనీ చేతికి ‘ఆసియా’ క్రికెట్ హక్కులు

ఏసీసీతో 8 ఏళ్ల ఒప్పందం

దుబాయ్: భారత్‌కు చెందిన సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ (ఎస్పీఎన్ఐ) ఆసియా క్రికెట్‌కు సంబంధించి ప్రత్యేక మీడియా హక్కుల్ని దక్కించుకుంది. ఈ మేరకు ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ)తో సోనీ సంస్థ ఎనిమిదేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది (2024) నుంచి 2031 సీజన్ ముగిసేదాకా ఏసీసీ ఆధ్వర్యంలో జరిగే పురుషులు, మహిళల ఆసియా కప్, అండర్-19 ఆసియా కప్, ఎమర్జింగ్ జట్ల ఆసియా కప్ మ్యాచ్‌లను సోనీ నెట్‌వర్క్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఈ ఒప్పందంలో టెలివిజన్ ప్రసార హక్కులతో పాటు డిజిటల్, ఆడియో మాధ్యమాలకు సంబంధించిన హక్కులు కూడా కలిసి ఉన్నాయి. అయితే ఈ ఒప్పందం విలువ బయటికి వెల్లడించకపోయినప్పటికీ గతంకంటే 70 శాతం ఎక్కువని ఏసీసీ ప్రకటించింది. ఇది ఆసియా క్రికెట్ టోర్నీలకు ఉన్న ఆదరణను తెలియజేస్తోందని ఓ ప్రకటనలో తెలిపింది. ఏసీసీ అధ్యక్షుడు జై షా మాట్లాడుతూ ‘క్రికెట్ నైపుణ్యానికి ఆసియా కప్ మూలస్తంభంలా నిలుస్తోంది. మా కొత్త మీడియా భాగస్వామి సోనీ ప్రపంచ శ్రేణి కవరేజీతో ప్రపంచవ్యాప్తంగా మరెంతో మంది క్రికెట్ వీక్షకుల్ని సంపాదిస్తుందన్న నమ్మకం ఉంది. పెరిగిన మీడియా హక్కుల విలువతో ఆసియా సభ్యదేశాల్లో మౌళిక సదుపాయాల అభివృద్ధి, క్షేత్రస్థాయిలో క్రికెట్ కార్యక్రమాలు కూడా పెరుగుతాయి’ అని విశ్వాసం వెలిబుచ్చారు. సోనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గౌరవ్ బెనర్జీ మాట్లాడుతూ దాయాదులు భారత్, పాక్ సహా ఏసీసీ మ్యాచ్‌లు తమ వీక్షకులకు మరింత వినోదాన్ని పంచుతాయని అన్నారు.

పోరాడి ఓడిన శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ



సాక్షి, హైదరాబాద్: ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు శుభారంభం లభించలేదు. శుక్రవారం ఇక్కడి డెక్కన్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌లో గోకులం కేరళ ఎఫ్‌సీ జట్టు 3-2 గోల్స్ తేడాతో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుపై గెలిచింది. శ్రీనిధి జట్టు తరఫున లాల్‌రొమావియా (40వ నిమిషంలో), డేవిడ్ కాస్టెనాడా మునోజ్ (90+6వ నిమిషంలో) ఒక్కోగోల్ చేశారు. గోకులం కేరళ జట్టుకు మార్టిన్ చావెస్ (60వ నిమిషంలో), ఇగ్నాసియో అబెలాడో (84వ నిమిషంలో), థాబ్‌పుయా (90+5వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. కోల్‌కతాలో జరిగిన మరో మ్యాచ్‌లో ఇంటర్ కాశీ జట్టు 1-0తో స్పోర్టింగ్ క్లబ్ బెంగళూరు జట్టును ఓడించింది. మొత్తం 12 జట్లు ఈ లీగ్‌లో పాల్గొంటున్నాయి.

అమెరికా విప్లవం ముందునాటిది..
అదిరిపోయే ధర పలికింది

రూ. 21 కోట్లు పలికిన 1652 నాటి వెండి నాణెం



17వ శతాబ్దంనాటి అత్యంత అరుదైన వెండి నాణెం అది. అందులోనూ అమెరికా విప్లవానికి ముందునాటిది. మరీ ముఖ్యంగా అమెరికాలోనే తయారైంది. అంటే అమెరికా సంయుక్త రాష్ట్రాలు(యూఎస్ఏ)గా అమెరికా ప్రాంతం ఒక స్వతంత్ర దేశంగా ఆవిర్భవించకముందునాటిది. ప్రపంచంలో ఇలాంటిది ఇంకొక్కటి మాత్రమే ఉంది. ఇన్ని ప్రత్యేకతలున్నాయి కాబట్టే ఆ చిన్ని నాణెం ఏకంగా రూ.21.28 కోట్ల ధర పలికిందని స్టేక్స్ బోవర్స్ గ్యాలరీస్ వేలం సంస్థ ప్రకటించింది. తయారుచేసినపుడు దీని ముఖ విలువ మూడు పెన్నీలు మాత్రమే. బోస్టన్ మింట్ ప్రారంభించిన కొద్ది వారాలకే 1652వ సంవత్సరంలో దీనిని ముద్రించారు. నాణేనికి ఒకవైపు న్యూ ఇంగ్లండ్(ఎన్‌ఈ) అన్న రెండు అక్షరాలు మాత్రమే ఉన్నాయి. మరోవైపు రోమన్ అంకెల్లో మూడు అని రాసి ఉంది. న్యూ ఇంగ్లండ్ ప్రభ పెరుగుతోందని తెలియజేసేందుకు గుర్తుగా మొదట్లో కొన్నింటిని మాత్రమే ఇలా వెండితో ముద్రించారు. ప్రస్తుత మార్కెట్లో నికెల్, వెండి విలువల్లో లెక్కిస్తే దీని ధర కేవలం 1.03 అమెరికన్ డాలర్లు. కానీ అమెరికా స్వాతంత్ర్యం ముందునాటిది కావడం, చారిత్రక విశేషాలుండటంతో దీనికి ఎక్కడా లేనంతటి విలువ వచ్చింది.


ఎనిమిదేళ్ల క్రితం వెలుగుచూసి..

నెదర్లాండ్స్‌లో 2016లో ఒక పేస్ట్‌బోర్డ్ పెట్టెలో దీనిని కనుగొన్నారు. దీంతోపాటు ఒక కవర్ ఉంది. దానిపై '1798 డిసెంబర్‌లో క్విన్సీ కుటుంబానికి బోస్టన్ మింట్ నుంచి వచ్చిన సిల్వర్ టోకెన్ ఇది'అని మాత్రమే రాసి ఉంది. అయితే దీని విలువ తెలియని ఆ యజమాని దీని గురించి పట్టించుకోవడం మానేశారట. అయితే అరుదైన నాణెం వార్త అందరి నోటా పడి చివరకు దీని మూలాల గుట్టు తెల్సుకునే పని మొదలైంది. అరుదైన నాణేల ప్రమాణాలను నిర్ధారించే స్వతంత్ర 'పీసీజీఎస్'విభాగం రంగంలోకి దిగి దీని విశిష్టతను ప్రపంచానికి తెలిసేలా చేసింది. అయితే గతంలోనూ ఇలాంటి ప్రయత్నం జరిగిందన్న విషయం పీసీజీఎస్ పరిశోధనలో వెల్లడైంది. ఇంగ్లండ్‌కు చెందిన నాణేలను సేకరించే థామస్ బ్రాండ్ అనే పెద్దాయన 1781లో నెదర్లాండ్స్‌లో అమెరికా రాయబారి జాన్ ఆడమ్స్‌కు ఒక లేఖ రాశారు. ఆడమ్స్ భార్య ఎబిగేల్‌కు ఈ నాణేనికి ఒక సంబంధం ఉండటమే ఇందుకు కారణం. ఈ నాణేన్ని ముద్రించిన స్వర్ణకారుడు జాన్ హల్‌కు సవతి సోదరుడి ముని మనవరాలే ఈ ఎబిగేల్. ఇలా ఈ నాణెం ఎప్పుడు ఎక్కడ ముద్రించబడిందనే వివరాలు తెలిశాయి. ఇలాంటి మరో నాణెం గతంలో ఉండేదని మసాచుసెట్స్ హిస్టారికల్ సొసైటీ పేర్కొంది. గతంలో అమెరికాలోని యేల్ కళాశాలలో ప్రదర్శనకు ఉంచగా చోరీకి గురైంది. ఇప్పుడు అది ఎక్కడ ఉందో ఎవరికీ తెలీదు. ''నాణెం వేలం మొదలెట్టిన కేవలం 12 నిమిషాల్లోనే ఊహించిన దానికంటే మూడు రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడుపోయింది'అని వేలంపాట నిర్వాహకుడు బెన్ ఒరోజీ చెప్పారు. గతంలోనూ కొన్ని అమెరికా నాణేలు రికార్డ్ ధరలకు అమ్ముడుపోయాయి. 2013లో 1794నాటి వెండి డాలర్ నాణెం ఒక కోటి డాలర్లకు అమ్ముడుపోయింది. 1933లో ముద్రించిన డబుల్ ఈగిల్ బంగారు నాణెం మూడేళ్ల క్రితం ఒక వేలంపాటలో 1.89 కోట్ల డాలర్లకు అమ్ముడుపోయింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

చరిత్ర సృష్టించిన గాజు కిటికీ

రూ.105 కోట్లు పలికిన ప్రఖ్యాత టిఫానీ విండో



దూరం నుంచి చూస్తే నల్లని వస్త్రంపై చిత్రకారుడి కలం నుంచి జాలువారిన అద్భుత చిత్రరాజం అనిపించకమానదు. కానీ దగ్గరికెళ్లి తరచిచూస్తే సప్తవర్ణశోభితమై ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే ఒక అద్దం కిటికీ అని వెంటనే తెలుస్తుంది. అపురూప కళాఖండంగా దశాబ్దాల క్రితమే ఘన కీర్తిని మూటగట్టుకున్న ఈ గాజు కిటికీకి మళ్లీ రెండు పుష్కరాల తర్వాత వేలంపాట కొచ్చింది. 24 ఏళ్ల క్రితం రూ.16 కోట్లకుపైబడి ధర పలికి ఔరా అనిపించిన ఈ గాజు కిటికీ తాజాగా సోమవారం ఏకంగా రూ.105 కోట్లకు అమ్ముడుపోయి తన విశిష్టతకు ఏ అద్దమూ సాటిరాదని నిరూపించుకుంది. 20వ శతాబ్దానికి చెందిన అమెరికన్ కళాకారుడు లూయిస్ కంఫర్ట్ టిఫానీ ఈ గాజు కిటికీని తయారుచేశారు. అలంకార, సౌందర్య కళల్లో లూయిస్‌ది అందె వేసిన చేయి. స్టెయిన్ గ్లాస్‌తో ఆయన చేసిన కళాకృతులు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతిపొందాయి. ఓహియో రాష్ట్రంలోని క్యాంటన్ సిటీలో తొలి బాప్టిస్ట్ చర్చి వ్యవస్థాపకుల్లో ఒకరైన జాన్ థెరిసా డ్యానర్ గౌరవార్థం లూయిస్ ఈ కిటికీని తయారుచేశారు. అందుకే దీనిని 'డ్యానర్ మెమోరియల్ విండో'అంటారు.

16 అడుగుల కళాఖండం

సోమవారం న్యూయార్క్‌లోని సోత్‌బే వేలం సంస్థ నిర్వహించిన వేలంలో కేవలం ఆరున్నర నిమిషాల్లో ఊహించినదానికంటే నాలుగు రెట్లు అధిక ధరకు ఇది అమ్ముడుపోవడం విశేషం. బిలియనీర్ అలెన్ గెర్రీ దీనిని విక్రయించగా ఒక గుర్తు తెలియని వ్యక్తి దీనిని కొనుగోలుచేశారని సోత్‌బే సంస్థ ప్రకటించింది. టిఫానీ రూపొందించిన కిటికీల్లో ఇంతవరకు ఇంత భారీ ధరకు అమ్ముడుపోయిన తొలి గాజు కిటికీ ఇదే. వాస్తవానికి చర్చి కోసం దీనిని తయారుచేసినా చివరకు వినియోగించకుండా వదిలేశారు. గలగలపారే సెలయేరుకు ఇరువైపులా విరగగాసిన ఫలాలతో అలరారుతున్న వృక్షాలు ఊసులాడుకుంటున్నట్లు ఎంతో రమ్యంగా రంగులద్దారు. డిజైన్ ఆగ్నెస్ నార్త్‌రోప్ ఈయనకు సాయపడ్డారు. 1913లో దీని తయారీ పూర్తయింది. ''టిఫానీ రూపొందించిన గాజు కిటికీలు ఇన్నేళ్లు గడిచినా మార్కెట్‌లో తమ హవా కొనసాగిస్తున్నాయనడానికి ఈ కిటికీ వేలమే నిదర్శనం''అని సోత్‌బే చైర్మన్ జోడీ పొల్లాక్ అన్నారు. లూయిస్ టిఫానీ వాళ్ల నాన్నకు అమెరికాలో టిఫానీ అండ్ కో. పేరిట స్టెయిన్ గ్లాస్ తయారీ కర్మాగారం ఉండేది. అందులో పనిచేస్తూనే టిఫానీ ఎన్నో కళాఖండాలను సృష్టించారు. గాజు దీపాలు, పుష్పలంకరణ వస్తువులను తయారుచేశారు. అమెరికాలోని న్యూయార్క్‌తోపాటు బ్రిటన్‌లోని లండన్, ఫ్రాన్స్‌లోని పారిస్ సొంత స్టోర్‌లలో ఈయన కళారూపాలకు విపరీతమైన డిమాండ్ ఉండేది. పెన్సిల్వేనియా, మసాచుసెట్స్, న్యూయార్క్‌లోని చాలా చర్చిల్లో ఈయన గాజు కిటికీలే మనకు దర్శనమిస్తాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

నెతన్యాహు అరెస్టవుతారా?

తమ దేశానికి వస్తే అరెస్టు చేస్తామన్న ఇటలీ

ఆచితూచి స్పందించిన యూరోపియన్ యూనియన్ దేశాలు

వాషింగ్టన్: గాజాలో యుద్ధ నేరాలకు పాల్పడినందుకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ) అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆయన నిజంగా అరెస్టవుతారా? అనే దానిపై చర్చ మొదలైంది. ఐసీసీలో మొత్తం 124 సభ్యదేశాలున్నాయి. అయితే, అన్ని దేశాలూ ఐసీసీ ఆదేశాలను పాటిస్తాయన్న గ్యారంటీ లేదు. అరెస్టు విషయంలో అవి సొంత నిర్ణయం తీసుకోవచ్చు. నెతన్యాహు తమ దేశానికి వస్తే అరెస్టు చేస్తామని ఇటలీ ప్రకటించింది. నెతన్యాహుతోపాటు ఇజ్రాయెల్ రక్షణ శాఖ మాజీ మంత్రి యోవ్ గల్లాంట్‌ను హమాస్ నేతలతో సమానంగా ఐసీసీ పరిగణించడం సరైంది కాదని ఇటలీ రక్షణ మంత్రి గైడో క్రోసెట్టో చెప్పారు. ఐసీసీ ఆదేశాలను పాటించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఒకవేళ నెతన్యాహు తమ దేశ భూభాగంలోకి ప్రవేశిస్తే చేస్తామని పేర్కొన్నారు. నెతన్యాహు అరెస్టుపై మరి కొన్ని యూరోపియన్ యూనియన్ దేశాలు మాత్రం ఆచితూచి స్పందించాయి. ఐసీసీని తాము గౌరవిస్తామని, నెతన్యాహు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఫ్రాన్స్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి క్రిస్టోఫీ లెమైన్ చెప్పారు. తమ వైఖరిని ఇప్పుడే వెల్లడించలేమని అన్నారు. ఐసీసీ జారీ చేసిన అరెస్టు వారెంట్ ఒక సాధారణ ప్రక్రియ అని, అది తుది తీర్పు కాదని స్పష్టం చేశారు.

నెతన్యాహును అరెస్టు చేయబోమని ఇజ్రాయెల్ మిత్రదేశం జర్మనీ సంకేతాలిచ్చింది. ఇజ్రాయెల్ ప్రధానిపై ఐసీసీ అరెస్టు వారెంట్‌ను హంగెరీ ప్రధానమంత్రి విక్టన్ ఓర్బన్ బహిరంగంగా ఖండించారు. నెతన్యాహు తమ దేశంపై స్వేచ్ఛగా పర్యటించవచ్చని సూచించారు. పాలస్తీనాకు మద్దతిచ్చే స్లొవేనియా దేశం ఐసీసీ నిర్ణయాన్ని సమర్థించింది. అరెస్టు వారెంట్‌కు స్లొవేనియా ప్రధాన మంత్రి రాబర్ట్ గొలోబ్ మద్దతు ప్రకటించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నిర్ణయాన్ని అమలు చేయడం అనేది రాజకీయపరమైన ఐచ్ఛికాంశం కాదని, చట్టపరమైన నిబంధన అని యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ జోసెఫ్ బోరెల్ చెప్పారు. ఐసీసీ నిర్ణయాన్ని అగ్రరాజ్యం అమెరికా ఖండించింది. ఇలాంటి అరెస్టు వారెంట్లతో పరిస్థితి మరింత విషమిస్తుందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఐసీసీ గత ఏడాది అరెస్టు వారెంట్ జారీ చేసింది. కానీ, ఆయన ఇప్పటికీ అరెస్టు కాలేదు. ఐసీసీ సభ్యదేశాలకు పుతిన్ వెళ్లలేదు.

చితిపై బతికొచ్చాడు

చనిపోయాడని నిర్ధారించిన డాక్టర్లు

- చితికి నిప్పంటిస్తుండగా శ్వాసపీల్చిన వైనం
- కొన్ని గంటల తర్వాత మృతి
- నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ముగ్గురు డాక్టర్ల సస్పెన్షన్

జైపూర్: మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించిన ఓ వ్యక్తి శ్మశానంలో చితిపైకి చేర్చగానే శ్వాస పీల్చడం ప్రారంభించాడు. అతడు ప్రాణాలతోనే ఉన్నట్లు తేలింది. దీంతో అంత్యక్రియలకు వచ్చినవారంతా షాక్ తిన్నారు. అయితే, కొన్ని గంటల తర్వాత ఆ వ్యక్తి తుదిశ్వాస విడిచాడు. ఆశ్చర్యకరమైన ఈ సంఘటన రాజస్తాన్‌లోని జుంఝునులో చోటుచేసుకుంది. ప్రాణంతో ఉన్న వ్యక్తి మరణించినట్లు ప్రకటించడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ముగ్గురు వైద్యులను జుంఝునూ జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. 25 ఏళ్ల రోహితాశ్ కమార్ దివ్యాంగుడు. వినలేడు, మాట్లాడలేడు. అతడి కుటుంబం ఏమైందో, ఎక్కడుందో తెలియదు. అనాథగా మారాడు. అనాథాశ్రమంలో ఉంటున్నాడు. గురువారం హఠాత్తుగా అనారోగ్యం పాలయ్యాడు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో జుంఝునూ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. అతడు చనిపోయినట్లు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు డాక్టర్లు ప్రకటించారు. దాంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. రెండు గంటలపాటు అక్కడే ఉంచారు. పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని అంత్యక్రియల కోసం శ్మశానానికి తరలించారు. దహనం చేయడానికి చితిపైకి చేర్చారు. చితికి నిప్పంటించడానికి సిద్ధమవుతుండగా రోహితాశ్ శ్వాస పీల్చుకోవడం ప్రారంభించాడు. అతడు బతికే ఉన్నట్లు గుర్తించి వెంటనే అంబులెన్స్ రప్పించారు. జుంఝునూలోని బీడీకే హాస్పిటల్‌కు తరలించారు. ఐసీయూలో చేర్చి చికిత్స ప్రారంభించారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం జైపూర్‌లోని ఎస్ఎంఎస్ ఆసుపత్రికి తరలిస్తుండగా, మధ్యలోనే ప్రాణాలు విడిచాడు. బతికి ఉన్న వ్యక్తి మరణించినట్లు నిర్ధారించినందుకు జుంఝున్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రిన్సిపల్ మెడికల్ ఆఫీసర్ సందీప్ పచార్‌తోపాటు మరో ఇద్దరు డాక్టర్లను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

పిల్లల తిండి కోసం... పస్తులుంటున్న కెనడియన్లు

- 84 శాతం ఒక పూట భోజనాన్ని మానేస్తున్నారు
- 90 శాతం కిరాణా ఖర్చు తగ్గించుకుంటున్నారు

ఒట్టావా: ఒకప్పుడు లక్షల మందికి కలల గమ్యస్థానమైన కెనడా కొన్నాళ్లుగా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న కిరాణా బిల్లులు, గృహ నిర్మాణ ఖర్చులతో ప్రజలు సతమతమవుతున్నారు. అనేక కుటుంబాలు రోజువారీ అవసరాలు తీర్చుకోవడానికే ఆపసోపాలు పడుతున్నాయి. చివరికి పిల్లలకు పౌష్టికాహారం కూడా గగనంగా మారుతోందట. సాల్వేషన్ ఆర్మీ చేసిన సర్వేలో ఇలాంటి విస్తుగొలిపే విషయాలెన్నో వెలుగులోకి వచ్చాయి. కెనడాలో 25 శాతం మంది తల్లిదండ్రులు పిల్లలకు పోషకాహారాన్ని అందించడానికి తమ ఆహారాన్ని తగ్గించుకుంటున్నారు. ఇక ఏకంగా 90 శాతానికి పైగా కుటుంబాలు కిరాణా వస్తువుల కొనుగోలును వీలైనంతగా తగ్గించుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. నివేదిక ఇంకా ఏం చెప్పిందంటే...

- కెనడాలో ప్రతి నలుగురు తల్లిదండ్రుల్లో ఒకరు పిల్లలకు మంచి ఆహారం అందించడానికి స్వీయ ఆహార వినియోగాన్ని తగ్గించారు
- సర్వేలో పాల్గొన్న వారిలో 90% మందికి పైగా ఇతర ఆర్థిక ప్రాధాన్యతలకు కావాల్సిన డబ్బు కోసం కిరాణా ఖర్చులు తగ్గించినట్లు చెప్పారు
- కెనడాలో ఫుడ్ బ్యాంకులు కూడా తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంటున్నాయి.
- దాంతో భారతీయులు సహా అంతర్జాతీయ విద్యార్థులను తిప్పి పంపాలని అవి నిర్ణయించాయి.
- చాలామందికి ప్రస్తుతం కనీస నిత్యావసర వస్తువుల కొనుగోలుకు సరిపడా జీవనోపాధి పొందడం కూడా కష్టంగా మారింది
- డబ్బుల్లేక చాలామంది చౌకగా దొరికే నాసిరకం ఆహారంతో కడుపు నింపుకుంటున్నారు
- అది కూడా కుదరినప్పుడు భోజనాన్ని దాటవేస్తున్నట్లు 84% మంది చెప్పారు.

> "చాలామంది కెనడియన్లు తమ పిల్లలు, కుటుంబసభ్యుల రోజువారీ ప్రాథమిక అవసరాలను తీర్చడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. దేశం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి ఇది అద్దం పడుతోంది"
>
> **- జాన్ ముర్రే, సాల్వేషన్ ఆర్మీ ప్రతినిధి**

ట్రూడో తాయిలాలు

- 1.87 కోట్ల మందికి తలో 250 డాలర్లు
- పలు వస్తువులపై పన్ను మినహాయింపులు
- ఎన్నికల గిమ్మిక్కులంటూ మండిపడ్డ విపక్షాలు



గురువారం ఒంటారియోలో ఓ సూపర్ మార్కెట్లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో

టొరంటో: ద్రవ్యోల్బణం పెరిగి జీవన వ్యయ సంక్షోభంతో సతమతమవుతున్న కెనడియన్లకు ఊరట కల్పిస్తూ జస్టిన్ ట్రూడో ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. కిరాణా, పిల్లల దుస్తులు, మద్యం, క్రిస్మస్ ట్రీలతో సహా పలు వస్తువులపై రెండు నెలల పాటు పన్ను మినహాయించింది. 2023లో 1.5 లక్షల కెనేడియన్ డాలర్లు లేదా అంతకంటే తక్కువ సంపాదన ఉన్న 1.87 కోట్ల మందికి 'వర్కింగ్ కెనడియన్స్ రిబేట్'కింద ఒక్కొక్కరికి 250 డాలర్ల చొప్పున పంపిణీ చేయనుంది. ట్రూడో ఈ మేరకు ఎక్స్‌లో పోస్టులో వెల్లడించారు. ''మా ప్రభుత్వం ధరలను నిర్ణయించలేదు. కానీ ప్రజలకు మరింత డబ్బు అందించగలదు. 250 డాలర్ల రిబేట్‌తో పాటు కెనేడియన్లు డిసెంబర్ 14 నుంచి రెండు నెలల పాటు జీఎస్టీ, హెచ్ఎస్టీ నిలిపివేత రూపంలో పన్ను మినహాయింపు పొందనున్నారు''అని ప్రకటించారు. దాని ప్రకారం కిరాణా సరుకులు, ఇతర నిత్యావసరాలు, పిల్లల దుస్తులు, డైపర్లు, ప్రాసెస్డ్ ఫుడ్, రెస్టారెంట్ భోజనం, స్నాక్స్, ఆల్కహాల్, బొమ్మలు, పుస్తకాలు, వార్తాపత్రికలతో సహా పలు ఇతర వస్తువులపై రెణ్నెల్లపాటు పన్ను ఎత్తేస్తారు.

ట్రూడో ప్రకటనను విపక్ష కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు పియరీ పొయిలీవ్రే తప్పుపట్టారు. రెండు నెలల తాత్కాలిక పన్ను విరామం వచ్చే సంవత్సరం ప్రారంభంలో పెరిగే కార్బన్ పన్నుల భారాన్ని భర్తీ చేయబోదన్నారు. ''ట్రూడో హయాంలో గృహనిర్మాణ ఖర్చులు రెట్టింపయ్యాయి. ఫుడ్‌బ్యాంక్ వినియోగం ఆకాశాన్నంటుతోంది. ఫెడరల్ కార్బన్ ట్యాక్స్ వల్ల చలికాలంలో ఇళ్లలో వెచ్చదనం కూడా ప్రజలకు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారుతోంది'' అని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే కొత్తింటి అమ్మకాలపై కార్బన్ పన్ను, జీఎస్టీ రద్దు చేస్తామన్నారు. ట్రూడో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉండటం తెలిసిందే. దాంతో తాజా ఆర్థిక తాయిలాలను వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో వారిని బుజ్జగించడంలో భాగమని భావిస్తున్నారు. కాగా జీఎస్టీ రద్దు తమ పార్టీ ప్రచారం ఫలితమేనని ఎన్డీపీ నేత జగ్మీత్ సింగ్ అన్నారు.

మా పత్రికవి ప్రేలాపనలే: కెనడా

టొరంటో: భారత్‌పై కొన్నాళ్లుగా కెనడా అకారణంగా విషం చిమ్ముతోందని మరోసారి రుజువైంది. ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య గురించి ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తదితరులకు ముందే తెలుసంటూ కెనడా పత్రిక ఒకటి అవాకులు పేలడం తెలిసిందే. అవన్నీ పచ్చి అబద్ధాలని ఆ దేశ ప్రభుత్వమే అంగీకరించింది! ఆ కథనం పూర్తిగా అవాస్తవమంటూ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. నిజ్జర్ హత్యలో మోదీ, మంత్రులు, లేదా భారత ఉన్నతాధికారుల పాత్రపై తమ వద్ద ఎలాంటి ఆధారాలూ లేవని పునరుద్ఘాటించింది. 'ది గ్లోబ్ అండ్ మెయిల్'అనే సదరు పత్రిక కథనంపై విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించడం తెలిసిందే. ''మీడియా కథనాలపై సాధారణంగా మేం స్పందించం. కానీ ఈ ఆరోపణలు మరీ హాస్యాస్పదం. బాధ్యతారహితం. ఇప్పటికే దెబ్బతిన్న ఇరు దేశాల దౌత్య సంబంధాలకు మరింత చేటుచేస్తాయి''అంటూ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ దుయ్యబట్టారు. కెనడా ప్రభుత్వం వాటిని తక్షణం ఖండించాలని డిమాండ్ చేశారు. ఆ మర్నాడే ట్రూడో సర్కారు దిగొచ్చి ఆ మేరకు ప్రకటన విడుదల చేసింది.

గాట్విక్ ఎయిర్‌పోర్టులో బాంబు కలకలం

- సౌత్ టెర్మినల్‌ను ఖాళీ చేయించిన అధికారులు
- తనిఖీల్లో బాంబు లేదని నిర్ధారణ

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో అత్యంత రద్దీగా ఉండే గాట్విక్ ఎయిర్‌పోర్టు సౌత్ టెర్మినల్‌ను అధికారులు శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా ఖాళీ చేయించారు. భద్రతాపరమైన కారణాలతో ముందు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నారు. లండన్‌కు దక్షిణ దిశగా 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఎయిర్‌పోర్టులో ఓ బ్యాగ్‌లో అనుమానాస్పద వస్తువును తనిఖీల్లో గుర్తించారు. అది బాంబు కావొచ్చన్న అంచనాతో సౌత్ టెర్మినల్‌ను వెంటనే ఖాళీ చేయించారు. ప్రయాణికులకు, ఎయిర్‌పోర్టు సిబ్బందిని బయటకు పంపించారు. చుట్టు పక్కల రోడ్లను కూడా మూసివేశారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. అణువణువూ క్షుణ్నంగా తనిఖీ చేశారు. అయితే, ఎలాంటి బాంబు లేదని గుర్తించినట్లు సమాచారం. సౌత్ టెర్మినల్‌ను పోలీసులు చుట్టుముట్టడంతో ఇక్కడి రాకపోకలు సాగించే నుంచి రైలు, బస్సు సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. అయితే, నార్త్ టెర్మినల్ యథాతథంగా పనిచేసింది.

మాలి ప్రధానిపై సైన్యం వేటు

బమాకో: సైన్యం ఆధ్వర్యంలోని అధికార జుంటాను విమర్శించిన మాలి ప్రధాని చొగుల్ మైగా (43) పదవి నుంచి ఉద్వాసనకు గురయ్యారు. ప్రభుత్వ అధికారిక వార్తా సంస్థ ఓఆర్టీఎం ఈ మేరకు ప్రకటించింది. ఆ వెంటనే సైనిక ఉన్నతాధికారి అబ్దులాయే మైగాను నూతన ప్రధానిగా నియమిస్తూ జుంటా నిర్ణయం తీసుకుంది. మాలిలో 2020, 2021ల్లో సైన్యం తిరుగుబాటు చేసి అధికారాన్ని చేజిక్కించుకుంది. అప్పటి నుంచీ సైనిక పాలనే సాగుతోంది. నాటినుంచీ భావ ప్రకటన స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపింది. సైనిక పాలనను విమర్శించినందుకు ఇప్పటికే డజనుకు పైగా నేతలను, ఉద్యమకారులను అరెస్టు చేసింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని సైనిక జుంటా హామీ ఇచ్చినా సాంకేతిక కారణాలతో సాగదీస్తూ వస్తోంది. ఎన్నికల వాయిదాపై ప్రభుత్వంలో ఎలాంటి చర్చ జరగలేదని చొగుల్ గత వారం విమర్శించారు. ''జుంటా నిర్ణయం నాకు కూడా మీడియా ద్వారానే తెలిసింది. ఇదంతా ప్రధానికి తెలియకుండా రహస్యంగా జరుగుతోంది''అని ఆక్షేపించి సైన్యం ఆగ్రహానికి గురయ్యారు.

సంస్థాగత ఎన్నికలపై బీజేపీ కసరత్తు

సాక్షి, న్యూఢిల్లీ: పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణపై బీజేపీ తన కసరత్తును వేగిరం చేసింది. డిసెంబర్ చివరి నాటికి పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక పూర్తి చేయాలని భావిస్తున్న పార్టీ హైకమాండ్ ఆలోగా రాష్ట్రాల వారీగా బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని పదవులకు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళిక వేస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ఇంఛార్జిలు, ముఖ్య నాయకులతో ఇక్కడ కీలక భేటీ నిర్వహించింది. ఈ భేటీకి పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి బీఎల్ సంతోష్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ కె.లక్ష్మణ్‌తో పాటు ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఎంపీలు సీఎం రమేశ్, డీకే అరుణ, పార్టీ కర్ణాటక, తమిళనాడు సహ ఇంఛార్జి పొంగులేటి సుధాకర్‌లు రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రాల వారీగా సభ్యత్వ నమోదు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం బూత్, మండల, జిల్లా సంస్థల ఎన్నికల ప్రక్రియ, వాటి నిర్వహణపై పెద్దలు మార్గదర్శనం చేశారు. ఎన్నికల అధికారులు ప్రకటించిన తేదీన బూత్, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధ్యక్ష ఎన్నికల పూర్తి, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడి ఎన్నికతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, అధ్యక్షుడు, జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక విధానంపై వివరించారు. డిసెంబర్‌లోగా మండల స్థాయి వరకు అధ్యక్ష నియామకాలు పూర్తి చేయాలని సూచించినట్లు తెలిసింది.

కాలుష్యంపై సభలో చర్చించాలి: రాహుల్

న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశంలో పెచ్చుమీరుతున్న వాయు కాలుష్యం జాతీయ అత్యవసర పరిస్థితి అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ సంక్షోభాన్ని ఎలా నివారించాలన్న దానిపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చర్చించాలని ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. వాయు కాలుష్యాన్ని అరికట్టే విషయంలో రాజకీయాలకు తావు లేదని, జాతీయ స్థాయిలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని చెప్పారు. ఈ మేరకు రాహుల్ శుక్రవారం ఒక వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఢిల్లీలోని ఇండియా గేటు వద్ద పర్యావరణవేత్త విమలేందు ఝూతో రాహుల్ చర్చిస్తున్న దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. వాయు కాలుష్యం తీవ్రమైన సంక్షోభంగా మారిపోయిందని, ఇది పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తోందని, పెద్దల ప్రాణాలను బలి తీసుకుంటోందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యాన్ని పర్యావరణ, ఆర్థిక విపత్తుగా పరిగణించాలని అభిప్రాయపడ్డారు. కాలుష్యం వల్ల పేదలే అత్యధికంగా నష్టపోతున్నారని, తమ చుట్టూ ఉన్న విషపూరిత గాలి నుంచి వారు తప్పించుకోలేకపోతున్నారని వెల్లడించారు. వాయు కాలుష్యంతో ప్రతిఏటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని, పర్యాటకులు మన దేశానికి రావడానికి వెనుకంజ వేస్తున్నారని, దేశ ప్రతిష్ట మసకబారుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

కాలుష్య కట్టడి చర్యలపై 25న తేలుస్తాం

ఢిల్లీలో గ్రేప్–4 చర్యల కొనసాగింపుపై స్పందించిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కట్టడి కోసం ఉద్దేశించిన గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్(గ్రేప్–4) అమలు తీరును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కొద్దిరోజులుగా గ్రేప్–4 నిబంధనలను అమలుచేస్తున్నాసరే కాలుష్యం తగ్గకపోవడమేంటని ఆగ్రహం వ్యక్తంచేసింది. కాలుష్యం కాస్తంత తగ్గిందని ప్రభుత్వం వాదించడంతో గ్రేప్–4 కొనసాగింపుపై ఈనెల 25న నిర్ణయం తీసుకుంటామని కోర్టు పేర్కొంది. ఢిల్లీలోకి నిత్యావసరయేతర సరకులను తీసుకొచ్చే ట్రక్కుల ప్రవేశాన్ని నిషేధించినా అది సరిగా అమలుకావడం లేదని సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. ఢిల్లీలో వాయు కాలుష్యానికి సంబంధించి కేసును జడ్జీలు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఈ కేసులో కోర్టు సలహాదారు(అమికస్ క్యూరీ)గా ఉన్న సీనియర్ మహిళా న్యాయవాది అపరాజితా సింగ్ సైతం తన వాదనలు వినిపించారు. అయితే ''113 ఎంట్రీ పాయింట్ల నుంచి ట్రక్కులు ఢిల్లీలోకి వస్తాయి. అయితే కేవలం 13 ఎంట్రీ పాయింట్ల వద్ద మాత్రమే చెక్‌పోస్ట్‌లు ఉన్నాయి'అని ఢిల్లీ ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ అన్నారు. దీనిపై కోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది ''మిగిలిన 100 ఎంట్రీ పాయింట్ల వద్ద వాహనాల రాకపోకలపై ఎలాంటి ఆంక్షలు లేవన్నమాట. గ్రేప్–4 నిబంధనలను ఇలాగేనా అమలుచేసేది?. వెంటనే అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేయండి'అని ఢిల్లీ ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది. ఎంట్రీ పాయింట్లను తనిఖీ చేయడానికి 13 మంది న్యాయవాదులను కోర్ట్ కమిషనర్‌లుగా ధర్మాసనం నియమించింది. ఢిల్లీకి ప్రవేశ కేంద్రాలను సందర్శించి, ట్రక్కుల ప్రవేశాన్ని నిలిపివేస్తున్నారో లేదో ధృవీకరించాలని వీరికి కోర్టు సూచించింది. అయితే ''ఢిల్లీలో ఇప్పుడు గ్రేప్–4 స్థాయి కాలుష్యం లేదు. వాయు నాణ్యతా సూచీ ఇప్పుడు గ్రేప్–2 స్థాయిలో చూపిస్తోంది. కాబట్టి గ్రేప్–4ను సడలించొచ్చు''అని ఐశ్వర్య అన్నారు. దీంతో ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో గ్రేప్–4 నిబంధనలను కొనసాగించాలా వద్దా అనే విషయాన్ని పరిశీలించడానికి నవంబర్ 25న తేలుస్తామని ధర్మాసనం పేర్కొంది.

ప్రపంచంలో అతి పెద్ద రాజ్యాంగం ఏది?

పౌరుల సమాజమే రాజ్యం, రాజ్యాన్ని నిర్వహించే పౌరవర్గమే ప్రభుత్వం అని అరిస్టాటిల్ పేర్కొన్నారు. ప్రతి రాజ్యానికి ఒక రాజ్యాంగం ఉంటుంది. ఇది రాజ్యానికి సంబంధించిన ఒక అత్యున్నత చట్టం. రాజకీయ కార్యకలాపాలను క్రమబద్ధం చేసే ముఖ్యమైన నియమావళి ఇందులోనే ఉంటుంది. రాజ్యం స్వరూపాన్ని నిర్ణయించే సూత్ర సముదాయాన్ని రాజ్యాంగంగా పేర్కొనవచ్చని గెటిల్ అన్నారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగం

భారతీయులకు ఒక రాజ్యాంగం, ఒక రాజకీయ పరిషత్ అవసరమని తొలిసారిగా గాంధీజీ 1922లో పేర్కొన్నారు. 1928లో మోతీలాల్ నెహ్రూ రూపొందించిన నివేదిక రాజ్యాంగానికి మూలాధారమైంది. 75 శాతానికి పైగా పాలనాంశాలను 1935 చట్టం నుంచి స్వీకరించారు.

అమెరికా రాజ్యాంగం ప్రపంచంలో తొలి లిఖిత రాజ్యాంగం. ప్రపంచంలో అతి చిన్న రాజ్యాంగం కూడా ఇదే. ఫ్రాన్స్ 1789 విప్లవం అనంతరం రాజ్యాంగాన్ని లిఖిత రూపంలో పొందుపరిచింది.

భారత రాజ్యాంగం ప్రపంచంలో అతి పెద్దది. ఇది కూడా లిఖిత రూపంలోనే ఉంది. ఇది 1950 జనవరి 26న అమల్లోకి వచ్చింది. దీన్ని రాజ్యాంగ సభ రూపొందించింది.రాజ్యాంగ సభను 1946 నవంబర్‌లో కేబినెట్ మిషన్ ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేశారు. ఇందులో ఒక సభ్యుడు ఒక మిలియన్ జనాభాకు ప్రాతినిధ్యం వహించాడు.

రాజ్యాంగ పరిషత్‌కు 1946 జూలైలో ఎన్నికలు నిర్వహించారు. మైనారిటీలు, ఆంగ్లో ఇండియన్‌లు, మహిళలకు రాజ్యాంగ పరిషత్ ఎన్నికల్లో పాల్గొని, ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. ప్రతి 10 లక్షల జనాభాకు ఒక నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. 1946 డిసెంబర్ 11న డాక్టర్ రాజేంద్రప్రసాద్ రాజ్యాంగ సభకు పూర్తి కాలం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకు రాజ్యాంగ సభ పార్లమెంటు బాధ్యతలను నిర్వహించింది.

రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశాన్ని 1946 డిసెంబర్ 9న ఢిల్లీలో నిర్వహించారు. తొలి సమావేశానికి 211 మంది హాజరయ్యారు. ఫ్రెంచ్ సాంప్రదాయాన్ని ఆదర్శంగా తీసుకొని సభ్యులందరిలో పెద్దవారైన డాక్టర్ సచ్చిదానందా సిన్హాకు అధ్యక్షుడిగా పనిచేసే అవకాశం కల్పించారు. ఈయన 2 రోజుల పాటు తాత్కాలిక అధ్యక్షుడిగా పనిచేశారు. రాజ్యాంగ పరిషత్ రెండో సమావేశం 1947 జనవరి 22న జరిగింది. దీంట్లో 'లక్ష్యాలు-ఆశయాలు' తీర్మానాన్ని ఆమోదించారు.

రాజ్యాంగ రచన కోసం రాజ్యాంగ పరిషత్ 22 కమిటీలను నియమించింది. 10 విధాన, 10 నిర్ణయ కమిటీలతో పాటు అతిపెద్ద సలహా సంఘం, ముసాయిదా కమిటీలు దీని కోసం పనిచేశాయి. అతిపెద్ద సలహా సంఘంలో చైర్మన్, 54 మంది సభ్యులు ఉంటారు. ముసాయిదా కమిటీని 1947 ఆగస్టు 29న ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేశారు. రాజ్యాంగ ముసాయిదాను 1948 ఫిబ్రవరిలో రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించారు. రాజ్యాంగ పరిషత్ దీన్ని 1946 నవంబర్ 26న ఆమోదించింది.

రాజ్యాంగం అమల్లోకి వచ్చినపుడు 395 నిబంధనలు, 8 షెడ్యూళ్లు, 22 భాగాలు, 3 అనుబంధాలు, 403 పుటలతో ఉంది. రాజ్యాంగాన్ని రూపొందించడానికి రాజ్యాంగ పరిషత్‌కు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. రాజ్యాంగాన్ని రూపొందించడానికి అయిన మొత్తం ఖర్చు రూ. 64 లక్షలు.

ప్రపంచంలో లిఖిత, అలిఖిత అనే రెండు రకాల రాజ్యాంగాలు అమల్లో ఉన్నాయి. పౌరుల ప్రాథమిక స్వేచ్ఛకు తగిన రక్షణ కల్పించడానికి, ప్రభుత్వ అధికారాలను పరిమితం చేయడానికి లిఖిత రాజ్యాంగం ఏర్పడిందని లార్డ్ బ్రైస్ అభిప్రాయపడ్డారు. అలిఖిత రాజ్యాంగంలో శాసన నిర్మాణం చేసే పార్లమెంటు సార్వభౌమ సంస్థగా గుర్తింపు పొందింది. అలిఖిత రాజ్యాంగ సవరణ చాలా సులభం. ఆచరణ యోగ్యమైన అంశాలకు చట్టాల్లో ప్రాధాన్యం ఉంటుంది.

మొదటి సాధారణ ఎన్నికల్లో (1952) స్త్రీ, పురుష విచక్షణ లేకుండా 21 ఏళ్లు నిండిన వారందరికీ వయోజన ఓటు హక్కు కల్పించారు. వయోజన ఓటుహక్కు పరిమితిని 1988లో యువ ప్రధాని రాజీవ్ గాంధీ 61వ సవరణ ద్వారా 21 సంవత్సరాల నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. 18 సంవత్సరాలు నిండిన, పౌరులు వయోజన ఓటుహక్కును తొలిసారిగా 1989 ఎన్నికల్లో ఉపయోగించుకున్నారు.



పాలనాంశాలను 3 జాబితాలుగా విభజించారు. అవి:

1. **కేంద్ర జాబితా:** ఇందులో 100 అంశాలు ఉన్నాయి. కీలకమైన రక్షణ, విదేశాంగ విధానం, బీమా, రైల్వే తదితర అంశాలు దీంట్లోనే ఉన్నాయి.
2. **రాష్ట్ర జాబితా:** ఇందులో 61 అంశాలు ఉన్నాయి. వ్యవసాయం, శాంతి భద్రతలు లాంటివి ఈ జాబితాలోనే ఉన్నాయి.
3. **ఉమ్మడి జాబితా:** ఇందులో 52 అంశాలు ఉన్నాయి. విద్య, విద్యుత్, వివాహం, విడాకులు లాంటివి ఇందులో ఉన్నాయి. మిగిలిపోయిన పాలనాంశాలను అవశిష్ట అధికారాలు అంటారు. ఇవి కేంద్రం పరిధిలోనే ఉంటాయి.

ఉదా: అంతరిక్ష పరిశోధన, గ్రహాలు, గ్రహాంతర అధ్యయనం.

- అరిస్టాటిల్ రచించిన ప్రధాన గ్రంథం పాలిటిక్స్. ఈయన 158 గ్రీకు రాజ్యాలను తులనాత్మకంగా అధ్యయనం చేశారు. ఉత్తమ రాజ్యాంగానికి ఉండాల్సిన లక్షణాలను వివరించారు.
- ఐవర్‌జెన్నింగ్స్ భారత రాజ్యాంగాన్ని న్యాయవాదుల స్వర్గంగా అభివర్ణించారు. రాజ్యాంగ ముఖ్య లక్షణాల్లో సుదీర్ఘ, వివరణాత్మక లిఖిత రాజ్యాంగం ఒకటని ఈయన పేర్కొన్నారు.
- మన జాతీయ చిహ్నాన్ని సారనాథ్‌లోని అశోకుని స్తంభం నుంచి స్వీకరించారు.
- రాజ్యాంగ సభ జాతీయ జెండాను ఆమోదించిన తేది 1947 జూలై 22.
- స్టడీస్ ఇన్ హిస్టరీ అండ్ జురిస్ప్రూడెన్స్ అనే గ్రంథంలో లార్డ్ జేమ్స్ బ్రైస్ రాజ్యాంగాలను రెండు రకాలుగా వివరించారు.
- సాధారణ చట్టాలను రూపొందించే శాసనసభకు సామాన్య ప్రక్రియ ద్వారా రాజ్యాంగాన్ని సవరించడానికి వీలుంటే దాన్ని అదృఢ రాజ్యాంగంగా ఆర్.జి. గెటిల్ అభిప్రాయపడ్డారు.
- కాన్‌స్టిట్యూషనల్ లా అనే గ్రంథంలో ఎ.వి. డైసీ దృఢ రాజ్యాంగం గురించి వివరించారు. రాజ్యాంగ చట్టాలను ఇతర సాధారణ చట్టాల మాదిరిగా మార్చడానికి వీలులేని రాజ్యాంగమే దృఢ రాజ్యాంగం. **ఉదా:** అమెరికా రాజ్యాంగం.
- రాజ్యాంగ సవరణ విధానాన్ని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు. రాజ్యాంగంలో మొదటి సవరణ (1951, జూన్) భూ సంస్కరణలకు సంబంధించింది.
- 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించారు. 2002, మార్చిలో ఈ రాజ్యాంగ సవరణ చట్టం చేశారు. దీని ద్వారా అధికరణం 21ఎ లో 6-14 సంవత్సరాల మధ్య ఉన్న బాలబాలికలకు తప్పనిసరిగా ఉచిత నిర్బంధ విద్యను రాజ్యం అందించాల్సి ఉంటుందనే అంశాన్ని చేర్చారు.
- 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తిహక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు.
- 113వ సవరణ ద్వారా ఒరిస్సా రాష్ట్రాన్ని ఒడిశాగా, ఒరియా భాషను ఒడియా భాషగా మార్చారు.
- భారతీయులు స్వతంత్రంగా రాజ్యాంగా న్ని రచించుకోవచ్చునని లార్డ్ లిన్‌లిత్ గో అనే గవర్నర్ జనరల్ 1940 ఆగస్టు 8న పేర్కొన్నారు.
- ప్రవేశికకు జరిగిన ఏకైక సవరణ 42వ రాజ్యాంగ సవరణ. ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో 1976లో ఈ సవరణ చేశారు. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సామ్యవాద, లౌకిక అనే రెండు పదాలను చేర్చారు.
- రాజ్యాంగ పీఠిక 'భారత ప్రజలమైన మేము' అనే వాక్యంతో ప్రారంభమై, 'ఎంపిక చేసుకొని శాసనంగా రూపొందించుకొని ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇచ్చుకున్నాం' అనే పదాలతో ముగుస్తుంది.
- ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని బెరుబారి కేసులో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.
- బ్రిటిషర్ల పాలనా కాలంలోనే 1946 సెప్టెంబర్ 2న నెహ్రూ తాత్కాలిక పార్లమెంటరీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. నెహ్రూ తాత్కాలిక ప్రధానిగా వ్యవహరించారు.
- రాజ్యాంగం మొత్తం 22 భాషలను గుర్తించింది. 21వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 1967లో సింధిని 15వ భాషగా చేర్చారు.
- భారత్‌లో అత్యధిక శాతం నివసించే గిరిజన తెగ సంతాల్. వీరు ఎక్కువగా మధ్యప్రదేశ్‌లో ఉన్నారు.

భారతదేశ పార్లమెంటరీ తరహా విధానం బ్రిటిష్ వెస్ట్ మినిస్టర్ నమూనాను పోలి ఉంది. పార్లమెంటరీ తర హా ప్రభుత్వాన్ని ప్రధాని తరహా ప్రభుత్వం, మంత్రి మండలి తరహా ప్రభుత్వం, సమష్టి బాధ్యతాయుత ప్రభుత్వంగా పేర్కొంటారు. పార్లమెంటరీ తరహా వ్యవస్థలో సమష్టి బాధ్యతాయుత సూత్రం లోక్‌సభకు వర్తిస్తుంది.

చట్టం ముందు అందరూ సమానులే అనే భావనను ఎ.వి. డైసీ రూపొందించారు. రాజ్యాంగంలో 14వ ఆర్టికల్ చట్ట సమానత్వం గురించి తెలియజేస్తుంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్‌లకు దీని నుంచి మినహాయింపు ఉంది. సివిల్, క్రిమినల్ చర్యలకు సంబంధించి పదవీకాలంలో వీరిని అరెస్ట్ చేయకూడదు. అమెరికాలో 1803లో మార్బరీ వర్సెస్ మారిసన్ కేసులో సర్‌జాన్ మార్షల్ తీర్పు ఫలితంగా న్యాయ సమీక్ష అనే అంశం ప్రస్తావనకు వచ్చింది. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న చట్టాలు చెల్లవ ని న్యాయస్థానాలు నిష్పక్షపాతంగా తీర్పునిచ్చే ఒక అత్యున్నత అధికారమే న్యాయసమీక్ష.

మాదిరి ప్రశ్నలు

1. రాడికల్ డెమొక్రటిక్ పార్టీ స్థాపకుడెవరు?
   1) ఎం.ఎన్. రాయ్
   2) జయప్రకాశ్ నారాయణ్
   3) ఆచార్య వినోబాభావే 4) గాంధీజీ
2. ప్రజాస్వామ్య రాజ్యాంగ రాజ్యాధినేతగా ఎన్నికైన ప్రజాప్రతినిధి ఉంటే ఆ రాజ్యాన్ని ఏమంటారు?
   1) ప్రజాస్వామ్య రాజ్యం
   2) సామ్యవాద రాజ్యం
   3) గణతంత్ర రాజ్యం 4) లౌకిక రాజ్యం
3. రాజ్యాంగానికి మూలకారకుడిగా ఎవరిని పేర్కొంటారు?
   1) మనువు 2) ప్లేటో
   3) గార్నర్ 4) అరిస్టాటిల్
4. ప్రపంచంలో తొలి లిఖిత రాజ్యాంగం ఏ దేశానిది?
   1) భారత్ 2) అమెరికా
   3) కెనడా 4) బ్రిటన్
5. పూర్ణ స్వరాజ్ తీర్మానం కిందివాటిలో ఏ సమావేశానికి సంబంధించింది?
   1) ఢిల్లీ 2) పుణే
   3) లాహోర్ 4) నాగపూర్
6. జీవించే హక్కును ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
   1) జపాన్ 2) జర్మనీ
   3) అమెరికా 4) కెనడా
7. భారత రాజ్యాంగానికి సంబంధించి మూలాధారమైన చట్టం ఏది?
   1) 1935 2) 1919
   3) 1947 4) 1909
8. కింద పేర్కొన్నవారిలో రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక అధ్యక్షుడిగా పని చేసినవారు?
   1) డాక్టర్ సచ్చిదానంద సిన్హా
   2) సర్దార్ వల్లభాయ్ పటేల్
   3) కె.ఎం. మున్షీ 4) నెహ్రూ
9. భారత రాజ్యాంగ రచనకు సుమారుగా ఎన్నేళ్లు పట్టింది?
   1) 5 2) 4 3) 3 4) 2
10. ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగం ఏ దేశానికి ఉంది?
    1) కెనడా 2) అమెరికా
    3) ఆస్ట్రేలియా 4) భారత్
11. రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించారు?
    1) 1946 డిసెంబర్ 8
    2) 1946 డిసెంబర్ 9
    3) 1946 డిసెంబర్ 6
    4) 1947 జనవరి 26
12. రౌండ్ టేబుల్ సమావేశాలను ఏ నగరంలో నిర్వహించారు?
    1) వాషింగ్టన్ 2) ఢిల్లీ
    3) బ్రస్సెల్స్ 4) లండన్
13. రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలను ఎప్పుడు నిర్వహించారు?
    1) 1946 ఆగస్టు 2) 1946 జనవరి
    3) 1947 సెప్టెంబర్ 4) 1946 జూలై
14. భారత రాజ్యాంగం అమల్లోకి రాకముందు అమల్లో ఉన్న చట్టం ఏది?
    1) 1935 చట్టం 2) 1909 చట్టం
    3) 1919 చట్టం 4) 1833 చట్టం
15. క్రిప్స్ కమిషన్‌ను ఎప్పుడు నియమించారు?
    1) 1943 2) 1946
    3) 1942 4) 1932
16. ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక రాజ్యం అనే పదాన్ని రాజ్యాంగ ప్రవేశికలో చేర్చారు?
    1) 44 2) 45 3) 43 4) 42
17. భారతదేశం ఏ ప్రభుత్వ విధానాన్ని స్వీకరించింది?
    1) పెట్టుబడిదారీ 2) అధ్యక్ష తరహా
    3) పార్లమెంటరీ 4) కమ్యూనిస్టు
18. దేశ రక్షణ, కరెన్సీ ఏ జాబితాలో ఉన్నాయి?
    1) కేంద్ర 2) రాష్ట్ర
    3) ఉమ్మడి 4) ఏదీకాదు
19. మనదేశంలో ఏ రకమైన పౌరసత్వం అమల్లో ఉంది?
    1) ద్వంద్వ 2) ఏక
    3) 1, 2 4) ఏదీకాదు
20. మత ప్రమేయం లేని (మత విషయాల్లో తటస్థంగా ఉండే)రాజ్యాన్ని ఏమంటారు?
    1) సోషలిస్టు రాజ్యం
    2) లౌకిక రాజ్యం
    3) ఫ్యూడలిజం
    4) థియోక్రటిక్ రాజ్యం
21. 'సామ్యవాదం' అనే పదాన్ని రాజ్యాంగ ప్రవేశికలో ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు?
    1) 44 2) 41 3) 42 4) 43
22. భారత రాజ్యాంగం మొదటి ప్రకరణ భారతదేశాన్ని ఏవిధమైన రాజ్యంగా ప్రకటిస్తుంది?
    1) ఏకకేంద్ర రాజ్యం
    2) అర్ధ సమాఖ్య రాజ్యం
    3) సమాఖ్య రాజ్యం
    4) రాష్ట్రాల యూనియన్

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 2; 5) 3; 6) 1; 7) 1; 8) 1; 9) 3; 10) 4; 11) 2; 12) 4; 13) 4; 14) 1; 15) 3; 16) 4; 17) 3; 18) 1; 19) 2; 20) 2; 21) 3; 22) 4.

అభినవ దండి బిరుదాంకితుడు ఎవరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు (ఎస్‌జీటీ, తెలుగు పండిట్స్)

బోధన పద్ధతులు

ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు బోధన పద్ధతులు తప్పనిసరి అంశం. కాబట్టి అభ్యర్థులు తెలుగు మెథడాలజీపై ప్రత్యేక దృష్టిని సారించాలి. ఎందుకంటే డీఎస్సీలో ఏ విభాగాన్నీ అశ్రద్ధ చేయకూడదు. ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్ తెలుగు అభ్యర్థులు డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని చదవాలి. గత టెట్, డీఎస్సీ పరీక్షల్లో తెలుగు అకాడమీ పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు ఇచ్చారు. అందువల్ల గత ప్రశ్నపత్రాలను కూడా పరిశీలించాలి. ఇక్కడ డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకంలోని 'ఆంధ్ర సాహితీ సంగ్రహం' అధ్యాయంలో ప్రశ్నలను సమగ్రంగా తెలుసుకుందాం. ముఖ్యంగా ఈ చాప్టర్ తెలుగు కంటెంట్‌కు కూడా ఉపయోగపడుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. తెలుగు ఏ భాషా జన్యం?
   1) సంస్కృత 2) ఆర్య
   3) ద్రావిడ 4) ఇండో - ఆర్యన్
2. తెలుగు భాషకు వ్యవహారంలో లేని పేరు?
   1) ఆంధ్రం 2) దేశం
   3) తెనుగు 4) తెలుగు
3. 'ఆంధ్ర' అనే పదం మొదట ఏ పదంగా కనిపిస్తుంది?
   1) దేశవాచకం 2) భాషావాచకం
   3) జాతివాచకం 4) అన్నీ
4. కొన్ని విశిష్టమైన, సమానమైన ధర్మాలు ఉన్న కాలాన్ని ఏమంటారు?
   1) దశాబ్దం 2) శతాబ్దం
   3) కాలక్రమం 4) యుగం
5. 'సమగ్రాంధ్ర సాహిత్యం' ఎవరి రచన?
   1) పింగళి లక్ష్మీకాంతం
   2) వీరేశలింగం
   3) దివాకర్ల వేంకటావధాని
   4) ఆరుద్ర
6. ఎక్కువ మందికి ఆమోదయోగ్యమైన తెలుగు సాహిత్య 'యుగ విభజన'ను ఎవరు చేశారు?
   1) కందుకూరి వీరేశలింగం
   2) గురజాడ శ్రీరామమూర్తి
   3) పింగళి లక్ష్మీకాంతం
   4) ఖండవల్లి లక్ష్మీరంజనం
7. తెలుగు సాహిత్యంలో 1500-1600 వరకు మధ్య కాలాన్ని ఏమంటారు?
   1) శ్రీనాథుని యుగం 2) ప్రబంధ యుగం
   3) సంధి యుగం 4) దక్షిణాంధ్ర యుగం
8. ఏ కావ్యం ఆధారంగా శాతవాహనుల కా లం నాటికే తెలుగు జన వ్యవహారంలో ఉం దని పరిశోధకులు పేర్కొంటున్నారు?
   1) ఋగ్వేదం 2) గాథాసప్తశతి
   3) బృహత్కథ 4) ఆది పురాణం
9. ఏ కవి తన కాలంలో వ్యాప్తిలో ఉన్న 'నాగ గీతాలు' అనే గేయాలను భారతంలో పేర్కొన్నాడు?
   1) నన్నయ 2) తిక్కన
   3) ఎర్రన 4) అథర్వణుడు
10. తుమ్మెద పదాలు, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు ఏ కవి కాలం నాటికి బహుళ ప్రచారంలో ఉన్నాయి?
    1) నన్నయ 2) తిక్కన
    3) నన్నెచోడుడు
    4) పాల్కురికి సోమనాథుడు
11. తెలుగు కవిత్వానికి మూల ఛందం?
    1) తరువోజ 2) ద్విపద
    3) కందం 4) మధ్యాక్కర
12. కంద పద్యం ఎవరి కాలం నుంచి నేటిదాకా తెలుగునాట ప్రచారంలో ఉందని చెప్పొచ్చు?
    1) నన్నయ 2) హాలుడు
    3) తిక్కన 4) పాల్కురికి సోమనాథుడు
13. నన్నయకు పూర్వం ఆంధ్ర వాఙ్మయ స్వరూపం తెలుసుకోవడానికి ప్రధాన ఆధారాలు?
    1) శాసనాలు 2) తాళపత్ర గ్రంథాలు
    3) జైనమత గ్రంథాలు
    4) ప్రాకృత గ్రంథాలు
14. అభినవ దండి బిరుదాంకితుడు ఎవరు?
    1) తిక్కన 2) కేతన
    3) గౌరన 4) నాచన సోమన
15. తెలుగు కవిత ఎవరి ప్రేరణతో దేశీ రూపంగా ఆరంభమైంది?
    1) పల్లవుల 2) శాతవాహనుల
    3) రెడ్డిరాజుల 4) చాళుక్యుల
16. తొలి తెలుగు పద్యం అయిన 'తరువోజ' ఏ శాసనంలో లభిస్తుంది?
    1) కలమళ్ల శాసనం 2) అద్దంకి శాసనం
    3) బెజవాడ శాసనం
    4) అమరావతి స్థూపం
17. ఐదు మధ్యాక్కర పద్యాలు లభిస్తున్న బెజవాడ శాసనాన్ని ఎవరు వేయించారు?
    1) ధనుంజయుడు
    2) గుణగ విజయాదిత్యుడు
    3) యుద్ధమల్లుడు 4) పండరంగడు
18. ప్రబంధ రత్నావళి ఎవరి సంకలన గ్రంథం?
    1) వేటూరి ప్రభాకర శాస్త్రి
    2) రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ
    3) మానవల్లి రామకృష్ణ కవి
    4) మడికి సింగన
19. సర్వదేవుడు రాసిన ప్రసిద్ధ జైన కావ్యం?
    1) పద్మ పురాణం 2) జినేంద్ర పురాణం
    3) ఆది పురాణం 4) అగ్ని పురాణం
20. నన్నయకు ముందున్న శాసన కవులు?
    1) పద్మకవి, సర్వదేవుడు
    2) నారాయణుడు, అథర్వణుడు
    3) గజాంకుశుడు, నన్నెచోడుడు
    4) శ్రీపతి పండితుడు, అయ్యనభట్టు
21. నన్నెచోడుడు నన్నయకు ముందువాడని ఎవరి అభిప్రాయం?
    1) నిడుదవోలు వెంకట్రావు
    2) మానవల్లి రామకృష్ణ కవి
    3) వేటూరి ప్రభాకర శాస్త్రి
    4) రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ
22. మహాభారతానికి గల నామాంతరం?
    1) జయ కావ్యం 2) సాత్వతసంహిత
    3) పంచమ వేదం 4) 1, 3
23. గానటబీసటగా ఉన్న తెలుగు భాషకు ఒక స్థిరమైన రూపాన్ని ఏర్పర్చినవారు?
    1) నన్నయ 2) తిక్కన
    3) నన్నెచోడుడు 4) ఎర్రన
24. మత ప్రచారానికి కవిత్వాన్ని సాధనంగా వాడుకోవడం ఎవరి ప్రత్యేకత?
    1) కవిత్రయ కవులు 2) ప్రబంధ కవులు
    3) శతక కవులు 4) శివ కవులు
25. మార్గదేశి కవితల ప్రస్తావన చేసిన మొదటి కవి?
    1) నన్నయ 2) తిక్కన
    3) నన్నెచోడుడు
    4) పాల్కురికి సోమనాథుడు
26. జాను తెనుగు అంటే?
    1) శుద్ధ గ్రాంథికం 2) అచ్చ తెనుగు
    3) తత్సమ - తద్భవ తెనుగు
    4) మార్గ - దేశి తెనుగు
27. 'ప్రథమ ప్రబంధం' అని చరిత్రకారులు ఏ గ్రంథాన్ని పేర్కొన్నారు?
    1) మను చరిత్ర 2) హరి వంశం
    3) కుమార సంభవం
    4) శృంగార నైషధం
28. అచ్చమైన తెలుగు ఛందస్సు ద్విపదకు పట్టం కట్టినవారు?
    1) గోన బుద్ధారెడ్డి 2) తాళ్లపాక చిన్నన
    3) గౌరన
    4) పాల్కురికి సోమనాథుడు
29. తెలుగు, సంస్కృత భాషల్లో మొదటి ఉదాహరణ కావ్యాన్ని ఎవరు రాశారు?
    1) నన్నెచోడుడు 2) పాల్కురికి సోమన
    3) పండితారాధ్యుడు
    4) రావిపాటి త్రిపురాంతకుడు
30. 'సర్వేశ్వర శతకం' కర్త?
    1) యథావాక్కుల అన్నమయ్య
    2) చక్రపాణి రంగన
    3) తాళ్లపాక అన్నమయ్య
    4) పాల్కురికి సోమనాథుడు
31. శివలీలలను వర్ణించే 'శివతత్త్వసారం' ఎవరి రచన?
    1) శ్రీనాథుడు
    2) మల్లికార్జున పండితారాధ్యుడు
    3) పాల్కురికి సోమనాథుడు
    4) నన్నెచోడుడు
32. ఎవరు తన కవిత్వంలో లలిత పదాలుంటాయని పేర్కొన్నారు?
    1) నన్నెచోడుడు 2) శ్రీనాథుడు
    3) తిక్కన 4) పోతన
33. 'అమలోదాత్త మనీష నేనుభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునం బారగుడ కళావిదుడ' నని చెప్పుకున్న కవి?
    1) నన్నయ 2) తిక్కన
    3) శ్రీనాథుడు 4) భట్టుమూర్తి
34. ఎవరి రచనలు తెలుగు నుడికారంతో, సజీవ పాత్ర చిత్రణతో, రసాభ్యుచిత బంధంతో, అర్థ గాంభీర్యంతో ఉంటాయి?
    1) తిక్కన 2) ఎర్రన
    3) శ్రీనాథుడు
    4) రామరాజభూషణుడు
35. మార్కండేయ పురాణం కర్త?
    1) తిక్కన 2) కేతన
    3) మారన 4) గౌరన
36. మంచన ఏ గ్రంథం ఆధారంగా కేయూర బాహు చరిత్ర రచించాడు?
    1) మార్కండేయ పురాణం
    2) విద్ధసాలభంజిక
    3) సింహాసన ద్వాత్రింశిక
    4) పంచపంత్రం
37. కృష్ణమాచార్యుడు రాసిన సింహగిరి నరహరి వచనాలు ఏ వచన భేదానికి చెందినవి?
    1) పదాలు 2) సంకీర్తనలు
    3) అష్టపదులు 4) చూర్ణికలు
38. గోన బుద్ధారెడ్డి రాసిన రంగనాథ రామాయణం ఏ కావ్యం?
    1) చంపూ కావ్యం 2) పద్య కావ్యం
    3) ద్విపద కావ్యం
    4) మంజరీ ద్విపద కావ్యం
39. ఎర్రన గారి ఏ రచన పేరుకు పురాణమైనా రచనా విధానాన్ని బట్టి రసవత్కావ్యం?
    1) హరివంశం 2) నృసింహపురాణం
    3) అరణ్య పర్వశేషం 4) గరుడ పురాణం
40. ప్రబంధ పరమేశ్వరుడు అని ఎవరినంటారు?
    1) ఎర్రన 2) నన్నెచోడుడు
    3) తిక్కన 4) అల్లసాని పెద్దన
41. 'శ్రీమత్సకలభాషాభూషణ, సాహిత్య రస పోషణ, సంవిధాన చక్రవర్తి, సంపూర్ణకీర్తి, నవీన గుణసనాథ' అని ఎవరు ఏ కావ్యం లో చెప్పుకున్నారు?
    1) తిక్కన-నిర్వచనోత్తర రామాయణంలో
    2) ఎర్రన-హరివంశం కావ్య అవతారికలో
    3) కేతన - దశకుమార చరిత్రలో
    4) నాచన సోమనాథుడు-హరివంశం గద్యలో
42. శ్రీనాథ యుగానికి గల నామాంతరం?
    1) ప్రబంధ యుగం 2) కావ్యయుగం
    3) స్వర్ణయుగం 4) పురాణేతిహాస యుగం
43. తెలుగులో కవిత్రయం తర్వాత అంతటి ప్రతిభావంతుడైన కవి?
    1) పోతన 2) వేములవాడ భీమకవి
    3) శ్రీనాథుడు 4) అల్లసాని పెద్దన
44. 'ఈక్షోణిన్ నినుబోలు సత్కవులు లేరు ఈనాటి కాలమ్మునన్' అని రాజులు, మంత్రులు కొనియాడిన కవీశ్వరుడు?
    1) చేమకూర వెంకటకవి
    2) శ్రీనాథుడు 3) అల్లసాని పెద్దన
    4) రామరాజభూషణుడు
45. తెలుగు సాహిత్యంలో కథా ప్రాధాన్యం తగ్గుతూ రస ప్రధానమైన రచనలు ఎవరితో ప్రారంభమయ్యాయని విమర్శకుల అభిప్రాయం?
    1) పాల్కురికి సోమనాథుడు 2) పోతన
    3) అల్లసాని పెద్దన 4) శ్రీనాథుడు
46. పిల్లలమర్రి పినవీరభద్రుడి జైమినీభారతం ఒక?
    1) వీరరస కావ్యం 2) శృంగార కావ్యం
    3) శాంతరస కావ్యం
    4) కరుణ రస కావ్యం

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 4; 5) 4; 6) 3; 7) 2; 8) 2; 9) 1; 10) 4; 11) 3; 12) 2; 13) 1; 14) 2; 15) 4; 16) 2; 17) 3; 18) 1; 19) 3; 20) 4; 21) 2; 22) 4; 23) 1; 24) 4; 25) 3; 26) 2; 27) 3; 28) 4; 29) 2; 30) 1; 31) 2; 32) 3; 33) 2; 34) 1; 35) 3; 36) 2; 37) 4; 38) 3; 39) 2; 40) 1. 41) 4; 42) 2; 43) 3; 44) 2; 45) 4; 46) 1.

గత డీఎస్సీ ప్రశ్నలు

1. సంస్కృతం, తెలుగు భాషల్లో మొదటి ఉదాహరణ రచన?
   1) రామరాజీయం 2) బసవోదాహరణం
   3) వెంకటేశ్వరోదాహరణం
   4) శివతత్త్వసారం
2. ఆంధ్ర సాహిత్యంలో ప్రబంధమనే పదాన్ని మొట్టమొదట ప్రయోగించినవారు?
   1) తిక్కన 2) అల్లసాని పెద్దన
   3) నన్నెచోడుడు
   4) చేమకూర వెంకటకవి
3. సింహగిరి నరహరి వచనాలు రచించిన వీరిని గద్య వాఙ్మయానికి ఆద్యుడిగా పేర్కొంటారు?
   1) కృష్ణమాచార్యులు
   2) కందుకూరి వీరేశలింగం
   3) పరవస్తు చిన్నయసూరి
   4) అయ్యగారి వీరభద్రరావు
4. మిరియాల కామసాని గూడూరు శాసనంలోని వృత్తాలు?
   1) మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు
   2) మూడు ఉత్పలమాలలు, రెండు మత్తేభాలు
   3) మూడు శార్దూలాలు, రెండు చంపకమాలలు
   4) రెండు చంపకమాలలు, మూడు ఉత్పలమాలలు
5. శ్రీనాథుడి 'పల్నాటి వీర చరిత్ర' రచనలోని ఛందస్సు?
   1) వసంత తిలకం 2) కవిరాజ విరాజితం
   3) మంజరీ ద్విపద 4) సీసం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 1; 5) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఉత్పత్తితో పాటు ఉత్పాదకతలోనూ పెరుగుదల

భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో హరిత విప్లవం చెప్పుకోదగ్గ మార్పులకు కారణమైంది. బహుళ పంటలు, యాంత్రీకరణ, మేలు రకమైన వంగడాల వినియోగం, నిశ్చలమైన నీటిపారుదల వసతి, నాణ్యమైన ఎరువుల వినియోగం లాంటివి భారత్‌లో హరిత విప్లవానికి దోహదం చేశాయి. తద్వారా మన దేశం ఆహార, వాణిజ్య పంటల ఉత్పత్తుల్లో గణనీయమైన పెరుగుదల సాధించగలిగింది. దీంతో పాటు ఉత్పాదకత విషయంలోనూ మంచి ఫలితాలు సాధ్యమయ్యాయి. అంతిమంగా ఇవన్నీ భారత ఎగుమతులు, ఉద్యోగిత తదితర అంశాలపై ప్రభావం చూపి ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయి.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

హరిత విప్లవం - ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

మొదట్లో వ్యవసాయ కార్యకలాపాలు ఏదో ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఒకేవిధంగా ప్రారంభమయ్యాయి. 16వ, 17వ శతాబ్దాల మధ్యకాలంలో వ్యవసాయంలో పెద్దగా మార్పులు సంభవించలేదు. 17వ శతాబ్దంలో రెండో వ్యవసాయ విప్లవం ఉత్పత్తి సామర్థ్యం, పంపిణీలలో ప్రగతికి దోహదమైంది. ఈ కాలంలో పారిశ్రామిక విప్లవం కారణంగా ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వెళ్లడం ప్రారంభించారు. 18వ శతాబ్దంలో యూరప్‌నకు సంబంధించిన వలస ఆర్థిక వ్యవస్థలు పారిశ్రామిక దేశాలకు వ్యవసాయ ముడిసరకులు, ఖనిజ ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశాలుగా అవతరించాయి. నాడు వలస ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న మధ్య అమెరికాలోని అనేక దేశాలు ఇప్పటికీ ఒకే విధమైన వ్యవసాయ వస్తువులను ఉత్పత్తి చేసే దేశాలుగానే మిగిలిపోయాయి. 20వ శతాబ్దంలో అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. ప్రపంచ జనాభాలో 45 శాతం మంది జీవనాధారం కోసం వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్న జనాభా అమెరికాలో 2 శాతం మాత్రమే కాగా ఆసియా, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో 80 శాతం వరకు ఉంది.

హరిత విప్లవ చరిత్ర, అభివృద్ధి

మెక్సికోలో 1940వ దశకంలో వ్యవసాయ రంగంలో పాత పద్ధతుల స్థానంలో నూతన విధానాలు ప్రవేశపెట్టారు. ఇవి వ్యవసాయ ఉత్పత్తుల్లో గణనీయమైన పెరుగుదలకు దోహదపడ్డాయి. నూతన పద్ధతులు విజయవంతమైన నేపథ్యంలో 1950, 1960వ దశకాల్లో హరిత విప్లవ సాంకేతిక విజ్ఞానం (Green Revolution Technologies) ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. మెక్సికోలోని రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌కు చెందిన ఆచార్యులు నార్మన్ బోర్లాగ్‌ను హరిత విప్లవ పితామహునిగా పేర్కొంటారు. 1940వ దశకంలో బోర్లాగ్ తన పరిశోధనల ద్వారా వ్యాధిని తట్టుకోగలిగే (Disease resistance) మేలు రకమైన అధిక దిగుబడినిచ్చే గోధుమ వంగడాలను అభివృద్ధి చేశారు. తద్వారా మెక్సికోలో దేశీయంగా ఉన్న డిమాండ్‌ను అధిగమించి గోధుమ ఉత్పత్తి జరిగింది. బోర్లాగ్ అభివృద్ధి చేసిన గోధుమ వంగడాలను వినియోగిస్తూ యాంత్రీకరణ ప్రవేశపెట్టడం ద్వారా మెక్సికో వ్యవసాయ రంగంలో మంచి ఫలితాలు సాధించింది. తద్వారా ఈ దేశం 1960వ దశకంలో గోధుమ ఎగుమతిదారుగా రూపొందింది. నూతన గోధుమ వంగడాలను వినియోగించడానికి ముందు మెక్సికో దేశీయ డిమాండ్‌కు తగినట్లుగా 50 శాతం గోధుమలు దిగుమతి చేసుకునేది. 1940వ దశకంలో అమెరికా దేశీయ అవసరాలకు సుమారు 50 శాతం గోధుమను దిగుమతి చేసుకునేది. హరిత విప్లవ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడం వల్ల 1950వ దశకంలో అమెరికా గోధుమ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడమే కాకుండా 1960వ దశకంలో ఎగుమతిదారుగా అవతరించింది.

1950, 1960 దశకాల్లో ప్రపంచ వ్యవసాయ చరిత్రకు సంబంధించి నూతన అధ్యాయం ప్రారంభమైంది. మెక్సికోకు చెందిన గోధుమ పంట; తైవాన్, సింహళం (శ్రీలంక), మలేషియాలోని వరి పంట వ్యవసాయ రంగంలో దిగుబడుల చరిత్రను మార్చివేశాయి. ఈ విత్తనాల విప్లవం ఫోర్డ్ ఫౌండేషన్ వారి సూచన మేరకు భారతదేశానికి కూడా వ్యాపించింది. భారత్‌తో పాటు ఆసియాలోని అనేక దేశాలు ఈ నూతన వంగడాలను వినియోగించి వ్యవసాయ ఉత్పత్తిని పెంచుకోవడం ప్రారంభించాయి. భారత్‌లోని వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు కూడా కొన్ని కొత్త రకం వంగడాలను, సంకరజాతి విత్తనాలను అభివృద్ధి చేశాయి. నూతన వ్యవసాయిక వ్యూహంలో భాగంగా ఈ అధిక దిగుబడినిచ్చే విత్తనాల వాడకం ద్వారా ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి కృషి చేశారు.

హరితవిప్లవం కారణంగా భారత్‌లో పరిష్కారమైన సమస్యలు

- 1951లో శాశ్వత నీటిపారుదల ఉన్న సాగు విస్తీర్ణం 15 శాతం మాత్రమే ఉండేది. సాగు విస్తీర్ణంలో అధిక భాగం వర్షపాతంపైనే ఆధారపడి ఉండటం వల్ల వ్యవసాయ రంగం అల్ప ఉత్పత్తి, ఉత్పాదకత సమస్యలను ఎదుర్కొంది. హరితవిప్లవ సాధనకు నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో ప్రభుత్వం అనేక చిన్న, మధ్య, భారీ తరహా ప్రాజెక్టులను నెలకొల్పడం ద్వారా ఎక్కువ విస్తీర్ణానికి సాగు నీటి వసతులను కల్పించడానికి సంకల్పించింది.
- 1960వ దశకంలో వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణకు ముందుకాలంలో రైతు లు వారి వ్యవసాయ పరపతి నిమిత్తం వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, భూస్వాములపై ఎక్కువగా ఆధారపడేవారు. ఇవన్నీ సంస్థాగతం కాని ఆధారాలు కావడం వల్ల గ్రామీణ రుణగ్రస్తత పెరిగింది. వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణ తర్వాతి కాలంలో చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం తక్కువ వడ్డీ కింద పరపతిని సమకూర్చినందువల్ల వ్యవసాయ కార్యకలాపాలు మెరుగయ్యాయి. దీంతో వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగింది.
- 1940 నుంచి 1970వ దశకం వరకు భారత్‌లోని అనేక ప్రాంతాల్లో కరవు కాటకాలు తీవ్రమయ్యాయి. శ్రమకు తగిన ప్రతిఫలం రాకపోవడంతో రైతులు వ్యవసాయ కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొనలేకపోయారు. దీంతో దేశంలో అధిక జనాభాకు సరిపోయేంత ఆహార ఉత్పత్తులను పొందలేకపోవడం వల్ల పౌష్టికాహార లోపంతో ఇబ్బందిపడే ప్రజల సంఖ్య పెరిగింది. వ్యవసాయంలో ప్రవేశపెట్టిన నూతన సాంకేతిక విజ్ఞానం క్రమంగా పౌష్టికాహార లోపంతో ఇబ్బందిపడే ప్రజల సంఖ్యను తగ్గించడానికి తోడ్పడింది.
- వ్యవసాయంలో పంటకాలం వృథా కాకుండా బహుళ పంటల పద్ధతికి వీలు కలిగించే విధంగా ఆధునిక యంత్ర పరికరాలను ప్రవేశపెట్టారు. పంటల రక్షణ కోసం క్రిమి సంహారక రసాయనాలను వినియోగించడం, విత్తనాలను శుద్ధి చేయడం లాంటి పద్ధతులను అనుసరించారు.
- గిట్టుబాటు ధరలు లభించకపోవడం వల్ల 1965కు ముందుకాలంలో రైతులు నష్ట భయాన్ని ఎదుర్కొన్నారు. ఆహార ధాన్యాల ధరల విషయంలో సలహాల కోసం వ్యవసాయేతర కమిషన్‌ను ఏర్పాటు చేశారు. రైతుల నుంచి ఆహార ధాన్యాలను సేకరించే ఉద్దేశంతో 1965లో 'భారత ఆహార సంస్థ (FCI)'ను స్థాపించారు.

ప్రధాన పంటల సాగు విస్తీర్ణంపై నూతన సాంకేతిక విజ్ఞాన ప్రభావం

హరిత విప్లవ కాలంలో ముఖ్యమైన పంటల కింద ఉన్న సాగు విస్తీర్ణంలో పెరుగుదల ఏర్పడింది. 1966-67లో మేలురకమైన వంగడాలను వినియోగించిన భూ విస్తీర్ణం 1.89 మిలియన్ హెక్టార్లు కాగా, 1998-99 నాటికి ఇది 78.4 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. 1970- 71లో మొత్తం ఆహారధాన్యాల కింద ఉన్న భూ విస్తీర్ణం 124.3 మిలియన్ హెక్టార్ల నుంచి 2013-14లో 126.2 మిలియన్ హెక్టార్లకు చేరింది. ఈ కాలానికి సంబంధించి ప్రధానంగా గోధుమ, వరి, మొక్కజొన్న పంటల కింద ఉన్న భూ విస్తీర్ణంలో పెరుగుదలను గమనించవచ్చు. 1970-71లో గోధుమ పంట కింద ఉన్న భూ విస్తీర్ణం 18.2 మి.హె. నుంచి 31.3 మి.హె. చేరింది. ఇదే కాలంలో వరి పంట కింద ఉన్న విస్తీర్ణం 37.6 మి.హె. నుంచి 43.9 మి.హె., మొక్కజొన్న కింద ఉన్న భూ విస్తీర్ణం 5.8 మి.హె. నుంచి 9.3 మి.హె. కు, నూనెగింజల కింద ఉన్న విస్తీర్ణం 16.6 మి.హె. నుంచి 28.2 మి.హె. కు పెరిగింది. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం ప్రధాన పంటల ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుదలకు దోహదమైంది.

ఆహార ధాన్యాలు, వాణిజ్య పంటల ఉత్పత్తి

హరిత విప్లవ కాలంలో అధిక దిగుబడినిచ్చే వంగడాలను వినియోగించడంతో పాటు నిశ్చితమైన నీటిపారుదల సౌకర్యాలు, మేలురకమైన ఎరువులు, క్రిమిసంహారక రసాయనాలను వినియోగించడం వల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 1960-61లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పతి 82 మిలియన్ టన్నులు కాగా, 2013-14 నాటికి ఇది 264.4 మిలియన్ టన్నులకు చేరింది. ప్రధాన పంటలను పరిశీలిస్తే.. గోధుమ ఉత్పత్తిలో అధిక పెరుగుదలను గమనించవచ్చు. 1960-61లో గోధుమ ఉత్పత్తి 11 మిలియన్ టన్నులు కాగా, 2013-14లో 95.8 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇదేకాలంలో వరి ఉత్పత్తి 35 మిలియన్ టన్నుల నుంచి 106.3 మిలియన్ టన్నులకు పెరిగింది. గోధుమ పంటకు చెందిన భూ విస్తీర్ణం పెరగడం వల్ల కూడా గోధుమ ఉత్పత్తిలో అధిక పెరుగుదల సాధ్యమైంది. పప్పు ధాన్యాలపై హరిత విప్లవం ప్రభావం తక్కువేనని చెప్పవచ్చు. 1960-61లో పప్పు ధాన్యాల ఉత్పత్తి 13 మిలియన్ టన్నులు కాగా, 2013-14లో 19.6 మిలియన్ టన్నులకు పెరిగింది. నూతన వ్యవసాయిక వ్యూహం ప్రధాన లక్ష్యం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల సాధించడం. 1973-74 వరకు వాణిజ్య పంటలపై హరిత విప్లవ ప్రభావం పెద్దగా లేదని గమనించవచ్చు. తర్వాత కాలంలో వాణిజ్య పంటల ఉత్పత్తిలోనూ కొంత పెరుగుదల ఏర్పడింది. చెరకు, పత్తి, జనుము, నూనెగింజల ఉత్పత్తిలో పెరుగుదల అధికంగా ఉంది. 1970-71లో నూనెగింజల ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులు కాగా, 2013-14లో 32.4 మిలియన్ టన్నులకు చేరుకుంది.

ఉత్పాదకత పెరుగుదలపై నూతన సాంకేతిక విజ్ఞానం ప్రభావం:

నూతన వ్యవసాయిక వ్యూహం ఫలితంగా ముఖ్యమైన పంటల ఉత్పాదకతలో పెరుగుదల సాధ్యమైంది. మొత్తం ఆహార ధాన్యాల దిగుబడి 1960-61లో హెక్టారుకు 710 కిలోగ్రాముల నుంచి 1970-71లో 872 కిలోగ్రాములకు, 2013-14లో 2095 కిలోగ్రాములకు పెరిగింది. వరి దిగుబడి హెక్టారుకు 1960-61లో 1013 కిలోగ్రాముల నుంచి 1970-71లో 1123 కిలోగ్రాములకు, 2013-14లో 2419 కిలోగ్రాములకు పెరిగింది. గోధుమ దిగుబడి హెక్టారుకు 1960-61లో 851 కిలోగ్రాముల నుంచి 1970-71లో 1307 కిలోగ్రాములకు, 2013-14లో 3059 కిలోగ్రాములకు పెరిగింది. మొక్కజొన్న, నూనెగింజల ఉత్పాదకతపై హరిత విప్లవ ప్రభావం ధనాత్మకంగా ఉంది. 1970-71లో మొక్కజొన్న దిగుబడి హెక్టారుకు 1279 కిలోగ్రాముల నుంచి 2013-14లో 2602 కిలోగ్రాములకు, నూనెగింజల దిగుబడి ఇదేకాలానికి సంబంధించి 579 కిలోగ్రాముల నుంచి 1149 కిలోగ్రాములకు పెరిగింది.

కొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రీకరణ:

నీటిపారుదల సౌకర్యం సమృద్ధిగా ఉన్న కొన్ని పరిమిత ప్రాంతాలకు హరిత విప్లవం వల్ల ప్రయోజనం కలిగింది. 2013-14లో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్ ప్రథమ స్థానం పొందగా.. పంజాబ్, మధ్యప్రదేశ్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దేశంలోని మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్ వాటా 19.09 శాతం. వరి ఉత్పత్తిలో 2013-14కు సంబంధించి పశ్చిమబెంగాల్ ప్రథమ స్థానం పొందగా తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ నిలిచాయి. దేశంలోని మొత్తం వరి ఉత్పత్తిలో పశ్చిమబెంగాల్ వాటా 14.32 శాతం. గోధుమల ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా మొదటి మూడు స్థానాలను పొందాయి. 2013-14లో దేశంలోని మొత్తం గోధుమ ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్ వాటా 30.85 శాతం. మొత్తం పప్పు ధాన్యాల ఉత్పత్తిలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ మొదటి మూడు స్థానాలను పొందాయి. 2013-14లో దేశంలోని మొత్తం పప్పుధాన్యాల ఉత్పత్తిలో మధ్యప్రదేశ్ వాటా 26.71 శాతం.

వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రభావం:

హరిత విప్లవం కారణంగా కొంతమేరకు వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కువగా ఎగుమతి చేయగలిగే అవకాశం కలిగింది. 1960 ఫిబ్రవరిలో భారత మొత్తం ఎగుమతుల్లో వ్యవసాయ ఉత్పత్తుల వాటా 44 శాతం కాగా, 1980 నాటికి 31 శాతానికి, 2011-12 నాటికి 9.08 శాతానికి తగ్గింది. భారత్ ఎగుమతుల్లో శాతం పరంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల వాటా తగ్గినప్పటికీ విలువపరంగా వ్యవసాయ ఉత్పత్తులు ప్రగతి సాధించాయి. 1970-71లో 5 కోట్ల రూపాయలు విలువ చేసే వరి ధాన్యాన్ని ఎగుమతి చేయగలిగితే 2013-14లో ఈ విలువ 7742 మిలియన్ డాలర్లకు పెరిగింది. భారత్ మొత్తం వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తుల ఎగుమతుల విలువ 1960-61లో రూ.284 కోట్లు కాగా, 2013-14లో 37.29 బిలియన్ డాలర్లకు పెరిగింది. హరిత విప్లవంతో పాటు పరిమాణాత్మక హద్దుల నియమాలను తొలగించడం, సరళీకరణ ఆర్థిక విధానాల అమలు, ఎగుమతి -దిగుమతుల విధానం, వ్యవసాయ అనుబంధాలను ప్రోత్సహించడానికి తీసుకున్న అనేక రకాల చర్యలు కూడా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరగడానికి దోహదపడ్డాయి.

ఉద్యోగితపై ప్రభావం: బహుళ పంటల విధానాన్ని అవలంభించడం, వ్యవసాయ ఉత్పాదకాల వినియోగం పెరగడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తం ఆర్థిక వ్యవస్థలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా పెరిగాయి. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ కారణంగా ఉపాధి అవకాశాలు తగ్గినా.. ఎరువులు, క్రిమిసంహారక రసాయనాల పరిశ్రమల్లో, రావాణా, బ్యాంకింగ్ లాంటి సేవా రంగంలో ఉపాధి అవకాశాలు అధికమయ్యాయి. వ్యవసాయ, అనుబంధ రంగాల్లోని శ్రామిక శక్తి 2004-05తో పోల్చినప్పుడు 2011-12లో 36 మిలియన్లు తగ్గింది. 2011-12లో మొత్తం ఉపాధిలో వివిధ రంగాల వాటాను పరిశీలించినప్పుడు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల వాటా 48.9 శాతం కాగా, పారిశ్రామిక రంగం 24.3, సేవా రంగం 26.9 శాతం వాటాలను కలిగి ఉన్నాయి.

Clients are judging you by your?

BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Each time Hemanth turns on his computer, he has (1)/ to wait for it to load, enter the special code, and then enters a password (2)/ to get into his workspace before (3) / he can begin working (4)/ No Error (5)
2. Because there is (1)/ two sets of cutlery, a couple napkins, and plates on each table, students do not have (2) / to set(3) / their own place settings. (4) / No Error (5)
3. The decision that has just been (1) / agreed with (2) / by the board members should serve as a basis for their (3) / other accomplishments in the years to come. (4)/ No Error(5)
4. People who dislike cats sometimes (1) /criticize them for being (2) /savvy and independent; whereas those who are fond of (3) / cats often admire them for the same qualities. (4) / No Error(5)
5. Even with (1) / a calculator, you must have a basic understanding of (2) / mathematics if one expects (3)/ to do decently on the Math section. (4) / No Error(5)

Directions: (Q. 6 -10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Godavari <u>rises in a magnificent way above</u> its tributaries during rainy season.
   1) rises a magnificent way above
   2) rises in a magnificent way, way above
   3) rises magnificently above
   4) rises magnificently way above
   5) No correction required
7. During <u>colonial days, a school room looked</u> rather empty.
   1) colonial days, a school room looks
   2) colonial days, a schoolroom looked
   3) colonial days; a schoolroom looked
   4) colonial days; a school room looked
   5) No correction required
8. The helium-filled balloon <u>rose in the air</u>.
   1) rose on the air.
   2) was rising in the air.
   3) was in the air.
   4) rose into the air.
   5) No correction required
9. If I <u>had the address</u>, I would have delivered the package myself.
   1) had address,
   2) had seen the address
   3) had had the address
   4) had their address
   5) No correction required
10. Vasantha claims that cats <u>made the best pets</u>.
    1) will make the best pets
    2) could be the best pets
    3) are the best pets
    4) make the best pets
    5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Tsunamis generally consist of a series of waves with periods ranging from minutes to hours, arriving in a so-called "wave train".

B) Wave heights of tens of meters can be generated by large events.

C) Rather than appearing as a breaking wave, a tsunami may instead initially resemble a rapidly rising tide, and for this reason they are often referred to as tidal waves.

D) A Tsunami is a series of waves in a water body caused by the displacement of a large volume of water, generally in an ocean or a large lake.

E) Although the impact of tsunamis is limited to coastal areas, their destructive power can be enormous and they can affect entire ocean basins.

F) Tsunami waves do not resemble normal sea waves, because their wavelength is far longer.

11. What is the LAST sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) F
12. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) C
13. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) C 3) B 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) F
15. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 16 - 20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Japan's abundant rainfall and the ___ mild temperature throughout most of the country have produced a _____vegetation cover.
    1) Typically, lush
    2) Prominence, dry
    3) Importantly, scarce
    4) Average, green
    5) General, prominent
17. Nobody knows ____ how many languages there are in the world, partly because of the difficulty in distinguishing between a language and the sub-languages or dialects ____ it.
    1) Exclusively, from
    2) Extend, among
    3) Exactly, within
    4) Extensively, Between
    5) Precisely, with
18. The ______ of natural gas from Norway's Troil gas ________ is expected to increase annually.
    1) Yield, field
    2) Production, depot
    3) Manufacture, ground
    4) Assemble, bunk
    5) Making, drivel
19. The results of the company's cost-cutting ______ are evident in its profits.
    1) Events 2) Action
    3) Dealings 4) Procedure
    5) Measures
20. With cloning technology, scientists ______ what has long been the ultimate _____ of modern husbandry.
    1) are approaching, goal
    2) were approaching, aim
    3) had approached, target
    4) is approaching, mark
    5) was approaching, set

Directions (Q. 21 - 30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Businesses spend a lot of time and money on choosing just the ___ (21) name for their enterprise. But, all too often choosing the right domain name is left for the end of the business naming process instead of at the _____ (22) where it belongs. Your future customers have to be able to ______ (23) you on the web. Your domain name may be sending the wrong message and ______ (24) you business. When people are given a website and then told it's .net or .biz, the first thing they think is, "Oh, somebody else got the .com, huh?" Some will even purposefully go and see what company secured .com, maybe they are the one that they should really be dealing with.

Even more damaging is the fact that .com is everyone's _____ (25) when typing. You may know someone's site ends in .net, but by default you probably often start to type .com. People are busy. Everyone is multitasking and managing a staggering amount of information. The ____ (26) you make someone work to find you the more likely they won't put in the effort.

While there are only so many .com addresses available, it is unlikely that anything else will ever take the place of .com as the default website ending for _____ (27) users.

In an effort to get a website ending in .com some business owners get cute and make up their own word. Sometimes service providers have reasonably used their own name as their website URL, but their name is tough for most people to spell.

The problem with both scenarios is that once someone has to ask how to spell your domain name they have already convinced themselves it is too hard to remember. If someone has to write down your domain name you are one lost piece of paper away from losing him or her as a ___ (28) forever.

People are not willing to put too much effort into finding your site. There are just ______ (29) many options on the web to be bothered by difficult to spell websites. Don't get too cute when thinking up a company name or domain name. Make it easy. If you want to use your own name, but your name is tough to spell, get a simple domain that will point to your other site. For example if your name is Christopher Zvynski, get another domain called askchris.com that will redirect customers to your site.

One company that has built its entire business around a premium domain name that's the obvious choice for its category is Hotels.com. One of their recent marketing campaigns even featured the tagline, "Hotels.com, the obvious choice". While the space is fiercely competitive, Hotels.com will likely always be an industry leader because it's name coincides perfectly with what people are likely to search for or enter into their browsers. How much value does this kind of premium domain name generate?

Beyond being easy to find, domain names like Cars.com or Hotels.com send a message to customers that this company understands the web and that they have been around a while. How else would they have gotten such a perfect name? Typical consumers are not thinking that the domain name was probably purchased as a business cost.

Customers and clients are judging you by your ______ (30). It may have nothing to do with your quality and abilities, but it is the way of the marketplace. Make it easy for people to find you and you will always have eager customers.

Key:

1) 2 2) 1 3) 2 4) 5
5) 3 6) 3 7) 2 8) 4
9) 4 10) 4 11) 4 12) 2
13) 2 14) 3 15) 1 16) 1
17) 3 18) 1 19) 5 20) 1
21) 2 22) 1